

# పీపుల్స్‌వార్

కేంద్రకమిటీ సిద్ధాంత పత్రిక


(మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవ శత వార్షికోత్సవ ప్రత్యేక సంచిక)

నవంబర్ 2017

13

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)





మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవ

శత వార్షికోత్సవం వర్ధిల్లాలి!

ప్రపంచ కార్మికవర్గ విప్లవం వర్ధిల్లాలి!

మార్క్సిజం–లెనినిజం–మావోయిజం వర్ధిల్లాలి!

కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!

# పీపుల్స్‌వార్

కేంద్రకమిటీ సిద్ధాంత పత్రిక

(మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవ శత వార్షికోత్సవ ప్రత్యేక సంచిక)

నవంబర్ 2017

13

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | అమరులకు జోహార్లు | | 5 |
| 2. | సంపాదకీయం | | 8 |
| 3. | మూడవ ఇంటర్నేషనల్, చరిత్రలో దాని స్థానమూ | - లెనిన్ | 21 |
| 4. | రష్యా విప్లవ అంతర్జాతీయ స్వభావం | - స్టాలిన్ | 30 |
| 5. | లెనిన్-లెనినిజం - సి.పి.ఐ. (మావోయిస్టు) డాక్యుమెంట్ నుండి | | 38 |
| 6. | రష్యన్ విప్లవంలో ఇమిడి వున్న అంతస్సారపు విశ్వజనీన సత్యాన్ని సదా ఎత్తిపట్టండి! - సిసి, సిపిఐ (మావోయిస్టు) | | 44 |
| 7. | బోల్షివిక్ విప్లవం - సమకాలీన చరిత్రలో దాని ప్రాధాన్యత | - బిఆర్ | 64 |
| 8. | ఉద్యమ బలాబలాల్లో కలిగే మార్పులను అనుసరించి తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యాన్ని మార్చుకోవడం గురించి | - దేవ్‌జీ | 87 |
| 9. | మే డే ప్రకటన | | 111 |
| 10. | జినుగు నరసింహా రెడ్డి లొంగుబాటును, విప్లవ ద్రోహాన్ని అసహ్యించుకుందాం! పార్టీనీ, మనల్నీ తీర్చిదిద్దుకొని పటిష్టపరచుకోవడం కోసం ఈ నెగెటివ్ టీచర్ నుండి నేర్చుకుందాం! | - సిసి సర్క్యులర్ | 117 |


***

# అమరులకు జోహార్లు

దేశంలో మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా ఈ సంవత్సరం మిషన్ 2017 పేరుతో భారత దోపిడీ పాలకవర్గాలు కొనసాగించిన అణచివేత వ్యూహాన్ని తిప్పికొడుతూ మన పార్టీ నేతృత్వంలోని పిఎల్‌జిఏ బలగాలు, విప్లవ ప్రజా కమిటీలు (ఆర్‌పిసి), విప్లవ ప్రజాసంఘాలు, ప్రజా మిలీషియా, విప్లవ ప్రజానీకం ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసేందుకు కృషి చేశాయి. దీంతో పాటుగా దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్, తూర్పు బీహార్-ఈశాన్య ఝార్ఖండ్, ఏఓబి, ఒడిశాలలో వీరోచిత దాడులను, దండకారణ్యంలో కొత్త చెరువు, బుర్కాపాల్ ఆంబుష్‌లు పిఎల్‌జిఏ నిర్వహించింది. ఇలా పిఎల్‌జిఏ ప్రతిఘటన ఫలితంగా భారత దోపిడీ పాలకవర్గాలు మిషన్ 2017ను పునఃసమీక్షించుకోవాల్సి వచ్చింది, 2017 మే 8న నూతన 'సమాధాన్' వ్యూహాన్ని రూపొందించాయి. 2022 కల్లా దేశంలో విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టే లక్ష్యంతో తమ అత్యంత క్రూరమైన బహుముఖ అణచివేత దాడిని తీవ్రతరం చేశాయి. ఈ 'సమాధాన్' వ్యూహానికి వ్యతిరేకంగా మన పార్టీ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసేందుకు, విస్తరించేందుకు కృషి చేసింది. ఈ కృషిలో భాగంగా పార్టీ, పిఎల్‌జిఏ, ఆర్‌పిసిలు, ప్రజా మిలీషియా యోధులు, విప్లవ ప్రజాసంఘాల కార్యకర్తలు, విప్లవ ప్రజలు సోషలిజం, కమ్యూనిజం సాధించే లక్ష్యంలో భాగంగా నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్య సాధన కోసం, దృఢసంకల్పంతో త్యాగపూరిత విప్లవ సాంప్రదాయాన్ని కొనసాగించారు.

పీపుల్స్‌వార్ గత సంచిక విడుదల చేసిన తర్వాత నుంచి ఇప్పటి వరకూ, అంటే 2017 ఆగస్టు నుంచి 2017 నవంబర్ వరకూ దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధంలో 30 మందికి పైగా విప్లవ కార్యకర్తలు, విప్లవ ప్రజలు అమరులయ్యారు. వీరిలో బిజెలో ఒకరు, పశ్చిమ కనుమల ప్రాంతంలో ఒకరు, డికెలో 28 మంది, ఒడిశాలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో 7 గురు మహిళా కామ్రేడ్స్ ఉన్నారు.

దోపిడీ పాలకవర్గాల కిరాయి పోలీసు మూకలు విప్లవోద్యమాన్ని దెబ్బతీయడం కోసం ఈ కాలంలో అనేక బూటకపు ఎన్‌కౌంటర్లు, చుట్టువేత-నిర్మూలనా దాడులు నిర్వహించాయి. ఇందులో భాగంగా దండకారణ్యంలో బూటకపు ఎన్‌కౌంటర్ హత్యాకాండలలో దక్షిణ బస్తర్ డివిజన్‌లో ఇత్తగూడెం, రాసతోంగ్, కన్నయ్‌గూడ వద్ద ఇద్దరిద్దరిని, పాలెమడుగు, బీర్‌భట్టీ వద్ద ఒక్కొక్కరిని, దర్భ డివిజన్‌లో మురుంగ వద్ద ఒక్కరిని, పశ్చిమ బస్తర్ డివిజన్‌లో మూకవెల్లి, జారమొగియా వద్ద ఒక్కొక్కరిని, మన్కేలి వద్ద ముగ్గురిని, మాడ్‌లో ఇర్పనార్ వద్ద ఐదుగురిని, దుర్వెడ వద్ద ఒకరిని మొత్తం 20 మందిని హత్య చేశాయి. గడ్చిరోలి జిల్లాలో ఖెండీ, టవ్వేకసా, కొడేర్ జరిగిన ఎన్‌కౌంటర్‌లలో ఒక్కొక్కరిని, ఆర్‌కెబి డివిజన్‌లో కోపెన్‌కడ్క కోవర్ట్ ఆపరేషన్‌లో

ముగ్గురిని మొత్తం 6 గురిని పోలీసు బలగాలు హత్య చేశాయి. బిజెలో బూబీట్రాప్ ప్రమాదంలో ఒక కామ్రేడ్, డికెలో అనారోగ్యాల వల్ల ఇద్దరు కామ్రేడ్స్, పాము కరిచి ఒక కామ్రేడ్ అమరులయ్యారు.

సెప్టెంబర్‌లో ఝార్ఖండ్-ఛత్తీస్‌గఢ్ సరిహద్దున వత్రి ప్రాంతంలో బుడా పహాడ్ వద్ద బూబీట్రాప్ ప్రమాదంలో బీహార్ రీజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ మేఘనాథ్ సింగ్ (వయసు 45 సంవత్సరాలు) అమరుడయ్యాడు. లాతేహార్ జిల్లా, మనికా బ్లాకు, మర్ఖిలా గ్రామానికి చెందిన మేఘనాథ్ పేదరైతు కుటుంబంలో జన్మించాడు. 15 సంవత్సరాలు పార్టీలో పనిచేశాడు. అమరుడయ్యేనాటికి టిడి విభాగ బాధ్యతలు నిర్వహిస్తూ ఉండినాడు. ఆగస్టు నెలలో పశ్చిమ కనుమల ప్రాంతంలోని కబని ఏరియాలో ఏనుగు దాడిలో అమరత్వం చెందిన కామ్రేడ్ లత (అను) భవాని దళం ఇన్‌చార్జి డివిసి సభ్యురాలుగా పనిచేసింది. మన దళం తిండి సామగ్రి కోసం ఒక గ్రామానికి వెళ్లినప్పుడు ఏనుగు దాడి జరిగింది. కామ్రేడ్ లత మునుపటి సిపిఐ(ఎంఎల్)(నక్సల్బరి)లో కేరళ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేసింది. 6 గురు ఏసి/పిపిసి సభ్యులు (ఇందులో డికెలోని పిఎల్‌జిఏ బెటాలియన్‌లో ప్లాటూన్ డిప్యూటీ కామ్రేడ్ సోఢీ సీతా, గడ్చిరోలిలో కామ్రేడ్ మడకం రాజె (సోని), ఆర్‌కెబి డివిజన్‌లో కామ్రేడ్స్ మహేష్, రాకేష్, ఒడిశాకు చెందిన కామ్రేడ్స్ భద్రు (బిబిఎం డివిజన్), కరణ్-సిసిఎం గార్డు దళం కమాండర్ ఉన్నారు), 16 మంది పార్టీ/పిఎల్‌జిఏ సభ్యులు (ఇందులో పిఎల్‌జిఏ బెటాలియన్ సభ్యుడు సోఢీ లక్మా, డికె సిఎన్ఎం టీం సభ్యురాలు కామ్రేడ్ జ్యోతి, మాడ్ డివిజన్‌లో డివిజన్ సప్లై దళం సభ్యుడు కామ్రేడ్ రాంసాయి, డివిజన్ సిఎన్ఎం టీం సభ్యురాలు కామ్రేడ్ రైని, డివిసిఎం గార్డు కామ్రేడ్ సంతీల, పిఎల్‌జిఏ సభ్యురాళ్లు కామ్రేడ్స్ సుంద్రి, అనిత, గడ్చిరోలిలో కామ్రేడ్ మంగ్లీ, దక్షిణ బస్తర్‌లో కామ్రేడ్స్ సోఢీ దీపక్, ముచాకి పొజ్జాల్, ఆర్‌కెబిలో రంజిత్, పశ్చిమ బస్తర్‌లో కోర్సా సోను, మొడియం మన్కు, తాతి గుడ్డూ, ఒడిశాలోని బిబిఎం డివిజన్‌లో కామ్రేడ్ మితా ఉన్నారు), జిపిసి సభ్యుడు కామ్రేడ్ మడకం హడ్మా (దక్షిణ బస్తర్), ఇద్దరు ఆర్‌పిసి సభ్యులు (ఇందులో గ్రామ స్థాయి ఆర్‌పిసి అధ్యక్షుడు కామ్రేడ్ పొడియం భీమాల్, ఏరియా ఆర్‌పిసి వ్యవసాయ శాఖ అధ్యక్షుడు కామ్రేడ్ పొడియం సన్నాల్ ఉన్నారు), డిఏకెఎంఎస్ గ్రామ అధ్యక్షులు కామ్రేడ్స్ రాగాల్ (ఉత్తర బస్తర్), ఫగ్ను (మాడ్), ప్రజాసంఘ సభ్యుడు కామ్రేడ్ పర్సా పాయికూ (పశ్చిమ బస్తర్), మిలీషియా సభ్యులు కామ్రేడ్ సోఢీ దూలా (దక్షిణ బస్తర్), దర్భ డివిజన్‌లో ఆదివాసీ గ్రామస్థుడు కామ్రేడ్ మడకం దుర్వా, పశ్చిమ బస్తర్ డివిజన్‌లో ఆదివాసీ గ్రామస్థుడు కామ్రేడ్ కుమ్మ వంజారాం ఉన్నారు.

విప్లవోద్యమ నిర్మూలనకు దోపిడీ పాలకవర్గాలు లక్షలాది పోలీసు, పారామిలటరీ, కమాండో బలగాలతో పాటు వాయుసేన సామర్థ్యాలను కూడా పెద్దెత్తున వినియోగిస్తూ ఇన్‌ఫార్మర్-కోవర్ట్ నెట్‌వర్క్‌ని వినియోగిస్తూ కొనసాగిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్ హత్యాకాండలు, కోవర్టు

హత్యాకాండల ద్వారా ఉద్యమానికి నష్టం కలుగజేస్తున్నాయి. ముఖ్యంగా పిఎల్‌జిఏలోని సెకండరీ బలగాల నాయకత్వాన్ని, యోధులను, స్థానిక పార్టీ, మిలీషియా, ఆర్‌పిసి, విప్లవ ప్రజాసంఘాల నిర్మాణాలను, ప్రజలను లక్ష్యం చేసుకొని ఈ దాడి చేస్తున్నాయి. అదే సమయంలో అవకాశం వచ్చినప్పుడు తమ బలాధిక్యతతో పార్టీ నాయకత్వాన్నీ, పిఎల్‌జిఏ బలగాలనూ నిర్మూలించేందుకు కౌంటర్ గెరిల్లా ఆపరేషన్లను తీవ్రతరం చేస్తున్నాయి. తమ ఎల్ఐసి వ్యూహంలో భాగంగా పాలకవర్గాలు అమలు చేస్తున్న మోసపూరిత బహుముఖ అణచివేత దాడిని లోతుగా అర్థం చేసుకుంటూ ఈ దాడిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.

శత్రువు అనేక రెట్లు బలంగా ఉండడం, విప్లవోద్యమం దేశవ్యాప్తంగా గడ్డు స్థితిని ఎదుర్కొంటుండడం, ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంలో సప్లై సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ పార్టీ నాయకత్వంలో ప్రజలు వీరోచితంగా పోరాడుతున్నారు. అమరులు తమ విలువైన ప్రాణాలను అర్పించడం ద్వారా మనకు అనేక గొప్ప గుణపాఠాలను అందించారు. కమ్యూనిస్టు విలువలను, త్యాగనిరతిని మనకు ఆదర్శంగా అందించారు. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసేందుకు వారు కన్నకలల్ని నిజం చేసేందుకు వారందించిన ఉన్నత విలువలను, త్యాగ సాంప్రదాయాన్ని ఎత్తిపడుతూ చివరి ఊపిరి వరకూ పోరాడుతామని శపథం చేద్దాం. ఇదే వారికి నిజమైన నివాళి. *

## పాఠకులకు పీపుల్స్‌వార్ సంపాదక మండలి మనవి!

## పీపుల్స్‌వార్-10, 11 సంచికలలో అచ్చయిన తప్పుల గురించి

**2016 జూన్‌లో విడుదల చేయబడిన పీపుల్స్‌వార్-10 సంచికలో**

**ప్రియమైన కామ్రేడ్స్!** 2016 జూన్‌లో విడుదల చేయబడిన పీపుల్స్‌వార్-10 (పార్టీ 10వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక-2) సంచికలో 'మహిళా సమస్య-ప్రజాయుద్ధం-ప్రజా విముక్తి' అనే వ్యాసంలో 97వ పేజీ 2వ పేరా 4వ లైన్‌లో "లాల్‌గఢ్ పోరాటంలో తపసి మాలిక్‌ను అత్యాచారం చేసి చంపడం - ఇలా ఎన్నో మనకు కనిపిస్తాయి" అని తప్పుగా రాశాం. ఈ వాక్యాన్ని ఈ కింది విధంగా సరిదిద్దుకొని చదువుకోవాల్సిందిగా కోరుతున్నాం.

"పశ్చిమ బెంగాల్‌లో హుగ్లీ జిల్లాలో సింగూర్ టాటా నైనో మోటర్ వాహనాల కంపెనీ కోసం భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 11 సంవత్సరాల యువతి తాపసీ మల్లిక్‌ను సిపిఎం గూండాలు పోలీసుల మద్దతుతో బలాత్కారం చేసి హత్య చేయడం, పశ్చిమ మేదినీపూర్ జిల్లాలో లాల్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 'పోలీసు అత్యాచారాల వ్యతిరేక

(తరువాయి భాగం 130వ పేజీలో...)

# సంపాదకీయం

## శత వార్షికోత్సవ సందర్భంగా మహత్తర రష్యన్ సోషలిస్టు విప్లవాన్ని ఎత్తిపడదాం!

మానవ చరిత్రలో వర్గ సమాజం ఏర్పడిన తర్వాత దోపిడీ వర్గాన్ని అధికారం నుంచి కూలదోసి దోపిడీ రహిత సమాజాన్ని నెలకొల్పే లక్ష్యంతో కార్మికవర్గం మొట్టమొదటిసారిగా రష్యాలో బోల్షివిక్ విప్లవం ద్వారా అధికారంలోకి వచ్చింది. 1871లో ప్యారిస్ తిరుగుబాటు ద్వారా మొట్టమొదటిసారి కార్మికవర్గం అధికారాన్ని చేపట్టినప్పటికీ అది 72 రోజులు మాత్రమే అధికారంలో ఉండగలిగింది. అందుకే కామ్రేడ్ లెనిన్ రష్యా విప్లవ విజయం తర్వాత ప్యారిస్ కమ్యూన్‌ను గుర్తు చేసుకొని రష్యా విప్లవం ఇంకా ముందుకు సాగుతుందని కార్మికులకు, ప్రజలకు ఉద్బోధించాడు. రష్యాలో పాత క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 25, కొత్త క్యాలెండర్ ప్రకారం నవంబర్ 7 తేదీల్లో విప్లవం విజయవంతమైంది.

రాచరిక, భూస్వామ్య, సైనిక ప్రభుత్వ ప్రతినిధి, రాజు అయిన రెండవ నికోలస్‌ను 1917 ఫిబ్రవరిలో అధికారం నుండి తొలగించి బూర్జువా పార్టీ అయిన కేడెట్ పార్టీ నాయకత్వంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వానికి సోషలిస్టు రివల్యూషనరీలు, మెన్షివిక్కులు మద్దతు ప్రకటించారు. ఆ పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం పై నుండి అధికారాన్ని నెరపగా గ్రామం, ఫ్యాక్టరీ, పట్నాలు, వీధుల్లో సోవియట్ల అధికారం ఉన్నది. అలా రష్యాలో ద్వంద్వ పరిపాలన కొనసాగింది. అలాంటి అనిశ్చిత పరిస్థితిలో కామ్రేడ్ లెనిన్ తన 'ఏప్రిల్ థీసిస్' ద్వారా సోవియట్లకే సర్వాధికారాలు చెందాలనీ, భూమి, రొట్టె, స్వాతంత్ర్యం కావాలనీ కార్మికులకు, రైతాంగానికి, సైనికులకు ఇచ్చిన పిలుపు బోల్షివిక్ విప్లవానికి నాంది పలికింది. తరువాత 6 నెలల కాలంలో జరిగిన అనేక మెలికలలో లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్కులు సరియైన విప్లవ ఎత్తుగడలు చేపట్టి రష్యాలో సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసారు.

కామ్రేడ్ లెనిన్ పారిస్ కమ్యూన్ అనుభవాలను లోతుగా అధ్యయనం చేసాడు. ఆయన మార్క్సిజాన్ని ఔపోసన పట్టాడు. మార్క్సిజం కార్యాచరణకు మార్గదర్శి అని నమ్మాడు. ఈ సమాజంలో వర్గాలు ఉనికిలో ఉన్నాయి, వర్గ పోరాటం ద్వారా కార్మికవర్గం పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి అధికారం చేపడుతుందని మార్క్స్ ఆచరణయుత సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఈ విషయాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు మొట్టమొదటి సారిగా కమ్యూనిస్టు

ప్రణాళికలో ప్రపంచానికి తెలియజేశారు. వారిరువురు ఈ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ కార్మికవర్గాన్ని రాబోయే విప్లవాల కోసం సిద్ధం చేసారు. జర్మన్ విప్లవ ఓటమితో కార్మికవర్గం, రైతాంగం ఐక్యంగా రాచరిక, బూర్జువా పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని కూడా వారు గుర్తించారు. పారిస్‌లో తిరుగుబాటు చేసి కార్మికవర్గం అధికారంలోకి వచ్చింది. ఆ విప్లవానికి మార్క్స్, ఎంగెల్స్‌లు మద్దతు తెలిపారు. ఆ సమయంలో కార్మికవర్గం తిరుగుబాటు చేసి అధికారాన్ని నిలుపుకోవడం కష్టమని అంటూ కార్మికవర్గం విప్లవాన్ని రక్షించుకోవడానికి ఏ చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందనే విషయాన్ని వివరించారు.

కామ్రేడ్ లెనిన్ మార్క్సిజం అనే దిక్సూచిని చేపట్టి రష్యా దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించాడు. అందుకే ఆయన కార్మిక, రైతుల ఐక్యతా అవసరాన్ని నిరంతరం బోధిస్తూ వచ్చాడు. 1905లో రష్యాలో జరిగిన మొదటి విప్లవ తిరుగుబాటులో ఆయన ఈ ఐక్యతా విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నాడు. కామ్రేడ్ లెనిన్ సిద్ధాంతంతో పాటు ఆచరణకు ఎంతో ప్రాధాన్యతనిచ్చాడు. అప్పటికే పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన ఇంగ్లండ్, జర్మనీలలో విప్లవం విజయవంతమవుతుందని రెండవ ఇంటర్నేషనల్ నాయకులు ప్రధానంగా నమ్మగా, కామ్రేడ్ లెనిన్ రష్యా నిర్దిష్ట పరిస్థితులను అంచనా వేసి రష్యాలో కార్మికవర్గ విప్లవం విజయవంతం అవుతుందని బలంగా నొక్కి చెబుతూ వచ్చాడు. మార్క్స్ యూరప్ అంతటా ఒకేసారి విప్లవం జరుగుతుందని ఊహించగా పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా పరిణామం చెందిన తర్వాత దాని బలహీనమైన లింకులోనే విప్లవాలు సంభవిస్తాయంటూ లెనిన్ మార్క్సిజాన్ని పెట్టుబడిదారీ విధాన నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించాడు. ఆ బలహీనమైన లింకు రష్యాలోనే ఉందని, అక్కడే విప్లవం బద్దలవుతుందని లెనిన్ చెప్పాడు. 18వ శతాబ్దంలో 50 సంవత్సరాల పాటు రష్యాలో కొనసాగిన అభ్యుదయ భావాలు, 1890వ దశకంలో సెయింట్ పీటర్స్ బర్గ్ కార్మికవర్గ పోరాటాల్లో లభించిన అనుభవాలను కా. లెనిన్ మార్క్సిజం వెలుగులో పరిశీలించి వాటి ఆధారంగా రష్యా విప్లవ గమనాన్ని అంచనా వేసాడు. నరోద్నిక్కులకు బెర్న్‌స్టీన్ అనుచరులయిన చట్ట బద్ధ మార్క్సిస్టులకు, ఆర్థిక వాదులకు, మెన్షివిక్కులకు, లిక్విడేటర్లకు, ట్రాట్స్కైట్లకూ వ్యతిరేకంగా సైద్ధాంతిక రంగంలో పోరాటం నిర్వహించాడు. బోల్షివిక్ పార్టీని నిర్మాణం చేసాడు.

"పార్టీ కార్మికవర్గ సంఘటిత అగ్రగామి దళం. పార్టీ కార్మికవర్గ అగ్రగామి దళం మాత్రమే కాదు. వర్గపోరాటాన్ని నడపాలని నిజంగా కోరుకుంటే అది తన వర్గానికి సంఘటిత దళంగా కూడా ఉండాలి. పెట్టుబడిదారీ విధానం వల్ల ఏర్పడే పరిస్థితుల్లో పార్టీ కర్తవ్యాలు

బ్రహ్మాండమైనవిగానూ, వివిధమైనవిగానూ ఉంటాయి. అంతరంగిక, బాహ్య పరిణామాలకు సంబంధించి మిక్కిలి కష్టసహితమైన పార్టీ శ్రామికవర్గ పోరాటాన్ని నడపవలసి ఉంటుంది. దాడి చేయవలసిన పరిస్థితి ఉన్నప్పుడు ఆ దాడిలో శ్రామికవర్గాన్ని నడిపించాలి. తిరోగమించవలసిన పరిస్థితి ఉన్నప్పుడు బలీయమైన శత్రు దెబ్బను తప్పించుకోవడానికి శ్రామికవర్గానికి అది దారి చూపించవలసి ఉంటుంది. సంఘటితం కాని లక్షలాది పార్టీయేతర ప్రజా సామాన్యానికి పోరాటంలో క్రమశిక్షణను, క్రమ పద్ధతిని అలవర్చాలి. నిర్మాణశక్తిని, సహనశీలతను అలవర్చాలి. తనకు తాను క్రమశిక్షణకు, నిర్మాణానికి ప్రతిరూపంగా ఉంటేనే, శ్రామికవర్గ సంఘటిత దళంగా వుంటేనే పార్టీ తన కర్తవ్యాలను నెరవేర్చగలుగుతుంది. ఇటువంటి పరిస్థితులు ఏర్పడకుండా పార్టీ విస్తార శ్రామిక జన బాహుళ్యానికి నిజంగా నాయకత్వం వహించి నడిపే సమస్యే లేదు.”

*– 'లెనినిజం పునాదులు', జె.వి.స్టాలిన్*

1905 విప్లవంలో ఏర్పడిన కార్మిక సోవియట్ల నుంచి లభించిన అనుభవాల ద్వారా 1917 విప్లవం జరిగిన కాలం మొత్తంలో ఆయన సోవియట్ల ప్రాముఖ్యతను గుర్తించి కింది నుండి అధికారాన్ని సుస్థిరం చేసే అవకాశం లభించగానే మొదట రాచరిక ప్రభుత్వాన్ని ఆ తదుపరి బూర్జువా అధికారాన్ని కూలదోసి సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసాడు. అందుకు సాయుధ తిరుగుబాటు కోసం రెడ్ గార్డ్స్ దళాలను నిర్మించారు. మొదటి సామ్రాజ్యవాద యుద్ధంలో కకావికలమైన సైనికులను శాంతి, రొట్టె అనే నినాదంతో విప్లవంలో సంఘటితం చేసి వారి తుపాకులను దోపిడీ ప్రభుత్వాలపై ఎక్కు పెట్టించాడు. ఇలా కామ్రేడ్ లెనిన్, స్టాలిన్‌ల నేతృత్వంలో రష్యా విప్లవం విజయవంతమైంది. లెనిన్ నిర్వహించిన ఈ పాత్ర ద్వారా మార్క్సిజం నూతన పరిస్థితుల్లో అభివృద్ధి చెంది మార్క్సిజం–లెనినిజంగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది.

1917 నవంబర్‌లో జరిగిన బోల్షివిక్ విప్లవం ప్రపంచంలో కార్మికులు, కర్షకులు, పీడితులు మొదలయిన అందరి పైనా సానుకూల ప్రభావాన్ని వేసింది. రష్యా విప్లవ ప్రభంజనం ప్రపంచంలో నలు దిక్కులకూ విస్తరించింది. పీడితులను, తాడితులను ఈ విప్లవం ఎంతో ఉత్సాహపరిచింది. కార్యాచరణకు ఉత్తేజపరిచింది. ప్రపంచంలో సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు, భూస్వాములు, రష్యా విప్లవ విజయాన్ని దాని ప్రభావాన్ని చూసి గడగడ వణికిపోయారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాల్లో, వలస, అర్ధవలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీల నిర్మాణం ప్రారంభమైంది. ఐరోపా కార్మికవర్గంలో రెండవ ఇంటర్నేషనల్ ప్రభావాన్ని బద్దలు కొట్టి అసలు సిసలైన కార్మికవర్గ పార్టీలు ఏర్పడ్డాయి. లెనిన్ నాయకత్వంలో మూడవ ఇంటర్నేషనల్

నిర్మాణం జరిగి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం ముందుకు సాగింది.

లెనిన్ నాయకత్వంలో రష్యాలో విప్లవం కొనసాగుతున్న కాలంలో పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా అభివృద్ధి చెందింది. కామ్రేడ్ లెనిన్ సామ్రాజ్యవాదాన్ని ఇలా వ్యాఖ్యానించాడు. సామ్రాజ్యవాదం అంటే బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఫైనాన్స్ పెట్టుబడిగా రూపాంతరం చెందడం, పలుకుబడి ప్రాంతాలు వలస ప్రాంతాలు అంతకంతకు విస్తరించడం, అత్యధికంగా ఉన్న వలస దేశాల ప్రజలు, పరాధీన దేశాల ప్రజలు సామ్రాజ్యవాద శృంఖలాలను తెంచుకునేందుకు తప్పనిసరిగా పోరాటాలు కొనసాగించవలసి రావడం, పలుకుబడి ప్రాంతాల మీద వలస దేశాల మీద యాజమాన్యం గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు ఏర్పడడంతో పాటు వివిధ పెట్టుబడిదారీ దేశాలలో అసమాన స్థాయిలో అభివృద్ధి జరగడం. దీంతో వలస ప్రాంతాలపై పెత్తనం సంపాదించిన దేశాలకు, తమకు కూడ వాటిలో భాగం కావాలని కోరుకునే ఇతర దేశాలకూ మధ్య పోరాటం తీవ్రతరమవుతుంది. ఈ రెండు ముఠాలు ప్రపంచాన్ని పునర్విభజించుకోవడానికి ఘర్షిస్తాయి. అందుకే "సామ్రాజ్యవాదమంటే సోషలిస్టు విప్లవ తొలి సంజ" అని లెనిన్ చెప్పాడు.

సామ్రాజ్యవాద యుగంలో "స్వతంత్ర దేశాలు, వాటి ఆర్థిక విధానాలు స్వయం పోషకమైనవి కావు. ప్రపంచ ఆర్థిక విధానమనే గొలుసులో అవన్నీ వేర్వేరు లింకులుగా తయారయ్యాయి.... అంటే అభివృద్ధి చెందిన 'బహుకొద్ది దేశాలు ప్రపంచంలో అత్యధిక సంఖ్యాక ప్రజల్ని ధనస్వామ్య బానిసత్వానికి, వలస దోపిడీకి గురిచేసే విశ్వవ్యాపిత విధానంగా మార్పు చెందింది...." దీని మూలంగా "ప్రపంచ శ్రామిక విప్లవాన్ని గురించి ఆలోచించాల్సిన" అవసరం ఏర్పడింది".... అలాగే "సామ్రాజ్యవాదమనే గొలుసును ఏ దేశంలో తెగ్గొడితే ఆ దేశంలో తత్ఫలితంగా శ్రామిక విప్లవం విజయవంతమవుతుంది".... "1917లో ప్రపంచ సామ్రాజ్యవాద గొలుసు ఇతర దేశాలలో కంటే రష్యాలో ఎక్కువగా బలహీనంగా ఉంది. ఆ దేశంలోనే గొలుసు బద్దలయింది. శ్రామిక విప్లవం అక్కడ ఎలా గండి కొట్టగలిగింది? అప్పుడు రష్యాలో బ్రాహ్మండమైన ప్రజా విప్లవం విజృంభించింది. విప్లవ చైతన్యం కల శ్రామికవర్గం దానికి నాయకత్వం వహించింది. భూస్వాముల దారుణ దోపిడీకి, పీడనకు గురి అవుతుండే అసంఖ్యాకమైన రైతులు శ్రామికవర్గానికి ప్రధాన మిత్రులుగా ఉన్నారు. సామ్రాజ్యవాదానికి ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలన్నింటిలోనూ అతి వికృతమైన జారిస్టు ప్రభుత్వం ఆ విప్లవాన్ని వ్యతిరేకించింది. దానికి నైతిక ప్రతిష్ఠ కొంచెమైనా లేదు. ప్రజలందరూ దాన్ని ద్వేషించారు. పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి దృష్ట్యా ఫ్రాన్స్, జర్మనీల కంటే ఇంగ్లండ్, అమెరికాల కంటే రష్యా వెనుకబడ్డ దేశమైనప్పటికీ రష్యాలోనే

సామ్రాజ్యవాదమనే గొలుసు అన్ని దేశాల్లో కంటే బలహీనంగా ఉంది. ఈ కారణంగా రష్యాలోనే కార్మికవర్గం ప్రప్రథమంగా సోషలిస్టు విప్లవాన్ని పరిపూర్తి చేసింది."

*-(లెనినిజం పునాదులు-స్టాలిన్, 3వ అధ్యాయం, సిద్ధాంతం)*

కామ్రేడ్ లెనిన్ సామ్రాజ్యవాదాన్ని, రాజ్యాంగ యంత్రాన్ని అధ్యయనం చేసి, రెండవ ఇంటర్నేషనల్ నాయకుడు కాట్స్కీ రివిజనిస్టు 'అధి సామ్రాజ్యవాద' సిద్ధాంతాన్ని ఎండగడుతూ రాజ్యాంగ యంత్రాన్ని కూల్చి ఆ స్థానంలో కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. కామ్రేడ్ లెనిన్ మార్గదర్శకత్వంలో రష్యాలో సార్వత్రిక సాయుధ తిరుగుబాటు ద్వారా సోషలిస్టు విప్లవం విజయవంతమయింది. ఒక నిరంకుశ భూస్వామ్య, సైనిక, రాచరిక సామ్రాజ్యం స్థానంలో ప్రపంచంలోనే మొట్టమొదటి సోషలిస్టు రాజ్యాంగం రష్యన్ సోవియట్ ఫెడరేటివ్ సోషలిస్టు రిపబ్లిక్ (ఆర్.ఎస్.ఎఫ్.ఎస్.ఆర్.-రష్యన్ సోవియట్ సోషలిస్టు గణతంత్ర సమాఖ్య) ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. అలాగే 1922లో మరిన్ని జాతుల రిపబ్లిక్‌లను కలుపుకొని యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ (యు.ఎస్.ఎస్.ఆర్.) అయింది.

"లెనినిజం అంటే సామ్రాజ్యవాద, శ్రామికవర్గ విప్లవ శకపు మార్క్సిజం. ఇంకా సరిగా చెప్పాలంటే, జనరల్‌గా శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతం-ఎత్తుగడలే లెనినిజం. ప్రత్యేకంగా శ్రామికవర్గ నియంతృత్వ సిద్ధాంతం-ఎత్తుగడలు లెనినిజం."

*-(అదే పుస్తకం, 1వ అధ్యాయం, లెనినిజం చారిత్రక మూలాలు)*

కామ్రేడ్ లెనిన్, స్టాలిన్ నాయకత్వంలో రష్యాలో అనేక అవాంతరాలను ఎదుర్కొంటూ సోషలిస్టు విప్లవం పురోగమించింది. సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ పెట్టుబడిదారీ విధానానికి ఆవల బ్రహ్మాండమైన ప్రగతి సాధించింది. ఒక వైపు పెట్టుబడిదారీ విధానం ఆర్థిక సంక్షోభ వలయాల్లో చిక్కుకొని యుద్ధాన్ని, ఫాసిజాన్నీ ఆశ్రయించగా స్టాలిన్ నాయకత్వంలో యు.ఎస్.ఎస్.ఆర్ ఆర్థిక సంక్షోభాలు లేకుండా తన సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను తీర్చి దిద్దింది. అందరికీ విద్య, అందరికీ వైద్యం, అందరికీ పని, అందరికీ గౌరవప్రదమైన జీవితం, జాతుల స్వయం నిర్ణయాధికారం, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు, అంతర్జాతీయ సహకారం....ఇలా ఏ రంగం తీసుకున్నా అపార విజయాలు సాధిస్తూ, ప్రపంచంలో ఇతర దేశాలకు ఒక నమూనాగా, పాటించదగిన ఆదర్శంగా నిలుస్తున్న సోవియట్ యూనియన్ మీద ప్రపంచ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద శక్తులు మూకుమ్మడిగా దాడి ప్రారంభించాయి. అబద్ధ, విష ప్రచారాలు సాగించాయి. దాన్ని యుద్ధంలోకి లాగాయి. మొదటి

సోషలిస్టు రాజ్యం పీక నులిమి చంపివేయాలని ప్రపంచ సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలు ఉవ్విళ్ళూరుతూ వచ్చాయి. అందులో భాగంగా రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ సోవియట్ రిపబ్లిక్ పై దాడి చేసి విధ్వంసానికి పూనుకున్నాడు. కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ ప్రజలు అత్యంత ధైర్యంగా, త్యాగాలు చేస్తూ హిట్లర్ ఫాసిజానికి గోరీ కట్టారు. ఈ యుద్ధంలో ఐదు కోట్ల మంది సోవియట్ ప్రజలు రక్తతర్పణం చేసారు. అప్పటికి రెండు దశాబ్దాలుగా సామాజికాభివృద్ధిలో అప్రతిహతంగా ముందుకు వెళ్తున్న సోవియట్ యూనియన్ ఈ సామ్రాజ్యవాద యద్ధంలో భాగమై తన వనరులనూ శక్తి సామర్థ్యాలనూ యుద్ధం కోసం వ్యర్థం చేసుకోవలసి వచ్చింది. సోవియట్ యూనియన్ యుద్ధానంతరం మళ్ళీ కాలూ చేయీ కూడదీసుకొని ఆరేడు సంవత్సరాలలోనే మునుపటి పరిస్థితికి వచ్చింది. వ్యవసాయ, పారిశ్రామిక, సామాజిక రంగాలలో పూర్వపు అభివృద్ధి నెలకొంది. ముప్పై సంవత్సరాలుగా ఈ విజయాలన్నిటికీ సారథిగా ఉన్న జుగాష్ విలి స్టాలిన్ 1953లో మరణించాడు. కామ్రేడ్ స్టాలిన్ మరణానంతరం అధికారానికి వచ్చిన కృశ్చేవ్ రష్యాలో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్దరించాడు. దాంతో బోల్షివిక్ విప్లవ పతనం ప్రారంభమయింది.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశమైన చైనా కా. మావో నాయకత్వంలో దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో విముక్తి పొంది 1949 అక్టోబర్‌లో జన చైనాగా ఆవిర్భవించింది. ప్రపంచంలో అప్పటికీ వలస దేశాలుగా కొనసాగుతున్న పరాధీన దేశాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో తుఫానులా జాతి విముక్తి పోరాటాలు, విప్లవ పోరాటాలు కొనసాగాయి. ఈ విప్లవ తిరుగుబాట్లకు సోషలిస్టు దేశాలు అండగా ఉన్నాయి. దీంతో సామ్రాజ్యవాదం వలస విధానాన్ని విడిచిపెట్టి నయావలస విధానం చేపట్టింది. బ్రిటన్ పరిపాలనలో ఉన్న మన భారతదేశానికి 1947 ఆగస్టులో బూటకపు స్వాతంత్ర్యాన్ని ఇచ్చి దేశాన్ని నయావలస విధానంలో భాగంగా తన కంట్రోల్‌లో పెట్టుకున్నది. అప్పటినుండి మన దేశంలో అర్ధవలస-అర్ధభూస్వామ్య విధానం కొనసాగుతున్నది. మన భారత ప్రజలకు ఇప్పటికీ సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలు శత్రువులుగా, కూల్చి వేయాల్సిన టార్గెట్స్‌గా ఉన్నాయి.

ఈ శతాబ్ద కాలంలో సామ్రాజ్యవాదంలో అనేక మార్పులు జరుగుతూ వచ్చాయి. లెనిన్ కాలంలో సామ్రాజ్యవాద దశలో అంతర్జాతీయ గుత్త సంస్థలు, ట్రస్టులు, కార్టెల్స్ ఉనికిలో ఉండగా వాటి స్థానంలో ఈ రోజు బహుళజాతి కంపెనీలు కొనసాగుతున్నాయి. 500 బహుళజాతి కంపెనీలు (కార్పోరేషన్లు), 100 బడా బ్యాంకుల చేతిలో నేటి సామ్రాజ్యవాదం మనుగడ

కొనసాగిస్తున్నది. అదే విధంగా మునుపటి కాలంలో ఒక్కొక్క పెట్టుబడిదారీ శక్తి తన అధీనంలో ఉంచుకున్న ప్రత్యక్ష వలసలు నేడు నామమాత్రపు స్వాతంత్ర్యాన్ని పొంది అన్ని సామ్రాజ్యవాద శక్తులు మరింత దోపిడీ చేసుకునేందుకు వీలుగా నయావలసలుగా మారాయి. అయితే సామ్రాజ్యవాదం గురించిన లెనిన్ అవగాహన సారాంశంలో పూర్తిగా వర్తిస్తుంది. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం దాని పుట్టుకలోనే ఉన్న ఆర్థిక సంక్షోభాలను తట్టుకొని నిలబడడానికి మొదటి ప్రపంచ యుద్ధం తదుపరి కీనీషియన్, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బ్రెట్టన్ వుడ్స్ సంస్థలుగా పేరొందిన ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ సంస్థల నిర్మాణం, థాచరిజం లాంటి ఆర్థిక సిద్ధాంతాలను అవలంబించింది. అయినప్పటికీ సామ్రాజ్యవాదం ఆర్థిక సంక్షోభాల నుండి బయట పడలేకపోయింది. ప్రస్తుతం 2008 నుండి కొనసాగుతున్న సుడులు తిరుగుతున్న ద్రవ్య, ఆర్థిక సంక్షోభంలో పీకల లోతు కూరుకొనిపోయింది.

ఆనాడు ప్రపంచంలో మూడవ వంతు భూభాగంలో విస్తరించిన సోషలిజం రష్యాలో రివిజనిజం తలెత్తి పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరించడంతో ప్రారంభమై, 1976 మావో మరణం తర్వాత డెంగ్ నాయకత్వంలో జన చైనా పెట్టుబడిదారీ మార్గం చేపట్టడంతో ఉనికిలో లేకుండా పోయింది. దాదాపు 60 సంవత్సరాలు కొనసాగిన సోషలిస్టు నూతన సమాజం వెనకడుగు వేసింది. ఈ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీల్లో పెట్టుబడిదారీ మార్గీయులు అధికారాన్ని చేజిక్కించుకొని అధికారానికి వచ్చి వీటిని సామ్రాజ్యవాద శిబిరంలో భాగం చేసారు. ప్రభుత్వ పెట్టుబడిలో గణనీయమైన భాగాన్ని ప్రైవేట్ గుత్త పెట్టుబడిగా మార్చి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించారు. ఆర్థిక వ్యవస్థను సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థగా మార్చారు.

భారతదేశంలో ఊడలు దిగిన రివిజనిజం, నయా రివిజనిజం విప్లవోద్యమానికి ఆటంకంగా ఉన్నాయి. ఇవి పాలకవర్గాలతో అంటకాగుతూ వామపక్షాలుగా చెలమణి అవుతూ దోపిడీ వర్గాలకు సేవ చేస్తున్నాయి. రష్యా విప్లవోద్యమంలో లెనిన్ రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడకుండా విప్లవోద్యమం విజయవంతం చేయడానికి సాధ్యం కాదని భావించి దానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేసాడు. మన దేశంలోనూ అదే స్ఫూర్తితో రివిజనిజాన్ని కూకటివేళ్లతో పెకిలించివేయాలి.

రెండవ ప్రపంచ యుద్ధానంతనరం అగ్రరాజ్య శక్తిగా ఎదిగిన అమెరికా సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ యుద్ధ ఆర్థిక వ్యవస్థగా మారిపోవడం, నిరంతరం యుద్ధాలలో కూరుకొనిపోవడం వల్ల దాని వనరులన్నీ హరించుకుపోతుండడంతో అది రాజకీయంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా బలహీనపడింది. ఈ స్థితిలో అది తన మిత్ర దేశాలను రాజకీయంగా, సైనికంగా మునుపటి

వలే తన పక్షాన నిలబెట్టుకోలేకపోతోంది. ఈ కాలంలో యూరప్ బలమైన ఆర్థికశక్తిగా ఎదుగుతూ దోపిడీలో తమ వాటాను డిమాండ్ చేయడం పెరిగింది. ఆర్థిక రంగంలో అమెరికాకు, ఇయుకు మధ్య పెరుగుతున్న పోటీ రీత్యా, తన ఆర్థిక సంక్షోభ పరిస్థితుల రీత్యా నాటో కూటమి కోసం గతంలో లాగా తాను అత్యధిక నిధుల్ని కేటాయించలేకపోతున్నది. ఈ స్థితిలో అది నాటో కూటమిని సమైక్యంగా ఉంచలేకపోతోంది. మరో వైపు రష్యా నిలదొక్కుకుంటూ తన స్థానాన్ని నిలుపుకుంటున్నది. చైనా నూతన సోషల్-సామ్రాజ్యవాద శక్తిగా ఎదిగి అమెరికాకు ఆర్థిక రంగంలో గట్టి ప్రత్యర్థిగా నిలబడుతోంది. ఆసియాలో తన పట్టును బిగించి ఆధిపత్యం నెలకొల్పుకునేందుకై చైనా ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకును ఏర్పాటు చేసింది. చైనా వన్ బెల్ట్-వన్ రోడ్ పథకం ద్వారా తన వ్యూహాత్మక పథకాన్ని బలోపేతం చేసుకుంటున్నది. సైనిక రంగాన్ని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. రష్యా, చైనాలు అమెరికాకు పోటీదారులుగా ముందుకు వస్తున్నాయి. ఈ స్థితిలో ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక-రాజకీయ (జియో-పొలిటికల్) సమీకరణలు మారుతున్నాయి.

సమీప భవిష్యత్తులో అమెరికా-చైనాల మధ్య ఆర్థిక, వ్యాపార, దౌత్య, సైనిక రంగాలలో పోటీ మరింత తీవ్రతరం అవుతుంది. ప్రపంచాన్ని పునర్విభజన చేసుకోవడానికి సామ్రాజ్యవాద ముఠాల మధ్య పోటీ, ఘర్షణలూ తీవ్రతరమవుతాయి. ఈ పునస్సమీకరణలను అనుసరించి వెనుకబడిన దేశాల్లో రాజకీయ సంక్షోభాలు పెరుగుతాయి. ఆసియాలో చైనా, రష్యా, ఇరాన్, పాకిస్తాన్‌లు ఒకవైపు, అమెరికా మిత్రపక్షాలైన జపాన్, దక్షిణ కొరియా, ఇండియా తదితర దేశాలు ఒకవైపు నిలబడి సాగించే పోటీ, ఘర్షణల ఫలితంగా, ప్రపంచంలో ఇతర రీజియన్‌లలో కూడా ఇలాంటి పునస్సమీకరణలు జరిగాయి. ఫలితంగా తలెత్తే పోటీ, ఘర్షణలు అంతర్జాతీయంగా మరింత తీవ్రతరం అవుతాయి. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా దేశాల నుండి పొంచి ఉన్న ప్రమాదం దృష్ట్యా ఉత్తర కొరియా తన ఆత్మరక్షణ కోసం జరుపుతున్న అణు మిస్సైళ్ళ పరీక్షలు అమెరికా సామ్రాజ్యవాద శిబిరాన్ని బెంబేలెత్తిస్తున్నాయి.

ఇందులో భాగంగా ఇప్పటివరకు అమెరికాకు వ్యూహాత్మక మిత్రదేశంగా ఉన్న పాకిస్తాన్ ఇప్పుడు చైనాతో వ్యూహాత్మక రక్షణ-ఆర్థిక ఒప్పందాలు చేసుకుని, వ్యూహాత్మక మిత్ర దేశంగా మారిపోయింది. మరోవైపు 1991వ సంవత్సరపు సోవియట్ యూనియన్ పతనం వరకు ఆ దేశంతో అత్యంత సన్నిహిత భాగస్వామిగా ఉన్న భారతదేశం ఆ తరువాతి కాలం నుండి అమెరికాకు దగ్గరవుతూ గత సంవత్సరం ఆగస్టులో ఆ దేశంతో కుదుర్చుకున్న సైనిక ఒప్పందం (లాజిస్టిక్స్ ఎక్స్‌చేంజ్ మెమొరాండం ఆఫ్ అగ్రిమెంట్-లెమోవా) ద్వారా అమెరికాకు కీలక

సైనిక భాగస్వామ్య దేశంగా మారింది. పెరుగుతున్న చైనా ఆర్థిక, సైనిక శక్తిని ఎదుర్కోవడానికి ఈ సైనిక ఒప్పందం ద్వారా భారతదేశం తన వ్యూహాత్మక మొగ్గు (స్ట్రాటజికల్ షిఫ్ట్)ను ప్రదర్శించింది. ఈ సంవత్సరం చైనా-భారత్‌లు డోక్లామ్‌లో సైన్యాలను మోహరించడం దాని వలన ఉద్రిక్తతలు నెలకొనడం అందులో భాగమే.

పశ్చిమాసియా (మధ్యప్రాచ్యం)లో అమెరికా సామ్రాజ్యవాదులు, ఇజ్రాయిల్ జియోనిస్టులు, శాంతి ఒప్పందాలను ఉల్లంఘిస్తూ జియోనిస్టు ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజల పై నిరంతరం చేస్తున్న దాడులకు, ఆక్రమిత భూభాగాల విస్తరణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజల ప్రతిఘటనా పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయిల్ రాజధానిగా టెల్ అవీవ్ స్థానంలో జెరుసెలెంను గుర్తిస్తున్నట్లుగా చేసిన ప్రకటనను అరబ్ ప్రపంచంతో సహా ప్రపంచమంతా నిందించింది. సామ్రాజ్యవాదులు వివిధ ఆఫ్రికా దేశాల్లో సాగిస్తున్న జోక్యందారీ దురాక్రమణ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన కొనసాగుతున్నది.

భారతదేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత మూడున్నర సంవత్సరాలుగా అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలన్నీ సామ్రాజ్యవాద, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను దూకుడుగా అమలు చేయడానికి ఉద్దేశించినవే. నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, దేశ వ్యతిరేక విధానాలతో దేశంలోని అన్ని సెక్టర్లపై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దాడులు పెరిగాయి.

నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలన్నీ మన దేశంలోని పీడిత వర్గాలకు, పీడిత జాతులకు, పీడిత సాంఘిక సముదాయాలకు వ్యతిరేకమైనవే. కాబట్టి దేశంలోని కార్మికులు, రైతులు, పెటీబూర్జువాలు, జాతీయ బూర్జువాజీ, పీడిత జాతులు, మతమైనారిటీలు, దళితులు, ఆదివాసులు, మహిళలు-అందరూ బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే స్థితి నెలకొంది.

గత మూడున్నర సంవత్సరాలుగా బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులు గోసంరక్షణ పేరుతో దేశవ్యాప్తంగా దళితులపై, ముస్లింలపై చేస్తున్న దాడులు పెరిగాయి. ఉత్తరప్రదేశ్‌లో దాదరి నుండి మొదలుకుని గుజరాత్‌లోని ఊనా, తెలంగాణలోని నేరెళ్ళ, అభంగపట్నం ఘటనల వరకు, రాజస్థాన్‌లోని పహుల్‌ఖాన్ నుండి అహ్మద్‌ఖాన్ వరకు, లౌ జిహాద్ పేరిట ముస్లిం వలస కార్మికుడైన అఫ్రజుల్‌ను హిందూ మతోన్మాది శంభూలాల్ పాశవికంగా హత్య చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన ఘటనలు వెర్రితలలు వేస్తున్న హిందూ మతోన్మాదాన్ని

తెలియజేస్తున్నాయి. ప్రజాస్వామిక, సెక్యులర్, హేతువాద భావాలు కలిగిన గత గోవింద్ పన్సారే, నరేంద్ర దభోల్కర్, కల్బుర్గి హత్యలు కాకుండా ఈ మధ్య బెంగుళూరులో గౌరీ లంకేశ్‌ను హిందూ ఫాసిస్టు శక్తులు పాశవికంగా హత్య చేసాయి. ఈ హత్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. రానున్న రోజుల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా విప్లవ శక్తులు, దళితులు, ముస్లింలు, ఆదివాసులు, ఇతర పురోగామి సెక్షన్లు మరింత సంఘటితపడి, సమరశీల పోరాటాలకు సిద్ధపడే పరిస్థితులు పెరుగుతున్నాయి.

దేశ, విదేశీ కార్పోరేట్ సంస్థల ప్రయోజనాలను దూకుడుగా అమలు చేస్తూ దేశంలోని ఆదివాసీ ప్రాంతాల నుండి ప్రాకృతిక వనరుల లూటీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలలో ఆదివాసీ సమూహాలు తీవ్రమైన విస్థాపిత సమస్యను ఎదుర్కొంటూ తమ అస్థిత్వాన్ని, అస్మితను కోల్పోతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో ఆదివాసీ, ఆదివాసేతర ప్రజల విస్థాపిత వ్యతిరేక ఉద్యమాలు మరింత సంఘటితపడి, సమరశీలంగా పోరాడే దిశగా సాగనున్నాయి.

దేశవ్యాప్తంగా వందలాది విశ్వ విద్యాలయాల్లో, వేలాది కళాశాలల్లో దళిత, ఆదివాసీ, మత మైనారిటీ విద్యార్థులు హిందూ ఫాసిస్టు దాడులను ఎదుర్కోవడానికి నరేంద్రమోడీ అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ మధ్య దేశవ్యాప్తంగా యూనివర్సిటీల్లో జరిగిన ఎన్నికల్లో హిందూ అనుకూల ఏబీవీపీ ఘోర పరాజయం పొందడం, పై విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రతిఘటనకు నిదర్శనం.

నరేంద్రమోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో వామపక్ష ట్రేడ్ యూనియన్ల నాయకత్వంలో దేశవ్యాప్తంగా 15 కోట్ల మందికి పైగా కార్మికులు సాధారణ సమ్మె జరిపి విజయవంతం చేశారు. 2015లో కూడా దాదాపు 14 కోట్ల మంది కార్మికులు సాధారణ సమ్మె చేశారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 28న దేశవ్యాపితంగా 10 లక్షల మంది ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు కార్మిక సంస్కరణలతో పాటు ఔట్‌సోర్సింగ్ వంటి ఇతర ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బంద్ నిర్వహించారు. రానున్న రోజుల్లో కార్మికుల సమ్మెలు పెరగనున్నాయి. మోడీ ప్రభుత్వ విధానాలు కేవలం కార్మిక వ్యతిరేకమైనవే కాకుండా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను దివాళా తీయించేవిగా ఉండడంతో రానున్న రోజుల్లో చిన్న, మధ్యతరహా పెట్టుబడిదార్లు వేర్వేరు రూపాల్లో పోరాడే పరిస్థితులు నెలకొంటున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలకు దేశవ్యాప్తంగా రైతాంగం వేర్వేరు

రూపాల్లో పోరాడుతున్నారు. పంజాబ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తెలంగాణతో సహా పలు రాష్ట్రాలలో రైతాంగం మిలిటెంట్ ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలను చేపట్టింది. అక్టోబర్ 20నాడు దేశంలో వేలాది మంది రైతులు 'కిసాన్ ముక్తి సంసద్' రైతు వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ఢిల్లీలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దేశవ్యాప్తంగా వందలాది రైతు సంఘాలు పాల్గొన్నాయి.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువాజీ ప్రయోజనాల కోసం దేశాన్నంతటినీ ఒకే ఏకీకృత మార్కెట్‌గా తీర్చిదిద్దడం కోసం పరోక్ష పన్నుల విధానాన్ని సవరించి వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ను ప్రవేశ పెట్టారు. ఈ విధానం ద్వారా వివిధ స్లాబ్‌ల్లో విధించిన పన్ను రేట్లతో ప్రజల, వ్యాపారస్తుల నడ్డి విరిగింది. దేశవ్యాప్తంగా దీనికి వ్యతిరేకంగా ఆందోళన చెలరేగింది. దీంతో 28శాతం స్లాబ్‌లో 225 సరుకుల నుండి 175 సరుకులను ఆ స్లాబ్ నుండి ప్రభుత్వం ఎత్తివేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ విపరీతమైన పన్నుల భారం చాలా రంగాల్లో కొనసాగుతోంది. మోడీ ప్రభుత్వం అవినీతిని నిర్మూలించడమనే మోసపు ప్రచారంతో పెద్ద నోట్లను రద్దుచేసింది. ప్రజలకు అనేక ఇక్కట్లు తెచ్చిపెట్టింది. సంవత్సరం తర్వాత రిజర్వు బ్యాంకు ఇచ్చిన రిపోర్టులో జమచేసిన నోట్లలో నల్లధనం లేదని తేలింది. దీంతో ప్రభుత్వ అసలు బండారం బయటపడింది.

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాదులకు అనుకూలమైన ఆర్థిక విధానాల వల్ల దేశం దివాళా తీస్తున్నది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో జీడీపీ పెరుగుదల రేటు 5.7 శాతంకు పడిపోయింది. రెండో త్రైమాసికంలో 6.3శాతానికి పెరిగింది. ఈ పెరుగుదలకు కారణం విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 60.1బిలియన్ డాలర్లకు పెరగడం. ఈ పెట్టుబడి మన దేశంలోని కంపెనీలను కొనుగోలు చేయడం, విదేశాల నుండి వస్తున్న ఎఫ్ఎఫ్ఐ లు ఎక్కువ మొత్తంలో రావడం, దీని ఫలితంగా విదేశీ మారక ద్రవ్య నిల్వలు 400 బిలియన్ డాలర్లకు పెరగడం, సెన్సెక్స్ 32 వేల పాయింట్లకు పైగా ఎగబాకడం రూపంలో కనబడుతుంది. ఇవి గతంలో ఈక్విటీ రూపంలో రాగా, ప్రస్తుతం అప్పుల రూపంలో వస్తున్నాయి. ఇవి దేశంపై అధిక భారాన్ని మోపుతున్నాయి.

కానీ మరో వైపు ప్రభుత్వం అనుసరిస్తున్న డీమానిటైజేషన్, జీఎస్‌టీ విధానాలతో పాటు ద్రవ్య, ఆర్థిక కారణాలు చాల లోతుల్లో ఉన్నాయి. 2016-17 మధ్య పరిశ్రమల రుణ సామర్థ్యం గత 60ఏళ్ళలో ఎన్నడు లేనంతగా 5.1శాతానికి పడిపోయింది. వ్యవస్థీకృత రంగంలో ఏడాదికి 2లక్షల ఉద్యోగాలతో ఉద్యోగ కల్పనా సామర్థ్యం కుంటి నడక నడుస్తోంది. 2011లో

ఉద్యోగ కల్పనతో పోలిస్తే ఇది పావు వంతు కూడా కాదు. దేశవ్యాప్తంగా దిగుమతులు పెరిగి ఎగుమతులు తగ్గాయి. వ్యాపార లోటు 2016లో 23 బిలియన్ డాలర్లు ఉండగా, అది 2017కు 41 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇవి రాబోయే రోజుల్లో మరింత తీవ్రతరమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థకు ప్రాణం లాంటి ఈ అంశాలను పరిశీలిస్తే, మోడీ ప్రభుత్వం చెబుతున్నట్టుగా భారత ప్రభుత్వం ప్రపంచంలో అత్యధిక అభివృద్ధి రేటును సాధిస్తుందనేది వట్టి బూటకం మాత్రమే.

కేంద్రంలో నరేంద్రమోడీ చేపట్టిన డీమానిటైజేషన్, జీఎస్టీ ప్రభావం, గుజరాత్ రాష్ట్రంలో "అభివృద్ధి" అనే డొల్లతనం బహిర్గతం కావడం, దళితులు, ముస్లింలపై హిందూ మతోన్మాద మూకల దాడులు పెచ్చు పెరగడంతో హిందూత్వ ప్రయోగశాలగా ఉన్న గుజరాత్‌లో ప్రజల్లో అసంతృప్తి పెరిగి బీజేపీ గుజరాత్ ఎన్నికల్లో చావు దప్పి కన్ను లొట్టపోయిన చందంగా విజయం సాధించింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు మంత్రులు ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. మిషన్-150 సీట్లు అని ప్రచారం చేసిన బీజేపీకి వంద సీట్లు కూడ దక్కలేదు. గుజరాత్‌లో ఓటమి తప్పదని భావించిన మోడీ తన ప్రచారంలో ధృవీకరణను పెంచడంలో భాగంగా పాకిస్తాన్ పై ముస్లింల పై విద్వేషాన్ని రెచ్చగొట్టడంతో పాటు కుల, ప్రాంతీయ భావనలను ప్రచారం చేసాడు. అయినప్పటికీ గుజరాత్ గ్రామీణ ప్రాంతాలను, నిరుద్యోగంతో ఆగ్రహావేశులైన యువకులను ఆకట్టుకోలేకపోయాడు. కేవలం బీజేపీకి బలమైన పట్టణ ప్రాంతాలలోని ఓట్లతోనే గండం గట్టెక్కాడు. దీంతో దేశంలో బీజేపీ రాజకీయ ప్రభావం మసకబారడం ప్రారంభమైంది. ఈ ప్రభావం 2019 ఎన్నికల్లో తప్పనిసరిగా ఉంటుంది.

ప్రపంచంలో, మన దేశంలో విప్లవ పరిస్థితులు అత్యద్భుతంగా ఉన్నాయి. ఈ పరిస్థితులను వినియోగించుకోవడానికి బలమైన విప్లవ పార్టీ లేకుండా సాధ్యం కాదు. అందుకు ఈ బోల్షివిక్ విప్లవ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా, ఆ విప్లవం నుండి మనం అసలైన సారాన్ని ఒడిసి పట్టుకొని మన పార్టీని బోల్షివీకరిస్తూ, నిజమైన లెనినిస్టు పార్టీగా అభివృద్ధి చేస్తూ విప్లవ పోరాటాలకు నాయకత్వం వహించడం ద్వారా విప్లవాన్ని విజయవంతం చేయగలం. బోల్షివిక్ పార్టీ నుండి రష్యన్ విప్లవతత్వంతో కూడిన విప్లవ పద్ధతిని, శైలిని నేర్చుకొని భారత విప్లవంలో శీఘ్రగతిన విజయాలు సాధించడానికి కృషి చేయాలి. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అనే సిద్ధాంతం మార్గదర్శకత్వంలో మన దేశంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా ద్వారా భారత విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లగలం. అందుకు మనకు లెనిన్, స్టాలిన్ నాయకత్వంలో కొనసాగిన రష్యన్ విప్లవం సదా ప్రేరణను అందిస్తూనే ఉంటుంది. రష్యన్ సోషలిస్టు విప్లవం ప్రపంచ

మానవాళికి సుందర భవిష్యత్తును అందించింది. దోపిడీ శృంఖలాలను తెంచి సమ సమాజ నిర్మాణం తదుపరి కమ్యూనిజం గుండా సాగే మానవాళి మహత్తర ప్రయాణానికి బాటలు వేసింది. ఆ బాటలో మనం పురోగమిస్తూ కమ్యూనిస్టు ఆశయాన్ని ముందుకు తీసుకువెళదాం. రష్యన్ విప్లవానికి జేజేలు పలుకుదాం.

దాదాపు యూరప్‌లోని అన్ని దేశాలలోను రోమన్ సామ్రాజ్యం రోజుల్లో జూలియస్ సీజర్ ప్రతిపాదించిన జూలియస్ కాలెండర్ అమలులో ఉండేది. ఆ కాలమానంలో పొరపాట్లు ఉన్నాయని పదమూడో గ్రెగరీ అనే పోప్ 1582లో కొత్త కాలెండర్‌ను ప్రతిపాదించాడు. దాన్ని గ్రెగేరియన్ కాలెండర్ అంటారు. ఆ తర్వాత యూరప్‌లో కొన్ని దేశాలలో జూలియస్ మరికొన్ని దేశాల్లో గ్రెగేరియన్ కాలెండర్లను పాటించడం అనవాయితీ అయింది. విప్లవం నాటికి రష్యాలో జూలియస్ కాలెండర్ అమలులో ఉండేది. ఆ కాలెండర్ ప్రకారం ప్రధాన విప్లవ విజయం అక్టోబర్ 25న సాధించారు. కానీ విప్లవానంతరం 1918 ఫిబ్రవరిలో రష్యాలో కూడా గ్రెగేరియన్ కాలెండర్‌ను పాటించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కాలెండర్ మార్పులో పదమూడు రోజుల లెక్క మారింది. అందువల్ల అక్టోబర్ 25 కాస్తా నవంబర్ 7గా మారింది. అక్టోబర్ విప్లవ విజయోత్సవ దినం నవంబర్ 7గా స్థిరపడింది. అక్టోబర్ విప్లవాన్ని నవంబర్ 7న జరపడం పరిపాటి అయింది. – సంపాదక మండలి

***

---

(127వ పేజీ తరువాయి భాగం...)

అంకిత భావం ఉండాలి. పార్టీ, విప్లవం, ప్రజల ప్రయోజనాలకు దూరమై, తమ స్వార్ధ ప్రయోజనాలకు విలువ నిచ్చి ద్రోహం చేసే రెనగేడ్లను తీవ్రంగా వ్యతిరేకిద్దాం, వారిని అసహ్యించుకుందాం. మన ప్రియతమ అమరులు చూపిన అరుణకాంతులీనే విప్లవ బాటలో కమ్యూనిస్టు విలువల్ని, ఆచరణను చివరి ఊపిరి వరకూ ఎత్తిపడుతూ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో, సోషలిజం–కమ్యూనిజం సాధించే లక్ష్యంతో భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేద్దాం.

**విప్లవాభినందనలతో,**

**కేంద్రకమిటీ**

తేదీ 19-1-2018 **సి.పి.ఐ. (మావోయిస్టు)**

# అక్టోబర్ సోషలిస్టు విప్లవంపై మార్క్సిస్టు మహోపాధ్యాయులు

## మూడవ ఇంటర్నేషనల్, చరిత్రలో దాని స్థానమూ

**– లెనిన్**

సోవియట్ రిపబ్లిక్కును అంటురోగానికి పుట్టిల్లుగా పెట్టుబడిదారీ ప్రపంచం నుండి తెగగొట్టి వేయడానికి ప్రయత్నించుతూ "మిత్రరాజ్య" దేశాల* సామ్రాజ్యవాదులు రష్యాపై దిగ్బంధన ప్రకటించారు. తమ "ప్రజాస్వామిక" సంస్థలను గురించి బడాయిలు చెప్పుకుంటున్న ఈ మనుషులకు సోవియట్ రిపబ్లిక్‌పట్ల వున్న గుడ్డి ద్వేషం ఎంతవరకూ పోతూందంటే, తాము ఎంతటి నగుబాట్లకు పాలవుతున్నది కూడా వారు తెలుసుకో లేకుండా వున్నారు. "ప్రజాస్వామిక ములైనట్టీ," నఖశిఖపర్యంతమూ ఆయుధాలు ధరించినట్టీ సర్వ ప్రపంచం పైనా అవిభక్తమైన సైనిక పరిపాలనను చలాయించుతున్నట్టీ అత్యంత నాగరికతను కల్గిన పురోగామి దేశాలు, శిథిలమైపోయి, వస్తుంటూ, వెనకపడిపోయి, కొందరి ఉద్ఘోషననుసరించి అర్ధ కిరాతకమైన దేశంనుండి భావశాస్త్రీయ సంసర్గ దోషం కలుగుతుందని ప్రాణాంతకంగా భయపడడం ఎంత విడ్డూరమో ఆలోచించండి !

ఈ వైరుధ్యం ఒక్కటే అన్ని దేశాల్లోని కష్టజీవులకు కనువిప్పు కలిగించుతూ, సామ్రాజ్యవాదులు క్లెమాన్‌సో, లాయిడ్ జార్జ్, విల్సన్‌లయొక్క, వారి ప్రభుత్వాలయొక్క కృత్రిమబుద్ధిని బయట పెట్టేందుకు తోడ్పడుతూంది.

అయినప్పటికి, సోవియట్ల పట్ల పెట్టుబడిదార్ల గుడ్డి ద్వేషమే కాకుండా, తమలో తాము సాగించుకుంటున్నట్టీ ఒకరి వెనుక ఒకరు గోతులు తీయడానికి ప్రేరేపించుతున్నట్టీ తగవులాటలు కూడా మనకు తోడ్పడుతున్నాయి. వారు పరస్పరంగా అచ్చమైన మౌనదుస్తంత్రం ఒకదానిని

---

* "మిత్రరాజ్య" దేశాలు లేక ఆంటాంట్ – జర్మనీ, ఆస్ట్రియా–హంగేరీ, ఇటలీల సామ్రాజ్యవాద త్రైరాజ్య మిత్రమండలికి ప్రతిగా 1907లో అంతిమంగా రూపొందినట్టి ఇంగ్లండు, ఫ్రాన్సు, రష్యాల సామ్రాజ్యవాద కూటమి. మొదటి ప్రపంచ యుద్ధంలో (1914–1918) అమెరికా సంయుక్త రాష్ట్రాలు, జపాన్, ఇటలీ, ఇతర రాజ్యాలూ ఆంటాంట్‌తో చేరాయి.

పన్నుతున్నారు, ఎందుచేతనంటే, సాధరణంగా సోవియట్ రిపబ్లిక్ గురించీ, ప్రత్యేకంగా దాని అధికారపత్రాలను గురించీ నిజమైన భోగట్టాను ప్రచురించడానికి వారికి వల్లమాలినంత భయం కలుగుతూంది. అయినప్పటికీ, ఫ్రెంచి బూర్జువావర్గ ప్రధాన పత్రిక అయిన "కాలము" ("Le Temps"), మాస్కోలో మూడవ ఇంటర్నేషనల్ స్థాపన గురించి ఒక వృత్తాంతం ప్రచురించింది.

ఇందుకుగాను ఫ్రెంచి బూర్జువావర్గపు ప్రధాన పత్రికకు, ఫ్రెంచి జాతీయదురహంకార, సామ్రాజ్యవాద నాయకమణికి మన గౌరవపురస్కరమైన వందనాలు తెలియజేస్తున్నాం. ఆ పత్రిక మనకు అందజేస్తూన్న ఫలప్రదమూ సమర్ధవంతమూ అయిన సహాయానికి అస్మదభివందన సూచకంగా సువర్ణాక్షరాలతో ఉజ్వలితమగు విజ్ఞాపన పత్రాన్ని "Le Temps" కు పంపడానికి మేం సిద్ధంగా వున్నాం.

మన రేడియో ప్రసారాలను ఆధారం చేసుకుని "Le Temps" తన వృత్తాంతాన్ని సంకలనం చేసిన విధానమే, డబ్బుసంచులకు బాకా పట్టుతూన్న ఈ పత్రికను ప్రేరేపించిన ఉద్దేశాన్ని స్పష్టంగానూ సంపూర్ణంగానూ బయటపెట్టుతూంది. "ఎలాంటి వాళ్లతో సంప్రతింపులు జరపడానికి మీరు ఒడిగట్టుతున్నారో, చూశారా!" అంటూ ధ్వనించేటట్లుగా విల్సన్‌న్ని దెప్పడమే దాని ఉద్దేశ్యం. బోల్‌షెవిక్ బూచిని చూపించి విల్సన్‌న్ని భయపెట్టేందుకు డబ్బుసంచుల హుకుమ్ ప్రకారం రాస్తూన్న ఈ పండితమ్మన్యులు చేస్తూన్న యత్నం, బోల్‌షెవిక్‌లకు ఒక అడ్వర్‌టైజ్‌మెంటుగా కష్టజీవుల దృష్టిలో కనబడుతూందన్న విషయం వారు గమనించడం లేదు. ఫ్రెంచి కోటీశ్వరుల పత్రికకు మన గౌరవ పురస్కారాభివందనాలు తెలియజేస్తున్నాం.

ప్రపంచ కార్మికవర్గంలో ఈ ఇంటర్నేషనల్ గురించిన వార్తలూ, దానిపట్ల సానుభూతీ వ్యాప్తిచెందకుండా "ఆంటాంట్" సామ్రాజ్యవాదుల, లేదా జర్మనీలోని షైడెమన్‌లూ, ఆస్ట్రియాలోని రెన్నెర్‌లూ లాంటి పెట్టుబడిదారీ వర్గపు గులాముల ఎట్టి నిషేదాజ్ఞలూ, ఎట్టి నీచమైన దౌర్భాగ్యపు కుతంత్రాలూ అరికట్టజాలనట్టి అంతర్జాతీయ పరిస్థితులలో మూడవ ఇంటర్నేషనల్ స్థాపించబడింది. సర్వత్రా స్పష్టంగా దినదినమూ, ఆమాటకొస్తే గంటగంటకూ, ప్రవర్ధమానమౌతూన్న శ్రామికవర్గ విప్లవమే ఈ పరిస్తితికి కారణం. కష్టజీవిరాసులలో నిజంగా అంతర్జాతీయంగా రూపొందినంతటి బలాన్ని ఇప్పటికప్పుడే సంపాదించిన సోవియట్ ఉద్యమమే ఈ పరిస్థితికి కారణభూతమైంది.

పెట్టుబడిపై తమ విప్లవాత్మక దాడిని సన్నద్ధం చేసుకునేందుకు కార్మికుల అంతర్జాతీయ ఆర్గనైజేషను ఒకదానికి మొదటి ఇంటర్నేషనల్ (1864–1872) శంఖుస్థాపన చేసింది. విప్లవాత్మక స్థాయిలో తాత్కాలికమైన తగ్గుదలకూ, చిట్టచివరకు ఈ ఇంటర్నేషనల్ యొక్క అవమానకరమైన వినాశానికే దారితీసిన అవకాశవాదంయొక్క తాత్కాలిక పటుత్వానికీ కారణమైన వైశాల్యాభివృద్ధిని సాధించినట్టి శ్రామికవర్గ ఉద్యమంయొక్క అంతర్జాతీయ ఆర్గనైజేషను రెండవ

ఇంటర్నేషనల్ (1889–1914).

అవకాశావాదానికి సోషల్–జాతీయ దురహంకారానికీ వ్యతిరేకంగా సుదీర్ఘ సంవత్సారాల కాలంలో ప్రత్యేకంగా యుద్ధకాలంలో, సాగిన పోరాటం అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీల స్థాపనకు దారితీసిన పరిస్థితులలో, వాస్తవంగా 1918లో మూడవ ఇంటర్నేషనల్ ప్రాదుర్భవించింది. అధికారయుతంగా మూడవ ఇంటర్నేషనల్ మాస్కోలో 1919 మార్చి లో జరిగిన ఈ ఇంటర్నేషనల్ యొక్క మొదటి కాంగ్రెస్‌లో స్థాపించబడింది. కాగా ఈ ఇంటర్నేషనల్‌యొక్క అత్యంత స్వాభావికమైన ఈ లక్షణం – ఈ కొత్త మూడవ "ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ ఎసోషియేషన్" ఇప్పటికే సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల యూనియన్‌తో కొంతమేరకు అనురూపం చెందడం ప్రారంభించిదనే వాస్తవ విషయంలో ప్రాదుర్భవించింది.

సోషలిజానికై శ్రామికవర్గ, అంతర్జాతీయ పోరాటానికి మొదటి ఇంటర్నేషనల్ పునాది వేసింది.

అనేక దేశాల్లో ఉద్యమానికై విశాల, రాశివిస్తరణకు నేలను సిద్ధంచేసే కాలావ్యవధికి రెండవ ఇంటర్‌నేషనల్ చిహ్నమైంది.

రెండవ ఇంటర్నేషనల్ క్రియాకలాప ఫలితాలను క్రోడీకరించి దాని అవకాశవాద, సోషల్ జాతీయ దురహంకార, బూర్జువా, పెటీ బూర్జువ వర్గాల చెత్తచెదారాన్ని తిరస్కరించి, శ్రామికవర్గ నియంతృత్వాన్ని ఆచరణలోకి తీసుకువచ్చేందుకు మూడవ ఇంటర్నేషనల్ ప్రారంభించింది.

ప్రపంచంలోని అత్యంత విప్లవాత్మకమైన ఉద్యమానికి, పెట్టుబడి గాటినుండి విముక్తిని సాధించేందుకై శ్రామికవర్గం యొక్క ఉద్యమానికి నాయకత్వం వహించుతూన్న పార్టీల అంతర్జాతీయ మిత్రత్వం, అంతర్జాతీయ స్థాయిలో శ్రామికవర్గ నియంతృత్వానికీ, పెట్టుబడిదారీ విధానంపై దాని విజయానికీ రూపురేఖలు దిద్దుతూన్న అనేక సోవియట్ రిపబ్లిక్కుల స్వరూపంలో అవతరించుతున్నట్టి అపూర్వ పటుతర ప్రాతిపదికపై ఇప్పుడు ఆదారపడివుంది.

మూడవ ఇంటర్నేషనల్ యొక్క చారిత్రాత్మక ప్రాముఖ్యతంతా, మార్క్స్ ఇచ్చినట్టి ప్రధాన నినాదం, శతాబ్దులుగా సాగుతూన్న సోషలిజంయొక్క, కార్మికవర్గ ఉద్యమంయొక్క అభివృద్ధిని సంక్షిప్తంగా వ్యక్తపరుస్తూన్న నినాదం, శ్రామికవర్గ నియంతృత్వమనే భావనలో ద్యోతకమవుతున్న నినాదాన్ని చరితార్థంచేయ నారంభించడంలోనే వుంది.

ప్రతిభాన్వితమైన ఈ భవిష్యత్ జ్ఞానం, ప్రతిభాన్వితమైన ఈ సిద్ధాంతం – యథార్థమవుతుంది.

లాటిన్ భాషలోవున్న ఈ వాక్యం ఇప్పుడు సమకాలిక యూరప్‌లోని అన్ని భాషల్లోకి అనువదించబడింది.

ప్రపంచ చరిత్రలో ఒక నూతన శకం ఆరంభమైంది.

పెట్టుబడిదారీ విధానపు బానిసత్వం, లేదా వేతనపు బానిసత్వం, అనే బానిసత్వపు తుది రూపాన్ని మానవాళి వదిలించేసుకుంటూంది.

బానిసత్వంనుండి తాను విమోచన సాధించుకోవడంవల్ల మానవాళి తొలిసారిగా నిజమైన స్వేచ్ఛాస్థితికి పరివర్తన చెందుతూంది.

యూరప్‌లోని మిక్కిలి వెనుకబడిన దేశాల్లో ఒక దేశానికి, శ్రామికవర్గ నియంతృత్వం స్థాపించడానికీ, సోవియట్ రిపబ్లిక్కును ఆర్గనైజు చేయడానికీ ఎలా వీలైంది? రష్యా బడుగుస్థితికీ, బూర్జువా ప్రజాస్వామ్యం పై గంతువేసి సోవియట్, లేక శ్రామికవర్గ ప్రజాస్వామ్యంలోకి, ప్రజాస్వామ్యం యొక్క అత్యున్నత రూపంలోకి "దాటు" వేయడానికి వున్న ఈ వైరుధ్యమే ఒక కారణమని (సోషలిస్టు నాయకులలో అధికసంఖ్యాకవర్గానికి గుదిబండలా తయారైన అవకాశవాదపు అలవాట్లూ, అల్పబుద్ధి దురభిమానాలూ అటుండగా) చెప్పడంలో మనమెంతమాత్రమూ పొరపడడంలేదు.

శ్రామికవర్గ పోరాటంలో ఒక ఉపకారణంగా, శ్రామికవర్గ రాజ్యాంగయంత్రం యొక్క ఒక రూపంగా సోవియట్ల ప్రాముఖ్యతను యావత్ ప్రపంచ కార్మిక ప్రజారాసులూ సహజ జ్ఞానంతో ఆకళింపు చేసుకున్నాయి. కాని అవకాశవాదంచే చెడగొట్టబడిన "నాయకమ్మన్యులు," "ప్రజాస్వామ్య"మని తాము సాధరణంగా పిలుస్తున్నట్టి బూర్జువా ప్రజాస్వామ్యాన్నే వారు ఆరాధించ సాగించి, దానిని ఇంకా ఆరాధించుతూనేవున్నారు.

రష్యాయొక్క వెనకబాటుతనమూ, బూర్జువా ప్రజాస్వామ్యం పై గంతువేసి "దాటు" వేయడమూ, ఈ రెంటికీ వున్న వైరుధ్యాన్ని శ్రామికవర్గ నియంతృత్వ స్థాపన ప్రధానంగా వ్యక్తపరచడంలో ఆశ్చర్యమేముంది? అనేక వైరుధ్యాలు లేకుండానే ప్రజాస్వామ్య నూతన రూపాన్నొకదానిని చరిత్ర మనకు ప్రసాదించి వుండిన పక్షంలో ఆ విషయమే ఎంతో ఆశ్చర్యం కల్గించి వుండేది.

"శ్రామికవర్గ నియంతృత్వంలోకి వేర్వేరు పెట్టుబడిదారీ విధానపు దేశాల పరివర్తనలు అసమానంగానూ, లేదా సమస్వర నిష్పత్తిలోనే వుండడమూ సంభవమా?" అని ఒక మార్క్సిస్టుని, లేదా ఆధునిక విజ్ఞాన శాస్త్రంతో ఏ మాత్రం పరిచయంవున్న వ్యక్తినైనా ప్రశ్నించినట్లయితే, వుండదనే అతడు తప్పక జబాబిస్తాడు. పెట్టుబడిదారీ ప్రపంచంలో సమానత, సమస్వరమూ, లేదా నిష్పత్తిబద్ధమూ ఇదివరకెన్నడూ వుండలేదు, వుండేందుకు వీలూలేదు. పెట్టుబడిదారీ విధానంయొక్కా, కార్మికవర్గ ఉద్యమంయొక్కా పార్శ్వాలలోనూ, లేక స్వభావాలలోనూ, లేక గుణగణాలలోనూ ఒకప్పుడు ఒకదానికి, మరొకప్పుడు మరొకదానికీ ప్రత్యేక ప్రాధాన్యతను ప్రదర్శించి, ప్రతి దేశమూ అభివృద్ధి చెందింది. అభివృద్ధి ప్రక్రియ అసమానంగానే వుంటూ వచ్చింది.

ఫ్రాన్సు తన మహనీయ బూర్జువా విప్లవాన్ని సాగించుకుంటూ, యూరపియన్ ఖండాన్నంతనూ చారిత్రకంగా ఒక నూతన జీవితానికి మేల్కొల్పుతుండినప్పుడు, పెట్టుబడిదారీ విధానం దృష్ట్యా ఫ్రాన్సుకంటె ఇంగ్లండే అత్యంత ఉన్నతాభివృద్ధి చెందివుండినప్పటికీ, విప్లవప్రతిఘాత సంయుక్తమండలికి ఇంగ్లండే నాయకత్వం వహించింది. కాగా ఆనాటి బ్రిటిష్ కార్మికవర్గ ఉద్యమం భావి మార్క్సిజంలోని విషయాన్ని చాలవరకు ముందుగానే ఉజ్వలంగా ఊహించగలిగింది.

ప్రపంచానికి బ్రిటన్ చార్టిజాన్ని, మొట్ట మొదటిసారిగా విశాలమైనట్టీ యథార్థ ప్రజారాశీమైట్టి రాజకీయంగా ఆర్గనైజైనట్టీ శ్రామికవర్గ విప్లవాత్మక ఉద్యమాన్ని, బహుకరించినప్పుడు, బలహీనస్థితిలోనే వుండిన అనేక బూర్జువా విప్లవాలు యూరప్ ఖండంలో జరుగుతుండగా, అదే సమయంలో శ్రామికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య మొదటి మహోనీయ అంతర్యుద్ధం ఫ్రాన్సులో ప్రజ్వరిల్లింది. శ్రామికవర్గం యొక్క వివిధ జాతీయ దళాలను ఒకదాని తరువాత ఒకటిగానూ, భిన్నభిన్న దేశాల్లో భిన్నభిన్న మార్గాలలోనూ బూర్జువావర్గం ఓడించివేసింది.

ఎంగెల్స్ చెప్పినట్టు, బూర్జువావర్గపు ప్రభువర్గం సరసనే అత్యంత బూర్జువా రూపాన్ని ధరించినట్టు శ్రామికవర్గ ఉన్నత స్తరమొక దానిని ప్రభవించిన బూర్జువావర్గాన్ని కలిగినట్టి దేశాలకు, బ్రిటన్ ఒక నమూనా దేశంగా తయారైంది. శ్రామికవర్గం యొక్క విప్లవాత్మక పోరాటానికి సంబంధించినంత వరకు, ఈ పురోగామి పెట్టుబడిదారీ దేశం అనేక దశాబ్దుల తరబడి వెనకే ఉండిపోయింది. 1848, 1871 సంవత్సరాలలో జరిగినట్టీ, ప్రపంచ చరిత్ర అభివృద్ధికి అత్యంత గణనీయంగా సహాయం చేసినట్టీ, బూర్జువావర్గానికి వ్యతిరేకంగా జరిగినట్టీ విరోచిత కార్మికవర్గ విప్లవాలు రెండింటిలోనూ, ఒక విధంగా చెప్పాలంటే, శ్రామికవర్గపు పటిమను ఫ్రాన్సు పూర్తిగా బలహీనపరచేసింది. తరువాత అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమాధిపత్యం జర్మనీకి లభించింది; పందొమ్మిదో శతాబ్ది ఎనిమిదో దశాబ్దిలో ఆర్థికదృష్ట్యా, ఇంగ్లండు ఫ్రాన్సులకంటే జర్మనీ ఇంకా వెనుకబడి వుండిన కాలంలో ఇది జరిగింది. కాని ఎప్పుడైతే ఆర్థికంగా జర్మనీ ఈ రెండు దేశాలనూ మించిపోయిందో, అనగా ఇరవైయ్యో శతాబ్ది రెండో దశాబ్దిలో, ప్రపంచానికంతటికీ నమూనాగా వుండిన జర్మన్ మార్క్సిస్టు కార్మికుల పార్టీ, కార్మికుల శ్రేణులలోనుండి వచ్చినట్టీ, ఏకరాజాధిపత్యం యొక్క కొలువులో వుండినట్టీ, పెట్టుబడిదార్లకు అమ్ముడు పోయినట్టీ, నీచాతినీచులైన కసాయివాళ్ల, అత్యంత హేయకరమైన పట్టెడుమంది శుద్ధ దగల్బాజీల – షైడెమన్, నోస్కెలమొదలు డావిడ్, లెజీన్‌ల వరకూ – నాయకత్వం కిందకి వచ్చినట్టు రుజువైంది.

శ్రామికవర్గ నియంతృత్వానికే ప్రపంచ చరిత్ర సూటిగా సాగిపోతూంది; కాని ఈ సాగిపోవడంలో ఎంత మాత్రమూ చదునూ, సరళమూ, సూటీ కానట్టి మార్గాలనే అది అనుసరించుతుంది.

కౌట్స్కి తానింకా మార్క్సిస్టుగానూ, సోవియట్, లేక శ్రామికవర్గ, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా షైడెమన్‌తోనూ బూర్జువా ప్రజాస్వామ్యంతోనూ కలిసి ఐక్యత తరపున పోరాడి తద్వారా మార్క్సిజంనుండి స్వపక్షపరిత్యాగి ఇంకా కాకుండానూ వుండిన రోజుల్లో, "స్లావ్ ప్రజలూ, విప్లవమూ" అనే శీర్షికతో ఒక వ్యాసం – ఇరవైయ్యో శతాబ్ది మొట్టమొదట్లో – రాశాడు. అంతర్జాతీయ విప్లవోద్యమంలో ఆధిపత్యం స్లావ్ ప్రజలకు లభించే సాధ్యతను సూచించుతుండినట్టి చారిత్రక పరిస్థితులను ఈ వ్యాసంలో అతడు ఎత్తి చూపాడు.

సరిగ్గా అలాగే జరిగింది. ఎలాగైతే పంథొమ్మిదో శతాబ్దిలో వివిధ కాలావధులలో విప్లవాత్మక శ్రామికవర్గపు ఇంటర్నేషనల్‌లోని ఆధిపత్యం మొదట బ్రిటిష్ కార్మికుల చేతిలోనూ, తరువాత ఫ్రెంచి కార్మికుల చేతిలోనూ, ఆ తరువాత జర్మన్ కార్మికుల చేతిలోనూ వుండినదో, అలాగే కొంతకాలం – కొంతకాలం వరకే అని చెప్పనవసరమే లేదు – అది రష్యన్లకు లభించుతుంది.

పురోగామి దేశాలతో సరిపోల్చి చూస్తే, మహత్తర శ్రామికవర్గ విప్లవాన్ని రష్యన్లు సులభంగానే ఆరంభించ గలిగారు గాని, సోషలిస్టు సమాజాన్ని ఆర్గనైజు చేయడమనే అర్థంలో, దానిని సాగించి, అంతిమ విజయానికి కొనిపోవడం వారికి మరింత కష్టమవుతుందని చెప్పడానికి అనేకాసార్లు అవకాశం కలిగింది.

మనకు ఆరంభం సులభమవడానికి కారణాలలో మొదటి కారణం: రాజకీయంగా జారిస్టు ఏకరాజ పరిపాలనా వ్యవస్థ యొక్క – ఇరవైయ్యో శతాబ్ది యూరప్ పరిస్థితుల దృష్ట్యా – అసాధారాణమైన వెనుకబడినతనం అసాధారణ బలంకలిగినట్టి విప్లవాత్మక దాడిని ప్రజారాసులలో పురికొల్పింది. రెండోకారణం, రష్యా వెనుకబడినతనం బూర్జువావర్గానికి వ్యతిరేకంగా లేచిన శ్రామికవర్గ విప్లవాన్ని, భూస్వాములకు వ్యతిరేకంగా లేచిన రైతు విప్లవంతో ఒక చిత్రమైన విధంగా విలీనంచేసింది. అక్టోబరు 1917 లో సరిగా ఇక్కడే మనం ప్రారంభించాం, కాగా ఇక్కడే గనుక మనం ప్రారంభించక పోయుంటే, అంత సులభంగా మనం విజయం సాధించగల్గి వుండేవారంకాం. ప్రష్యా గురించి చెబుతూ శ్రామికవర్గ విప్లవము, రైతుయుద్ధాల చిత్రమైన కలయికయొక్క సాధ్యతను గురించి 1856 లోనే మార్క్స్ ప్రస్తావించాడు. 1905 ఆరంభం నుండీ బోల్‌షెవిక్‌లు శ్రామికవర్గ, రైతాంగాల విప్లవాత్మక ప్రజాస్వామిక నియంతృత్వ భావానికి అనుకూలంగానే వాదించుతూ వచ్చారు. మూడో కారణం: కార్మిక, రైతు ప్రజారాసుల రాజకీయ ప్రబోధానికై, పాశ్చాత్యంలో సోషలిజం గురించి చెప్పబడిన "తుది మాట"ను వాటి అగ్రగామిదళాలకు పరిచయం చేయడమూ, ప్రజారాసుల విప్లవాత్మక క్రియాకలాపాలూ, ఈ రెంటి విషయంలోనూ, 1905 విప్లవం బ్రహ్మాండంగా తోడ్పడింది. 1905 లో జరిగినట్టి "డ్రెస్ రిహర్సల్" మనకు లేకుండిన పక్షమందు – 1917లో ఫిబ్రవరి బూర్జువా విప్లవమూ,

అక్టోబరు శ్రామికవర్గ విప్లవమూ, రెండూ అసాధ్యములే అయివుండేవి. నాల్గో కారణం: పెట్టుబడిదారీ పురోగామి దేశాల సైనిక శ్రేష్టతకు తట్టుకొని, మరేఇతర దేశంకంటే కూడా రష్యాయే దీర్ఘకాలం నిలబడగల్గిందంటే, అందుకు రష్యా భౌగోళిక పరిస్థితులే కారణమయాయి. ఐదోకారణం: రైతాంగం పట్ల శ్రామికవర్గం యొక్క వైఖరి, బూర్జువా విప్లవం నుండి సోషలిస్టు విప్లవంలోకి పరివర్తనను సులభంచేసి, గ్రామీణ కష్టజీవులలో నిరుపేద అర శ్రామికవర్గ విభాగాలపై నగర శ్రామికులకు తమ ప్రభావం ప్రసరించడానికి మరింత సులభంచేసింది. ఆరో కారణం: సమ్మెక్రియాకలాపంలో సుదీర్ఘమైన శిక్షణా, యూరపియన్ రాశి కార్మికవర్గ ఉద్యమానుభవమూ సోవియట్లు లాంటి శ్రామికవర్గ విప్లవాత్మక ఆర్గనైజేషను యొక్క అద్వితీయ రూప ఆవిర్భవాన్ని – ప్రగాఢంగానూ త్వరితగతినీ తీవ్రమవుతూన్న విప్లవాత్మక పరిస్థితులలో – సులభం చేశాయి.

ఈ జాబితా అసంపూర్ణంగా వుండడం సహజమే; కాని ప్రస్తుతానికి చాలు.

సోవియట్, లేక శ్రామికవర్గ ప్రజాస్వామ్యం రష్యాలో ఉద్భవించింది. పారిస్ కమ్యూన్ తరువాత చరిత్రాత్మకమైన రెండవ అడుగు వేయడం జరిగింది. శ్రామికవర్గ – కర్షక సోవియట్ రిపబ్లిక్కే ప్రపంచంలో సుస్థిరమైన మొదట సోషలిస్టు రిపబ్లిక్కు అని రుజువయింది. ఒక కొత్త తరహా రాజ్యాంగయంత్రంగా దానికి మృతివుండదు. ఈనాడు అది ఒంటరిగా నిలబడడంలేదు.

సోషలిస్టు నిర్మాణకార్యాన్ని సాగించడానికీ, పరిసమాప్తం కావించడానికీ మరింత ఇంకా మరింత కృషి అవసరం. ఇంతకంటె మరింతగా నాగరికత చెందిన దేశాలు, ఇంతకంటే మరింత అధికంగా శ్రామికవర్గానికి బలప్రభావాలుగల దేశాలు ఒకసారి గనుక శ్రామికవర్గ నియంతృత్వ మార్గాన్ని చేపట్టాయంటే, అట్టి దేశాలలో ఏర్పడే సోవియట్ రిపబ్లిక్కులకు రష్యాను మించిపోవడానికి ఎంతేనా సాధ్యమవుతుంది.

దివాళాకోరు రెండవ ఇంటర్నేషనల్ ఇప్పుడు మరణశయ్య మీదా కొనవూపిరితో కుళ్లుతూంది. వాస్తవంగా అది అంర్జాతీయ బూర్జువావర్గపు గులాము పాత్రను నిర్వహిస్తూంది. అది అచ్చమైన పసుప్పచ్చ ఇంటర్నేషనల్ కౌట్స్కీలాంటి దానిప్రధాన భావశాస్త్ర వేత్తలు, బూర్జువా ప్రజాస్వామ్యాన్ని ఆకాశానికి ఎత్తుతూ, దానికి సాధారణంగా "ప్రజాస్వామ్య" మని, లేక – మరింత బుద్ధితక్కువగానూ, మరింత మొరటుగానూ – "స్వచ్ఛమైన ప్రజాస్వామ్య"మని పేరు పెడతారు.

బూర్జువా ప్రజాస్వామిక చట్రపు పరిమితులలో కార్మికవర్గాన్ని తర్ఫీదు చెయ్యడమే తక్షణ కర్తవ్యమై వుండినప్పుడు చారిత్రకంగా అవసరమూ ఉపయోగకరమూ అయినట్టి ఆ కర్తవ్యాన్ని రెండవ ఇంటర్నేషనల్ నెరవేర్చినప్పటికీ, దీనిలాగానే బూర్జువా ప్రజాస్వామ్యం తన ఆయుష్కాలాన్ని

మించి జీవించుతూంది.

అత్యంత ప్రజాస్వామికమైన బూర్జువా రిపబ్లిక్కు అయినా సరే, అది పెట్టుబడిచే కష్టజీవులను అణచిపెట్టివుంచే యంత్రమే, పెట్టుబడియొక్క రాజకీయ పరిపాలనా ఉపకారణమే, బూర్జువా నియంతృత్వమే తప్ప మరొకటిగా ఇంతవరకూ కాలేదు, ఇకమీదటా కానేరదు. ప్రజాస్వామిక బూర్జువా రిపబ్లిక్కు అధికసంఖ్యాకవర్గపు ప్రభుత్వాన్ని వాగ్దానం చేసింది, ప్రకటించింది, కాని భూమిపైనీ, ఇతర ఉత్పత్తి సాధనాలలోనూ ప్రైవేటు ఆస్తి వుండినంత కాలమూ దీని నది ఆచరణలో పెట్టజాలదు.

బూర్జువా ప్రజాస్వామిక రిపబ్లిక్కులలో "స్వేచ్ఛ" అంటే ధనికులకు స్వేచ్ఛే అయింది. నిజంగా పెట్టుబడిని కూలదోసేందుకై తమ బలాలను తయారుచేసుకుందుకు శ్రమ జీవులూ, కష్టజీవిరైతాంగమూ దానిని ఉపయోగించుకొనగల్గి వుండేవారు, ఉపయోగించుకుని వుండాల్సిందే కూడా, కాని వాస్తవానికి, ఒక సాధారణ నియమంగా పెట్టుబడిదారీ విధానం కింద కష్టజీవి ప్రజారాసులు ప్రజాస్వామ్యాన్ని అనుభవించ లేకపోయారు.

సోవియట్, లేక శ్రామికవర్గ ప్రజాస్వామ్యం, ప్రపంచంలో మొట్టమొదటి సారిగా ప్రజారాసులకు, కార్మికులకూ, సన్నకారు రైతులకూ ప్రజాస్వామ్యాన్ని సృష్టించింది.

సోవియట్ రాజ్యాధికారం వంటి, జనసంఖ్యలో అధిక సంఖ్యాకవర్గంచే పరిపాలనా రాజ్యాధికారం, ఈ అధికసంఖ్యాకవర్గంచే రాజ్యాధికారం వాస్తవంగా, ఇంతవరకెన్నడూ ప్రపంచంలో ప్రభవించివుండలేదు.

దోపిడీదార్ల యొక్కా, వారి కుమ్మక్కుదార్ల యొక్కా "స్వేచ్ఛ" ను అది అణగదొక్కి వుంచుతుంది. వారికి దోపిడీ చేసేందుకు "స్వేచ్ఛ" లేకుండా, ఇతరుల కడుపులుకొట్టి తాము కొవ్వెకేందుకు "స్వేచ్ఛ" లేకుండా, పెట్టుబడి పరిపాలనను తిరిగి నెలకొల్పేందుకు పోరాడే "స్వేచ్ఛ" లేకుండా, తమ స్వదేశపు కార్మికులకూ రైతులకూ వ్యతిరేకంగా విదేశ బూర్జువావర్గంతో ఒప్పందాలు కుదుర్చుకుందుకు "స్వేచ్ఛ" లేకుండా అది చేస్తుంది.

అట్టి స్వేచ్ఛను కౌట్స్కీలు రక్షించుతే రక్షించవచ్చు గాక, ఇందుకు మార్క్సిజం నుండి స్వపక్షపరిత్యాగి సోషలిజంనుండి స్వపక్షపరిత్యాగి కాకతప్పదు.

హిల్ ఫేర్‌డింగ్, కౌట్స్కిలాంటి రెండవ ఇంటర్నేషనల్ భావశాస్త్రవేత్తల దివాళా కోరుతనం సోవియట్ లేక శ్రామికవర్గపు ప్రజాస్వామ్యంయొక్క ప్రాముఖ్యతను, పారిస్ కమ్యూన్‌తో దాని సంబంధాన్ని, చరిత్రలో దాని స్థానాన్ని, శ్రామికవర్గ నియంతృత్వ రూపంగా దాని సంబధాన్ని, చరిత్రలో దాని స్థానాన్ని, శ్రామికవర్గ నియంతృత్వ రూపంగా దాని ఆవశ్యకతను బొత్తిగా అర్థం చేసుకో లేకపోవడంలో ప్రదర్శితమైనంత అద్భుతంగా మరెందులోనూ ప్రదర్శితం

కావడంలేదు.

"స్వతంత్ర" (మధ్యతరగతి, అల్పబుద్ధి, పెట్టీ బూర్జువా తత్వం పెట్టుకున్న మారు పేరు ఇది) జర్మన్ సోషల్ - డెమోక్రాటిక్ పార్టీ వార్తాపత్రిక "స్వేచ్ఛ" ("Die freiheit") "జర్మనీ దేశపు విప్లవాత్మక శ్రామికవర్గానికి" అనే శీర్షికతో ఒక విజ్ఞప్తిని 1919 ఫిబ్రవరి 11న 74 సంచికలో ప్రచురించింది.

ఈ విజ్ఞప్తి మీద పార్టీ కార్యవర్గమూ, జర్మన్ "ఉచ్రెదీల్క" అయినట్టి "జాతీయ సమావేశం" లోని పార్టీ సభ్యులందరూ సంతకాలు చేశారు.

షైడెమన్ ప్రభృతులకు సోవియట్లను రద్దుచేసే ఉద్దేశ్యం వుందని, వీరిపై నేరం మోపుతూ, ఈ విజ్ఞప్తి - నవ్వకండి! - ఉచ్రెదీల్కతో సోవియట్లు మిళితం చేయబడాలనీ, కొన్ని నిర్దిష్టములైన రాజకీయాధికారాలనూ, రాజ్యాంగంలో ఒక నిర్దిష్ట స్థానాన్నీ, సోవియట్లకు కల్గించాల్సిందనీ ప్రతిపాదించింది.

బూర్జువా నియంతృత్వానికి శ్రామికవర్గ నియంతృత్వంతో పొత్తు కుదిర్చి, ఐక్యం చేయడం! ఎంత సులభమో! ఎంత ప్రతిభభాన్విత అల్పబుద్ధి భావమో!

అసలు లోపమంతా ఎక్కడుందంటే, సంయుక్త మెన్‌షెవిక్‌లూ, తాము సోషలిస్టులమని భ్రమపడుతున్నట్టి పెట్టీ బూర్జువాలైన ఆ సోషలిస్టు రివల్యూషనరీలూ ఇద్దరు లోగడే సంయుక్తమై కేరెన్‌స్కి నాయకత్వాన రష్యాలో దీనినప్పుడే ప్రయత్నంచేయనే చేశారు.

మార్క్సును చదివి, పెట్టుబడిదారీ సమాజంలో ప్రతి తీవ్ర క్షణమందూ, గంభీరమైన ప్రతి వర్గ సంఘర్షణలోనూ, బూర్జువా నియంతృత్వమా, లేక శ్రామికవర్గ నియంతృత్వమా అనే ప్రత్యామ్నాయం తారసిల్లుతుందని అర్థం చేసుకోజాలని వ్యక్తి, మార్క్సుయొక్క ఆర్థిక సిద్ధాంతాలనుగాని, రాజకీయ సిద్ధాంతాలనుగాని ఏ మాత్రమూ ఆకళింపు చేసుకోలేదన్నమాటే.

అత్యంత అద్భుతమైనట్టీ, విపరీతంగా నవ్వుపుట్టించేటట్టీ ఈ ఫిబ్రవరి 11వ తేదీ విజ్ఞప్తినిండా దట్టించి వున్న ఆర్థిక, రాజకీయపుట సందర్భాలను క్షుణ్ణంగా విశదపరచాలంటే, బూర్జువా నియంతృత్వంతో శ్రామికవర్గ నియంతృతంత్వాన్ని శాంతియుతంగా మిళితం చేయడమనే హిల్‌ఫెర్‌డింగ్, కౌట్‌స్కి ప్రభృతుల ప్రతిభాన్విత అల్పబుద్ధి భావాన్ని విడిగా పరిశీలించాల్సి వుంటుంది. ఇందుకు ప్రత్యేకంగా మరొకసారి మరొకవ్యాసం అవసరమవుతుంది.

*"ఉచ్రెదీతెల్‌నొయో పొబ్రానియె" - రాజ్యాంగ నిర్ణయ పరిషత్తు పట్ల తృణీకార భావం ప్రదర్శించుతూ ఉపయోగించే సంగ్రహపదం. - అనువాదకుడు.

మాస్కో, ఏప్రిల్ 15, 1919.

***

# అక్టోబరు విప్లవ అంతర్జాతీయ స్వభావం

## (అక్టోబరు విప్లవ పదో వార్షికోత్సవం సందర్భంగా)

జె.స్టాలిన్

ప్రావ్దా, నెం. 255, 1927 నవంబరు 6-7

అక్టోబరు విప్లవాన్ని కేవలం 'జాతీయ పరిధులలో' జరిగిన విప్లవంగా చూడలేం. ప్రధానంగా, అది అంతర్జాతీయ, ప్రపంచ వ్యవస్థలో వచ్చిన విప్లవం. ఎందుకంటే, ఈ విప్లవం ప్రపంచ మానవాళి చరిత్రలో ఒక మౌలిక మార్పును, పాత, పెట్టుబడిదారీ ప్రపంచం నుంచి నూతన, సోషలిస్టు ప్రపంచానికి జరిగిన మార్పును సూచిస్తున్నది.

గతంలో విప్లవాలు సాధారణంగా ప్రభుత్వంలో ఉన్న ఒక దోపిడీదారుల గుంపు స్థానంలో మరో దోపిడీదారుల గుంపు రావడంతో ముగిసిపోయేవి. దోపిడీదారులు మారారు, దోపిడీ కొనసాగింది. బానిసల విముక్తి ఉద్యమాలలో జరిగినది ఇదే. వెట్టి బానిసల తిరుగుబాటు కాలంలో జరిగినది ఇదే. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీలలో పేరొందిన 'మహా' విప్లవాల కాలంలో జరిగినదీ ఇదే. చరిత్రను పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా మలచడానికి కార్మికవర్గం చేసిన మొట్టమొదటిది, మహత్తరమైనది, వీరోచితమైనదీ అయినప్పటికీ సఫలం కాని పారిస్ కమ్యూన్ గురించి నేను మాట్లాడడం లేదు.

ఆ విప్లవాలకు అక్టోబరు విప్లవానికీ *సూత్రబద్ధంగా* తేడా ఉన్నది. దీని లక్ష్యం ఒక దోపిడీ రూపం స్థానంలో మరో దోపిడీ రూపాన్ని తీసుకురావడం కాదు. ఒక దోపిడీదారుల గుంపు స్థానంలో మరో దోపిడీదారుల గుంపును తీసుకురావడం కాదు. మనిషి మనిషిని దోచుకునే సమస్త దోపిడీనీ నిర్మూలించడం దీని లక్ష్యం. సమస్త దోపిడీదారుల గుంపులనూ నిర్మూలించడం దీని లక్ష్యం. కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పడం, ఇంతవరకూ లేని సమస్త పీడిత వర్గాల అత్యంత విప్లవకర వర్గ అధికారాన్ని నెలకొల్పి, ఒక నూతన వర్గ రహిత సోషలిస్టు సమాజాన్ని సంఘటితం చేయడం దీని లక్ష్యం.

ఈ కారణం వల్లనే అక్టోబరు విప్లవ విజయం మానవాళి చరిత్రలో మౌలిక మార్పును సూచిస్తున్నది. ప్రపంచ పెట్టుబడిదారీ విధాన చారిత్రక లక్ష్య మౌలిక మార్పును, ప్రపంచ కార్మికవర్గ విముక్తి ఉద్యమంలో మౌలిక మార్పును, పోరాట పద్ధతులు, నిర్మాణ రూపాలలో, జీవన, సంప్రదాయాల పద్ధతిలో, ప్రపంచవ్యాప్తంగా దోపిడీకి గురయ్యే ప్రజల సంస్కృతి, భావజాలాలలో మౌలిక మార్పును సూచిస్తుంది.

ఈ మౌలిక కారణం వల్లనే అక్టోబరు విప్లవం అంతర్జాతీయ, ప్రపంచ వ్యవస్థలో జరిగిన విప్లవం.

ఈ కారణం వల్ల కూడా సమస్త దేశాల పీడిత ప్రజలలో అక్టోబరు విప్లవం పట్ల గొప్ప సానుభూతి ఉంటుంది. ఈ విప్లవం తమ విముక్తి కోసం చేసే ఒక ప్రతిజ్ఞగా వారు భావిస్తారు.

ప్రపంచవ్యాప్తంగా విప్లవోద్యమ అభివృద్ధిని అక్టోబరు విప్లవం ప్రభావితం చేసే మౌలిక అంశాలు చాలానే చెప్పవచ్చు.

1. అక్టోబరు విప్లవాన్ని గురించి ప్రధానంగా ప్రపంచ సామ్రాజ్యవాద క్షేత్రంలో పగులు తీసుకువచ్చినందుకు చెప్పుకోవాలి. ఒక పెద్ద పెట్టుబడిదారీ దేశంలో సామ్రాజ్యవాద బూర్జువా వర్గాన్ని కూలదోసి సోషలిస్టు కార్మికవర్గాన్ని అధికారంలోకి తీసుకువచ్చినందుకు అక్టోబరు విప్లవం గురించి చెప్పుకోవాలి.

అణచబడ్డ, పీడిత, దోపిడీకి గురైన వర్గమైన వేతన కార్మికుల వర్గం మానవాళి చరిత్రలో *మొట్టమొదటిసారిగా పాలక* వర్గ స్థానంలోకి ఎగిసి, సమస్త దేశాల కార్మికవర్గానికీ అనుసరణీయమైన ఉదాహరణ నెలకొల్పింది.

దీని అర్థమేమంటే, అక్టోబరు విప్లవం ఒక నూతన యుగాన్ని *తీసుకువచ్చింది, సామ్రాజ్యవాద* దేశాలలో *కార్మికవర్గ* విప్లవాల యుగం ఇది.

భూస్వాముల, పెట్టుబడిదారుల నుంచి ఉత్పత్తి పరికరాలను, సాధనాలను తీసుకుని వాటిని ప్రజా ఆస్తిగా మార్చింది. తద్వారా బూర్జువా ఆస్తికి వ్యతిరేకంగా సోషలిస్టు ఆస్తిని నిలబెట్టింది. బూర్జువా ఆస్తి ఎదురులేనిది, పవిత్రమైనది, ఎప్పటికీ నిలిచి ఉండేదీ అన్న పెట్టుబడిదారుల అబద్ధాన్ని ఎండగట్టింది.

అది బూర్జువా వర్గం నుంచి అధికారం గుంజుకుంది, బూర్జువా వర్గానికి రాజకీయ హక్కులు లేకుండా చేసింది, బూర్జువా రాజ్యాంగ యంత్రాంగాన్ని నాశనం చేసి అధికారాన్ని సోవియట్‌లకు బదిలీ చేసింది. తద్వారా *పెట్టుబడిదారీ* ప్రజాస్వామ్యంగా ఉన్న బూర్జువా పార్లమెంటరిజానికి వ్యతిరేకంగా *కార్మికవర్గ* ప్రజాస్వామ్యంగా సోవియట్‌ల సోషలిస్టు పాలనను నిలబెట్టింది. విప్లవం జరిగిన మర్నాడు 'మునుపటి పెట్టుబడిదారులందరూ హక్కులు కోల్పోతారు' అని లాఫార్గ్ 1887లోనే సరిగా చెప్పాడు.

ఈ రకంగా, ప్రస్తుత సమయంలో బూర్జువా పార్లమెంటరిజం ద్వారానే సోషలిజానికి శాంతియుత పరివర్తన సాధ్యమన్న సోషల్ డెమోక్రాట్ల అబద్ధాన్ని ఎండగట్టింది.

అయితే అక్టోబరు విప్లవం ఇక్కడితో ఆగలేదు, ఆగలేకపోయింది. పాత, బూర్జువా వ్యవస్థను

నాశనం చేసిన తరువాత అది నూతన, సోషలిస్టు వ్యవస్థను నిర్మించసాగింది. పది సంవత్సరాల అక్టోబరు విప్లవ కాలంలో పార్టీ, కార్మిక సంఘాలు, సోవియట్‌లు, సహకార సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, రవాణా, పరిశ్రమ, ఎర్రసైన్యాల నిర్మాణం జరిగింది. బూర్జువా వర్గం *లేకుండా* బూర్జువా వర్గానికి *వ్యతిరేకంగా* కార్మికవర్గం దేశాన్ని విజయవంతంగా పాలించ*గలదని,* బూర్జువా వర్గం *లేకుండా* బూర్జువా వర్గానికి *వ్యతిరేకంగా* పరిశ్రమను విజయవంతంగా నిర్మించగలదని, బూర్జువా వర్గం *లేకుండా* బూర్జువా వర్గానికి *వ్యతిరేకంగా* యావత్తు జాతీయ ఆర్థిక వ్యవస్థనూ నిర్దేశించగలదని, పెట్టుబడిదారీ చుట్టివేత ఉన్నప్పటికీ విజయవంతంగా సోషలిజాన్ని నిర్మించ*గలదనీ* నిర్మాణ రంగంలో యుఎస్‌ఎస్‌ఆర్ సోషలిజపు నిస్సందేహ విజయాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

పొట్ట లేకుండా తల, ఇతర శరీర భాగాలూ పని చేయలేనట్టే దోపిడీదారులు లేకుండా దోపిడీకి గురయ్యేవారు ఏమీ చేయలేరన్న పాత 'సిద్ధాంతా'న్ని ఎత్తిపట్టేవారిలో ప్రాచీన కాలపు ప్రముఖ రోమన్ సెనేటర్ మెనెనియస్ అగ్రిప్పా ఒక్కడే కాక ఇంకా ఉన్నారు. ఈ 'సిద్ధాంతం' ఇప్పుడు సాధారణంగా సోషల్–డెమోక్రసీ రాజకీయ 'తత్వశాస్త్రాని'కి, ప్రత్యేకించి సామ్రాజ్యవాద బూర్జువా వర్గంతో సోషల్ డెమోక్రటిక్ *మిశ్రమ* విధానానికీ పునాదిగా ఉన్నది. ద్వేష స్వభావం సంతరించుకున్న ఈ 'సిద్ధాంతం' ఇప్పుడు పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గ విప్లవీకరణ పంథా దిశలో ఎదురయ్యే తీవ్రమైన ఆటంకాలలో ఒకటిగా ఉన్నది. అక్టోబరు విప్లవ అతి ముఖ్యమైన ఫలితాలలో ఈ బూటకపు 'సిద్ధాంతాన్ని' చావు దెబ్బ తీయడం ఒకటి.

పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గ విప్లవోద్యమం మీద అక్టోబరు విప్లవం ముఖ్యమైన ప్రభావం వేయడంలో విఫలం కాలేకపోయిందని, కాలేదనీ రుజువు చేయడానికి ఇంతకంటే మరేదైనా అవసరం ఉన్నదా? పెట్టుబడిదారీ దేశాలలో కమ్యూనిజం ప్రగతిశీలమైన పెరుగుదల, యుఎస్‌ఎస్‌ఆర్ కార్మికవర్గానికి సమస్త దేశాల కార్మికవర్గం నుంచి పెరుగుతున్న సానుభూతి వంటి సాధారణ వాస్తవాలు, అంతిమంగా సోవియట్‌కి వచ్చిన అనేక కార్మిక ప్రతినిధి బృందాలూ, – ఇవన్నీ అక్టోబరు విప్లవం నాటిన బీజాలు ఫలితాలు చూపించసాగాయని నిస్సందేహంగా రుజువు చేస్తున్నాయి.

2. అక్టోబరు విప్లవం సామ్రాజ్యవాదాన్ని దాని ఆధిపత్య కేంద్రాలలోను, 'మెట్రోపోలిస్'లలోనూ కుదిపివేయడమే కాకుండా అది సామ్రాజ్యవాదాన్ని వెనకతట్టున, బయటా కూడా దెబ్బ తీసింది. వలస, పరాధీన దేశాలలో సామ్రాజ్యవాద పాలనను బలహీనపరచింది.

భూస్వాములను, పెట్టుబడిదారులను కూలదోసిన తరువాత అక్టోబరు విప్లవం జాతీయ, వలస పీడనా శృంఖలాలను బద్దలుగొట్టి, మినహాయింపు లేకుండా పీడిత ప్రజలందరికీ దాని

నుంచి స్వేచ్ఛను అందించింది. పీడిత ప్రజలను విముక్తం చేయకుండా కార్మికవర్గం తన్ను తాను విముక్తం చేసుకోలేదు. యుఎస్ఎస్ఆర్‌లో జాతీయ-వలస విప్లవాలను దేశాల మధ్య జాతీయ శత్రుత్వం, ఘర్షణల పతాక కింద కాకుండా, యుఎస్ఎస్ఆర్‌లో వివిధ కార్మిక రైతాంగ ప్రజల మధ్య పరస్పర విశ్వాసం, సౌహార్ద సంబంధం ద్వారాను, *జాతీయవాదం* పేరుతో కాకుండా *అంతర్జాతీయతావాదం* ద్వారానూ పరిపూర్తి చేయడం అక్టోబరు విప్లవ ప్రత్యేక లక్షణం.

మన దేశంలో జాతీయ-వలస విప్లవాలు కార్మికవర్గ నాయకత్వంలో అంతర్జాతీయతావాద పతాక కింద జరిగినందువల్లనే మానవాళి చరిత్రలో మొట్టమొదటిసారిగా అంటరాని ప్రజలు, బానిస ప్రజలూ *నిజంగా* స్వేచ్ఛాయుతమైన, *నిజంగా* సమానమైన స్థానానికి ఎదిగారు. అలా యావత్తు ప్రపంచ పీడిత జాతులకు అనుసరణీయ ఉదాహరణగా నిలిచారు.

అంటే అక్టోబరు విప్లవం నూతన యుగాన్ని *తీసుకువచ్చింది.* కార్మికవర్గ *మైత్రితో* కార్మికవర్గ *నేతృత్వంలో* ప్రపంచ *పీడిత దేశాలలో* జరుగుతున్న *వలస* విప్లవాల యుగం ఇది.

అనంత కాలంగా ప్రపంచం అధమ, ఉత్తమ జాతులుగా, నల్లజాతి, తెల్లజాతివారుగా విభజించబడి ఉన్నదన్న భావం గతంలో 'ఆమోదనీయమైనది'గా ఉన్నది. ఇందులో అధమ, నల్ల జాతివారు నాగరికతకు యోగ్యులు కారు, దోపిడీకి వస్తువులుగా ఉండడమే వారి విధి. ఉత్తమ, తెల్లజాతివారు మాత్రమే నాగరికతను పోషించేవారు, అధములను దోపిడీ చేయడమే వారి కార్యక్రమం.

ఆ చరిత్రను ఇప్పుడు చెదిరిపోయినదిగా, విడనాడినదిగా భావించాలి. సోవియట్ అభివృద్ధి క్రమంలో భాగమయిన విముక్తి చెందిన ఐరోపాయేతర ప్రజలు ఒక *నిజమైన* ప్రగతిశీల సంస్కృతిని ముందుకు తీసుకువచ్చే సామర్థ్యం తక్కువ ఉన్నవాళ్లు కాదని, ఐరోపా ప్రజల కంటే *నిజంగా* ఒక ప్రగతిశీల నాగరికత ఉన్న వారనీ ఆచరణలో రుజువు చేసి ఆ చరిత్రను చావు దెబ్బ తీయడం అక్టోబరు విప్లవ అతి ముఖ్యమైన ఫలితాలలో ఒకటి.

పీడిత ప్రజలను విముక్తం చేయడానికి *బూర్జువా జాతీయవాద* పద్ధతి, దేశాలను ఒక దాని నుంచి మరొక దానిని దూరం చేసే పద్ధతి, దేశాలను అనైక్యం చేసే పద్ధతి, వివిధ దేశాల శ్రామిక ప్రజల మధ్య జాతీయ శత్రుత్వాన్ని తీవ్రతరం చేసే పద్ధతే ఏకైక పద్ధతి అన్న భావన గతంలో 'ఆమోదనీయమైనది'.

ఇప్పుడు ఆ చరిత్రను ఖండనకు గురైనదిగా భావించాలి. పీడిత ప్రజలను విముక్తం చేయడానికి *కార్మికవర్గ, అంతర్జాతీయతావాద* పద్ధతి ఏకైక పద్ధతిగా సాధ్యము, ప్రయోజనకరమూ అని ఆచరణలో రుజువు చేయడం ద్వారా; స్వచ్ఛందత, అంతర్జాతీయతా సూత్రాల ఆధారంగా

అత్యంత వైవిధ్యత కలిగిన దేశాల కార్మిక కర్షకుల మధ్య *సౌహార్దపూరిత ఐక్యత* సాధ్యమూ ప్రయోజనకరమూ అని ఆచరణలో రుజువు చేయడం ద్వారా ఆ చరిత్రను చావు దెబ్బ తీయడం అక్టోబరు విప్లవ అత్యంత ముఖ్యమైన ఫలితాలలో ఒకటి. భవిష్యత్తులో ఏకైక ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా సమస్త దేశాల కార్మిక ప్రజల సమైక్యతకు నమూనాగా ఉన్న యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్‌ల అస్తిత్వం ఇందుకు ప్రత్యక్ష రుజువుగా పని చేసి తీరుతుంది.

ఇవి, ఇటువంటి ఫలితాలూ అక్టోబరు విప్లవం వలస, పరాధీన దేశాల విప్లవోద్యమం మీద ముఖ్యమైన ప్రభావం వేసి తీరుతాయని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. చైనా, ఇండోనేషియా, భారత్ వంటి దేశాలలో పీడిత ప్రజల విప్లవోద్యమ పెరుగుదల, ఈ ప్రజలలో యుఎస్‌ఎస్‌ఆర్ పట్ల పెరుగుతున్న సానుభూతి వంటి వాస్తవాలు నిస్సందేహంగా దీనిని తెలియజేస్తాయి.

వలస, పరాధీన దేశాల పై అడ్డు లేని దోపిడీ పీడనల యుగం *అంతరించిపోయింది.*

వలస, పరాధీన దేశాలలో విముక్తి విప్లవాల యుగం, ఆ దేశాలలో *కార్మికవర్గం* చైతన్యవంతమయ్యే యుగం, విప్లవంలో దాని *ఆధిపత్యం* ఉండే యుగం *ప్రారంభమయింది.*

3. సామ్రాజ్యవాద కేంద్రాలలోనూ దాని వెనకతట్టునా కూడా విప్లవ బీజాలు నాటి, 'మెట్రోపోలిస్ (మహానగరా)ల'లో సామ్రాజ్యవాద శక్తిని బలహీనపరిచి, వలసలలో దాని ఆధిపత్యాన్ని కుదిపివేసిన తరువాత, అక్టోబరు విప్లవం *ఒక మొత్తంగా* ప్రపంచ పెట్టుబడిదారీ విధాన అస్తిత్వాన్నే ప్రమాదంలోకి నెట్టింది.

పెట్టుబడిదారీ విధానంలో ఉన్న అసమానత వల్లను, అనివార్య ఘర్షణలు, సాయుధ సమరాల వల్లను, అంతిమంగా మునుపెన్నడూ లేని సామ్రాజ్యవాద ఊచకోత వల్లనూ సామ్రాజ్యవాద పరిస్థితులలో దాని స్పాంటేనియస్ అభివృద్ధి పెట్టుబడిదారీ విధానపు శిథిలత్వ, చరమ క్రమంలోకి ప్రవేశించింది. అక్టోబరు విప్లవము, దాని ఫలితంగా ప్రపంచ పెట్టుబడిదారీ విధానం నుంచి ఒక పెద్ద దేశం విడివడడమూ ఈ క్రమాన్ని అనివార్యంగా వేగవంతం చేస్తూ, ప్రపంచ సామ్రాజ్యవాద పునాదులనే కొంచెం కొంచెంగా బలహీనపరచింది.

దీనికి మించిన మరొక విషయం ఉన్నది. అక్టోబరు విప్లవం సామ్రాజ్యవాదాన్ని కుదిపివేస్తూ అదే సమయంలో, మొట్టమొదటి కార్మికవర్గ నియంతృత్వం రూపంలో ప్రపంచ విప్లవోద్యమానికి ఒక శక్తివంతమైన, బహిరంగ పునాదిని, అది గతంలో *ఎన్నడూ కలిగి లేని,* ఇప్పుడిక ఆధారపడగలిగిన ఒక పునాదిని సృష్టించింది. ప్రపంచ విప్లవోద్యమానికి గతంలో *ఎన్నడూ కలిగి లేని* ఒక శక్తివంతమైన బహిరంగ *కేంద్రాన్ని* సృష్టించింది. ఇప్పుడిక అది దీని కేంద్రంగా *సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమస్త దేశాల కార్మికవర్గ, పీడిత ప్రజల ఐక్య విప్లవ వేదికను* సంఘటితం చేసి సమీకృతం కాగలుగుతుంది.

అంటే, మొదటగా, అక్టోబరు విప్లవం ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని మరిక తిప్పుకోలేని చావు దెబ్బ తీసింది. అందుకని అక్టోబరుకు ముందున్న 'సమతుల్యం', 'స్థిరత్వం' పెట్టుబడిదారీ విధానానికి ఇక ఎన్నటికీ చిక్కవు.

పెట్టుబడిదారీ విధానం పాక్షికంగా స్థిరపడవచ్చు. ఉత్పత్తిని క్రమబద్ధీకరించవచ్చు. కార్మికవర్గాన్ని తాత్కాలికంగా పట్టి ఉంచే ఫాసిజంగా దేశ పాలనా యంత్రాంగాన్ని మార్చవచ్చు. కానీ గతంలో అది ఆడంబరంగా ప్రదర్శించిన 'శాంతి', 'హామీ', 'సమతుల్యం', 'స్థిరత్వా'లను మాత్రం ఎన్నటికీ తిరిగి పొందలేదు; ఎందుకంటే విప్లవ జ్వాలలు అనివార్యంగా కాసేపు సామ్రాజ్యవాద కేంద్రాలలోను, కాసేపు దాని చుట్టూ ఎగియవలసిన ఒక అభివృద్ధి దశకు ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సంక్షోభం చేరుకుని, పెట్టుబడిదారీ అతుకుల బొంతను సమాధి చేస్తూ రోజు రోజుకూ పెట్టుబడిదారీ విధాన క్షీణత దిశగా దారి తీస్తున్నది. సరిగ్గా సామెత చెప్పినట్టుగా, 'అది బురదలో నుంచి తోకను బయటకు లాగితే ముక్కు ఇరుక్కుంది, ముక్కును లాగితే తోక ఇరుక్కుంది'.

అంటే, రెండవది, అక్టోబరు విప్లవం యావత్తు ప్రపంచ పీడిత వర్గాల బలం, ప్రాముఖ్యతలను, ధైర్యాన్ని, పోరాట సంసిద్ధతలనూ ఎంతటి ఎత్తుకు తీసుకువెళ్లిందంటే, పాలక వర్గాలు వారిని ఒక *నూతన,* ముఖ్యమైన అంశంగా పరిగణించక తప్పలేదు. ఇప్పుడిక ప్రపంచ శ్రామిక ప్రజలను ఎంత మాత్రం చీకట్లో తడుములాడే, అవకాశాలు లేని 'గుడ్డి మూక'గా చూడలేం; ఎందుకంటే అక్టోబరు విప్లవం వారి పంథాను ప్రకాశవంతం చేసే ఒక వెలుగును సృష్టించింది, వారి కోసం అవకాశాలను సుగమం చేసింది. గతంలో పీడిత వర్గాల ఆకాంక్షలను, ప్రయత్నాలనూ వివరించే, రూపొందించే *ప్రపంచవ్యాప్త* బహిరంగ వేదిక లేదు. ఇప్పుడు అటువంటి వేదిక మొట్టమొదటి కార్మికవర్గ నియంతృత్వ రూపంలో ఉన్నది.

ఈ వేదికను నాశనం చేస్తే నిస్సందేహంగా 'పురోగామి దేశాల' సామాజిక, రాజకీయ జీవితం మీద సుదీర్ఘ కాలం పాటు అదుపులేని, తీవ్ర ఆగ్రహానికి దారి తీస్తుంది. 'బోల్షివిక్కు రాజ్య' అస్తిత్వమే చీకటి ప్రతీఘాతుక శక్తులను అదుపులో ఉంచుతుందన్నది కాదనలేం. ఇది విముక్తి పోరాటంలో పీడిత వర్గాలకు సహాయం అందిస్తుంది. బోల్షివిక్కుల పట్ల సమస్త దేశాల దోపిడీదారులలో ఉండే ఆటవిక ద్వేషానికి కారణం ఇదే.

ఒక నూతన పునాది మీద అయినప్పటికీ చరిత్ర పునరావృతం అవుతుంది. గతంలో *భూస్వామ్యం* కూలిపోతున్న కాలంలో 'జాకోబిన్' పదం అన్ని దేశాల ఉన్నత వర్గాలలో భయం, ద్వేషం పుట్టించినట్టుగానే ఇప్పుడు *పెట్టుబడిదారీ విధానం* కూలిపోతున్న కాలంలో 'బోల్షివిక్కు' పదం అన్ని దేశాల బూర్జువా వర్గాలలో భయం, ద్వేషం పుట్టిస్తున్నది. అదే విధంగా గతంలో

ఎగుస్తున్న *బూర్జువా వర్గ* విప్లవకర ప్రతినిధులకు పారిస్ ఆశ్రయంగా, పాఠశాలగా ఉంటే ఇప్పుడు ఎగుస్తున్న *కార్మికవర్గ* విప్లవకర ప్రతినిధులకు మాస్కో ఆశ్రయంగా, పాఠశాలగా ఉన్నది. జాకోబిన్ పట్ల ద్వేషం భూస్వామ్యం కూలిపోకుండా రక్షించలేదు. పెట్టుబడిదారీ విధాన అనివార్య క్షీణత నుంచి బోల్షివిక్కుల పట్ల ద్వేషం రక్షించలేదనడంలో ఏమైనా సందేహం ఉన్నదా?

బూర్జువా వ్యవస్థ వినాశనం కాదన్న చరిత్రను తనతో తీసుకుపోతూ పెట్టుబడిదారీ విధాన 'స్థిరత్వ' యుగం *ముగిసిపోయింది.*

పెట్టుబడిదారీ విధానం కూలిపోయే యుగం *ప్రారంభం అయింది.*

4. అక్టోబరు విప్లవాన్ని కేవలం ఆర్థిక, సామాజిక, రాజకీయ సంబంధాల రంగంలో విప్లవంగా చూడలేం. అది కార్మికవర్గ మెదళ్లలో విప్లవం, భావజాలంలో విప్లవం. అక్టోబరు విప్లవం మార్క్సిజం పతాక కింద, కార్మికవర్గ నియంతృత్వ భావన పతాక కింద, సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవాల యుగపు మార్క్సిజమైన లెనినిజం పతాక కింద పుట్టి బలోపేతం అయింది. అందువల్ల అది సంస్కరణవాదం మీద మార్క్సిజం విజయాన్ని సూచిస్తుంది. సోషల్ డెమోక్రటిజం మీద లెనినిజం, సెకండ్ ఇంటర్నేషనల్ మీద థర్డ్ ఇంటర్నేషనల్ విజయాన్నీ సూచిస్తుంది.

అక్టోబరు విప్లవం మార్క్సిజానికీ సోషల్-డెమోక్రటిజనికీ మధ్య, లెనినిజానికీ సోషల్-డెమోక్రటిజానికీ మధ్య పూడ్చలేని అగాధాన్ని సృష్టించింది.

గతంలో, *కార్మికవర్గ నియంతృత్వ విజయానికి ముందు,* సోషల్ డెమోక్రసీ కార్మికవర్గ నియంతృత్వ భావనను బహిరంగంగా ఖండించేది కాదు కానీ ఈ భావనను సాకారం చేసే మార్గంలో ఏమీ, ఎంత మాత్రమూ ఏమీ చేసేది కాదు, మార్క్సిజం పతాకను మహా గొప్పగా చెప్పుకునేది. సోషల్-డెమోక్రసీ ఈ ప్రవర్తన పెట్టుబడిదారీ విధానానికి ఎటువంటి ప్రమాదమూ కలిగించలేదన్నది సుస్పష్టం. అప్పుడు ఆ కాలంలో సోషల్ డెమోక్రసీని లాంఛనంగానో లేదా దాదాపు సంపూర్తిగానో మార్క్సిజంగా భావించేవారు.

ఇప్పుడు, *కార్మికవర్గ నియంతృత్వ విజయం తరువాత,* మార్క్సిజం దేనికి దారి తీస్తుందో, దాని విజయం *ఏం* సూచిస్తున్నదో తెలుసుకున్నాక, సోషల్-డెమోక్రసీ ఇక మార్క్సిజం పతాకను గొప్పగా చెప్పుకోలేకపోతున్నది. పెట్టుబడిదారీ విధానానికి ఎంతో కొంత ప్రమాదం సృష్టించకుండా కార్మికవర్గ నియంతృత్వ భావన గురించి ఇక అభిమానంతో మాట్లాడలేకపోతున్నది. చాలా కాలం క్రితమే మార్క్సిస్టు స్ఫూర్తితో తెగతెంపులు చేసుకోవడంతో మార్క్సిస్టు పతాకను కూడా ఇక విడిచిపెట్టక తప్పలేదు; మార్క్సిజం నుంచి పుట్టిన దానికి వ్యతిరేకంగా, అక్టోబరు విప్లవానికి వ్యతిరేకంగా, ప్రపంచంలో మొదటి కార్మికవర్గ నియంతృత్వానికి వ్యతిరేకంగా బహిరంగమైన, స్పష్టమైన వైఖరి తీసుకుంది.

ఇప్పుడు అది మార్క్సిజంతో తెగతెంపులు చేసుకోవలసి వచ్చింది, వాస్తవంగా చేసింది; ఎందుకంటే ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచ మొదటి కార్మికవర్గ నియంతృత్వానికి బహిరంగంగా, అంకిత భావంతో మద్దతు ఇవ్వకుండా, తమ దేశ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా విప్లవ పోరాటం జరపకుండా, తమ దేశంలో కార్మికవర్గ నియంతృత్వ విజయానికి పరిస్థితులు సృష్టించకుండా ఎవరూ మార్క్సిస్టునని చెప్పుకోలేరు.

సోషల్-డెమోక్రసీకి మార్క్సిజానికీ మధ్య ఒక అగాధం ఏర్పడింది. అందుకని మార్క్సిజానికి *ఏకైక* వారసురాలు, దానికి రక్షణా లెనినిజమే, కమ్యూనిజమే.

అయితే ఇంతటితో అంతా అయిపోలేదు. సోషల్ డెమోక్రసీకి మార్క్సిజానికీ మధ్య విభజన రేఖ గీసి మరింత ముందుకు వెళ్లింది అక్టోబరు విప్లవం; ప్రపంచ ప్రథమ కార్మికవర్గ నియంతృత్వానికి *వ్యతిరేకంగా* పెట్టుబడిదారీ విధాన ప్రత్యక్ష పరిరక్షకుల శిబిర స్థాయికి దాన్ని దిగజార్చింది. ఆడ్లర్, బాయర్‌గార్లు, వెల్సెస్, లెవిస్‌గార్లు, లాంగ్వెట్, బ్లమ్‌గార్లు 'సోవియట్ పాలన'ను దూషించి, పార్లమెంటరీ 'ప్రజాస్వామ్యా'న్ని ప్రశంసిస్తున్నారంటే వాళ్లు యుఎస్‌ఎస్‌ఆర్‌లో పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ *కోసం,* 'నాగరిక' రాజ్యాలలో పెట్టుబడిదారీ బానిసత్వాన్ని పరిరక్షించడం *కోసం* పోరాడుతున్నారు, పోరాటం కొనసాగిస్తారు.

నేటి సోషల్-డెమోక్రటిజం పెట్టుబడిదారీ విధానానికి *భావజాల మద్దతు.* నేటి సోషల్-డెమోక్రాట్ రాజకీయవేత్తలు *కార్మికవర్గ ఉద్యమంలో బూర్జువా వర్గ నిజమైన ఏజెంట్ల*ని, పెట్టుబడిదారీ వర్గ లేబర్ లెఫ్టినెంట్‌ల'ని, 'కార్మికవర్గానికి, బూర్జువా వర్గానికీ మధ్య అంతర్యుద్ధం'లో వాళ్లు అనివార్యంగా "కమ్యూనార్డ్‌ల'కు వ్యతిరేకంగా 'వర్సెలైస్' పక్షం వహిస్తార'ని లెనిన్ అన్న మాట వెయ్యి సార్లు నిజం.

*కార్మిక ఉద్యమంలో సోషల్-డెమోక్రటిజాన్ని అంతం చేయకుండా పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేయడం అసాధ్యం.* అందుకనే మరణావస్థలో ఉన్న పెట్టుబడిదారీ విధాన యుగం, కార్మిక ఉద్యమంలో మరణావస్థలో ఉన్న సోషల్-డెమోక్రటిజం యుగం కూడా.

ఇతర అంశాలతో పాటు ప్రపంచ కార్మికోద్యమంలో సోషల్-డెమోక్రటిజం పై లెనినిజం సాధించిన అనివార్య విజయాన్ని సూచించడం కూడా అక్టోబరు విప్లవ గొప్ప ప్రాముఖ్యత.

కార్మికోద్యమంలో సెకండ్ ఇంటర్నేషనల్, సోషల్-డెమోక్రటిజాల ఆధిపత్య యుగం *ముగిసిపోయింది.*

లెనినిజం, థర్డ్ ఇంటర్నేషనల్‌ల ఆధిపత్య యుగం *ప్రారంభమయింది.*

***

# లెనిన్-లెనినిజం

## *(సి.పి.ఐ. (మావోయిస్టు) ఎంఎల్ఎం డాక్యుమెంటు నుంచి)*

మార్క్స్, ఏంగెల్స్‌ల తర్వాత లెనిన్ మొత్తంగా ప్రపంచంలోని శ్రామిక ప్రజలకు, పీడిత జాతులకు గొప్ప విప్లవ మహోపాధ్యాయుడు. సామ్రాజ్యవాద యుగపు చారిత్రక పరిస్థితులలో, సోషలిస్టు విప్లవ జ్వాలల నడుమ లెనిన్, మార్క్స్ ఏంగెల్స్‌ల విప్లవ బోధనలను వారసత్వంగా స్వీకరించారు, వాటిని దృఢంగా పరిరక్షించారు, వాటిని సృజనాత్మకంగా అన్వయించి అభివృద్ధి పరిచారు. సామ్రాజ్యవాదం, కార్మికవర్గ విప్లవాల శకానికి సంబంధించిన మార్క్సిజమే లెనినిజం.

ఆయన మార్క్సిజం మౌలిక సూత్రాలను సామ్రాజ్యవాద యుగపు తొలిదశలో రష్యా విప్లవం, ప్రపంచ కార్మిక విప్లవాల నిర్దిష్ట ఆచరణకు సృజనాత్మకంగా అన్వయించారు. కామ్రేడ్ స్టాలిన్ లెనినిజాన్ని ఇలా సంక్షిప్తంగా క్రోడీకరించి చెప్పారు : "*సామ్రాజ్యవాదం, కార్మికవర్గ విప్లవాల యుగానికి సంబంధించిన మార్క్సిజమే*" లెనినిజం. స్టాలిన్ లెనినిజం యొక్క విశిష్ట లక్షణాలకు రెండు కారణాలను పేర్కొన్నారు : "*....మొదటిది, లెనినిజం కార్మికవర్గ విప్లవం నుండి ఆవిర్భవించిందన్న వాస్తవం. దాని ముద్ర లెనినిజం పైన ఉండకుండా ఉండజాలదు. రెండవది, అది వృద్ధి చెందింది, బలమైనదిగా పెంపొందింది రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదంతో జరిపిన పోరాటాలలో నుండే.*"

మార్క్సిజంలోని మూడు అంతర్భాగాలను సుసంపన్నం చేసే గొప్ప చేర్పులను కా. లెనిన్ చేశారు. కార్మికవర్గ పార్టీ, విప్లవ హింస, రాజ్యం, కార్మికవర్గ నియంతృత్వం, సామ్రాజ్యవాదం, రైతు సమస్య, మహిళా సమస్య, జాతుల సమస్య, ప్రపంచ యుద్ధం, వర్గపోరాటంలో కార్మికవర్గ ఎత్తుగడలు అనే అంశాలకు సంబంధించి మన అవగాహనను ఇంకా ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. కామ్రేడ్ లెనిన్ సిద్ధాంత రచనలు, మార్క్స్ యొక్క గతితార్కిక పద్ధతిని అన్వయిస్తూ ఇంచుమించుగా సమస్త విషయాలను తడుముతాయి.

ఏంగెల్స్ తర్వాత నుండి తన కాలం వరకు జరిగిన అత్యంత ముఖ్యమైన శాస్త్ర విజ్ఞాన విజయాలను భౌతికవాద తత్వశాస్త్రపు ప్రాతిపదిక పైన సాధారణీకరించే అత్యంత గురుతరమైన కర్తవ్యాన్ని లెనిన్ చేపట్టారు. అంతేకాదు, ఆ కాలంలోనే ఆయన మార్క్సిస్టులలోని భౌతికవాద వ్యతిరేక ధోరణుల పట్ల సమగ్రమైన విమర్శను సాగించారు. అనుభవవాద విమర్శపై ఆయన సాగించిన సుప్రసిద్ధమైన విమర్శ తత్వశాస్త్రంలో ముందుకొచ్చిన రివిజనిస్టు ధోరణికి వ్యతిరేకంగా సాగించినది, అది మౌలికంగా ప్రాముఖ్యతను కలిగి ఉన్న గ్రంథం. ఆనాటి నుండి అది నేటి వరకు ఆధునిక బూర్జువా తత్వశాస్త్ర ధోరణుల పట్ల మార్క్సిస్టు విమర్శగా ఉపయోగపడుతూనే ఉంది. ఆధునిక శాస్త్ర విజ్ఞాన ఆవిష్కరణలపై ఆధారపడిన "నూతన" తాత్విక ధోరణుల పేరిట మార్క్సిజంపైన జరిగిన దాడిని ఆయన తాత్విక రంగంలోని వర్గపోరాటపు ప్రతిఫలనంగా పరిగణించారు. ఈ "నూతన" తాత్విక సిద్ధాంతాలు బర్క్‌లీ, హ్యూమ్‌ల పాత స్వీయాత్మక భావవాదం కంటే ఏ విధంగానూ భిన్నమైనవి కావని ఆయన నిరూపించారు. ఈ విధంగా లెనిన్,

తత్వశాస్త్ర రంగంలో మార్క్సిజంపై జరిగిన దాడిని అత్యంత సమర్థవంతంగా ఓడించారు. ఆ క్రమంలో ఆయన మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని సృజనాత్మకంగా అభివృద్ధి పరిచారు.

లెనిన్, మార్క్సిస్టు ప్రతిఫలన సిద్ధాంతాన్ని సృజనాత్మకమైన రీతిలో అభివృద్ధిపరిచారు. ఆధునిక విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణలపైన ఆధారపడి ఆయన పదార్థానికి ప్రతిఫలించే లక్షణం ఉందనీ, చైతన్యమంటే అత్యున్నత రూపంలో మెదడులో జరిగిన పదార్థ ప్రతిఫలనమేననీ వివరించారు.

లెనిన్ అభివృద్ధిపరిచిన ఈ పదార్థ ప్రతిఫలన సిద్ధాంతం, *పదార్థానికి* ఆయన ఇచ్చిన నిర్వచనం మార్క్సిస్టు తాత్విక భౌతిక వాదపు పునాదులను మరింతగా పటిష్టం చేశాయి, వాటిని ఏ రూపంలోని భావవాద దాడులకు చెక్కుచెదరని విధంగా నిలిపాయి. విప్లవకర గతితర్కాన్ని లెనిన్ మరింతగా ముందుకు తీసుకుపోయారు. ప్రత్యేకించి ఆయన వైరుధ్యాలను లోతుగా అధ్యయనం చేశారు. వైరుధ్యాన్ని ఆయన *'గతితర్కానికి అంతస్సారం'*గా పేర్కొన్నారు. *''ఒకటి, విభజితం కావడమూ దానికి సంబంధించిన విరుద్ధ భాగాల జ్ఞానమే వైరుధ్యాల అంతస్సారం''* అని ఆయన అంటారు. *''గతితర్కాన్ని క్లుప్తంగా విరుద్ధాంశాల ఐక్యతకు సంబంధించిన సిద్ధాంతంగా నిర్వచించవచ్చు''* అని ఆయన నొక్కి చెప్పారు.

లెనిన్ రాజకీయ అర్థశాస్త్రానికి కొన్ని అతి గొప్ప చేర్పులను చేశారు. మార్క్స్, ఏంగెల్స్‌లు పెట్టుబడిదారీ విధానం స్వేచ్ఛాయుత పోటీ దశలో ఉండినప్పుడు దానికి సంబంధించిన వివిధ అంశాలను వెల్లడి చేసి దాని పోకడలను, భవిష్యత్తు దిశను సూచించారు. ఆనాటికి పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాదం ఇంకా వికసించనందున దానిని విశ్లేషించడం వారికి సాధ్యం కానిది. లెనిన్ మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రాన్ని మరింతగా అభివృద్ధిపరిచి సామ్రాజ్యవాదపు ఆర్థిక రాజకీయ అంతస్సారాన్ని విశ్లేషించారు.

మార్క్సిజానికి లెనిన్ చేసిన గొప్ప చేర్పయిన సామ్రాజ్యవాదం గురించిన అద్భుతమైన విశ్లేషణలో కామ్రేడ్ లెనిన్ పెట్టుబడిదారీ విధానం దాని గుత్తపెట్టుబడిదారీ పూర్వదశ నుండి గుత్తాధిపత్య దశకు పరివర్తన చెందడాన్ని గురించి, పెట్టుబడిదారీ విధానపు ఈ అత్యున్నత దశ ఎలా యుద్ధాలకు, విప్లవాలకు జన్మనిస్తుంది అనే దాన్ని గురించి శాస్త్రీయంగా వివరించారు. సామ్రాజ్యవాద యుద్ధం సామ్రాజ్యవాద రాజకీయాల కొనసాగింపేనని ఆయన ఎత్తిచూపారు. సామ్రాజ్యవాదులు ప్రపంచ మార్కెట్ కోసం, ముడిపదార్థాల వనరుల కోసం, పెట్టుబడి మదుపులకు రంగాల కోసం ఎన్నటికీ తీరని దురాశతో కుమ్ములాడుతారు, ప్రపంచాన్ని పునర్విభజించుకోవడం కోసం ప్రపంచ యుద్ధాలకు దిగుతూనే ఉంటారు. అందువల్ల ఈ ప్రపంచంలో సామ్రాజ్యవాదం ఉనికిలో ఉన్నంత వరకు యుద్ధానికి అవకాశం, వనరు ఉంటూనే ఉంటాయి. ఆయన దాని ప్రజాస్వామ్యం భ్రమను పటాపంచలు చేశారు *''సామ్రాజ్యవాదం రాజకీయంగా ఎల్లప్పుడూ హింస, అభివృద్ధినిరోధకత్వాల కోసమే ప్రయత్నిస్తుంది.''*

సామ్రాజ్యవాదమంటే గుత్తాధిపత్యం వహించే, పరాన్నబుక్కు లేదా క్షీణిస్తున్న, శిథిలమవుతున్న

పెట్టుబడిదారీ విధానమని లెనిన్ నొక్కి చెప్పారు. అది పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిలోని అత్యున్నత, ఆఖరి దశ. అందువల్ల అది కార్మికవర్గ విప్లవపు తొలి సంజ అని చెప్పారు.

కామ్రేడ్ లెనిన్ చేసిన మరొక గొప్ప చేర్పు, దోపిడీ వర్గాల రాజ్య నిర్మాణాన్ని ధ్వంసం చేసి కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పడానికి సంబంధించినది. రాజ్యం ఎలా ఒక వర్గం మరో వర్గాన్ని అణచివేసేందుకు దోహదపడే సాధనమో, దోపిడీవర్గ రాజ్యాన్ని ఏ విధంగా విప్లవకర హింస ద్వారా మాత్రమే ధ్వంసం చేయగలమో ఆయన వివరించారు. కార్మికవర్గం బూర్జువా రాజ్య యంత్రాంగాన్ని తప్పక ధ్వంసం చేసి తీరాల్సిందేనని, దాని స్థానంలో కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పవలసిందేనని ఆయన పదే పదే నొక్కి చెప్పారు.

పారిస్ కమ్యూన్, రష్యా విప్లవాల అనుభవాల నుండి గుణపాఠాలను తీస్తూ ఆయన సోవియట్ రూపంలోని ప్రభుత్వం కార్మికవర్గ నియంతృత్వపు అత్యుత్తమ రూపమని కనుగొన్నారు. కార్మికవర్గ నియంతృత్వాన్ని ఆయన కార్మికవర్గానికి, దోపిడీకి గురయ్యే ప్రజాబాహుళ్యంగా ఉండే కార్మికవర్గేతర వర్గాలకు మధ్య, ప్రత్యేకించి రైతాంగానికి మధ్య ఏర్పడే వర్గ కూటమి యొక్క ఒక ప్రత్యేక రూపంగా నిర్వచించారు. ఆ వర్గ కూటమికి నాయకత్వం వహించేది కార్మికవర్గమే. కార్మికవర్గ నియంతృత్వం ఏ విధంగా అత్యున్నత రూపంలోని ప్రజాస్వామ్యమో, కార్మికవర్గ ప్రజాస్వామ్య రూపమో ఆయన వివరించారు. కార్మికవర్గ నియంతృత్వం ప్రజారాశులలోని అత్యధికుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కార్మికవర్గ నియంతృత్వమంటే పాత సమాజపు శక్తులకు, సాంప్రదాయాలకు వ్యతిరేకంగా నిరంతరాయమైన పోరాటం – రక్తపాతంతో రక్తపాతం లేకుండా, హింసాత్మకంగా, శాంతియుతంగా, సైనికంగా ఆర్థికంగా విద్య పరిపాలనల పరంగా సాగే పోరాటం అని లెనిన్ వివరించారు. అంటే కార్మికవర్గ నియంతృత్వమంటే బూర్జువా వర్గం పైన సార్వత్రికమైన నియంతృత్వమని అర్థం. లెనిన్ ఆలోచనలో కార్మికవర్గ నియంతృత్వానికి ఉన్న ప్రాముఖ్యత ఎంతటిదో లెక్కగట్టాలంటే ఆయన చేసిన ఈ సుప్రసిద్ధమైన వ్యాఖ్యను చూడాలి : *''వర్గపోరాటాన్ని గుర్తించడమనేదాన్ని* ***కార్మికవర్గ నియంతృత్వాన్ని*** *గుర్తించడానికి* ***విస్తరింపజేసే*** *వారే మార్క్సిస్టు అవుతారు.''*

కార్మికవర్గం చిన్న సరుకుల ఉత్పత్తిని పూర్తిగా పరివర్తన చెందించక పోయినట్లైతే పెట్టుబడిదారీ విధానపు పునరుద్ధరణ ముప్పు ఉంటుందని కూడా లెనిన్ హెచ్చరించారు. లెనిన్ ఇలా అన్నారు : *''చిన్నతరహా ఉత్పత్తి నిరంతరాయంగా, అనుదినము, గంట గంటకు, స్పాంటేనియస్‌గా, భారీ యెత్తున పెట్టుబడిదారీ విధానానికి, బూర్జువా వర్గానికి జన్మనిస్తూనే ఉంటుంది.''*

అందువల్లనే లెనిన్ కార్మికవర్గ నియంతృత్వాన్ని నూతన బూర్జువా వర్గం వృద్ధిని నిరోధించడానికి ఆవశ్యకమైనదిగా పేర్కొన్నారు. పైగా పెట్టుబడిదారీ విధానంలోని అసమాన ఆర్థిక రాజకీయ అభివృద్ధి నియమాన్ని ప్రాతిపదికగా చేసుకొని లెనిన్ ఒక ముఖ్యమైన నిర్ధారణ చేశారు. వివిధ దేశాలలో పెట్టుబడిదారీ విధానం అసమానంగా అభివృద్ధి చెందినందున సోషలిజం ముందుగా ఒకటి లేదా కొన్ని దేశాలలో విజయాన్ని సాధిస్తుందనీ, అంతేగానీ అన్ని దేశాలలో ఒకేసారి

విజయం సాధించజాలదని ఆయన నిర్ధారించారు. అందువల్ల ఒకటి లేదా కొన్ని దేశాలలో సోషలిజం విజయాన్ని సాధించినప్పటికీ ఇతర పెట్టుబడిదారీ దేశాలు ఇంకా అస్థిత్వంలోనే ఉంటాయి. అవి సోషలిస్టు రాజ్యాలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద విద్రోహకర కార్యకలాపాలు తలెత్తడానికి కారణమవుతూనే ఉంటాయి. అందువల్ల ఈ పోరాటం దీర్ఘకాలికమైనదిగా ఉంటుంది. ఈ విషయాన్ని 1969లో చైనా కమ్యూనిస్టు పార్టీ తన సుప్రసిద్ధమైన *జూన్ 14 లేఖలో* ఇలా అతి వివరంగా చెప్పింది :

*"అక్టోబర్ విప్లవం తర్వాత లెనిన్ ఈ విషయాన్ని ఎన్నోసార్లు ఎత్తి చూపారు :*

*a) కూలదోయబడిన దోపిడీదార్లు ఎల్లప్పుడూ తమ చేజారిన 'స్వర్గాన్ని' తిరిగి సాధించుకోవడం కోసం వేయిన్నొక్క విధాల ప్రయత్నిస్తారు.*

*b) పెటీబూర్జువా వాతావరణంలో పెట్టుబడిదారీ విధానపు నూతన అంశాలు నిరంతరాయంగా, స్పాంటేనియస్‌గా పుట్టుకొస్తూ ఉంటాయి.*

*c) బూర్జువా వర్గపు ప్రభావం వల్లనూ, సర్వత్రా వ్యాపించి ఉన్న పెటీబూర్జువా ఇతరులను చెడగొట్టే వాతావరణాల ఫలితంగానూ కార్మికవర్గ శ్రేణులలోనుండి, ప్రభుత్వ ఉద్యోగులలో నుండి రాజకీయ దిగజారుడు గాళ్లు, నూతన బూర్జువా శక్తులు తలెత్తవచ్చు.*

*d) అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానపు చుట్టివేత, సామ్రాజ్యవాదుల సాయుధ జోక్యం, హెచ్చరికలు, శాంతియుతంగా విచ్ఛిన్నం చేయడాన్ని సాధించడానికై వారి విద్రోహ కార్యకలాపాలు - ఇవి సోషలిస్టు దేశం లోపల వర్గపోరాటాన్ని కొనసాగించటానికి బాహ్య పరిస్థితులు."*

సోషలిజం, పెట్టుబడిదారీ విధానాల మధ్య పోరాటం మొత్తంగా ఒక చారిత్రక శకమంతటా ఆవరించి ఉంటుందని చెప్పే ఈ లెనిన్ సిద్ధాంతం సోషలిజం, కమ్యూనిజాలను నిర్మించడానికి సంబంధించిన సిద్ధాంతానికి బ్రహ్మాండమైన చేర్పు.

పార్టీ నిర్మాణానికి సంబంధించిన భావనలో, ఆచరణలో నూతన మార్గాన్ని ఆవిష్కరించిన ఒక గెంతును లెనిన్ తీసుకు వచ్చారు. అది మార్క్సిజం ఆయుధాగారానికి ఒక గొప్ప చేర్పు. కార్మికవర్గం నిజంగా తనదైన స్వంత విప్లవ రాజకీయ పార్టీని ఏర్పరచుకోవడమనేది ప్రాథమిక ప్రాముఖ్యత కలిగిన అంశంగా ఆయన భావించారు. అలాంటి పార్టీ అవకాశవాదంతో పూర్తిగా తెగతెంపులు చేసుకున్న కమ్యూనిస్టు పార్టీయే. కార్మికవర్గ విప్లవాన్ని పూర్తిగా కొనసాగించాలంటే, కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పి సంఘటితపరచుకోవాలంటే అలాంటి పార్టీ అవసరం. ఆయన పార్టీ యొక్క అవసరాన్ని సుప్రసిద్ధమైన ఈ పదబంధం ద్వారా అద్భుతంగా సంక్షిప్తీకరించారు: *"కార్మికవర్గం అధికారం కోసం సాగించే పోరాటంలో దానికి నిర్మాణానికి మించిన ఆయుధమేదీలేదు."* పార్టీ అంటే అత్యున్నత రూపంలోని వర్గ సంస్థనీ, అది ఇతర అన్ని రూపాలలోని ప్రజా నిర్మాణాలకు మార్గ నిర్దేశకత్వం వహిస్తుందనీ, కార్మికవర్గ పార్టీ ద్వారానే కార్మికవర్గ నియంతృత్వాన్ని సాధించగలమని ఆయన సూత్రీకరించారు. అలాంటి పార్టీకి అతి విస్తృతమైన పార్టీ సభ్యత్వపు యంత్రాంగం ఉండి దానికి ప్రొఫెషనల్ విప్లవకారులు అనే సుస్థిర కేంద్రకం (న్యూక్లియస్)

ఉండాలి. అలాంటి రాజకీయ పార్టీ ప్రజలతో తప్పనిసరిగా మమేకమై, చరిత్ర నిర్మాణంలో ప్రజలు చూపే సృజనాత్మక చొరవకు గొప్ప ప్రాధాన్యతనివ్వాలి. విప్లవంలోనూ, సోషలిజం, కమ్యూనిజాలను నిర్మించేటప్పుడు కూడా అది ప్రజారాశులపై సన్నిహితంగా ఆధారపడాలి.

జాతుల సమస్యపైన లెనినిస్టు అవగాహన గుణాత్మకంగా ఒక ఉన్నత స్థాయికి చెందినది. ఆయన పీడక జాతి దురహంకారానికి వ్యతిరేకంగానూ, పీడిత జాతి సంకుచిత జాతీయ వాదానికి వ్యతిరేకంగానూ పోరాడారు. ఆయన కార్మికవర్గ పార్టీకి జాతుల సమస్య పైన ఒక సరియైన విధానాన్ని రూపొందించారు, అంటే అన్ని జాతులకు పూర్తి సమానత్వం, జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికార హక్కు, అన్ని జాతుల సమాఖ్య. జాతీయ, వలసల సమస్య అనేది ప్రపంచ కార్మికవర్గ విప్లవపు సాధారణ సమస్యలో ఒక అంతర్గత భాగంగా ఎలా ఉంటుందో ఆయన విడమర్చి చెప్పారు. కామ్రేడ్ లెనిన్ యొక్క జాతుల, వలసల థీసిస్ ప్రకారం పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గ విప్లవోద్యమాలు, వలసలు పరాధీన దేశాలలోని జాతి విముక్తి ఉద్యమాలతో మైత్రిని ఏర్పరచుకోవాలి. ఈ కూటమి, వలసలు సకల పరాధీన దేశాలలోని సామ్రాజ్యవాదుల, భూస్వామ్య, దళారీ ప్రతీఘాతుక శక్తుల కూటమిని కూడా ధ్వంసం చేయగలుగుతుంది. అందువల్ల అది అంతిమంగా సామ్రాజ్యవాద వ్యవస్థను ప్రపంచవ్యాప్తంగా అనివార్యంగానే అంతం చేస్తుంది.

కార్మికవర్గానికి, రైతాంగానికి మధ్య మైత్రి గురించి మార్క్స్, ఏంగెల్స్‌ల భావాలను లెనిన్ సృజనాత్మకంగా అభివృద్ధిపరిచి దానిని ఒక సమగ్రమైన సిద్ధాంతంగా రూపొందించారు. రష్యాలోని బూర్జువా ప్రజాస్వామిక విప్లవంలో కార్మికవర్గం తీవ్ర వామపక్ష, ప్రతిపక్షం పాత్రను మాత్రమే నిర్వహిస్తూ, నాయకత్వ పాత్రను బూర్జువా వర్గానికి అప్పగించాలని, రైతాంగాన్ని ఆ బూర్జువా వర్గం నీడనే ఉంచేయాలని వాదించిన ప్లెఖనోవ్ వంటి మెన్షివిక్కుల పంథాను ఆయన తిరస్కరించారు. లెనిన్ రష్యా విప్లవం లోని ఆ రెండు దశలకు వ్యూహాత్మక పథకాలను ఇలా రూపొందించారు : *"కార్మికవర్గం రైతాంగ ప్రజారాశులతో కలిసి నిరంకుశత్వపు ప్రతిఘటనను బలప్రయోగంతో అణచివేసి బూర్జువా వర్గ అస్థిరతను నిర్వీర్యంచేసి ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తిగా కొనసాగించి తీరాలి. కార్మికవర్గం జనాభాలోని అర్ధ శ్రామిక శక్తులతో కలిసి బూర్జువా వర్గ ప్రతిఘటనను బలప్రయోగం ద్వారా అణచివేసి రైతాంగపు, పెటీబూర్జువా వర్గ అస్థిరతను నిర్వీర్యంచేసి సోషలిస్టు విప్లవాన్ని పరిపూర్తిచేసి తీరాలి."*

సామ్రాజ్యవాద శకంలోని అంతర్జాతీయ, రష్యా అంతర్గత పరిస్థితులను విశ్లేషించి లెనిన్ ఈ విధంగా పూర్తిగా కొత్తదైన ఈ రెండు దశల విప్లవ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. బూర్జువా ప్రజాస్వామిక, కార్మికవర్గ సోషలిస్టు విప్లవాలు రెండూ అవిభాజ్యమైనవి, కార్మికవర్గమే వాటికి నాయకత్వం వహించాలి.

లెనినిజం, బెర్న్‌స్టీనియన్ రివిజనిస్టులు, నరోద్నిక్కులు, ఆర్థిక వాదులు, మెన్షివిక్కులు, చట్టబద్ద మార్క్సిస్టులు, లిక్విడేటర్లు [పార్టీని రద్దు చేయాలని కోరేవారు], కాట్స్కైట్లు, ట్రాట్స్కైట్లు

వంటి వివిధ వర్ణాల అవకాశవాదులకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా సాగించిన పోరాటం నుండి అభివృద్ధి చెందింది. మార్క్సిజాన్ని ఒక పిడివాదంగా గాక ఆచరణకు మార్గదర్శిగా స్వీకరించి లెనిన్ ఈ ఎత్తుగడలను రూపొందించారు. లెనిన్ రూపొందించిన ఎత్తుగడల నినాదాల విభ్రాంతికరమైన సుస్పష్టత, విప్లవ పథకాల విస్మయకరమైన సాహసం రెండవ ఇంటర్నేషనల్‌లోని వామపక్ష శక్తులన్నింటిని, విప్లవ ప్రజారాశులందరినీ బోల్షివిక్కుల పక్షానికి ఆకర్షించాయి.

లెనిన్ రివిజనిస్టులను కార్మికవర్గ ఉద్యమ శ్రేణులలో దాగిన సామ్రాజ్యవాద ఏజెంట్లుగా పరిగణించారు. *"....సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, అది గనుక అవకాశవాద వ్యతిరేక పోరాటంతో విడదీయరానిదిగా ముడిపడి ఉండనట్లయితే, అది ఒట్టి బూటకం, దగా."*

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో పలు సోషల్ డెమోక్రటిక్ పార్టీల విద్రోహం కారణంగా రెండవ ఇంటర్నేషనల్ పతనమైంది. ఆ పార్టీలు జాతీయోన్మాద విధానాన్ననుసరించి "మాతృభూమి పరిరక్షణ" విధానాన్ని అనుసరించాయి. యుద్ధం ముగిసిన వెనువెంటనే కామ్రేడ్ లెనిన్ మూడవ ఇంటర్నేషనల్‌ను ఏర్పాటు చేశారు. ఆయన దానిని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసే శక్తివంతమైన అంతర్జాతీయ కార్మికవర్గ ఆయుధంగా మలిచారు.

పెట్టుబడిదారీ విధానం సాపేక్షికంగా శాంతియుతంగా అభివృద్ధి చెందిన యుగానికి సంబంధించిన సిద్ధాంతం మార్క్సిజం కాగా, లెనినిజం సామ్రాజ్యవాదం, కార్మికవర్గ విప్లవాలకు సంబంధించిన సిద్ధాంతం.

లెనినిజం ఆవిర్భవించిన పరిస్థితులను వర్ణిస్తూ, కామ్రేడ్ స్టాలిన్ ఈ విధంగా పేర్కొన్నారు: *"పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలు ఒక చివరి అంచుకు చేరినప్పుడు, కార్మికవర్గ విప్లవం ఒక తక్షణమైన ఆచరణాత్మక సమస్యగా మారినప్పుడు, కార్మికవర్గ విప్లవానికి సన్నాహాలు జరిపే పాతకాలం గడచి పెట్టుబడిదారీ విధానం మీద ప్రత్యక్షంగా దాడికి దిగే కాలంగా – నూతన కాలంగా అది పరివర్తన చెందినప్పుడు, సామ్రాజ్యవాద పరిస్థితుల నడుమ లెనినిజం వృద్ధి చెంది, రూపుదిద్దుకుంది." "లెనినిజం అంటే సాధారణంగా కార్మికవర్గపు సిద్ధాంతం, ఎత్తుగడలు, ప్రత్యేకించి చెప్పాలంటే కార్మికవర్గ నియంతృత్వం యొక్క సిద్ధాంతం, ఎత్తుగడలు."*

సామ్రాజ్యవాదం– కార్మికవర్గ విప్లవాలపైన, కార్మికవర్గ నియంతృత్వంపైన, యుద్ధం-శాంతిపైన, సోషలిజం, కమ్యూనిజాలపైన లెనిన్ చేసిన బోధనలు ఇప్పటికీ జీవత్వంతో తొణకిసలాడుతూ ఉంటాయి. మార్క్సిజం అనే విజ్ఞానశాస్త్రం మార్క్సిజం-లెనినిజం అనే దాని రెండవ ఉన్నత దశకు ఒక గుణాత్మకమైన గెంతును తీసుకుంది. పెట్టుబడిదారీ విధానపు సామ్రాజ్యవాద దశలో రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నుండి, కార్మికవర్గ విప్లవ క్రమం నుండి మార్క్సిజం-లెనినిజం అనే ఈ గుణాత్మకమైన గెంతు సంభవించింది.

***

# అక్టోబర్ సోషలిస్టు విప్లవంపై సి.పి.ఐ.(మావోయిస్టు)

## మహత్తర రష్యన్ సోషలిస్టు విప్లవ శతాబ్ది వార్షికోత్సవం సందర్భంగా

## రష్యన్ విప్లవంలో ఇమిడి వున్న అంతస్సారపు విశ్వజనీన సత్యాన్ని సదా ఎత్తిపట్టండి!

## మన దేశ నిర్దిష్టతకు అనుగుణంగా దాన్ని ఆచరణలో అమలు చేయండి!

**– సిసి, సి.పి.ఐ. (మావోయిస్టు)**

**సెప్టెంబర్ 21, 2017.**

నవంబర్ 7, 1917 రోజు రష్యా విప్లవ విజయ దినం. అది ప్రపంచ కార్మిక-కర్షక, తదితర శ్రమజీవులు వర్గ దోపిడీ, పీడనల నుంచి విముక్తిని సాధించుకునే దిశలో ఒక ముందడుగుగా ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తూ ఉత్సవాలను జరుపుకునే రోజు, శపథం చేసే రోజు. దీన్ని మరింత స్పష్టంగా చెప్పాలంటే రష్యన్ విప్లవాన్ని పెట్టుబడిదారీ విధానపు అంతులేని దోపిడీ, తీవ్రమైన పీడనల నుంచి విముక్తి వైపుగా పురోగమించే మార్గంలో ఒక మైలురాయిగా నిలిచే విజయంగా వాళ్లు చూస్తారు. నిజానికి సమాజంలో వర్గాలు ఉద్భవించి, వర్గ పోరాటం ప్రారంభమైనప్పటి నుంచి బానిస సమాజంలో బానిస యజమానులకు వ్యతిరేకంగా బానిస తిరుగుబాట్లు, భూస్వామ్య సమాజంలో భూస్వాములకు వ్యతిరేకంగా బూర్జువా విప్లవాలు జగమెరిగినదేఅయితే, బానిస తిరుగుబాట్లు, రైతాంగ తిరుగుబాట్లు, బూర్జువా విప్లవాల ద్వారా సామాజిక వ్యవస్థలలో మార్పు వచ్చినప్పటికీ, ఇవి ఒక రూపంలోని దోపిడీ వ్యవస్థ స్థానంలో మరొక రూపంలోని దోపిడీ వ్యవస్థను ప్రవేశపెట్టాయి. వీటి వల్ల రూపంలో ఎంతటి విప్లవాత్మకమైన మార్పులు వచ్చినప్పటికీ, అంతస్సారంలో అవన్నీ దోపిడీ వ్యవస్థలే ఎటువంటి మౌలిక గుణాత్మక మార్పు రాలేదు. అంటే, ప్రపంచంలో పాత దోపిడీ పాలకవర్గాలను కూలదోసి

కార్మికవర్గ, కార్మిక-కర్షక, తదితర శ్రమజీవుల రాజ్యాన్ని స్థాపించిన మొట్టమొదటి విప్లవం రష్యన్ నవంబర్ విప్లవం మాత్రమేనని మనం చెప్పవచ్చు. అందువల్ల, దీన్ని మైలురాయి అనీ, ప్రమాణచిహ్నం అనీ, వర్గ పోరాట చరిత్రలో అత్యంత గుణాత్మక ప్రత్యేకతతో కూడిన ఒక ప్రత్యేక ఘటన అనీ కూడా వర్ణిస్తారు. కామ్రేడ్ మావో ఇలా అన్నారు, "అక్టోబర్ సోషలిస్టు విప్లవం రష్యా చరిత్రలోనే కాక, ప్రపంచ చరిత్రలో కూడా ఒక నూతన యుగాన్ని ఆరంభించింది." (వైరుధ్యాల గురించి - కామ్రేడ్ మావో). తిరిగి మహత్తర రష్యా అక్టోబర్ విప్లవ 40వ వార్షికోత్సవం సందర్భంగా 6 నవంబర్ 1957న రష్యన్ సుప్రీం సోవియట్ (ఇందులో సోవియట్ యూనియన్, యావత్తు జాతుల సోవియట్లు ఉండినాయి) ఎదుట ఇచ్చిన ఒక ఉపన్యాసంలో మావో ఇలా అన్నారు, "మన విప్లవ ఉపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ 40 యేళ్ల ముందు సోవియట్ ప్రజలు కొనసాగించిన మహత్తర రష్యన్ విప్లవం ప్రపంచ చరిత్రలో ఒక నూతన యుగాన్ని ఆరంభించింది. .... .... చరిత్రలో అనేక రకాల విప్లవాలు జరిగాయి. అయితే, అక్టోబర్ సోషలిస్టు విప్లవంతో పోల్చదగ్గ విప్లవం ఒక్కటి కూడా లేదు. గడిచిన వేలాది సంవత్సరాలుగా యావత్తు ప్రపంచ శ్రమజీవులు, ప్రగతిశీల శక్తులు ఒక మనిషిని మరో మనిషి మానవులను మానవులు దోచుకోవడానికి వీలులేని సమాజాన్ని స్థాపించే విషయం గురించి కలలు కంటూ ఉండేవి. ప్రపంచంలోని నాలుగవ వంతు భాగంలో మొట్టమొదటిసారి అక్టోబర్ విప్లవం విజయవంతమైనప్పుడు మాత్రమే ఈ కలలు నెరవేరడం సాధ్యమైంది."

'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' ద్వారానే మహనీయులు మార్క్స్-ఏంగెల్స్‌లు మొట్టమొదటిగా పెట్టుబడిదారీ విధానం ధ్వంసం కావడం, సోషలిజాన్ని స్థాపించడం అనివార్యమనే విషయాన్ని చెప్పారు.

పెట్టుబడిదారీ విధానం ధ్వంసం కావడం, సోషలిజాన్ని స్థాపించడం అనివార్యమనే సిద్ధాంతాన్ని మొట్టమొదటిసారిగా మహనీయుడు మార్క్స్ ముందుకు తెచ్చారనే విషయం ప్రపంచ కార్మిక-కర్షక, శ్రమజీవులతో సహా సాధారణ ప్రజలందరికీ తెలిసిందే. "పెట్టుబడిదారీ వర్గం తనకు సమాధి కట్టే వారిని పుట్టిస్తుంది. వారి పతనం, కార్మికవర్గ విజయం, రెండూ అవశ్యం" అని కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో మనం చూడవచ్చు. "కమ్యూనిస్టుల తక్షణ లక్ష్యం ఇతర సకల కార్మికవర్గ పార్టీల లక్ష్యమే. అంటే కార్మికవర్గం ఒక వర్గంగా సంఘటితం కావడం, పెట్టుబడిదారీ వర్గ ఆధిపత్యాన్ని కూలదోయడం, కార్మికవర్గం ద్వారా రాజకీయాధికారాన్ని సాధించడం" (మార్క్స్-ఏంగెల్స్ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక) గురించి కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక మనకు నేర్పింది.

అంటే మార్క్స్-ఏంగెల్స్‌లు ఈ చారిత్రాత్మక సిద్ధాంతాన్ని ప్రపంచం ముందుకు తీసుకొచ్చారు. అయితే ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో అమలు చేయడానికి, అంటే పెట్టుబడిదారీ వర్గ ఆధిపత్యాన్ని కూలదోయడం, కార్మికవర్గం ద్వారా రాజకీయాధికారాన్ని సాధించడం కోసం 1917 వరకూ

వేచి ఉండాల్సి వచ్చింది. అయితే, 1871లో పారిస్ కమ్యూన్‌లో కార్మికవర్గం రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసం మొట్టమొదటిసారి వీరోచిత పోరాటాన్ని నిర్వహించింది. అయితే, పెట్టుబడిదారీ సాయుధ అణచివేత వల్ల అందులో అది ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

నిజానికి, మార్క్స్-ఏంగెల్స్‌ల చారిత్రాత్మక సిద్ధాంతాన్ని వ్యవహారికంగా కార్మికవర్గ సిద్ధాంతం అని పిలువవచ్చు. కార్మికవర్గ విప్లవం వ్యక్తిగత యాజమాన్యం స్థానంలో సమిష్టి యాజమాన్యాన్ని స్థాపిస్తుంది. సకల దోపిడీ వ్యవస్థలను, దోపిడీ వర్గాలను నిర్మూలిస్తుంది. ప్రపంచాన్ని కుదిపివేసే ఇటువంటి విప్లవం తీవ్ర, భీషణ వర్గ పోరాటాల గుండా ప్రయాణించడం, అనివార్యంగా సుదీర్ఘ, మెలికలు-మలుపులతో కూడిన మార్గం గుండా కొనసాగడం, ఇందులో అడుగడుగునా అపజయాలు ఎదుర్కోవలసి రావడం అత్యంత సహజమైన విషయం.

కామ్రేడ్ లెనిన్ కూడా ఒకసారి ఇలా అన్నారు : 'మనం ఈ విషయంలో, దీని అంతస్సారం నుంచి ఆలోచిస్తే, ఏదేని నూతన ఉత్పత్తి విధానం దీర్ఘకాలం పాటు ఒకదాని తర్వాత మరొకటి అపజయాలను ఎదుర్కొనకుండా, తప్పులు చేయకుండా, ఎదురుదెబ్బలు తినకుండా తక్షణం నిలదొక్కుకోవడం అనేది చరిత్రలో ఎప్పుడైనా జరిగిందా?' (లెనిన్, ఒక మహా ప్రారంభం నుంచి).

## రష్యన్ విప్లవ చరిత్ర కూడా మెలికలు-మలుపులు, ఎగుడు-దిగుళ్లతో కూడిన మూడు విప్లవాల గుండా కొనసాగింది!

మహనీయులు లెనిన్, స్టాలిన్, వారి ప్రత్యక్ష నాయకత్వంలో నడపబడిన సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) నేతృత్వంలో నవంబర్ 7, 1917 (రష్యన్ క్యాలెండర్ ప్రకారం అక్టోబర్) సోషలిస్టు విప్లవం విజయవంతమైంది. అయితే, ఒకే దెబ్బ లేదా ప్రయత్నంలో ఈ సోషలిస్టు విప్లవం విజయవంతం కాలేదు. ఇందుకు భిన్నంగా, మూడు విప్లవాల గుండా కొనసాగడం ద్వారానే 1917 సోషలిస్టు విప్లవం విజయవంతమైంది. ఈ మూడు విప్లవాలు ఇవి : 1905 పెట్టుబడిదారీ ప్రజాస్వామిక విప్లవం, 1917 ఫిబ్రవరి పెట్టుబడిదారీ ప్రజాస్వామిక విప్లవం, 1917 అక్టోబర్ (ప్రస్తుతం నవంబర్) సోషలిస్టు విప్లవం.

అయితే, మొట్టమొదటి 1905 రష్యన్ విప్లవం ఓటమితో ముగిసింది. అది పరాజయం పొందడానికి దారితీసిన కారణాలను లోతుగా అర్థం చేసుకోవడం మనకు ఎంతో అవసరం. ఎందుకంటే మనం కూడా భారత విప్లవ ప్రస్తుత దశలో ఎగుడు-దిగుళ్లు, వెనకడుగు వేయడం, దెబ్బతినడం మొదలైన వాటిని ఎదుర్కొంటున్నాము. ఏది ఏమైనప్పటికీ, మొదటి రష్యన్ విప్లవ ఓటమికి మూల కారణాలను రష్యన్ బోల్షివిక్ పార్టీ సమీక్షిస్తూ ముందుకు తెచ్చిన విషయాలు సంక్షిప్తంగా ఇవి :

1. విప్లవంలో జారు రాచరికానికి వ్యతిరేకంగా ప్రస్తుతం కార్మికులు, రైతాంగం మధ్య

దృఢమైన సహకారం స్థాపించబడలేదు.

2. రైతాంగంలో ఒక పెద్ద సెక్షన్ జారు రాచరికాన్ని నిర్మూలించడం కోసం కార్మికులకు సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా లేదు. దాని ప్రభావం సైన్యం ఆచరణపై కూడా పడింది. సైన్యంలో ఎక్కువ మంది సైనికులు సైనిక దుస్తులు ధరించిన రైతుల కొడుకులే ఉండినారు. జారు సైన్యంలో అనేక దళాలలో అసంతృప్తి, తిరుగుబాటు పెల్లుబికాయి, అయితే ఎక్కువ మంది సైనికులు కార్మిక సమ్మెలను, తిరుగుబాట్లను అణచివేయడంలో జారుకు మద్దతు ఇచ్చారు.

3. కార్మికుల చర్యలు కూడా అంత సంఘటితంగా లేవు. విప్లవ పోరాటంలో వాళ్లు 1906లో ఎక్కువ క్రియాశీలంగా భాగస్వామ్యం వహించడం ఆరంభమైంది. అయితే ఆ సమయానికి కార్మికవర్గ అగ్రగామి దళం బాగా బలహీనపడిపోయింది.

4. కార్మికవర్గం విప్లవానికి ప్రధానమైన, ముఖ్యమైన శక్తిగా ఉండింది. అయితే కార్మికవర్గ పార్టీ కేడర్లలో తగినంత ఐక్యత, దృఢత్వం లేవు. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ (ఆర్.ఎస్.డి.ఎల్.పి.) – కార్మికవర్గ పార్టీ – బోల్షివిక్, మెన్షివిక్ అనే రెండు గ్రూపులుగా విడిపోయి ఉండింది. బోల్షివిక్కులు స్థిరమైన విప్లవ పంథాలో నడిచే వాళ్లు. వారు జారు రాచరికాన్ని నిర్మూలించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. మెన్షివిక్కులు రాజీపడే ఎత్తుగడలతో విప్లవానికి అవరోధాలు సృష్టించారు. కార్మికుల్లోని ఒక పెద్ద సెక్షన్ మనసులో సందేహాల్ని సృష్టించారు, కార్మికవర్గంలో చిచ్చుపెట్టారు. అందువల్ల, కార్మికులు విప్లవంలో నిరంతరం ఐక్యంగా నిలిచి పని చేయలేదు. స్వయంగా తన శ్రేణుల్లో ఐక్యత లేని కారణంగా కార్మికవర్గం విప్లవానికి నిజమైన నాయకురాలు కాలేకపోయింది.

5. నిరంకుశ జారు రాచరికానికి 1905 విప్లవాన్ని అణచివేయడంలో పశ్చిమ యూరప్ సామ్రాజ్యవాదుల మద్దతు లభించింది.

6. సెప్టెంబర్ 1905లో, జపాన్‌తో శాంతి సంధి కుదరడంతో జారు చక్రవర్తికి ఎంతో ఊరట లభించింది. సంధి కుదరడం వల్ల జారు పునాది బలోపేతం అయ్యింది.

ఇప్పుడు రెండవ విప్లవం గురించి చూద్దాం : రెండవ విప్లవం 1917 ఫిబ్రవరిలో జరిగింది. దీని ద్వారా జారు రాచరికం పతనమైంది. కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్లు నిర్మాణమయ్యాయి. దీంతో పాటు తాత్కాలిక ప్రభుత్వం నిర్మాణమయ్యింది. ద్వంద్వాధికారం ఉనికిలోకి వచ్చింది. ఈ విధంగా ఫిబ్రవరి బూర్జువా ప్రజాస్వామిక విప్లవం విజయవంతమైంది. రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) ఈ విధంగా చాటిచెప్పింది, "విప్లవానికి కార్మికవర్గం నాయత్వం వహించడం వల్లనే అది విజయవంతమైంది. 'శాంతి', రొట్టెలు, స్వాతంత్ర్యాన్ని

డిమాండ్ చేస్తూ సైనిక దుస్తుల్లో ఉన్న లక్షలాది మంది రైతుల పోరాటానికి కార్మికవర్గం నేతృత్వం వహించింది. కార్మికవర్గ దృఢమైన నేతృత్వం వల్లనే విప్లవ విజయం ఖాయం అయ్యింది.”

విప్లవ ప్రారంభ దినాల్లో కామ్రేడ్ లెనిన్ ఇలా అన్నారు : “కార్మికులు విప్లవం చేశారు. కార్మికులు వీరత్వాన్ని ప్రదర్శించారు. వారు తమ రక్తాన్ని పారించారు. తమతో శ్రమజీవులను, పేద ప్రజలను కలుపుకున్నారు.”

మొదటి విప్లవం 1905 విప్లవం, రెండవ విప్లవం 1917 ఫిబ్రవరి విప్లవ విజయానికి మార్గాన్ని సుగమం చేసింది.

కామ్రేడ్ లెనిన్ ఇలా అన్నారు : 1905–1907 మధ్య మూడు సంవత్సరాల్లోనే సోవియట్లు నిర్మాణమయ్యాయి. విప్లవ విజయానికి కార్మిక, సైనిక ప్రతినిధులతో కూడిన సోవియట్ల మద్దతు లభించింది. ఏ కార్మికులు, సైనికులు అయితే తిరుగుబాటు చేశారో వాళ్లు కార్మిక, సైనిక ప్రతినిధులతో కూడిన సోవియట్లు నిర్మించారు. సోవియట్లు సాయుధ తిరుగుబాటు సాధనాలని, అంతేకాక నూతన విప్లవాధికారానికి విత్తనాలని 1905 విప్లవం చాటిచెప్పింది. సోవియట్లు సాధారణ కార్మిక ప్రజానీకపు విశ్వాసాన్ని చూరగొన్నాయి. జారు రాచరికాన్ని కూలదోసిన వెంటనే సోవియట్లు అమలులోకి వచ్చాయి. వ్యత్యాసం ఏమిటంటే, 1905లో కేవలం కార్మిక సోవియట్లే నిర్మాణం కాగా, ఫిబ్రవరి 1917 విప్లవంలో బోల్షివిక్కుల చొరవతో కార్మిక, సైనిక సోవియట్లు నిర్మాణమయ్యాయి.

అయితే, సోవియట్ కార్యనిర్వాహక సమితిలోని సోషల్ రివల్యూషనరీల, మెన్షివిక్కుల నాయకులు అధికారాన్ని పెట్టుబడిదారులకు అప్పగించారు. అయినప్పటికీ, ఈ విషయాన్ని తెలుసుకున్న మెజారిటీ కార్మిక, సైనిక ప్రతినిధులు, నిజానికి బోల్షివిక్కులు వ్యతిరేకించినప్పటికీ, సోషల్ రివల్యూషనరీల, మెన్షివిక్కుల నాయకుల కృషిని ఆమోదించారు.

ఈ విధంగా రష్యాలో ఒక నూతన రాజ్యాధికారం ఉద్భవించింది. అందులో లెనిన్ మాటల్లో, “పెట్టుబడిదారుల, పెట్టుబడిదారులుగా మారే జమీందార్ల” ప్రతినిధులు ఉండినారు.

అయితే పెట్టుబడిదారీ అధికారంతో పాటే మరొక అధికారం – కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్ ఉనికిలో ఉండింది. సోవియట్‌లో సైనిక ప్రతినిధులుగా ఉండినవారు చాలా వరకూ యుద్ధం కోసం సైన్యంలో చేర్చుకోబడిన రైతులే. కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్ – జారు రాచరికానికి వ్యతిరేకంగా కార్మిక–కర్షక సహకారంతో కూడిన సంస్థ, వారి అధికార సంస్థ, కార్మిక–కర్షక నియంతృత్వ సంస్థ.

ఈ విధంగా రెండు అధికారాలు, రెండు నియంతృత్వాలు విచిత్రంగా పరస్పరం పెనవేసుకొని ఉండినాయి : తాత్కాలిక ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించే పెట్టుబడిదారుల నియంతృత్వం, కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్ ప్రాతినిధ్యం వహించే కార్మిక–కర్షక

నియంతృత్వం.

దీని ఫలితమే ద్వంద్వాధికారం.

**ఇప్పుడు, మూడవ విప్లవం, అంటే రష్యన్ అక్టోబర్ సోషలిస్టు విప్లవం గురించి చూద్దాం. మొదటి ప్రపంచ యుద్ధం 1914 నుంచి 1918 వరకూ కొనసాగిందనీ, రష్యన్ సోషలిస్టు విప్లవం అక్టోబర్ 1917లో విజయవంతమైందనే విషయాన్ని మొట్టమొదట మనం దృష్టిలో ఉంచుకోవాలి.**

1917 ఏప్రిల్ 3 నాటి రాత్రి ఇచ్చిన ఉపన్యాసంలో కామ్రేడ్ లెనిన్ సోషలిస్టు విప్లవ విజయానికై పోరాడవలసిందిగా విశాల ప్రజనీకానికి ఇచ్చిన పిలుపుతో నవంబర్ రష్యా విప్లవ ప్రక్రియ జయప్రదమైంది. 'సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి' అనే నినాదంతో కామ్రేడ్ లెనిన్ ఆ ఉపన్యాసాన్ని ముగించారు. అదే సమయంలో కామ్రేడ్ లెనిన్ యుద్ధం-విప్లవం అనే విషయంపై బోల్షెవిక్కుల సమావేశంలో నివేదికను సమర్పించారు. ఆ తర్వాత మెన్షివిక్కులు, బోల్షివికులు కలిసి నిర్వహించిన సమావేశంలో ఆ నివేదికలోని సైద్ధాంతిక అంశాలను (సిద్ధాంతాన్ని) పునరుల్లేఖించారు. ఇదే కామ్రేడ్ లెనిన్ రూపొందించిన సుప్రసిద్ధ ఏప్రిల్ థీసిస్. ఇది బూర్జువా విప్లవాన్ని సోషలిస్టు విప్లవం వైపుగా పురోగమింపజేసేందుకు పార్టీకీ, కార్మికవర్గానికీ ఒక స్పష్టమైన విప్లవ విధానాన్ని అందించింది.

అక్టోబర్ 1917 నుంచి ఫిబ్రవరి 1918 వరకూ సోవియట్ విప్లవం దేశంలోని విశాల ప్రాంతాలకు ఎంత వేగంగా విస్తరించిందంటే కామ్రేడ్ లెనిన్ దాన్ని సోవియట్ అధికార 'విజయ యాత్ర' అని పిలిచారు.

## విజయవంతమైన మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం

రష్యాలో సోషలిస్టు విప్లవం అనుకున్న దానికంటే సులభంగా విజయవంతం కావడానికి అనేక కారణాలు ఉండినాయి. కింద పేర్కొన్న ముఖ్య కారణాలు దృష్టిలో ఉంచుకోదగినవి :

(1) అక్టోబర్ విప్లవ శత్రువు అంటే రష్యన్ పెట్టుబడిదారీ వర్గం, అనుకున్న దానికంటే ఎంతో బలహీనంగా, అసంఘటితంగా, రాజకీయంగా అనుభవరాహిత్యంతో ఉండింది. రష్యన్ పెట్టుబడిదారీ వర్గం ఆర్థికంగా బలహీనంగా ఉండింది. పూర్తిగా ప్రభుత్వ కాంట్రాక్టులపై ఆధారపడి ఉండింది. పరిస్థితి నుంచి బయటపడే మార్గాన్ని వెతుక్కునే రాజకీయంగా స్వయంనిర్ణయాధికార శక్తి, చొరవ దానికి లేవు. ఉదాహరణకు, పెద్దెత్తున రాజకీయ గ్రూపులు కట్టడం, మోసగించడంలో ఫ్రెంచి పెట్టుబడిదారులకు గల అనుభవం దానికి లేవు. బ్రిటిష్ పెట్టుబడిదారుల్లా సమగ్రంగా, చాకచక్యంతో కూడిన ఒప్పందాలు చేసుకునే విద్య దానికి అబ్బలేదు. ఒప్పందం చేసుకునే విద్యను అది పొంది ఉండలేదు. ఫిబ్రవరి విప్లవం జారును కూలదోసింది, అధికారం పెట్టుబడిదారుల హస్తగతమైంది.

కానీ, మౌలికంగా దుష్ట జారు విధానాన్నే అమలు చేయడం తప్ప వారికి మరో గత్యంతరం లేదు. జారు లాగానే వారు 'విజయం సాధించేంత వరకూ యుద్ధాన్ని నిర్వహించాలనే' విధానాన్ని సమర్థించారు. నిజానికి యుద్ధాన్ని నడపడం రష్యా శక్తికి మించిన పనిగా మారింది. ప్రజలు, సైన్యం - ఇరువురూ యుద్ధం వల్ల తీవ్రంగా దెబ్బతిని ఉండినారు. మొత్తం మీద జారు లాగానే వారు కూడా విశాల భూములను చుట్టబెట్టుకునే వైపే ఉండినారు. మరోవైపు భూముల కొరత భూమి దొరకకపోవడం, భూస్వాములు మోపిన భారంతో రైతులు మరణిస్తూ ఉండినారు. కార్మికులపట్ల అనుసరించిన విధానానికి వస్తే వారు జారును మించిపోయారు. వాళ్లు కార్ఖానా యజమానుల క్రూర విధానాన్ని యథాతథంగా కొనసాగించడమూ, దాన్ని మరింత తీవ్రతరం చేయడమే కాక, పెద్దెత్తున లాకౌట్లు ప్రకటించి ఇక భరించలేని పరిస్థితిని తీసుకొని వచ్చారు.

ప్రజలు జారు విధానానికీ, పెట్టుబడిదారుల విధానానికి మధ్య మౌలిక తేడా ఏదీ చూడలేకపోయారంటే ఆశ్చర్యమేమీ లేదు. జారు అంటే ఎంత కసి ఉందో అంతే కసి పెట్టుబడిదారీ తాత్కాలిక ప్రభుత్వం పట్ల పెరిగిపోయింది.

సోషల్ రివల్యూషనరీ, మెన్షివిక్ పార్టీల ప్రభావం ప్రజలపై ఉన్నంత మేరకు పెట్టుబడిదారులు వాటిని ముసుగులా తాత్కాలిక ప్రభుత్వం ఉపయోగించుకోగలిగేది. తన అధికారాన్ని నిలబెట్టుకోగలిగేది. అయితే, మెన్షివిక్కులు, సోషల్ రివల్యూషనరీలు సామ్రాజ్యవాద పెట్టుబడిదారుల ఏజెంట్లమని స్పష్టం చేసిన తర్వాత, వారు ప్రజలలో తమ ప్రభావాన్ని కోల్పోయారు, ప్రజలు ఇంకెంత మాత్రమూ పెట్టుబడిదారుల తాత్కాలిక ప్రభుత్వానికి మద్దతు ఇవ్వలేదు.

(2) అక్టోబర్ విప్లవానికి రష్యన్ కార్మికవర్గం వంటి విప్లవకర వర్గం నాయకత్వం వహించింది. అది పోరాటాల్లో కాకలుతీరిన వర్గం. అది కొద్ది కాలంలోనే రెండు విప్లవాలను చూసింది. మూడవ విప్లవం ప్రారంభం కావడానికి ముందు శాంతి, భూమి, స్వాతంత్ర్యం, సోషలిజం కోసం కొనసాగే పోరాటంలో ప్రజల నాయకురాలిగా గుర్తింపు పొందింది. విప్లవానికి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న రష్యన్ కార్మికవర్గం నాయకత్వం వహించి ఉండకపోతే, కార్మిక-కర్షక మైత్రి స్థాపించబడి ఉండకపోతే, అటువంటి మైత్రి లేకపోతే అక్టోబర్ విప్లవ విజయం అసంభవం అయి ఉండేది.

(3) విప్లవంలో రష్యన్ కార్మికవర్గానికి రైతాంగంలో అత్యంత మెజారిటీగా ఉన్న, దృఢమైన పేద రైతుల మైత్రి లభించింది. కార్మికవర్గము, పేద రైతాంగం మధ్య మైత్రి దృఢతరమైంది. కార్మికవర్గం, పేద రైతాంగం మధ్య మైత్రి ఏర్పడడంతో మధ్యతరగతి రైతాంగపు పాత్ర స్పష్టమైంది. ఈ మధ్యతరగతి రైతాంగం చాలా రోజుల వరకూ

ఊగిసలాడుతూ ఉండింది. అక్టోబర్ తిరుగుబాటు ప్రారంభానికి ముందే అది పూర్తిగా విప్లవం వైపుకు వచ్చింది. పేద రైతాంగంతో మైత్రి కట్టింది. ఈ మైత్రి లేకపోతే అక్టోబర్ విప్లవం విజయవంతం అయ్యేది కాదు.

(4) రాజకీయ పోరాటాల్లో కాకలుతీరిన, రాటుదేలిన బోల్షివిక్ పార్టీ వంటి పార్టీ కార్మికవర్గానికి నాయకత్వం వహించింది. నిర్ణయాత్మక దాడిలో ప్రజలకు నాయకత్వం వహించగలిగేంత సాహసోపేతమైన పార్టీ బోల్షివిక్ పార్టీ. శాంతి కోసం సాధారణ ప్రజాస్వామిక ఉద్యమం, భూస్వాముల భూముల్ని స్వాధీనం చేసుకోవడం కోసం రైతుల ప్రజాస్వామిక ఉద్యమం, జాతీయ స్వాతంత్ర్యం, జాతీయ సమానత్వం కోసం పీడిత జాతుల ఉద్యమం, పెట్టుబడిదారుల అధికారాన్ని కూలదోసేందుకు, కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపించేందుకు కార్మికవర్గ సోషలిస్టు ఉద్యమం – వీటన్నింటినీ అటువంటి పార్టీ మాత్రమే విప్లవ స్రవంతిలో సమైక్యం చేయగలిగేది.

ఇటువంటి వివిధ ఉద్యమాల స్రవంతులను ఒకే సామాన్య, శక్తివంతమైన విప్లవ స్రవంతిగా సమైక్యం చేయడంతో రష్యాలో పెట్టుబడిదారీ విధాన భవిష్యతు తేలిపోయింది.

(5) పెట్టుబడిదారీ ప్రపంచం రెండు శత్రు శిబిరాలుగా చీలిపోయి, పరస్పరం యుద్ధంలో కూరుకుపోయి, ఒకరి పునాదులను మరొకరు పెకలించడంలో తలమునకలయి వున్న, సామ్రాజ్యవాద యుద్ధం తీవ్రస్థాయికి చేరుకున్న స్థితిలో అక్టోబర్ విప్లవం ఆరంభమైంది. వాళ్లు 'రష్యా వ్యవహారాల్లో' బలంగా జోక్యం చేసుకునే, క్రియాశీలంగా అక్టోబర్ విప్లవాన్ని వ్యతిరేకించే స్థితి లేకుండింది.

అక్టోబర్ సోషలిస్టు విప్లవం కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపించింది. సువిశాల దేశంపై అధికారాన్ని కార్మికవర్గానికి అప్పగించింది. ఈ విధంగా దాన్ని పాలకవర్గంగా చేసింది. ఈ విధంగా అక్టోబర్ సోషలిస్టు విప్లవం మానవ జాతి చరిత్రలో ఒక నూతన యుగాన్ని, కార్మికవర్గ విప్లవాల యుగాన్ని ఆరంభించింది.

## రష్యన్ విప్లవ చారిత్రక గుణపాఠాలు

రష్యన్ విప్లవ చారిత్రక గుణపాఠాలకు సంబంధించిన అంశాలు ఈ కింది విధంగా చెప్పుకోవచ్చు :

(1) కార్మికవర్గ విప్లవ విజయం, కార్మికవర్గ నియంతృత్వం కార్మికవర్గ విప్లవ పార్టీ లేకుండా సాధ్యం కాదు. కేవలం నూతన తరహా పార్టీ, మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీ (ప్రస్తుతం మార్క్సిస్టు–లెనినిస్టు–మావోయిస్టు పార్టీ), సోషలిస్టు విప్లవ పార్టీ, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక యుద్ధాన్ని సాగించేందుకు కార్మికవర్గాన్ని సంసిద్ధం చేయగలిగే, కార్మికవర్గ విప్లవ విజయాన్ని సంఘటితం చేయగలిగే పార్టీ మాత్రమే అటువంటి

పార్టీ కాగలుగుతుంది;

(2) కార్మికవర్గ పార్టీ కార్మికవర్గ ఉద్యమానికి చెందిన పురోగామి సిద్ధాంతం (నేడు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం)పై పట్టు సాధించనంత వరకూ వర్గ నాయకురాలిగా తన పాత్రను అది పరిపూర్తి చేయలేదు.

మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం సమాజాభివృద్ధికి సంబంధించిన శాస్త్రం, కార్మిక-కర్షక, శ్రమజీవి ప్రజల ఉద్యమాల శాస్త్రం. ఒక శాస్త్రంగా అది ఒకే చోట నిలిచిపోదు. సరికదా అది నిరంతరం అభివృద్ధి అవుతుంది, మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం పిడివాదం కాదు, అది కార్యాచరణకు మార్గదర్శి;

(3) పార్టీ విజయాలతో పొంగిపోయి గర్విష్టిగా మారితే, అది తన పనిలో తప్పులను చూడకపోతే, తన తప్పులను ఒప్పుకోవడంలో, సకాలంలో ఎటువంటి దాపరికం లేకుండా, నిజాయితీగా వాటిని సరిదిద్దుకోవడానికి భయపడితే అది కార్మికవర్గ అగ్రగామి పాత్రను నిర్వర్తించలేదు. పార్టీ విమర్శ- స్వీయవిమర్శకు భయపడకుండా ఉంటే, తన పనిలో తప్పుల నుండి గుణపాఠాలు నేర్చుకొని కార్యకర్తలకు నేర్పిస్తే సకాలంలో తన తప్పులను సరిదిద్దుకుంటే అజేయం కాగలుగుతుంది. కార్మికవర్గ పార్టీ తన శ్రేణులలో తలెత్తే అవకాశవాదులకు వ్యతిరేకంగా నిరంతరం తీవ్రమైన పోరాటం చేయకపోతే, తనలోనే అంతర్గతంగా చోటుచేసుకొనే లొంగుబాటువాదులను ఎదుర్కోకపోతే అది తన శ్రేణులలో ఐక్యతను, క్రమశిక్షణను నిలబెట్టలేదు. **వాస్తవానికి బోల్షివిక్ పార్టీ అంతర్గత అభివృద్ధి చరిత్ర పార్టీలో అంతర్గతంగా ఉన్న అవకాశవాద ముఠాలకు వ్యతిరేకంగా, ఆర్థికవాదులకు, మెన్షివిక్కులకు, ట్రాట్స్కీయిస్టులకు, బుఖారిన్‌వాదులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్రే.**

(4) (అ) **పట్టణాలను హస్తగతం చేసుకోవడం ద్వారా ప్రారంభమైన 1871 పారిస్ కమ్యూన్ తిరుగుబాటు కామ్రేడ్ లెనిన్‌కు ఒక నమూనాగా ఉండింది. ఆ అనుభవం నుంచి గుణపాఠం నేర్చుకొని కామ్రేడ్ లెనిన్ రష్యా విప్లవ మార్గంగా సార్వత్రిక తిరుగుబాటు రష్యన్ విప్లవానికి ముందుమార్గాన్ని చేపట్టారు.**

(ఆ) **అందువల్ల, రష్యన్ విప్లవం సార్వత్రిక తిరుగుబాటు ద్వారా విజయవంతమైందని చెప్పవచ్చు. దీని అర్థం, మొదట శత్రు స్థావరాలుగా ఉన్న పట్టణాలను హస్తగతం చేసుకొని, తర్వాత గ్రామాలపై పట్టు సాధించడం.** కానీ, రష్యన్ విప్లవ మహా నాయకులు మొదట కామ్రేడ్ లెనిన్, తర్వాత కామ్రేడ్ స్టాలిన్ మరణం తర్వాత రష్యన్ సోషలిజం నిలబడలేకపోయింది. ఇది ప్రపంచ

కార్మికవర్గానికి అత్యంత బాధాకరమైన ఘటన. దీనికి కారణం కింది విధంగా చెప్పవచ్చు:

1924 జనవరి 21న మహనీయుడు లెనిన్ మరణించారు. ఆయన మరణం తర్వాత కార్మికవర్గ నియంతృత్వం కింద రష్యా దేశంలో సోషలిజాన్ని అభివృద్ధి చేసే బాధ్యత కామ్రేడ్ స్టాలిన్ భుజస్కంధాలపై పడింది. ఈ బాధ్యతను కామ్రేడ్ స్టాలిన్ తన నాయకత్వంలో నైపుణ్యంతో నిర్వహించారు. అయితే కామ్రేడ్ స్టాలిన్ ఎదుట సోషలిస్టు నిర్మాణ కృషికి సంబంధించిన ఎటువంటి అనుభవం లేదు. ఆయన రష్యాలో సోషలిస్టు కృషిని పురోగమింపజేయడమే కాక, దీంతో పాటు ప్రపంచ కార్మికవర్గానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించారు. కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వంలోనే రష్యన్ ఎర్రసైన్యం మునుపెన్నడూ లేని విధంగా సాహసిక ఎదురుదాడి ద్వారా రెండవ ప్రపంచ యుద్ధంలో పరమ ఫాసిస్టు శక్తుల నాయకుడు హిట్లర్‌ను చిత్తుగా ఓడించింది. యావత్తు ఫాసిస్టు శక్తుల నడుములు విరిచింది. కానీ, పార్టీలో దాగి వున్న అత్యంత రివిజనిస్టు, ద్రోహి కృశ్చేవ్ ముఠా 1953 మార్చి 1న కామ్రేడ్ స్టాలిన్ మరణానంతరం అధికారాన్ని హస్తగతం చేసుకుంది. మొదటి పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించి తర్వాత రష్యన్ సోషలిజాన్ని సోషల్ సామ్రాజ్యవాదంగా మార్చివేసింది. ఇది ప్రపంచ కార్మికవర్గం, పీడిత జాతుల, ప్రజలకు ఒక ప్రతికూల అనుభవాన్ని ఇచ్చింది. దీని నుంచి మావో గుణపాఠం తీసుకొని చైనాలో సోషలిజాన్ని పురోగమింపజేశారు. రష్యాలో సోషలిజాన్ని నిర్మాణం చేసే కృషిలో జరిగిన తప్పులు, లోపాల నుండి గుణపాఠాలు తీసుకుని మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని కొనసాగిస్తూ చైనాలో కార్మికవర్గ నియంతృత్వాన్ని మరింత బలోపేతం చేశారు. ద్రోహులైన రివిజనిస్టు–పెట్టుబడిదారీ మార్గీయులను పార్టీ నుంచి బహిష్కరించారు. కానీ, సోషలిజానికి ద్రోహం తలపెట్టిన డెంగ్ ముఠా 1976 సెప్టెంబర్ 9న కామ్రేడ్ మావో మరణానంతరం పార్టీని, అధికారాన్ని హస్తగతం చేసుకుంది. చైనాను మొదట పెట్టుబడిదారీ దేశంగా, ప్రస్తుతం సామ్రాజ్యవాదంగా మార్చివేసింది. ఈ విధంగా ప్రపంచ కార్మికవర్గం, పీడిత ప్రజల ముందు రష్యా పతనం తర్వాత సోషలిస్టు చైనా పతనంతో మరో ప్రతికూల అనుభవం వచ్చింది. ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశంలోనూ సోషలిస్టు వ్యవస్థ ఉనికిలో లేదు. ఈ రెండు ప్రతికూల అనుభవాల నుంచి గుణపాఠం నేర్చుకొని సోషలిస్టు విప్లవాలను మరింత పురోగమింపజేసే, బలోపేతం చేసే బాధ్యత నిజమైన కమ్యూనిస్టుల భుజస్కంధాలపై పడింది. ఈ ముఖ్యమైన కృషిని సరైన విధంగా నిర్వహించేందుకు ప్రపంచ కమ్యూనిస్టులు తమను తాము తీర్చిదిద్దుకోవాల్సే ఉంటుంది. అందువల్ల మహనీయుడు మావో చైనాలో సోషలిజాన్ని బలోపేతం చేయడం కోసం సూత్రబద్ధం చేసిన విధానాలను లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఆచరణలో అన్వయించుకోవాల్సి ఉంటుంది. సోషలిజం విజయం సాధించే దిశను కూడా స్పష్టంగా ముందుకు తీసుకొనిపోవడం కోసం అవసరమైన వాటినన్నింటినీ సిద్ధం చేసుకోవాలి.

## రష్యన్ సోషలిస్టు విప్లవ విశ్వజనీన లక్ష్యంతో మమేకంకండి!

అత్యంత సంక్షిప్తంగా మహత్తర రష్యన్ సోషలిస్టు విప్లవ లక్ష్యాన్ని ఈ కింది విధంగా చెప్పవచ్చు :

(అ) వర్గ సమాజం ఆవిర్భవించిన తర్వాత యావత్తు ప్రపంచ సామాజిక అభివృద్ధి చరిత్ర వర్గ పోరాటాల చరిత్రగానే ఉంది. ఈ చరిత్రలో మహత్తర రష్యన్ అక్టోబర్ విప్లవం గత దోపిడీ యుగాలకు అంతం పలికి చోటు చేసుకున్న ఘటన. ఎందుకని ఇలా అంటున్నాం? ఎందుకంటే రష్యన్ సోషలిస్టు విప్లవం గతంలో జరిగిన అన్ని తిరుగుబాట్లూ, విప్లవాల కంటే స్పష్టంగా భిన్నమైనది. ఉదాహరణకు, రష్యన్ విప్లవానికి ముందు మానవ సమాజంలో ఎన్నో తిరుగుబాట్లు, విప్లవాలు జరిగాయి. మహనీయుడు మావో ప్రకారం, అవన్నీ పాత బూర్జువా ప్రజాస్వామిక విప్లవంలో భాగం. వాటి ప్రధాన లక్ష్యం బూర్జువా వర్గం నేతృత్వంలో బూర్జువా సమాజాన్ని లేదా పెట్టుబడిదారీ సమాజాన్ని స్థాపించడం. బూర్జువా వర్గం కార్మిక-కర్షక జనాలను సంఘటితం చేసి సాయుధంగా బూర్జువా విప్లవం ద్వారా తన వర్గ ప్రయోజనం కోసం మాత్రమే భూస్వామ్య సమాజాన్ని ధ్వంసం చేసి బూర్జువా లేదా పెట్టుబడిదారీ సమాజాన్ని స్థాపించింది. అయితే, పెట్టుబడిదారీ సమాజ స్థాపనానంతరం కార్మిక-కర్షక జనాలు చేతులు ముడుచుకొని కూర్చోవడం లేదని అది గమనించింది. ఇందుకు భిన్నంగా, వారు ముందుకు పురోగమించి 1917లో రష్యన్ సోషలిస్టు విప్లవం ద్వారా బూర్జువా లేదా పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోసి కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించారు. దీంతో భీతిల్లిపోయిన బూర్జువా వర్గం 1917 తర్వాత మరెక్కడా కూడా బూర్జువా విప్లవ పతాక రెపరెపలాడ లేదు. అంటే బూర్జువా వర్గం బూర్జువా విప్లవ బాధ్యతను మరెప్పుడూ నిర్వహించలేదు. ప్రస్తుతం, అంటే 1917 నుంచి బూర్జువా విప్లవం ద్వారా భూస్వామ్య విధానాన్ని భూస్థాపితం చేసే బాధ్యత కార్మికవర్గ భుజస్కంధాలపైనే పడింది. దీన్ని జాతీయ లేదా ప్రజాస్వామిక విప్లవం, అంటే నూతన ప్రజాస్వామిక విప్లవంగా కామ్రేడ్ మావో సిద్ధాంతీకరించారు. మహత్తర రష్యన్ విప్లవం తర్వాత జరిగిన, జరుగుతున్న విప్లవాలన్నీ కార్మికవర్గ నాయకత్వంలో ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగం అయ్యాయి. ముఖ్యంగా ప్రపంచ కార్మికవర్గ విప్లవంలో రెండు స్రవంతులు ఉన్నాయి. మొదటిది, సోషలిస్టు విప్లవం. రెండవది, నూతన ప్రజాస్వామిక విప్లవం. సోషలిస్టు విప్లవ ప్రధాన లక్ష్యం కార్మికవర్గ నియంతృత్వం కింద సోషలిస్టు సమాజాన్ని స్థాపించడం; నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రధాన లక్ష్యం కార్మికవర్గ నాయకత్వంలో 90 శాతం ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వం కింద నూతన ప్రజాస్వామిక సమాజాన్ని స్థాపించడం, ఆ తర్వాత నూతన ప్రజాస్వామిక సమాజాన్ని పురోగమింపజేస్తూ కార్మికవర్గ నియంతృత్వం కింద సోషలిస్టు సమాజాన్ని స్థాపించడం.

(ఆ) విప్లవంలో మౌలిక కర్తవ్యం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం. దీనికి ఎంతో లోతైన అర్థం ఉన్నది. దీన్ని మనం ఎన్నడూ మరచిపోకూడదు.

## రష్యన్ విప్లవం కొనసాగింపుగా, దాని నుంచి విడదీయలేని విధంగా జరిగిన చైనా విప్లవం; రష్యా, చైనా విప్లవాల కొనసాగింపులో భాగంగానే కొనసాగుతున్న భారత విప్లవం

సామ్రాజ్యవాద యుగంలో కార్మికవర్గ విప్లవాల అనుభవాలను సంశ్లేషిస్తూ, చైనాలోని నిర్దిష్ట పరిస్థితుల గురించి, విప్లవ యుద్ధం గురించి మాట్లాడుతూ, "సాయుధ బలంతో రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం, యుద్ధం ద్వారా సమస్యను పరిష్కరించడం విప్లవంలో కేంద్ర కర్తవ్యంగా, అత్యున్నత రూపంగా ఉంటుంది" అని మావో చెప్పారనే విషయం మనకు తెలుసు. విప్లవానికి సంబంధించిన ఈ మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రం అంతటా వర్తిస్తుంది, చైనాకూ, ఇతర దేశాలన్నింటికీ వర్తిస్తుంది.

సూత్రం ఒక్కటే అయినప్పటికీ కార్మికవర్గ పార్టీ దాన్ని అమలు చేసేటప్పుడు వివిధ పరిస్థితులకు అనుగుణ్యంగా దాన్ని వేరు వేరు పద్ధతుల్లో అన్వయిస్తుంది. ఫాసిజాన్ని చేపట్టని పెట్టుబడిదారీ దేశాలు, యుద్ధంలో భాగం కాని దేశాలైతే అవి తమ దేశంలో బూర్జువా ప్రజాస్వామ్యాన్ని అమలు చేస్తాయి. తమ విదేశీ సంబంధాల్లో అవి ఇతర జాతుల పీడనకు గురికావు కానీ, ఇందుకు భిన్నంగా ఇతర జాతుల్ని పీడిస్తాయి. వాటి ఈ నిర్దిష్ట పరిస్థితుల కారణంగా, పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గ పార్టీల కర్తవ్యం - దీర్ఘకాలికంగా చట్టబద్ధ పోరాటాల ద్వారా కార్మికులకు శిక్షణ గరపడం, తమ శక్తిని కూడగట్టుకోవడం, అంతిమంగా పెట్టుబడిదారీ రాజ్యాధికారాన్ని కూలదోయడం కోసం సన్నాహాలు చేయడం. పై దేశాల్లో దీర్ఘకాలం వరకూ చట్టబద్ధ పోరాటాలు నడపడం, పార్లమెంటును ఒక వేదికగా ఉపయోగించుకోవడం, ఆర్థిక, రాజకీయ సమ్మెలు నిర్వహించడం, ట్రేడ్ యూనియన్లను సంఘటితం చేయడం, కార్మికులకు శిక్షణ గరపడమే కర్తవ్యంగా ఉంటుంది. ఈ దేశాల్లో నిర్మాణ రూపం చట్టబద్ధంగా, పోరాట రూపం రక్తపాతం లేనిదిగా (సైనికేతరమైనదిగా) ఉంటుంది. యుద్ధానికి సంబంధించిన సమస్య వచ్చినప్పుడు, పెట్టుబడిదారీ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు తమ సొంత దేశాలు కొనసాగించే సామ్రాజ్యవాద యుద్ధాలను వ్యతిరేకిస్తాయి. ఈ విధంగా యుద్ధాలు జరిగితే, తమ తమ దేశాల అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలను ఓడించడంలో మద్దతు నిచ్చే విధంగా కమ్యూనిస్టు పార్టీల విధానం ఉంటుంది. అవి నిర్వహించాలని కోరుకునే యుద్ధం అంతర్యుద్ధం అవుతుంది, అందుకు అవి సన్నాహాలు చేస్తాయి. అయితే ఈ తిరుగుబాటును-యుద్ధాన్ని పెట్టుబడిదారీ వర్గం వాస్తవికంగా దిక్కుతోచని స్థితికి రానంత వరకూ, మెజారిటీ కార్మికవర్గ ప్రజలు సాయుధ తిరుగుబాటు చేసేందుకు, యుద్ధాన్ని నిర్వహించేందుకు పూనుకోనంత వరకూ, రైతాంగ ప్రజలు

స్వచ్ఛందంగా కార్మికవర్గానికి మద్దతునీయనంత వరకూ ప్రారంభించకూడదు. ఇటువంటి తిరుగుబాటుకు, యుద్ధానికి సమయం ఆసన్నం కాగానే, మొదటి అడుగుగా పట్టణాలను హస్తగతం చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల వైపు పురోగమించాల్సి ఉంటుంది తప్ప భిన్నమైన మార్గాన్ని అనుసరించకూడదు. పెట్టుబడిదారీ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు ఇలాగే చేశాయి. రష్యన్ అక్టోబర్ విప్లవం ఈ విషయం సరైందని రుజువు చేసింది.

"అయితే చైనా భిన్నమైన దేశం. చైనా నిర్దిష్ట లక్షణం ఏమిటంటే అది ఒక స్వతంత్ర దేశం కాదు. ఇందుకు భిన్నంగా అర్ధ-వలస అర్ధ-భూస్వామ్య దేశం. చైనాలో ప్రజాస్వామ్యం లేదు. అది భూస్వామ్య దోపిడికి గురవుతుండింది. దాని విదేశీ సంబంధాల్లో జాతీయ స్వాతంత్ర్యం లేదు. అది సామ్రాజ్యవాద దోపిడీకి గురవుతుండింది. ఈ విధంగా ఇక్కడ ఉపయోగించుకోవడానికి పార్లమెంటు అంటూ ఏదీ లేదు, కార్మికులను సమ్మెలలో సంఘటితం చేసేందుకు ఎటువంటి చట్టబద్ధ హక్కులూ లేవు. మౌలికంగా, ఇక్కడి కమ్యూనిస్టు పార్టీకి తిరుగుబాటు-యుద్ధం ప్రారంభించే ముందు దీర్ఘకాలం పాటు చట్టబద్ధ పోరాటాలు కొనసాగించాల్సిన పనిలేదు, మొదట పట్టణాలను హస్తగతం చేసుకొని, ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాలలో అధికారాన్ని స్థాపించుకోవాల్సిన పనిలేదు. దాని ముందున్న కర్తవ్యం దీనికి పూర్తిగా భిన్నమైంది." (మావో - 'యుద్ధం-వ్యూహానికి సంబంధించిన సమస్యలు' నుంచి). ఈ విధంగా దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారానే 1949లో మహనీయుడు మావో నేతృత్వంలో చైనా విప్లవం విజయవంతమైంది.

అనుభవం మనకు నేర్పిందేమిటంటే, ప్రపంచ కార్మికవర్గం, ప్రజలు నిర్వహించిన విప్లవ పోరాటాల అనివార్య ఫలితంగా మహత్తర రష్యన్ అక్టోబర్ సోషలిస్టు విప్లవం ముందుకు వచ్చింది, ఈ ప్రక్రియకు కొనసాగింపే మహత్తర చైనా విప్లవం. ప్రస్తుత మన భారత విప్లవం కూడా ప్రపంచ కార్మికవర్గం, ప్రజలు నిర్వహించిన విప్లవ పోరాటాల నుంచి విడదీయలేనిది. అందువల్ల, భారత విప్లవ కేంద్ర కర్తవ్యం కూడా సాయుధ బలం ద్వారా రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే. భారతదేశంలో కూడా కార్మికవర్గ పార్టీ అంటే కమ్యూనిస్టు పార్టీ ప్రపంచ సోషలిస్టు విప్లవ అనుభవాలను, ప్రత్యేకించి, రష్యా, చైనాల రెండు మహత్తర విప్లవాల అనుభవాలను అధ్యయనం చేయడం అత్యంత అవసరం.

భారతదేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం. అందువల్ల ఇక్కడ విప్లవం కోసం ఈ మార్గాన్ని అవలంబించాలి, "ఏదేని దేశం సామ్రాజ్యవాద శక్తి లేదా శక్తులచే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాలించబడుతుంటే, ప్రజలకు ఎటువంటి స్వాతంత్ర్యం లేదా ప్రజాస్వామిక హక్కులు లేని అర్ధభూస్వామ్య దేశం అయి ఉంటే, అక్కడ కార్మికవర్గ పార్టీ మొట్టమొదటి నుంచే ప్రజలను సాయుధ పోరాటం కోసం జాగృతుల్ని చేయాలి, సంఘటితం చేయాలి. విప్లవ ప్రధాన శక్తిగా రైతాంగం ఉంటుంది. వెనుకబడిన ప్రాంతాలను తన పనికి ముఖ్య కేంద్రంగా చేసుకుంటుంది.

ప్రజాసైన్యం, ప్రజా మిలీషియా నిర్మాణం చేస్తుంది. విశాల గ్రామీణ ప్రాంతాల్లో ఆధారపడదగిన, బలమైన, స్వయంపోషక విముక్తి ప్రాంతాలను, స్థావర ప్రాంతాలను స్థాపిస్తుంది. దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా వాటిని నిరంతరం విస్తరిస్తుంది. అభివృద్ధి నిరోధక రాజ్యాధికారంపై నిర్ణయాత్మక, విధ్వంసపూర్వక దాడి చేయడం ద్వారా పట్టణాలను చుట్టుముట్టి అంతిమంగా వాటిని హస్తగతం చేసుకుంటుంది. దేశవ్యాప్తంగా ప్రజల రాజకీయ అధికారాన్ని, రాజ్య వ్యవస్థను స్థాపిస్తుంది."

భారతదేశంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివిధ రూపాల్లోని రివిజనిస్టు పంథా, కార్యక్రమం నేపథ్యంలో పార్లమెంటరీ ఎన్నికలపై మనదైన ఒక సరైన దృక్పథం, దానికి అనుగుణ్యంగా కార్యక్రమం ఉండడం అత్యంత అవసరం. ఈ విషయంలో మన వ్యూహం-ఎత్తుగడల డాక్యుమెంటులో రాయబడిన అంశంలోని సారాంశాన్ని లోతుగా వంటబట్టించుకోవాలి. దానికి అనుగుణ్యంగా నినాదాలు, కార్యక్రమాలను కూడా సిద్ధం చేసుకోవాలి. ఎన్నికల్లో పాల్గొనడం లేదా బహిష్కరించడం ఎత్తుగడలకు సంబంధించిన అంశమని మనం తప్పకుండా దృష్టిలో ఉంచుకోవాలి. అయితే కృశ్చేవ్ రివిజనిజం ఆవిర్భావం తర్వాత, పార్లమెంటరీ మార్గం, ఎన్నికల్లో పాల్గొనడం ఆధునిక రివిజనిజానికి వ్యూహంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో మనం ఈ సమస్యను కేవలం ఎత్తుగడల సమస్యగానే భావించలేము. దీంతో పాటు "ప్రస్తుతం పార్టీ కొండలు-అడవులు ఉన్న బహుకొద్ది ప్రాంతానికి పరిమితమైపోయింది", "అనేక ప్రాంతాల్లో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రాబల్యం సంపాదించుకుంది", "పార్లమెంటరీ వ్యవస్థ లేదా ఎన్నికలపై ప్రజలకు భ్రమలు ఉన్నాయి" - మొదలైన వాదాలు, అభిప్రాయాలు పసలేనివి. భారతదేశ నిర్దిష్ట వాస్తవికతతో వీటికి ఎటువంటి సంబంధమూ లేదు.

మన దేశంలో "ఇప్పటి వరకూ లభించిన చారిత్రక అనుభవం రుజువు చేసేదేమంటే, ఎన్నికల్లో పాల్గొన్నవారిలో ఎక్కువ భాగం రివిజనిస్టులుగా మారారు లేదా సాయుధ విప్లవోద్యమాన్ని చట్టబద్ధ, శాంతియుత మార్గంతో పక్కదారి పట్టించారు. అందువల్ల, ఎన్నికల బహిష్కరణ ఎత్తుగడల సమస్యే అయినప్పటికీ, భారతదేశ నిర్దిష్ట పరిస్థితులలో అది వ్యూహాత్మక ప్రాధాన్యతను కలిగి ఉంటుందనీ, ఎందుకంటే, ఎన్నికల్లో పాల్గొనడం దీర్ఘకాల ప్రజాయుద్ధ వ్యూహానికి ఏమాత్రమూ పొసగదనీ" మనం ఖచ్చితంగా చెప్పవచ్చు.

**అందువల్ల ఒక్కమాటలో చెప్పాలంటే, మనం భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం కోసం సాయుధ వ్యవసాయ విప్లవం, దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గానికి ఖచ్చితంగా అంటిపెట్టుకొని ఉండాలి.**

## రష్యన్ విప్లవ శతాబ్ది ఉత్సవం సందర్భంగా భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దామని, మన తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యంపై దృఢంగా నిలబడతామని ప్రతిజ్ఞ చేద్దాం!

రష్యన్ విప్లవ శతాబ్ది ఉత్సవాన్ని జరుపుకునేందుకు రెండు పద్ధతులు ఉన్నాయి : ఒకటి, పెటీబూర్జువా రివిజనిస్టు పద్ధతి. రెండవది, విప్లవ పద్ధతి. రివిజనిస్టు పద్ధతి అంటే, కేవలం పై పై మెరుగుల కోసం రష్యన్ విప్లవాన్ని, కామ్రేడ్ లెనిన్, స్టాలిన్‌లను కీర్తించడం, పెద్దెత్తున ఉపన్యాసాలు దంచడం, ఆచరణలో వాటిని ఏమాత్రం అమలు చేయకపోవడం. విప్లవ పద్ధతి అంటే, పై పై మెరుగుల కోసం కాక, రష్యన్ విప్లవ లక్ష్యాన్ని, అంటే విప్లవం ద్వారా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే కర్తవ్యాన్ని తమ-తమ దేశాల నిర్దిష్ట పరిస్థితికి అనుగుణ్యంగా ముందుకు తీసుకొని వెళ్లేందుకు శపథం చేయడం. అందువల్ల, మనం తప్పకుండా రివిజనిస్టు పద్ధతులను తీవ్రంగా వ్యతిరేకించాలి, విప్లవ పద్ధతులకు అనుగుణ్యంగా రష్యన్ విప్లవ శతాబ్ది ఉత్సవాన్ని నిర్వహించుకోవాలి.

రష్యన్ విప్లవ శతాబ్ది ఉత్సవ సందర్భంగా భారత విప్లవం ఎదుట ప్రస్తుతం వున్న సవాళ్లను, మోడీ ప్రభుత్వపు ప్రతీ ఫాసిస్టు విధానాన్ని, చర్యలను సాహసోపేతంగా ఎదుర్కొంటూ నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మిద్దామని, సోషలిజం-కమ్యూనిజం స్థాపించడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని శపథం చేద్దాం.

దేశంలో కేంద్రంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బిజెపి నరేంద్ర మోడీ గద్దెనెక్కి మూడు యేళ్లు పూర్తయ్యాయి. ప్రభుత్వ, కార్పొరేట్ నియంత్రణలో ఉన్న ప్రచార యంత్రాంగం - రేడియో, టివి, పత్రికలు మొదలైనవన్నీ మోడీ ప్రభుత్వం విజయాలు సాధించిందంటూ అదే పనిగా ప్రచారం చేస్తున్నాయి. ఇప్పుడు దేశంలో పేదరికం లేదు, ఉద్యోగాలకు కొదవలేదు, కొరతా-లేమి అనేది ఏదీ లేకుండా అన్ని రకాల సమానత్వం వచ్చేసిందంటున్నారు. అంకెల గారడీతో స్థూల దేశ ఉత్పత్తి భారీగా పెంచేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఎదిగివచ్చిందంటున్నారు. ఇప్పుడు దేశంలో అవినీతి లేదంటున్నారు. పెద్ద నోట్ల రద్దుతో నల్లధనం పోయిందంటున్నారు. అందరి అభివృద్ధీ జరిగి, మంచి రోజులు కూడా వచ్చేశాయట. మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, లైంగిక దోపిడీ మొదలైనవి చాలా వరకూ తగ్గాయంటున్నారు. కులతత్వం, వివక్ష పోయి మత మైనారిటీలకు అన్ని హక్కులు దొరుకుతున్నాయట. 'మేక్ ఇన్ ఇండియా', 'మాన్యుఫ్యాక్చరింగ్ హబ్', 'స్టార్టప్ ఇండియా' మొదలైన నినాదాలు దేశ అభివృద్ధికి తోడ్పడుతున్నాయని బుకాయిస్తున్నారు. డిజిటల్ ఇండియా, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ కార్యక్రమాలు ప్రజలపై రుద్దుతున్నారు. ఇక మిగిలిందల్లా వారి

దృష్టిలో కేవలం దేశ అంతర్గత భద్రతకు మావోయిజమే లేదా మావోయిస్టులే అత్యంత ప్రమాదంగా ఉన్నారు.

కానీ, వాస్తవానికి, భారతదేశ వ్యాప్తంగా అసలు చిత్రం దీనికి పూర్తిగా భిన్నంగా ఉంది. పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా మారుతున్నారు. పేదలకూ, ధనికులకూ మధ్య అంతరం బాగా పెరిగిపోయింది. ప్రత్యేకించి, 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక శాతం ధనికుల ఆస్తి 49 శాతం పెరిగి 2016లో 58.4 శాతం అయ్యింది. 2016లో దేశంలో పది శాతం అత్యంత ధనికుల వద్ద మొత్తం ఆస్తుల్లో 80.7 శాతం ఉండినాయి. అంటే మిగతా 90 శాతం జనాభా వద్ద 19.3 శాతం ఆస్తులు మాత్రమే ఉన్నాయి (క్రెడిట్ సోర్స్ గ్లోబల్ వెల్త్ డేటా బేస్ నుంచి). విదేశాల్లో దాచిన నల్లధనాన్ని 100 రోజుల్లో తీసుకొస్తాననే మోడీ ప్రకటన ప్రస్తుతం 1050 రోజులు గడిచిన తర్వాత కూడా ఆ వైపుగా ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్ల లేదు. అంటే ఆ ప్రకటన గాలిలో కలిసిపోయింది.

దేశంలో ఉద్యోగాలు దొరికే అవకాశాలు పూర్తిగా అడుగంటిపోయాయి. ద్రవ్యోల్బణం రేటు కూడా పెరిగింది. ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. అలాగే, మోడీ 'మేక్ ఇన్ ఇండియా', 'మాన్యుఫ్యాక్చరింగ్ హబ్' నినాదాలు నిజానికి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడానికీ, 'డిజిటల్ ఇండియా' నినాదం కూడా నిజానికి మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని డిజిటలైజ్ చేయడానికే. తద్వారా మొత్తం పరిపాలనా యంత్రాంగంపై తన నియంత్రణ నిలుపుకొని బలోపేతం చేసుకోవాలని చూస్తున్నాడు. మోడీ ప్రభుత్వం అనేక కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చింది. దీని వల్ల లక్షలాది కార్మికుల ఉద్యోగాలు ఊడిపోయాయి. రైతుల ఆత్మహత్యలు మరింత పెరిగాయి.

సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం యావత్తు దేశాన్ని ఏకీకృత మార్కెట్‌గా మార్చడానికి పరోక్ష పన్నుల విధానాన్ని సవరించి వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ను ముందుకు తెచ్చారు. అవినీతి నిర్మూలిస్తామనే మోసపూరిత ప్రచారంతో పాటు పెద్ద నోట్లను రద్దు చేసి ప్రజల వద్ద వున్న మొత్తం నగదును బ్యాంకుల్లో జమ చేశారు. దీని ద్వారా రైతులను, చిన్న వ్యాపారులను, చిన్న పెట్టుబడిదారులను దెబ్బతీశారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలు దెబ్బతిన్నాయి. ప్రజలు తాము దాచుకున్న డబ్బును స్వతంత్రంగా వినియోగించుకునే అవకాశాన్ని ఇవ్వకుండా వారి డబ్బునంతా బ్యాంకుల్లో జమ చేయించి, దాని ద్వారా సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాన్ని నెరవేరుస్తూ డిజిటలీకరణ, నగదు రహిత ఆర్థిక వ్యవస్థను స్థాపించడం కోసం ప్రయత్నిస్తున్నారు. దీని వల్ల రానున్న రోజుల్లో దేశ మధ్యతరగతి వర్గంతో పాటు అన్ని సెక్షన్లపై ప్రపంచ ద్రవ్య పెట్టుబడి, దళారీ నిరంకుశ పెట్టుబడి దాడి మరింత పెరిగే అవకాశం ఉంది.

దేశం ఆర్థికంగా అభివృద్ధి అయ్యిందని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ దేశంలో పారిశ్రామిక రంగంలో, ఉత్పత్తి రంగంలో మాంద్యం ఏర్పడిన కారణంగా నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు, వ్యవసాయ సంక్షోభం పెరిగి ఈ 'అభివృద్ధి' డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నాయి.

దేశంలో రోజు రోజుకూ తీవ్రతరమవుతున్న వైరుధ్యాల కారణంగా పెరుగుతున్న సామాజిక ఉద్యమాలను రూపుమాపడం కోసం మోడీ ప్రభుత్వం ఎంతటి ఫాసిస్టు చట్టాలను తీసుకొచ్చే అవకాశం ఉంది. అదే విధంగా వివిధ పేర్లతో హిందూ ఫాసిస్టు ముఠాలను కూడా ఏర్పరచి ప్రజలపై చట్టవ్యతిరేక, ఫాసిస్టు దాడులను తీవ్రతరం చేసే అవకాశం ఉంది.

కశ్మీర్‌లో అన్ని రకాల హక్కులను కాలరాచి ప్రజలను నిర్బంధ శిబిరంలో, తుపాకుల నీడలో జీవితాన్ని గడిపే స్థితికి నెట్టారు. అత్యాచారాలు ఎంత భయంకరంగా ఉన్నాయంటే, సైన్యం కశ్మీరు యువకుడిని జీపుకు బంధించి తిప్పే అత్యంత దుర్మార్గమైన స్థాయికి చేరుకున్నాయి. ఈశాన్య భారతంలోని యావత్తు జాతుల ప్రజలు స్వయం-నిర్ణయాధికార హక్కు కోసం కొనసాగిస్తున్న ఉద్యమాలపై అమానవీయమైన అణచివేత క్యాంపెయిన్‌ను కొనసాగిస్తున్నారు. ఆ ఉద్యమాలను ఉక్కుపాదాలతో అణగదొక్కుతున్నారు. నిరసన తెలిపే మీడియా వారిని కూడా వదిలిపెట్టడం లేదు. వారు లేవనెత్తే ప్రశ్నల్ని, వారి ప్రతిఘటనా గొంతుల్ని నొక్కివేయడం కోసం వివిధ రకాలుగా వారిని బెదిరిస్తున్నారు, వారిపై కేసులు మోపుతున్నారు.

అలాగే, గో రక్షణ సాకుతో, గో మాంసాన్ని కలిగి ఉన్నారనీ, తిన్నారనే ఆరోపణతో ముస్లిములను కొట్టి-కొట్టి చంపడం, గాయపరచడం అడ్డూ ఆపూ లేకుండా కొనసాగుతున్నది. ఉత్తర ప్రదేశ్‌లో కరుడుగట్టిన ముస్లిము వ్యతిరేక యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మత మైనారిటీ ముస్లిం ప్రజలపై పలు రకాల జులుం-అత్యాచారాలు, ఒత్తిడి పెరిగిపోయాయి, వివిధ రకాల ఆంక్షలు విధించబడుతున్నాయి. మాంసం దుకాణాలను బంద్ పెట్టించి గో మాంసంతో పాటు అన్ని రకాల మాంసం అమ్మకాలపై నిషేధం విధిస్తున్నారు. పశువుల కొనుగోలు-అమ్మకాలపై కూడా నియంత్రిస్తూ క్రూరమైన చట్టాలు తెస్తున్నారు. ప్రజల తిండీ, కట్టూ బొట్టులను నియంత్రిస్తున్నారు. ఇతర మత మైనారిటీలపై కూడా వివిధ రకాల ఒత్తిడి, ఆంక్షలు విధించబడుతున్నాయి. దీని వల్ల పేదవారిలో ఒక సెక్షన్‌కు ఉపాధి దొరకకుండా పోయింది. దళితులపై అత్యాచారాలు అనేక రెట్లు పెరిగిపోయాయి. సహారన్‌పుర్ దళితులపై అత్యాచారాలు దీనికి తాజా ఉదాహరణ.

మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత భారతదేశ విస్తరణవాద ధోరణి మరింతగా పెరిగిపోయింది. పొరుగు దేశాలతో పరస్పర సంబంధాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. చైనాను చుట్టుముట్టాలనే అమెరికా సామ్రాజ్యవాద అగ్రరాజ్యపు విధానాన్ని తలకెత్తుకోవడం కోసమే మోడీ ప్రభుత్వం వివిధ రకాల పథకాలు, కార్యక్రమాలు చేపట్టింది. ఇటీవల, మోడీ అసోంలోని బ్రహ్మపుత్ర

నదిపై 9 కి.మీ. వంతెనను ప్రారంభించడం నిజానికి అరుణాచల్ ప్రదేశ్‌తో కనెక్టివిటీలో వేగాన్ని పెంచడం, తద్వారా 'చైనాను చుట్టుముట్టే' అమెరికా పథకాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసమే. నిజానికి భారతదేశ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సైనిక, విదేశీ విధానం, పరిపాలనా విధానం - సకల క్షేత్రాలలో ఫాసిస్టు విధానాలు, పద్ధతులు అమలు చేయబడుతున్నాయి. వాస్తవం చెప్పాలంటే దేశవ్యాప్తంగా పోలీసు-తుపాకి రాజ్యం అమలవుతున్నది.

## మన కర్తవ్యాలు

కామ్రేడ్స్!

మావోయిస్టు పార్టీ, మావోయిస్టు ఉద్యమాన్ని పూర్తిగా రూపుమాపడమే మోడీ ప్రభుత్వపు ఒక ముఖ్యమైన కర్తవ్యంగా అర్థం చేసుకోవాలి. అయితే ఇది కేవలం దేశంలో ఏదో ఒక పార్టీకి సంబంధించిన ఇష్టాయిష్టాలతో చేసిన నిర్ణయం కాదు, అలా అవ్వడానికి అవకాశం లేదు. ఎందుకంటే, భారత పాలకవర్గ పార్టీలు భూస్వామ్య, సామ్రాజ్యవాద దళారీ పార్టీలు. అందువల్ల, ఏ పార్టీ అయినా, ఏ రంగు ప్రభుత్వం అయినా సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదపు నిర్దేశానికి అనుగుణంగా ఎల్ఐసి పాలసీ (తక్కువ తీవ్రత కలిగిన యుద్ధం)లోని వివిధ అంశాలను పూర్తిగా అమలు చేస్తున్నాయి. యుపిఏ హయాంలో ఇదే జరిగింది. ప్రస్తుతం ఎన్‌డిఏ హయాంలో మరింత దూకుడుగా జరుగుతున్నది. అందువల్ల ఇది కేవలం మోడీ ప్రభుత్వం గద్దె నెక్కిన తర్వాతే ప్రభుత్వానికి ముఖ్యమైన పనిగా మారిందనేది కాదు. యుపిఏ-1, యుపిఏ-2 ప్రభుత్వాలపై ఒకసారి దృష్టి సారిస్తే, ఆ రెండు ప్రభుత్వాలూ మావోయిస్టు పార్టీనీ, మావోయిస్టు ఉద్యమాన్నీ 'దేశ అంతర్గత భద్రతకు అత్యంత ప్రమాదం' అని చెప్పి మన పార్టీనీ, ఉద్యమాన్నీ రూపుమాపే పనికి అత్యంత ప్రాధాన్యత నిచ్చి కొనసాగించాయి. 'ఆపరేషన్ గ్రీన్ హంట్' మొదటి రెండు దశలు ఆ ప్రభుత్వాలే కొనసాగించాయి. అయితే ఫలితం ఏమైంది? అవి నిర్ధారించుకున్న లక్ష్యాలను సాధించడంలో చాలా వరకూ విఫలమయ్యాయనడానికి చరిత్ర సాక్షిగా నిలిచింది. ఇందుకు భిన్నంగా మావోయిస్టు పార్టీ, ఉద్యమం ప్రజల్లో వేళ్లూనుకుంది. వేలాది మంది కామ్రేడ్స్ అమరత్వాల కారణంగా భారీ నష్టాన్ని ఎదుర్కొన్నప్పటికీ పార్టీ అనేక అనుభవాలను సంపాదించుకొని, గుణపాఠాలను తీసుకొని బలోపేతమయ్యింది.

ప్రస్తుతం బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు మోడీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదంతో సహా యావత్తు సామ్రాజ్యవాదుల నుంచి, అభివృద్ధి నిరోధకుల నుంచి అన్ని రకాల మద్దతును తీసుకొని విప్లవోద్యమాన్ని పూర్తిగా నాశనం చేయడం కోసం 'ఆపరేషన్ గ్రీన్ హంట్' మూడవ దశ పథకాన్ని అమలు చేస్తున్నది. 'చుట్టుముట్టు-నాశనం చేయి' క్యాంపెయిన్‌లో లేదా వివిధ రకాల అణచివేత క్యాంపెయిన్లలో, సరెండర్ పాలసీలో లేదా మానసిక యుద్ధంలాగా

దుష్ప్రచారాన్ని కొనసాగించే పాలసీలో, వివిధ రకాల సోకాల్డ్ సంస్కరణ కార్యక్రమాలు లేదా అభివృద్ధి ఢంకా భజాయించే కార్యక్రమాలలో – అన్నింటిలోనూ మోడీ ప్రభుత్వం పూర్తిగా మార్పు తీసుకొని వచ్చింది. మోడీ ప్రభుత్వం గద్దె నెక్కిందో లేదో మావోయిస్టులను నిర్మూలిస్తానని ప్రకటించింది. మరింత ఎక్కువ సంఖ్యలో పారామిలటరీ బలగాల బెటాలియన్లను నిర్మించి మావోయిస్టు ప్రాంతాలలో మోహరిస్తున్నది. అలాగే 'తమ వేలితో తమ కంటిలో పొడిచే' అత్యంత అభివృద్ధి నిరోధక విధానంలో భాగంగా 'బస్తరియా బెటాలియన్', 'పహాడియా బెటాలియన్' లేదా 'స్థానిక ఆదివాసీ బెటాలియన్'లను నిర్మించి 'ఆదివాసులను ఆదివాసులకు వ్యతిరేకంగా పోరాడే' విధంగా అభివృద్ధి నిరోధక ఎల్ఐసి పాలసీని అత్యంత దూకుడుగా అమలు చేస్తున్నది.

మరో హేయ విధానంగా, యుపిఏ ప్రభుత్వం అమలు చేసిన సరెండర్ లేదా లొంగుబాటు పాలసీని, దాని మాటల్లో 'మరింత ఆకర్షణీయంగా' తయారు చేయడం కోసం మునుపటి కంటే చాలా అధికంగా డబ్బు దొరుకుతుందనే దురాశను పెంచేస్తున్నది. మన కామ్రేడ్స్‌ను, కార్యకర్తలను సరెండర్ చేయించాలని వారి కుటుంబాలపై ఒత్తిడి తీసుకొస్తున్నది. అలా చేయకపోతే వారిని చిత్రహింసలు పెడతామనీ, జైలులో పెట్టి కుళ్లిపోయేలా చేస్తామని కూడా బెదిరిస్తున్నది. చిల్లిగవ్వ లేకుండా వారి ఆస్తుల్ని జప్తు చేసుకుంటున్నది.

పైన పేర్కొన్న యావత్తు విప్లవ వ్యతిరేక పాలసీలను తిప్పికొట్టేందుకు మన మొట్టమొదటి, ప్రధానమైన పని, సిసి నుంచి ఏసి వరకూ, ప్రజా సంఘాల వరకూ నాయకత్వాన్ని రక్షించడం, పార్టీనీ మరింతగా బోల్షివీకరించడం, శత్రు బహుముఖ దాడిని బహుముఖ ఎదురుదాడి ద్వారా తిప్పికొట్టేందుకు యావత్తు పార్టీ కేడర్లను, విప్లవ ప్రజలను అన్ని రకాలుగా శిక్షణ నిచ్చి, సమర్థవంతులుగా తీర్చిదిద్దటం. వారు మరింత మెరుగైన ప్రతిఘటనా చర్యలు చేయగలిగేలా చేయాలి. ఇందుకోసం మిలటరీ శిక్షణ పెంచాలి. వారు ఎదురుదాడిని సరైన రీతిలో ప్రజాయుద్ధంగా మార్చగలిగేలా చేయాలి. మనం తప్పకుండా రాజకీయ, నిర్మాణ, సైనిక సన్నాహాలు చేసుకునే పనిని ఒక క్యాంపెయిన్‌లా నిర్వహించాలి. సైనిక ఎదురుదాడి చర్యలు, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే ప్రచార క్యాంపెయిన్లు నిర్వహించడం, తీవ్రమైన ప్రజా సమస్యలను చేపట్టి ప్రజా ఉద్యమాలను నిర్మించడం మొదలైన వాటి కోసం మనం తీవ్రంగా కృషి చేయాలి. దీంతో పాటు యావత్తు ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులతో సహా బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా యావత్తు మిత్ర శక్తులతో కలిసి ఉద్యమాన్ని నిర్మించడం కోసం కృషి చేయాలి. అఖిల భారత స్థాయిలో వీలైనంత త్వరగా ఒక ఐక్యసంఘటన లేదా విశాల వేదికను నిర్మించి దేశ ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

కామ్రేడ్స్!

తీవ్రమైన సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోవడం ద్వారానే మనం భారత విప్లవాన్ని మునుముందు పురోగమింపజేయగలుగుతాం. అందువల్ల మనం అన్ని రకాల సవాళ్లను ఎదుర్కోవడం కోసం అన్ని రకాల సన్నాహాలు పూర్తి చేసుకోవాలి. అంటే, పైన పేర్కొన్న అన్ని రకాల కర్తవ్యాలను పూర్తిగా అమలు చేయడం మన తక్షణ, ముఖ్యమైన కర్తవ్యం.

ఆ విధంగా చేయడం ద్వారా మనం విప్లవంలో మూడు అద్భుత ఆయుధాలను అంటే పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటనల నిర్మాణాలను పటిష్టం చేసుకుంటూ, వాటిని నిరంతరం బలోపేతం చేయగలుగుతాం. పార్టీని సరైన అర్థంలో బోల్షివీకరణ చేయకుండా మనం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేమని మనం గుర్తుంచుకోవాలి. రండి, అన్ని రకాల బలహీనతలు, లోపాలను మాటల్లో కాకుండా చేతల్లో అధిగమించేందుకు దృఢసంకల్పంతో పూనుకుందాం, పార్టీ అంతర్గత ఐక్యతను కంటికి రెప్పలా రక్షించుకుంటూ దాన్ని మరింత బలోపేతం చేద్దాం, 'అతివాద', మితవాద రివిజనిజాలతో సహా అన్ని రకాల రివిజనిజాలను ఓడిస్తూ సరైన పార్టీ పంథాను, విధానాలను, పనిశైలిని దృఢంగా అమలు చేద్దాం.

నిస్సందేహంగా మార్గం మెలికలు-మలుపులతో, కఠినంగా, జటిలంగా ఉంది, కానీ ఎంఎల్ఎంను, పార్టీ పంథాను అంటిపెట్టుకొని ఉంటే మనం సకల అడ్డంకుల్ని అధిగమిస్తాం. 'గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా మారుస్తూ', 'పిఎల్‌జిఏను పిఎల్ఏగా వికసింపజేస్తూ', బేస్ ఏరియాలను నిర్మించే తక్షణ, ప్రధాన కర్తవ్యాన్ని పరిపూర్తి చేస్తూ భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి జేయగలం.

రండి, మన గొప్ప అమరుల అసంపూర్ణ కర్తవ్యాలను, కన్న కలల్ని పరిపూర్తి చేయడం కోసం సాహసంగా వర్గ యుద్ధ మైదానంలోకి దూకుదాం.

చరిత్ర సాక్షిగా అంతిమ విజయం ప్రజలదే. నిశీధి రాత్రిని పటాపంచలు చేస్తూ వేకువ కిరణాలు విచ్చుకుంటాయి. భారత విప్లవం విజయవంతమై తీరుతుంది, అంటే మొదట నూతన ప్రజాస్వామిక విప్లవం, దీని తర్వాత వెంటనే సోషలిస్టు విప్లవం కూడా విజయవంతమై తీరుతుంది.

రష్యన్ విప్లవ శతాబ్ది వేడుకల లక్ష్యాన్ని సరైన అర్థంలో, కేవలం భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో వేగాన్ని తీసుకొని వచ్చి, దాన్ని విజయవంతం చేయడం ద్వారానే, దాని తర్వాత అడుగుగా సోషలిస్టు సమాజ స్థాపన వైపు పురోగమించడం ద్వారానే సరైన విధంగా నిర్వహించుకోగలుగుతాం. ఇదే పార్టీ పిలుపు.

# బోల్షివిక్ విప్లవం - సమకాలీన చరిత్రలో దాని ప్రాధాన్యత

**– బిఆర్**

రష్యాలో 1917 అక్టోబరు 25న బోల్షివిక్ విప్లవం జరిగింది. ఈ అక్టోబరు విప్లవ శత వార్షికోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా మార్క్సిస్టు- లెనినిస్టు- మావోయిస్టులు, కార్మికవర్గం, విప్లవ ప్రజలు సోషలిజాన్ని స్థాపించే లక్ష్యంతో ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదాన్ని ధ్వంసం చేయాలనే అక్టోబరు విప్లవ స్ఫూర్తిని ఎత్తిపడుతూ జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా సోషలిజం, కమ్యూనిజం సాధించే లక్ష్యం కోసం మార్క్సిస్టు మహోపాధ్యాయులైన మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విప్లవ కార్మిక కర్షక ప్రజలు కోట్లాది మంది అసువులు బాసారు. ఆ అమరులందరికీ వినమ్రంగా తలవంచి విప్లవజోహార్లు అర్పిద్దాం. వారి ఆశయ సాధన కోసం చివరికంటా పోరాటాన్ని కొనసాగిద్దాం.

ఈ సందర్భంగా ఆధునిక రివిజనిస్టులు [సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎం-ఎల్)లిబరేషన్], అవకాశవాద సంస్కరణవాదులు, కాట్స్కీవాదులు, మెన్షివిక్‌లు, ట్రాట్స్కీవాదులు, అభివృద్ధి నిరోధకులు విప్లవాలకు, మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు సిద్ధాంతానికి కాలం చెల్లిపోయాయని ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు. వీటన్నింటినీ ఈ రోజు ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విప్లవం ఒక నిరంతరాయమైన, తీవ్రమైన పోరాటం. ఈ పోరాటం ద్వారానే "మార్క్సిజం-లెనినిజం-మావోయిజం" అభివృద్ధి చెందింది, యింకా అభివృద్ధి చెందుతుంది. "మార్క్సిజం-లెనినిజం-మావోయిజం" అందించే శాస్త్రీయమైన మౌలిక సూత్రాలు మానవ సమాజంలో ప్రతి కొత్త మార్పుకీ మార్గదర్శకంగా వుంటూనే వుంటాయి. ఎంఎల్ఎం సూత్రాలను, జ్ఞానాన్ని ఆధారం చేసుకుని నూతన సామాజిక ప్రయోగాలతో ఎప్పటికప్పుడు కొత్త విషయాలు గ్రహిస్తూ, సిద్ధాంత జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఆయా సమయాలకు కావలసిన కొత్త విషయాల్ని రూపొందించుకుంటూ ఉండాలి. గత సిద్ధాంతాల, సూత్రాల ఆధారం లేకపోతే నూతన ప్రయోగాలకు పునాదీ వుండదు. నూతన ప్రయోగాలు లేకపోతే సిద్ధాంతానికి అభివృద్ధీ వుండదు. ఈ రకంగానే పారిస్ కమ్యూన్, రష్యాలో అక్టోబరు విప్లవం, చైనాలో మొదట నూతన ప్రజాస్వామిక విప్లవం, సోషలిస్టు విప్లవం, యింకా అనేక విప్లవాలు ఉద్భవించాయి.

## 1917 అక్టోబరు విప్లవ స్ఫూర్తిని ఎత్తిపడదాం! సోషలిజాన్ని స్థాపించే లక్ష్యంతో ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదాన్ని ధ్వంసం చేద్దాం!

కామ్రేడ్స్ లెనిన్, స్టాలిన్‌ల రచనల్లో అక్టోబర్ విప్లవ ప్రాధాన్యత గురించి సంక్షిప్తంగా ఈ విధంగా చెప్పారు : రష్యాలో కార్మికవర్గ పార్టీ ఎలా అక్టోబరు విప్లవానికి నాయకత్వం

వహించిందంటే పైపై మెరుగులకు మార్క్సిజాన్ని ఆమోదించడం కాక, దాన్ని వాస్తవికంగా అమలు చేయడానికి, ఆచరణకు అన్వయించడానికి ప్రధాన ప్రాధాన్యతనిచ్చింది. మార్క్సిజాన్ని వాస్తవికంగా అమలు చేయడానికి మార్గాలను, పద్ధతులను నిర్ధారించుకోవడంపై, పరిస్థితి మారే కొలదీ ఈ మార్గాలను, పద్ధతులను మార్చుకోవడంపై ముఖ్యంగా తన దృష్టిని కేంద్రీకరించింది. అది తన నిర్దేశాలను, సూచనలను చారిత్రక పోలికల నుంచి, సమానతల నుంచి కాక, తన చుట్టూ ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి చేసిన అధ్యయనం నుంచి రూపొందించింది. తన కార్యకలాపాలు ఉల్లేఖనలు (కొటేషన్లు), సామెతలపై కాక, ఆచరణాత్మక అనుభవంపై, ప్రతి అడుగును ఆచరణలో పరీక్షించుకోవడంపై, తన తప్పుల నుంచి నేర్చుకోవడంపై, నూతన జీవితాన్ని నిర్మించుకోవడంపై ఇతరులకు బోధించడంపై ఆధారపడి ఉండేవి. తన కార్యకలాపాల్లో మాటలకూ, చేతలకూ మధ్య అంతరం లేకపోవడానికి, మార్క్స్ బోధనలను పూర్తిగా తన సజీవ విప్లవ శక్తిగా ఇముడ్చుకోవడానికి కారణం యిదే. మహోపాధ్యాయులు మార్క్స్ చెప్పినట్లు "మార్క్సిస్టులు ప్రపంచ సారం గురించి వివరించడంతో సరిపుచ్చుకోరు, మరింత ముందుకుపోయి దాన్ని మార్చుతారు". దీని పేరు బోల్షివిక్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ. ఈ పార్టీకి నాయకులు లెనిన్, స్టాలిన్.

రష్యాలో కార్మికవర్గ పార్టీ నిర్మాణం ఏ ప్రత్యేక పరిస్థితుల్లో చోటు చేసుకుందంటే – అవి యూరప్ (పాశ్చాత్య) దేశాల్లో కార్మికుల పార్టీని స్థాపించేటప్పుడు నెలకొని ఉన్న పరిస్థితులకు భిన్నమైనవి. యూరప్ దేశాల్లో – ఫ్రాన్స్, జర్మనీలలో – ట్రేడ్ యూనియన్లు, పార్టీలు చట్టబద్ధంగా ఉన్నప్పుడు, బూర్జువా విప్లవం విజయవంతమైన తర్వాత బూర్జువా పార్లమెంట్లు ఉనికిలో ఉన్నప్పుడు, బూర్జువాజీ అధికారాన్ని చేపట్టిన తర్వాత అది కార్మిక వర్గంతో తలపడుతున్న స్థితిలో కార్మికుల పార్టీ ఏర్పడింది. రష్యాలో దీనికి భిన్నంగా క్రూరమైన జారు నిరంకుశత్వం కొనసాగుతున్న స్థితిలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవం జరగబోతుందనే స్థితిలో కార్మికవర్గ పార్టీ నిర్మాణం జరిగింది. ఒక వైపు పార్టీ సంస్థలు బూర్జువా "లీగల్ మార్క్సిస్టులతో" కిటకిటలాడుతుండినాయి. వారు బూర్జువా విప్లవం కోసం కార్మికవర్గాన్ని ముందుకు తోస్తుండినారు. ఇంకోవైపు యాదృచ్ఛిక విప్లవోద్యమం పెంపొందుతుండడంతో నిరంకుశత్వాన్ని కూలదోయడంలో ఉద్యమాన్ని దక్షతతో నిర్దేశించే విప్లవకారుల దృఢమైన, బలమైన, తగినంత రహస్య పోరాట కోర్ అవసరం ముందుకు వచ్చిన సమయంలో, జారిస్టు మూకలు ఉత్తమ కార్మికుల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులను అపహరించుకొని పోతూ ఉండినాయి.

ఇటువంటి పరిస్థితుల్లో బోల్షివిక్‌ల కర్తవ్యం ఏమంటే నిజమైన మార్క్సిస్టులను, నకిలీ మార్క్సిస్టులను వేరుచేయడం, పోరాట ఆచరణలో నెల్లును, పొల్లును వేరుచేయడం, నిర్దిష్ట ప్రదేశాల్లో అనుభవం ఉన్న విప్లవ కేడర్లను సంఘటితం చేయడం, వారికి స్పష్టమైన కార్యక్రమం,

దృఢమైన ఎత్తుగడలను అందించడం, అంతిమంగా ఈ కేడర్లను వృత్తి విప్లవకారులతో కూడిన, తగినంత రహస్యంగా ఉండి పోలీసు మూకల దాడులను తట్టుకొనగలిగే, అదే సమయంలో తగినంతగా ప్రజారాశులతో సంబంధాన్ని కలిగి ఉండి అవసరమైన సమయంలో వారికి సమరంలో నాయకత్వం వహించగలిగే ఒకే ఒక సమరశీల సంస్థలో సంఘటితం చేయడం.

అయితే మార్క్సిస్టు దృక్పథానికి సాష్టాంగ నమస్కారం చేసిన మెన్షివిక్కులు సమస్యను చాలా సరళంగా తేల్చివేసారు. యూరప్ దేశాల్లో కార్మికవర్గ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చడం కోసం పోరాడే క్రమంలో నాన్-పార్టీ ట్రేడ్ యూనియన్ల నుంచి కార్మికుల పార్టీ ఆవిర్భవించిన విధంగానే, రష్యాలో కూడా ఆవిర్భవిస్తుందనీ, "పెట్టుబడిదారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు ఆర్థిక పోరాటం" చేస్తే సరిపోతుందనీ, అఖిల రష్యా సమరశీల సంస్థను నిర్మాణం చేయాల్సిన అవసరం లేదనీ, సమయానికి ట్రేడ్ యూనియన్లు జాగరూకం కాకపోతే నాన్-పార్టీ లేబర్ కాంగ్రెసును నిర్వహించి దాన్నే పార్టీగా నిర్మించవచ్చుననీ చెప్పారు. మెన్షివిక్కుల ఇటువంటి మార్క్సిస్టు వ్యతిరేక పథకం రష్యన్ పరిస్థితుల్లో సైతం ఊహాజనితమే. (ఆర్.సి.పి. ఆర్గనైజర్గా, నాయకుడిగా లెనిన్-జె. స్టాలిన్, ప్రావ్దా, నెం. 86, ఏప్రిల్ 23, 1920 లేదా స్టాలిన్ రచనలు-4-6 నుండి).

రష్యన్ కార్మికవర్గానికీ, బోల్షివిక్ పార్టీకి లెనిన్ అందించిన మహత్తర సేవ ఏమిటంటే, ఆయన ఆ సమయంలో మెన్షివిక్కుల నిర్మాణ "పథకం" నుంచి తలెత్తే ప్రమాదాన్ని ప్రారంభంలోనే బహిర్గతపరిచారు. నిర్మాణ విషయాల్లో మెన్షివిక్కుల సడలింపుపై ఆయన తీవ్రంగా దాడి ప్రారంభించారు. ఈ సమస్యపై పార్టీలో ఆచరణలో పని చేస్తున్న కార్యకర్తల (practical workers) మొత్తం దృష్టిని కేంద్రీకరింపజేశారు. పార్టీ ఉనికి ప్రమాదంలో పడింది. అది పార్టీకి జీవన్మరణ సమస్య.

ఇటువంటి పరిస్థితుల్లో పార్టీ శక్తులను సమీకరించే కేంద్రంగా అఖిల రష్యా రాజకీయ వార్తా పత్రిక తీసుకొని రావడం, వార్తా పత్రిక మాధ్యమం ద్వారా ఆయా ప్రదేశాల్లో దృఢమైన పార్టీ కేడర్లను పార్టీ రెగ్యులర్ యూనిట్లుగా, ఒకే సంస్థగా (entity) సంఘటితం చేయడం, అంటే వారిని స్పష్టంగా నిర్వచించిన హద్దుల్లో, స్పష్టమైన కార్యక్రమంతో, దృఢమైన ఎత్తుగడలతో, ఒకే లక్ష్యంతో అఖిల రష్యన్ సమరశీల పార్టీలో భాగం చేయడం - ఇదీ లెనిన్ తన ప్రముఖ గ్రంథాలు - " ఏంచేయాలి", "ఒక్క అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి"లలో అభివృద్ధి చేసిన పథకం. రష్యన్ వాస్తవిక పరిస్థితులకు పూర్తిగా అనుగుణ్యంగా ఉండడమే ఈ పథకం గొప్పతనం. ఆచరణలో పని చేస్తున్న మంచి కార్యకర్తల నిర్మాణ అనుభవాన్ని తీసుకొని దక్షతతో అందులో సాధారణీకరించారు. ఈ పథకం కోసం సాగిన పోరాటంలో మెజారిటీ రష్యన్ కార్యకర్తలు లెనిన్ను అనుసరించారు. ఎటువంటి చీలికకూ తావులేకుండా అభేద్యంగా నిలిచారు. ఈ పథకం

విజయం పరస్పర సహకారంతో కూడుకొని ఉన్న, కాకలు తీరిన, ప్రపంచంలో మరేదీ సాటిరాని కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు పునాదులు వేసింది.

బోల్షివిక్ పార్టీ తన నుండి కార్మికవర్గేతర, అవకాశవాద శక్తులను బహిష్కరించకపోతే, అది అంతర్గత బలహీనతల నుండి, నిస్పృహ నుండి బయటపడేది కాదు. తన స్ఫూర్తిని, బలాన్ని తిరిగి సంపాదించుకునేది కాదు. బూర్జువా పరిపాలనా కాలంలో కార్మికవర్గ పార్టీ తనలోనూ, కార్మిక వర్గం లోపలా ఉన్న అవకాశవాద, విప్లవ వ్యతిరేక, పార్టీ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా ఏ మేరకు పోరాడుతుందో ఆ మేరకు అది పెరిగి బలోపేతం అవుతుందని బోల్షివిక్ పార్టీ చరిత్ర రుజువు చేసింది. పార్టీ వ్యతిరేక, విప్లవ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాట పంథాలో పార్టీని లెనిన్ నడపడం వేయి రెట్లు సరైనది. అటువంటి నిర్మాణ పంథా ద్వారా మాత్రమే బోల్షివిక్ పార్టీ అంతర్గత ఐక్యతను, సరైన పొందికను సాధించగలిగింది. కెరెన్స్కీ పరిపాలన కాలంలో ఎదురైన జూలై సంక్షోభం నుంచి సులువుగా బయటపడగలిగింది. అక్టోబరు తిరుగుబాటులో ప్రధాన శక్తిగా నిలబడగలిగింది. ఏ విధంగానూ తడుముకోకుండా బ్రెస్ట్-లిటోవస్క్ సంధి కాలంలోని సంక్షోభం నుంచి బయటపడగలిగింది. ఎన్‌టెంటే పై విజయాన్ని సాధించగలిగింది. చివరకి ఏ సమయంలోనైనా తన శ్రేణులను పునర్నిర్మాణం చేయగలిగే అసమానమైన వెసులుబాటును సంపాదించుకుంది. బోల్షివిక్ పార్టీ ఎటువంటి గందరగోళానికి గురికాకుండా తన వందల వేల సభ్యులను ఎటువంటి పెద్ద కర్తవ్య సాధన కోసమైనా కేంద్రీకరించగలిగింది.

బోల్షివిక్ పార్టీ తాను చేసే కృషిలో, తన కార్యక్రమం(వ్యూహం)లో, ఎత్తుగడల్లో రాజకీయ సారం రష్యన్ వాస్తవిక పరిస్థితులకు అనుగుణ్యంగా లేకపోయినట్లయితే, దాని నినాదాలు కార్మిక-కర్షక ప్రజారాశులను మేల్కొల్పకపోతే, విప్లవోద్యమాన్ని పురోగమింపజేయకపోయి ఉంటే, అది వేగంగా పెరిగి బలోపేతం అయ్యేది కాదు. ఇప్పుడు ఈ కోణం గురించి చూద్దాం.

రష్యన్ బూర్జువా ప్రజాస్వామిక విప్లవం (1905) యూరప్ దేశాలలో - ఉదాహరణకు ఫ్రాన్స్, జర్మనీలలో - విప్లవ వెల్లువల కాలంలో నెలకొని ఉన్న వాటికి భిన్నమైన పరిస్థితుల్లో చోటు చేసుకుంది. యూరప్ దేశాలలో విప్లవాలు పెట్టుబడిదారీ విధానపు సరుకుల ఉత్పత్తి దశలో ఉన్నప్పుడు, వర్గ పోరాటం అభివృద్ధి కాని స్థితిలో, కార్మికవర్గం బలహీనంగా ఉన్నప్పుడు, అది సంఖ్య రీత్యా తక్కువగా ఉండి, తనకంటూ సొంత పార్టీ లేకుండా, తన సొంత డిమాండ్లు రూపొందించుకోలేని స్థితిలో, బూర్జువా వర్గం తగినంత విప్లవాత్మకంగా ఉండి అది కార్మిక-కర్షక ప్రజారాశుల విశ్వాసాన్ని పొందగలిగిన, రాజరికానికి వ్యతిరేకంగా పోరాటంలోకి వారికి నాయకత్వం వహించగలిగిన పరిస్థితుల్లో చోటు చేసుకున్నాయి. దీనికి భిన్నంగా రష్యాలో విప్లవం (1905) పెట్టుబడిదారీ విధానపు యంత్రీకరణ (machine industry) కాలంలో, వర్గ పోరాటం

అభివృద్ధి చెందిన కాలంలో, రష్యన్ కార్మికవర్గం సాపేక్షికంగా సంఖ్య రీత్యా పెరిగిన, పెట్టుబడిదారీ విధానం ద్వారా సంఘటితం చేయబడిన కాలంలో, అప్పటికే బూర్జువాజీతో అది అనేక సమరాలు సాగించిన స్థితిలో, తనకంటూ సొంత పార్టీ ఉన్న కాలంలో, బూర్జువా పార్టీ కంటే మరింత ఐక్యంగా ఉన్న కాలంలో, తన సొంత వర్గ డిమాండ్లు ఉండి, అదే సమయంలో రష్యన్ బూర్జువా వర్గం చాలా వరకూ ప్రభుత్వ కాంట్రాక్టులపై ఆధారపడుతున్న కాలంలో, కార్మికవర్గ విప్లవ స్ఫూర్తిని చూసి తగినంతగా భీతిల్లి కార్మిక-కర్షకులకు వ్యతిరేకంగా ప్రభుత్వంతో, భూస్వాములతో బూర్జువా వర్గం ఐక్యం అయిన స్థితిలో చోటు చేసుకుంది.

ఇటువంటి పరిస్థితుల్లో రష్యన్ విప్లవానికి కార్మికవర్గం తప్పనిసరిగా నాయకత్వం వహించాలని, రైతాంగాన్ని తన చుట్టూ సమీకరించుకోవాలని, దేశంలో పూర్తి ప్రజాస్వామ్యాన్ని స్థాపించే లక్ష్యంతో, తన సొంత వర్గ ప్రయోజనాలకు భరోసా ఇస్తూ, జారిజానికి, బూర్జువాజీకి వ్యతిరేకంగా ఒకే సమయంలో నిర్ణయాత్మక పోరాటాన్ని సాగించాలని బోల్షివిక్ పార్టీ నిర్ణయం చేసింది.

దీనికి భిన్నంగా మార్క్సిజానికి తిలోదకాలు యిచ్చి బూర్జువాజీ తోక పట్టుకున్న మెన్షివిక్కులు, విప్లవ సమస్యను తమదైన శైలిలో పరిష్కరించారు : రష్యా విప్లవం బూర్జువా విప్లవం కనుక, దానికి బూర్జువాలే నాయకత్వం వహించాలి (ఫ్రెంచి, జర్మనీ విప్లవాల "చరిత్ర" చూడండి), ఆ విప్లవానికి కార్మికవర్గం నాయకత్వం వహించలేదు. అది నాయకత్వాన్ని రష్యన్ బూర్జువాజీకి (విప్లవానికి ద్రోహం చేస్తున్న బూర్జువాజీకి) వదిలిపెట్టాలి. రైతాంగాన్ని కూడా బూర్జువాజీ పర్యవేక్షణ కింద వదిలి వేయాలి. కార్మికవర్గం అతివామపక్ష ప్రతిపక్షంగా ఉండిపోవాలి.

రష్యన్ విప్లవానికి లెనిన్ చేసిన అపార సేవ ఏమిటంటే ఆయన మెన్షివిక్కుల చారిత్రాత్మక పోలికల నిరర్ధకతను, బూర్జువాజీ దయాదాక్షిణ్యాలకు కార్మికుల లక్ష్యాన్ని వదిలిపెట్టే మెన్షివిక్ "విప్లవ పథకం" నుంచి పొంచి వున్న ప్రమాదాన్ని బహిర్గతం చేశారు. బూర్జువా నియంతృత్వం కాక, కార్మిక-కర్షక విప్లవ ప్రజాస్వామిక నియంతృత్వం; బులిగిన్ డ్యూమాలో పాల్గొనడం కాక డ్యూమా బహిష్కరణ (బులిగిన్ కమీషన్ 1905 ఫిబ్రవరిలో జారు జారీ చేసిన ఒక ఆదేశంతో అంతర్గత మంత్రి ఏ.జి. బులిగిన్ నేతృత్వంలో ఏర్పడింది. సలహాదారు శక్తులతో కూడిన ప్రభుత్వ డ్యూమాను ఏర్పాటు చేయడం కోసం ఒక ముసాయిదా బిల్లును, డ్యూమా ఎన్నికల నియయ-నిబంధనలను ఈ కమీషన్ తయారు చేసింది. 1905 ఆగస్టు 6 (19) జారు ప్రణాళికతో పాటు ఆ బిల్లును, నియమ-నిబంధనలను వెల్లడించారు. బోల్షివిక్కులు బులిగిన్ డ్యూమాను క్రియాశీలంగా బహిష్కరిస్తామని ప్రకటించారు. డ్యూమాను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ప్రయత్నం విఫలమైంది. విప్లవ వెల్లువలో అది కొట్టుకుపోయింది. బులిగిన్ డ్యూమా బహిష్కరణపై వి.ఐ. లెనిన్, ఏరిన రచనలు-2వ సంపుటిలో 404 పేజీలోని 76వ వివరణను చూడండి), సాయుధ తిరుగుబాటు; ఈ చట్రంలో నిర్మాణ కృషిని కొనసాగించడం; డ్యూమా ప్రారంభమైన తర్వాత

"వామపక్ష కూటమి" భావన; క్యాడెట్ మంత్రిత్వ పదవిని చేపట్టడమూ, అభివృద్ధి నిరోధక డ్యూమాను "ఆకాశానికి" ఎత్తడమూ కాక, డ్యూమా వెలుపల పోరాటానికి డ్యూమా వేదికను ఉపయోగించుకోవడం; కాడెట్ పార్టీతో "కూటమి"ని ఏర్పరచుకోవడం కాక, విప్లవ ప్రతీఘాతక శక్తిగా ఉన్న ఆ పార్టీకి వ్యతిరేకంగా పోరాడటం – ఇటువంటి ఎత్తుగడల పథకాన్ని లెనిన్ తన ప్రముఖ కరపత్రాలు – ప్రజాతంత్ర విప్లవంలో సోషల్–డెమోక్రసీకి చెందిన రెండు ఎత్తుగడలు, క్యాడెట్ల విజయం, కార్మికుల పార్టీ కర్తవ్యాలు – లలో అభివృద్ధి చేశారు.

ఈ పథకంలోని ప్రతిభ ఏమిటంటే, అది రష్యాలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవంలో కార్మికవర్గ వర్గ డిమాండ్లకు పదును పెట్టి దృఢతరం చేసింది. సోషలిస్టు విప్లవానికి మార్గాన్ని సుగమం చేసింది. అది మొలక రూపంలో కార్మికవర్గ నియంతృత్వ భావనను కలిగి ఉండింది. మెజారిటీ రష్యన్ కార్యకర్తలు దృఢంగా, స్థిరంగా, ఎటువంటి మార్పు లేకుండా ఈ ఎత్తుగడల పథకాన్ని అమలు చేసే పోరాటంలో లెనిన్‌ను అనుసరించారు. బోల్షివిక్ పార్టీ ఆ విప్లవ ఎత్తుగడలకు పునాది వేసిన కారణంగానే ఈ పథకం విజయవంతమై ప్రస్తుతం అది ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద పునాదులను కుదిపి వేస్తున్నది.

ఆ తర్వాత జరిగిన పరిణామాలు; నాలుగు సంవత్సరాల సామ్రాజ్యవాద యుద్ధం, మొత్తం దేశ (రష్యా) ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేయడం; ఫిబ్రవరి విప్లవం, ద్వంద్వాధికారం ఏర్పడడం; బూర్జువా విప్లవ ప్రతీఘాత కార్యకలాపాలకు కేంద్రంగా మారిన తాత్కాలిక ప్రభుత్వం; కార్మికవర్గ నియంతృత్వం ఆరంభ రూపంగా పెట్రోగ్రాడ్ సోవియట్ డిప్యూటీలు; అక్టోబరు విప్లవం, రాజ్యాంగ సభ కనుమరుగు కావడం; బూర్జువా పార్లమెంటరీ విధానాన్ని రద్దు చేయడం, సోవియట్ల రిపబ్లిక్కు ప్రకటన; సామ్రాజ్యవాద యుద్ధం అంతర్యుద్ధంగా పరివర్తన చెందటం; కార్మికవర్గ విప్లవానికి వ్యతిరేకంగా ప్రపంచ సామ్రాజ్యవాదం, మార్క్సిస్టు విద్రోహులతో కలిసి దాడి చేయడం; రాజ్యాంగ సభకు వేలాడబడి ఉండిన మెన్షివిక్కుల దయనీయమైన స్థితి – ఇవన్నీ తన "రెండు ఎత్తుగడలలో" లెనిన్ రూపొందించిన విప్లవ ఎత్తుగడల సూత్రాలు సరైనవి అని ధృవీకరస్తున్నాయి. అటువంటి వారసత్వం కలిగిన బోల్షివిక్ పార్టీ నీటిలో మునిగి ఉన్న బండరాళ్ళంటే భయం లేకుండా తప్పించుకుంటూ ధైర్యంగా ఈదుతూ ముందుకు పురోగమించింది. అక్టోబరు విప్లవం కార్మికవర్గ విప్లవ విజయం కోసం ఒక స్పష్టమైన లక్ష్యం (ఒక కార్యక్రమం), ఒక దృఢమైన పంథా (ఎత్తుగడలు)తో పాటు సరైన నాయకత్వ పాత్రను పెంపొందించింది. అలాగే బూర్జువాజీకి, సామ్రాజ్యవాదులకు వకాల్తా పుచ్చుకున్న రెండవ ఇంటర్నేషనల్, మెన్షివిక్ రివిజనిస్టు నాయకత్వ పాత్రను ఓడించి, తిరస్కరించింది. కార్మికవర్గ విప్లవంలో, కార్మికవర్గ పార్టీలో నాయకత్వ పాత్రను నిలబెట్టుకోవాలంటే సిద్ధాంత పటుత్వంతో పాటు దానిని కార్మికోద్యమ నిర్మాణంలో ఆచరణాయుతమైన అనుభవంతో తప్పనిసరిగా మేళవించాలి. ఇలా చేయడంతో పాటు ఆచరణలో

కాకలుతీరిన, తిరుగుబాటు సమయాల్లో దృఢంగా ఆత్మబలిదానం చేసే, ధీరోదాత్తమైన కార్మికవర్గ లక్షణాలు పరీక్షించబడినాయి.

అందుకే 1917లో రష్యాలో జరిగిన అక్టోబరు విప్లవం, విప్లవాలకు తలమానికమైంది. అంతక్రితం చరిత్రలో జరిగిన విప్లవాలన్నింటికన్నా రాశిలోనూ, వాసిలోనూ గుణాత్మకంగా ఉన్నతంగా నిలిచింది. రష్యన్ విప్లవానికే కాక, ప్రపంచ విప్లవాలన్నింటినీ నిర్దిష్టమైన, సరైన మార్గదర్శకత్వాన్ని రూపొందించింది బోల్షివిజం. అందుకే లెనిన్ యిలా చెప్పారు : “బోల్షివిజం, ప్రపంచ బోల్షివిజం కావడమే కాక, అది ఒక భావాన్నీ, ఒక సిద్ధాంతాన్నీ, ఒక కార్యక్రమాన్నీ, ఎత్తుగడల్నీ సోషల్ జాతీయ దురహంకారానికీ, సోషల్ శాంతివాదానికీ భిన్నమైన వాటిని సృష్టించింది.” “బోల్షివిజం మూడవ ఇంటర్నేషనల్ అయి, నిజమైన కార్మికవర్గ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌గా సిద్ధాంత పునాదుల్నీ, ఎత్తుగడల పునాదుల్నీ సృష్టించింది”. (కార్మికవర్గ విప్లవం–విప్లవ ద్రోహి కాట్స్కీ, పేజీ 68.) “సామ్రాజ్యవాదపు యుద్ధ బీభత్సాల నుండి సరైన విముక్తి మార్గాన్ని బోల్షివిజం సూచించింది”. (పై పుస్తకమే, పేజీ 69.)

“బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికీ, సోషలిస్టు విప్లవానికీ మధ్య వ్యత్యాసాన్ని ఖచ్చితంగా గుర్తించిందీ, మొదటి విప్లవాన్ని కడకంటా తీసుకెళ్ళి, రెండో విప్లవానికి ద్వారాలు తెరిచిందీ బోల్షివిక్కులే. ఇది మాత్రమే విప్లవాత్మక మార్క్సిజం”. (పై పుస్తకమే, పేజీ 85.)

మార్క్స్, ఏంగెల్స్ మరణానంతరం, లెనిన్ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి మహా నాయకుడిగా, ప్రపంచ కార్మికవర్గం–పీడిత ప్రజల మహోపాధ్యాయునిగా ఉండినారు. 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభంలో లెనిన్ తన విప్లవ కార్యకలాపాలను ఆరంభించిన సమయంలో ప్రపంచం సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవ యుగంలోకి ప్రవేశిస్తూ ఉండింది. సామ్రాజ్యవాదానికీ, అన్ని రకాల అవకాశవాదాలకూ, ప్రత్యేకించి 2వ ఇంటర్నేషనల్ రివిజనిజానికి వ్యతిరేకంగా లెనిన్ పోరాటాలు నిర్వహించి మార్క్సిజం వారసత్వాన్ని నిలబెట్టి, దాన్ని పరిరక్షించి, అభివృద్ధిపరిచారు, దాన్ని నూతన, ఉన్నత దశ అయిన లెనినిజానికి అభివృద్ధి పరిచారు. దాన్ని గురించి స్టాలిన్ “లెనినిజం సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవ యుగపు మార్క్సిజంగా” పేర్కొన్నారు. (లెనినిజం పునాదులు). లెనిన్ సామ్రాజ్యవాదంలోని వైరుధ్యాలను విశ్లేషించి, దాన్ని నడిపించే సూత్రాన్ని బహిర్గతం చేశారు. సామ్రాజ్యవాద యుగంలో కార్మికవర్గ విప్లవానికి సంబంధించిన అనేక ముఖ్యమైన సమస్యల్ని పరిష్కరించారు. “ఒకటి లేదా అంత కంటే ఎక్కువ దేశాల్లో విజయం సాధించడం” ద్వారా సోషలిజం సమస్యను పరిష్కరించారు. మానవ చరిత్రలో ఒక నూతన యుగాన్ని ప్రారంభించారు. కార్మికవర్గ విప్లవ లక్ష్యం కోసం లెనిన్ చేసిన సైద్ధాంతిక, ఆచరణాత్మక చేర్పులు ఎంతో మహత్తరమైనవి.

లెనిన్ మరణానంతరం, స్టాలిన్ దేశ, విదేశాల్లోని వర్గ శత్రువులకు, పార్టీలో మితవాద,

అతివాద అవకాశవాదులకు వ్యతిరేకంగా సాగించిన పోరాటాలలో లెనినిజం వారసత్వాన్ని ఎత్తిపట్టి, దాన్ని పరిరక్షించారు. ఆయన సోషలిస్టు మార్గంలో సోవియట్ ప్రజలను ముందుకు నడిపిస్తూ గొప్ప విజయాలు సాధించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సోవియట్ ప్రజలు స్టాలిన్ ఆధ్వర్యంలో ఫాసిస్టు దురాక్రమణను ఓడించడంలో ప్రధాన శక్తి అయ్యారు. మానవ చరిత్రలో చిరకాలం నిలిచే అద్భుతమైన కృషి చేశారు.

మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాన్ని అన్వయిస్తూ మావో సేటుంగ్ చైనా విప్లవ ప్రధాన సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించారు. బాగా సుదీర్ఘమైన, తీవ్రమైన, కష్టభరితమైన, సంక్లిష్టమైన విప్లవ పోరాటాల్లో, విప్లవ యుద్ధాలలో ప్రజలకు నాయకత్వం వహించారు. ప్రపంచ కార్మికవర్గ విప్లవ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తూర్పు ఆసియా ప్రాంతంలోని విశాల దేశమైన చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవంలో విజయం సాధించారు. మార్క్సిజం-లెనినిజం విశ్వజనీన సత్యానికీ, చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణకూ మధ్య ఐక్యతపై ఆధారపడి మావో చైనా చరిత్ర, దాని వాస్తవిక పరిస్థితులను సమకాలీన చైనా సమాజ మౌలిక వైరుధ్యాలను విశ్లేషించారు. చైనా విప్లవ దాడి లక్ష్యాలు, దాని కర్తవ్యాలు, దాని చోదక శక్తులు, దాని స్వరూపం, దాని భవిష్యత్తు, భవిష్యత్తులో దాని పరిణామం మొదలైన సమస్యలకు సరైన జవాబు చెప్పారు. చైనా విప్లవం 1917 అక్టోబరు విప్లవానికి కొనసాగింపు రూపమని, అది ప్రపంచ కార్మికవర్గ సోషలిస్టు విప్లవంలో భాగమని మావో చెప్పారు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధాన (ఇప్పుడు మావోయిజం) కాలంలో సోషలిజాన్ని సంఘటితం చేయడం, ఆధునిక రివిజనిజంతో పోరాడడం, పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించడం కోసం మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని నడిపిన మావో కృషి ఉన్నతమైంది. యిలా ఆయన సోషలిజం నుండి కార్మికవర్గ నియంతృత్వంలో అనేక సాంస్కృతిక విప్లవాల (వర్గ పోరాటాల) ద్వారా కమ్యూనిజంకు చేరుకునే బాటను సుగమం చేసారు.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ పరిస్థితుల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ యుద్ధంలో అతి పెద్ద సామ్రాజ్యవాద శక్తుల (అమెరికా మినహా) ఆర్థిక వ్యవస్థలు పెద్దెత్తున ధ్వంసం అయ్యాయి. అమెరికా సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి అవి 1950 మధ్య నాటికి కోలుకున్నాయి. 1955-1970ల మధ్య ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో పాక్షిక స్థిరత్వం ఏర్పడింది. అమెరికా సామ్రాజ్యవాదం అగ్రరాజ్యంగా మారింది. సోషలిస్టు శిబిరం ఉనికిలోకి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దశాబ్దకాలం పాటు కొనసాగిన విప్లవ సంక్షోభం నేపథ్యంలో వలసల్లో, అర్థ వలసల్లో అపూర్వమైన ప్రజా వెల్లువ రావడంతో సామ్రాజ్యవాదం ఉక్కిరిబిక్కిరి అయి తోకముడవాల్సి వచ్చింది. అది ప్రత్యక్ష వలస పాలన, బందిపోటు దోపిడీల స్థానంలో పీడిత దేశాల సంపదను కొల్లగొట్టడానికి పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీ అనే నయావలస విధానాల్ని చేపట్టింది. ఈ పీడిత దేశాల దళారీ పాలకవర్గాలైన

తన తైనాతీల ద్వారా సామ్రాజ్యవాదం విశాల పీడిత ప్రజానీకం మూపుల పైకి తన సంక్షోభ భారాన్ని మోపి మొత్తానికి మొత్తంగా దేశాల్ని దోచుకోవడాన్ని అధికం చేసింది.

కానీ, చరిత్రకు తనకంటూ ఎగుడు-దిగుళ్ళు, ఓటమి-విజయాలు, మెలికలు-మలుపులు, తిరోగమనాలు-పురోగమనాలు, వెనుకపట్టులు-ముందడుగులు ఉన్నాయి. దీంట్లో భాగంగానే మార్క్సిస్టు మహోపాధ్యాయులు ఏంగెల్స్ మరణానంతరం మార్క్సిజానికి తిలోదకాలు యిచ్చిన రెనగేడ్లు బెర్న్‌స్టీన్-కాట్స్కీల రివిజనిజం ఆవిర్భవించింది, స్టాలిన్ మరణానంతరం మార్క్సిజం-లెనినిజానికి తిలోదకాలు యిచ్చిన రెనగేడ్లు కృశ్చేవ్-బ్రెజ్నేవ్ రివిజనిస్టులుగా మారి, సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరణ చేస్తూ, వీళ్ళు లెనిన్ పేరును అడ్డం పెట్టుకొని 'సోషలిజం పేరు కలిగిన' సామ్రాజ్యవాదం, సోషల్-ఫాసిజాన్ని, సోషల్-సైనిక వాదాన్ని ముందుకు తీసుకొచ్చారు. అది ఒక అగ్రరాజ్యంగా మారి, పూర్తిగా ఆధిపత్యవాదంతో నయావలసవాద తరహా దోపిడీ కొనసాగించింది. మావో మరణానంతరం మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానానికి తిలోదకాలు యిచ్చిన రెనగేడ్లు హువా-డెంగ్‌లు రివిజనిస్టులుగా మారి చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ చేశారు. యిప్పుడది జిన్ పింగ్ ఆలోచనా విధానం జపం చేస్తూ ఒక నూతన సోషల్-సామ్రాజ్యవాద దేశంగా మారింది. అది ప్రపంచ కార్మిక-కర్షక తదితర పీడిత ప్రజలకు, జాతులకు శత్రువయ్యింది.

పెట్టుబడిదారీ విధానంలో సార్వత్రిక సంక్షోభం 1973 నుండి తీవ్రతరం అయిన నేపథ్యంలో ప్రపంచ రాజకీయాల్లో గొప్ప మార్పులు జరిగాయి. ఇందులో భాగంగా చివరి సోషలిస్టు స్థావరమైన చైనా దిగజారిపోవడంతో సోషలిస్టు స్థావర ప్రాంతం కోల్పోవడం జరిగింది. అగ్రరాజ్యంగా సోవియట్ యూనియన్ కుప్పకూలి రాజకీయ పతనమైంది. అమెరికన్ అగ్రరాజ్యం బలహీనపడుతూ వచ్చింది. రష్యన్ సామ్రాజ్యవాదం ఆర్థికంగా, రాజకీయంగా కొంత కోలుకుంది. చైనా ఒక నూతన సోషల్-సామ్రాజ్యవాదంగా రంగం మీదకు వచ్చింది. సామ్రాజ్యవాద దేశాల్లో, పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక రంగంలో రక్షణ విధానం (ప్రొటెక్షనిజం), రాజకీయ రంగంలో రేసిజం (జాత్యహంకారం), ఫాసిజం పెరుగుతున్నాయి. వెనుకబడిన దేశాల వనరులను, మార్కెట్లను కొల్లగొట్టడం కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ పెరుగుతున్నది. ప్రపంచ పునర్విభజన కోసం అమెరికా-చైనా, రష్యాల మధ్య పోటీ పెరుగుతున్నది. యూరప్‌లో ఆధిపత్యం కోసం జర్మనీ, ఫ్రాన్స్ మధ్య పోటీ పెరుగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఫాసిజం పెరుగుతున్నది. ప్రపంచ మార్కెట్‌పై, వనరులపై తమదైన ప్రత్యేక అజమాయిషీ కోసం అమెరికా నేతృత్వంలో సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలు, పరోక్ష యుద్ధాలు కొనసాగుతున్నాయి. పర్యవసానంగా ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న విప్లవ పోరాటాలకు అనుకూల పరిస్థితులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని, ప్రజలు విప్లవాన్ని కోరుకుంటున్న తరుణంలో విప్లవాల నుంచి పక్కదారి పట్టించడానికి

సామ్రాజ్యవాదులు వారి తైనాతీలు, తమ ప్రయోజనాల కోసం పాటుపడే కొంతమంది మేధావులు "సంక్షేమ రాజ్యం", "సంపదలతో తులతూగే సమాజం లేదా ఐశ్వర్యవంతమైన సమాజం", "ప్రజల పెట్టుబడిదారీ విధానం", "ప్రత్యేక సంక్షేమం" వంటి పలు రకాల పేర్లతో ముందుకు తెచ్చిన మోసపు సంస్కరణవాద పంథాలన్నీ ప్రజా పోరాటాల ద్వారా బహిర్గతమైనాయి, విఫలమైనాయి.

ఈ రకంగా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఇప్పటి వరకూ అనేక మార్పులు జరిగినప్పటికీ సామ్రాజ్యవాదం బలహీనపడినప్పటికీ సామ్రాజ్యవాద దశ నాశనం కాలేదు. అలాగే కాట్స్కీ చెప్పినట్లు 'అధి సామ్రాజ్యవాదం'గా లేక 'అతీత సామ్రాజ్యవాదం'గా, యుద్ధాలు లేని సామ్రాజ్యవాదంగా మారలేదు. యిలా కాట్స్కీయిస్టులు, ఆధునిక రివిజనిస్టులు, సంస్కరణవాదులు, కొద్దిమంది బూర్జువా, పెటీ బూర్జువా మేధావులు భ్రమపడడమనేది వర్తమాన ప్రపంచంలో ఒక ధోరణిగా కొనసాగుతున్నది. ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం పూర్తిగా భూమండలం నుండి ధ్వంసం చేయబడే వరకూ సామ్రాజ్యవాదం నాశనం కాదు. సామ్రాజ్యవాదం ఉన్నంత వరకూ దాని స్వభావం ఎన్నటికీ మారదు. ఈ సందర్భంగా మావో చెప్పిన ఈ కింది సూత్రీకరణను గుర్తు చేసుకోవడం సముచితంగా వుంటుంది, "మనమింకా సామ్రాజ్యవాద దశలోనే, కార్మికవర్గ విప్లవ దశలోనే వున్నాము. మార్క్సిజం యొక్క మౌలిక సూత్రాలపై ఆధారపడి సామ్రాజ్యవాదాన్ని గురించి లెనిన్ చెప్పిన శాస్త్రీయమైన విశ్లేషణ పూర్తిగా సరైనది. లెనినిజం యొక్క మౌలిక సూత్రానికి కాలం చెల్లలేదు" (రాజకీయ అర్థశాస్త్ర మూలసూత్రాలు, 170వ పేజీ, 2వ పేరా). మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్, మావోలు బోధించిన ఈ సూత్రం నేటికీ మన సిద్ధాంతానికీ, కార్యాచరణకూ ప్రాతిపదికగానే ఉంటుంది.

## నేడు భారతదేశంలో లెనినిజానికి తిలోదకాలు ఇచ్చే తప్పుడు రివిజనిస్టు సిద్ధాంతాన్ని ఓడిద్దాం :

భారతదేశంలో పాత, కొత్త రివిజనిస్టులు మార్క్సిజం-లెనినిజం పేరుతో ముందుకు తెస్తున్న సిద్ధాంతం ఈ కింది విషయాలను ముందుకు తెస్తున్నది : 1) అది సామ్రాజ్యవాద యుద్ధాన్ని విప్లవం ఆసన్నమవడానికి తప్పనిసరిగా షరతుగా చేస్తుంది. అదే లెనినిస్టు సిద్ధాంతానికి పునాది అంటుంది. 2) సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధాలు లేని, విప్లవ ఆసన్నం కాని నేటి స్థితిలో, లెనినిజానికి కాలం చెల్లిందని అంటుంది. 3) ప్రస్తుత పరిస్థితిలో భారత వామపక్షం, మావోయిస్టులతో సహా, అవకాశవాద, విప్లవేతర, కూటముల ప్రాతిపదికతో సంస్కరణవాద పంథా చేపట్టాలని అంటుంది.

ఈ సంస్కరణవాద పంథా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో కాట్స్కీ ముందుకు తెచ్చిన ద్రోహపూరిత 'అధి-సామ్రాజ్యవాద' సిద్ధాంతం వంటిది తప్ప మరొకటి కాదు. ఇది యావత్తు

ప్రపంచాన్ని ద్రవ్య పెట్టుబడి శాసిస్తూండడంతో యుద్ధాలు లేని ప్రపంచం ఏర్పడిందనీ, కనుక విప్లవ ఆవశ్యకతే లేదనీ వాదిస్తూ విప్లవాన్ని అనంతకాలానికి వాయిదా వేయాలనుకుంటున్నది. ఈ రివిజనిస్టు పంథా సంస్కరణవాద ఆలోచనలకు, అవకాశవాద ఆచరణకు నమూనాగా ఉంటుంది. భారత రివిజనిస్టు మేధావి ప్రభాత్ పట్నాయక్ 2016లో 'ఏ థీరీ ఆఫ్ ఇంపీరియలిజం' పేరుతో రాసిన వ్యాసంలో ఈ సిద్ధాంతాన్నే భుజాన వేసుకున్నాడు. కనుక, ఈ సిద్ధాంతం ద్వారా ప్రవేశపెట్టబడుతున్న వివిధ వైఖరులను, దాని నుండి ఇవ్వబడుతున్న సూచనలను కార్మికవర్గ విప్లవ దృక్పథంతో విశ్లేషించి బహిర్గతపరచడం ముఖ్యం. ఇందుకోసం ఈ సిద్ధాంతం ముందుకు తెస్తున్న వాదనలను లోతుగా పరిశీలించి, విశ్లేషిద్దాం. మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు అవగాహనతో దాని డొల్లతనాన్ని ఎండగడదాం.

**1) సామ్రాజ్యవాద యుద్ధం విప్లవం ఆసన్నమవడానికి తప్పనిసరి షరతు అని చెప్పడం ద్వారా అది కార్మికవర్గ ఉద్యమంలోకి దశల వారీ సిద్ధాంతాన్ని దొంగచాటుగా ప్రవేశపెడుతుంది:** లెనినిస్టు సిద్ధాంతానికి విప్లవం ఆసన్నమైంది అనేదే పునాది అని చెప్పడం ద్వారా ఈ సిద్ధాంతం తన సాంప్రదాయక, క్షుద్ర మార్క్సిస్టు, సంస్కరణవాద దృక్పథాన్ని బయటపెట్టుకుంటుంది. లెనినిస్టు సిద్ధాంత మౌలిక వాదన ప్రకారం విప్లవం ఆసన్నం కావాలి, కానీ భారతదేశంలో విప్లవ వెల్లువ ఏదీ కనపడడం లేదు, అందువల్ల విప్లవం ఆసన్నమయ్యేంత వరకూ కార్మికవర్గ పార్టీ విప్లవకర పద్ధతిలో కార్యకలాపాలు సాగించరాదు అంటూ అది కార్మికవర్గ ఉద్యమంలోకి దశల సిద్ధాంతాన్ని దొంగచాటుగా తీసుకొస్తుంది. అది ఈ విధంగా కోరుతుంది : "విప్లవం ఆసన్నమయ్యేంత వరకూ, విప్లవకారులు తమ విప్లవ పంథాను వదిలిపెట్టి, ఆచరణాయుతమైన పార్లమెంటరీ రాజకీయాలను ఆధిపత్యంలో పెట్టాలి. బూర్జువా, పెటీబూర్జువా పార్టీలతో 'పోరాటాలలో, వేదికలపైన, ప్రభుత్వంలో సైతం' ఐక్యం కావాలి. విప్లవం ఆసన్నమవుతుందని వేచిచూడడం నిజమైన విప్లవ ఆచరణకు పునాదిగా ఉంటుంది. విప్లవం ఆసన్నం కాగానే ఉద్యమం విప్లవకర 'పద్ధతి' (మోడ్)లోకి మారాలి. అంటే, విప్లవ ఆసన్నానికి ముందటి దశలో అవకాశవాద రాజీలు, సంక్షేమ కార్యక్రమాల్లో నిండా మునిగి ఉన్న విప్లవ పార్టీ హఠాత్తుగా ఉద్యమానికి మళ్లాలి. విప్లవాన్ని ప్లేటులో వడ్డించిన తర్వాత 'ఆ విందును ఆరగించడం కోసం' పక్కవారందరినీ తోసుకుంటూ ముందుకు దూకాలి." విప్లవ ఆసన్నత గురించిన ఈ దశల వారీ సిద్ధాంతం విప్లవం ఎన్నటికీ ఆసన్నం కాదనడాన్ని ఖాయం చేసే ఖచ్చితమైన వ్యూహం అని చెప్పక తప్పదు. లెనినిస్టు సిద్ధాంత పునాదిని నిజంగా అర్థం చేసుకోవాలంటే విప్లవ ఆసన్నత గురించి కాక, విప్లవ వాస్తవికత గురించిన లెనిన్ ఆలోచనా విధానపు నిజమైన సారాన్ని అర్థం చేసుకోవాలి.

విప్లవ ఆసన్నత అనేది ఒక నిశ్చల భావన. అది ఎటువంటి చారిత్రక క్రమాలకు సంబంధం లేకుండా విప్లవం రానున్నదనే దాన్ని సూచిస్తుంది. విప్లవ వాస్తవికత అనేది ఒక గతిశీల

భావన. ఇది చరిత్రలో స్థిరంగా వచ్చే మార్పులో భాగంగా ఉంటుంది. చారిత్రక క్రమంలో పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలు క్రమంగా, స్థిరంగా పరిపక్వం కావడాన్ని, కార్మికవర్గ చారిత్రక పార్టీ అభివృద్ధిని, ఈ వాస్తవికతకు సంబంధించిన స్వీయాత్మక శక్తిగా దాని కార్మికవర్గ స్పృహను సూచిస్తుంది. విప్లవ వాస్తవికతను అర్థం చేసుకోవాలంటే సామాజిక చరిత్ర మొత్తంలో భాగంగా రోజువారీగా ముందుకు వచ్చే ప్రతి ఒక్క సమస్యను కార్మికవర్గ విముక్తిలో భాగంగానే అధ్యయనం నిర్దిష్టంగా చేయాలి. దీనికి భిన్నంగా, విప్లవ ఆసన్నత సిద్ధాంతం విప్లవోద్యమాన్ని సమగ్ర మొత్తంగా చూడకుండా విప్లవ ఆసన్నతకు ముందటి పరిస్థితులు, ఆసన్నమైన తర్వాతి పరిస్థితులుగా విడగొడుతుంది. అది ఈ పరిస్థితుల మధ్య (సంబంధం లేదా) కొనసాగింపును గురించి చెప్పదు. వీటి సరిహద్దుల మధ్య ఉద్యమం వేలుతో మీటను నొక్కడం ద్వారా సంస్కరణవాదం నుంచి విప్లవకర మోడ్‌లోకి మారుతుందని అది చెబుతుంది. వాస్తవికత విప్లవోద్యమాన్ని సమగ్ర మొత్తంగా చూస్తుంది, ఆసన్నత దాన్ని ముక్కలుగా విడగొడుతుంది, నిర్వీర్యం చేస్తుంది. ఆసన్నత సిద్ధాంతం ఆసన్నత ముందటి దశలో ప్రతి రాజకీయ సమస్యను సంస్కరణ సమస్యగా మాత్రమే చూస్తుంది. దీనికి భిన్నంగా, వాస్తవికత అంటే ఆ రోజు ముందుకు వచ్చిన ప్రతి సమస్యను ఆ రోజు ముందుకు వచ్చిన సమస్యగానే కాక, దాన్ని విప్లవానికి సంబంధించిన మౌలిక సమస్యగా కూడా చూస్తుంది. 'ఆ రోజు ముందుకు వచ్చిన సమస్య' 'విప్లవానికి సంబంధించిన మౌలిక సమస్య' మధ్య గతితార్కిక ఐక్యతను తెలియజేసేదే లెనినిజం. లెనినిజం అంతా తక్షణ రాజకీయ సమస్యలు, అంతిమ విప్లవోద్యమం మధ్య గతితార్కిక ఐక్యతకు సంబంధించిన అధ్యయనమే.

లెనిన్ ఇలా స్పష్టం చేస్తారు, బూర్జువా సమాజపు నిశ్శబ్ద వలయాల్లో ఒక భౌతిక చారిత్రక క్రమం సుళ్లు తిరుగుతూ స్వయంగా దాని విధ్వంసం కోసం భూమికను తయారు చేస్తూ, ఈ వాస్తవికత పట్ల స్పృహ కలిగిన, ఈ వాస్తవికతను సాకారం చేసేందుకు విప్లవ రాజకీయ పోరాటాల ద్వారా తగినంతగా కాకలుతీరిన స్వీయాత్మక శక్తిని అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని అర్థం చేసుకుంటుంది. దీని కంటే మరీ ముఖ్యంగా, విప్లవ వాస్తవికత విప్లవకర కార్మికుల పార్టీ దైనందిన రాజకీయ కృషిని తన అంతిమ లక్ష్యం అయిన కార్మికవర్గ విప్లవంతో జోడిస్తుంది. అయితే మోసపూరిత (విప్లవ) ఆసన్నత సిద్ధాంతానికి ఈ విధమైన కృషి పట్ల విశ్వాసం ఉండదు.

లెనిన్ రాజకీయ వ్యూహంలోని స్థిరత్వం రెండు అంశాలకు స్థానం కల్పిస్తుంది : ఒకటి, లెనిన్ రాజకీయ వ్యూహం ఎల్లప్పుడూ వర్తమాన ఆర్థిక సంబంధాలను విస్తారంగా వర్గ విశ్లేషణ చేయడంపై ఆధారపడి ఉండేది. రెండు, లెనిన్ రూపొందించే ప్రతీ వ్యూహం దాని అంతిమ లక్ష్యపు వాస్తవికత, అంటే కార్మికవర్గ విప్లవపు వాస్తవికత ద్వారా స్పష్టమవుతుంది. లెనిన్ ప్రకారం, కార్మికవర్గ అగ్రగామి దళం ప్రధాన విధులు ఇవి : ప్రతి ఒక్క రాజకీయ పరిస్థితిలో

ముందుకు వచ్చే అవకాశాలను సామాజిక ఆర్థిక వాస్తవికత గురించిన వర్గ విశ్లేషణపై ఆధారపడి ఖచ్చితంగా అంచనా కట్టుకోవడం, కార్మికవర్గ ఉద్యమాన్ని అత్యంత మౌలిక అభివృద్ధిని సాకారం చేసే వైపుగా మళ్లించడం, అది మౌలిక మార్పు సాధించే స్థితికి చేరకుండా అడ్డుకునే బూర్జువాజీ, పెటీబూర్జువాజీ ప్రయత్నాలకు వ్యతిరేకంగా దాన్ని నేరుగా ఎక్కుపెట్టడం.

లెనిన్ విప్లవ పరిస్థితి లేని సమయంలో కమ్యూనిస్టుల విప్లవకర విధి గురించి సరిగ్గా, ఒక్క పొల్లు కూడా తప్పకుండా ఈ విధంగా వివరించారు : "... విప్లవేతర (నాన్-రివల్యూషనరీ) సంస్థలలో విప్లవ ప్రయోజనాలను (ప్రచారం, ఆందోళన, నిర్మాణం ద్వారా) నెరవేర్చే మొనగాడుగా నిలబడగలగాలి ... వాస్తవిక, నిర్ణయాత్మక, అంతిమ విప్లవ పోరాటానికి ప్రజలను నడిపించగల నిర్దిష్ట పంథాను లేదా ఘటనలు మలుపు తీసుకునే నిర్దిష్ట క్రమాన్ని అన్వేషించగలగాలి, కనుగొనగలగాలి, సరిగ్గా నిర్ధారించుకోగలగాలి." (లెనిన్ రచనలు-8వ సంపుటి, వామపక్ష కమ్యూనిజం-ఒక బాలారిష్టం, పేజీ 118.) కమ్యూనిస్టులు "ప్రజలను వాస్తవిక, నిర్ణయాత్మక, అంతిమ విప్లవ పోరాటం వైపుగా నడిపించగల నిర్దిష్ట పంథాను లేదా ఘటనలు మలుపు తీసుకునే నిర్దిష్ట క్రమాన్ని అన్వేషించేందుకు, కనుగొనేందుకు", దీనిపై ఆధారపడి ఉద్యమ నిర్దిష్ట వ్యూహాన్ని నిర్దేశించేందుకు ప్రయత్నిస్తే, సంస్కరణవాద సోషల్ డెమోక్రాట్లు తమ పెటీబూర్జువా వర్గ దృక్పథం వల్ల, చీకట్లో వెతుకులాడుతూండడం వల్ల, వర్తమానాన్ని మాత్రమే చూడడం వల్ల, ఊగిసలాడటం వల్ల, రాజీపడే వివిధ ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం వల్ల, 'అంతిమ విప్లవ పోరాటపు' వాస్తవికత పట్ల ఉన్న ఎటువంటి మంచి అభిప్రాయాలనన్నింటినీ కోల్పోయి, వీలైనంత త్వరగా, అసాధారణ ఘటనలు ఏమీ సంభవించకుండా ప్రస్తుత సంక్షోభ తీవ్రతను తగ్గించడం కోసం, అంతిమంగా, సులభమైన, ప్రగతినిరోధకమైన ప్రత్యామ్నాయం వద్దకు చేరుకుంటారు.

**2) సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధాలు లేని, విప్లవ ఆసన్నం కాని నేటి స్థితిలో, లెనినిజానికి కాలం చెల్లిందనడం విప్లవాన్ని అనంత కాలానికి వాయిదా వేయడానికే :** రివిజనిస్టు సిద్ధాంతకర్తల మరో వాదన ఏమిటంటే, "రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పెట్టుబడిదారీ విధానం కమ్యూనిస్టు ముప్పును అధిగమించేందుకు మూడు ముఖ్యమైన రాయితీలను ప్రకటించింది : వలస విధానానికి స్వస్తి చెప్పడం, సార్వజనిక వయోజన ఓటింగ్ విధానంపై ఆధారపడి ప్రజాస్వామ్యాన్ని వ్యవస్థీకృతం చేయడం, అత్యధిక ఉపాధి అవకాశాలు ఉండేలా 'డిమాండ్ మేనేజ్‌మెంట్'లో రాజ్యం జోక్యం చేసుకోవడం. దీనితో ''సామ్రాజ్యవాదుల మధ్య శత్రుత్వాలు సమసిపోయే యుగం'' ఆవిర్భవించింది. 'యుద్ధరహిత సామ్రాజ్యవాద' యుగంలో ద్రవ్య పెట్టుబడి ముందుకు వచ్చింది. అది ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛగా కదలడానికి విభజించబడి ఉన్న ప్రపంచం అడ్డంకిగా ఉంది. ప్రత్యర్థి దేశాల కేంద్రంగా ఉన్న గుత్త సంస్థల మధ్య ప్రపంచాన్ని పునర్విభజించుకునేందుకై పోరాటాలు సాగించిన యుగం ఆ సంస్థలు కేంద్రం స్థానంలో ఇక ఎంత మాత్రమూ

లేకపోవడంతో అంతమైంది. సామ్రాజ్యవాద శక్తుల మధ్య వర్తమాన సంధి శాశ్వతమైంది. ప్రస్తుతం కొనసాగే యుద్ధాలు సామ్రాజ్యవాద వైరుధ్యాలను ప్రతిబింబించేవి కావు. అవి కనీసం పరోక్ష యుద్ధాలు కూడా కావు.” “లెనినిస్టు సిద్ధాంతానికి విప్లవం ఆసన్నమైందనేది పునాది. ఈ (విప్లవ) ఆసన్నతకు కారణం సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధమే. ప్రస్తుతం ద్రవ్య పెట్టుబడి సామ్రాజ్యవాద శత్రుత్వాలను, సామ్రాజ్యవాద యుద్ధాలు వచ్చే అవకాశాన్ని పూర్తిగా లేకుండా చేసింది. విప్లవం ఆసన్నమయ్యే అవకాశం లేదు. కనుక లెనినిస్టు సిద్ధాంతానికి కాలం చెల్లింది.”

ఈ వాదన మార్క్సిజం–లెనినిజం స్ఫూర్తిని పూర్తిగా తప్పుగా చిత్రించడమూ, విప్లవకర మార్పు గురించిన మార్క్స్ భావాలను నగ్నంగా వికృతపర్చడమే అవుతుంది. ఇక్కడ మొదట కొన్ని చారిత్రక ఉదాహరణలను చూద్దాం. తద్వారా ఈ వాదనకు గల వర్గ పునాది స్పష్టమవుతుంది. 1915లో, విప్లవకర మార్గంలో సామ్రాజ్యవాద మొదటి ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించని తన ‘మధ్యేమార్గ’ పంథాను, ఒక పక్క యుద్ధం జరుగుతుంటే హాస్యాస్పదంగా తాను అనుసరించిన తప్పుడు తటస్థ విధానాన్ని సమర్థించుకునేందుకు కార్ల్ కాట్స్కీ ‘అధి–సామ్రాజ్యవాదం’ అనే తన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చాడు.

‘అధి–సామ్రాజ్యవాద’ సిద్ధాంతం లెనినిజానికి వ్యతిరేకమైనది. ఎలాగంటే, ఇది పెట్టుబడిదారీ విధానంలో ప్రపంచ శాంతిని గూర్చి కలలుగంటుంది. పెట్టుబడిదారీ విధానంలోని అసమానాభివృద్ధి కారణంగా సామ్రాజ్యవాద శక్తుల మధ్య జరిగే ఎటువంటి ఒప్పందమైనా ప్రపంచాన్ని సంయుక్తంగా దోచుకోవడానికి ఉద్దేశించిందిగానే ఉంటుంది. అది సాపేక్షికంగా తమ బలాలపై ఆధారపడి ఉంటుంది. కాలం గడిచే కొలదీ అది దెబ్బతినిపోతుంది. బలప్రయోగం ద్వారా మరో ఒప్పందం ముందుకు వస్తుంది. సామ్రాజ్యవాద శక్తుల మధ్య ఘర్షణలు–యుద్ధాలు జరగడం అనేది శాశ్వత లక్షణం. పోరాట విరమణ సంధి జరిగిన కాలాల్లో అవి ఆగిపోయినా అవి తాత్కాలిక విరామాలు మాత్రమే. పెట్టుబడిదారీ విధానంలో శాశ్వత శాంతి అసాధ్యం.

2వ ప్రపంచ యుద్ధం తర్వాత స్పష్టంగా కనపడుతున్న మార్పు ఏమిటంటే, మొత్తం ప్రపంచంపై ద్రవ్య పెట్టుబడి ప్రభావం అనేక రెట్లు పెరిగింది. ఇది సామ్రాజ్యవాద శక్తుల మధ్య, సామ్రాజ్యవాద శక్తులకు, ఇతర దేశాలకు మధ్య వైషమ్యాలు తీవ్రతరమయ్యేందుకు దారితీసింది. 2000 సంవత్సరం తర్వాత, చాలా చిన్న కారణాలతోనే ప్రపంచంలో అనేక చోట్ల సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాల మీద యుద్ధాలు కొనసాగించాయి. అయినప్పటికీ ఆశ్చర్యంగా ఈ రివిజనిస్టు సిద్ధాంత కర్తలు ఈ యుద్ధాలకూ సామ్రాజ్యవాదానికీ ఎటువంటి సంబంధం లేదని అంటారు. ఒక వైపు సిరియాలో దీర్ఘకాలంగా ఘర్షణలు కొనసాగుతూ, వివిధ సామ్రాజ్యవాద బ్లాకులు విభిన్న ఎత్తుగడలు అవలంబిస్తూ, వివిధ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే, పరస్పరం వ్యతిరేకమైన పార్టీలకు మద్దతు ఇస్తుంటే ఈ విధంగా వారు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.

వీరు కాట్స్కీ 'అధి-సామ్రాజ్యవాద సిద్ధాంతానికి' మద్దతునిస్తూ ఉద్దేశ్యపూర్వకంగా రెండు అంశాలను మర్చిపోతున్నారు. ఒకటి, వెనుకబడిన దేశాలకు వ్యతిరేకంగా ప్రస్తుతం సామ్రాజ్యవాదం సమైక్యంగా సాగిస్తున్న యుద్ధాలు గుత్త పెట్టుబడిదారీ విధానంలో లోతుగా వేళ్లూనుకున్న వైరుధ్యాల వ్యక్తీకరణే. రెండు, ఈ రివిజనిస్టు సిద్ధాంతకర్తలు తమ సంస్కరణవాద దృక్పథంతో, 'సామ్రాజ్యవాదుల మధ్య ఘర్షణలను పెట్టుబడిదారీ విధానపు గుత్తాధిపత్య దశలో నివారించడం సాధ్యం కాదు' అనే లెనిన్ సూత్రీకరణ వెనుక ఉన్న నిజమైన స్ఫూర్తిని విస్మరిస్తున్నారు.

ఉదాహరణకు, సకల సామ్రాజ్యవాద దేశాలు ఆసియాలోని ప్రాంతాలను శాంతియుతంగా 'విభజించుకోవడం' కోసం ఒక కూటమిని ఏర్పరచుకున్నారని అనుకుందాం. ఇది 'అంతర్జాతీయ సమైక్య ద్రవ్య పెట్టుబడి' కూటమిగా ఉంటుందంటే 'నమ్మగలిగేదేనా'? అది ఒత్తిడిలను, ఘర్షణలను, పోరాటాలను అరికడుతుందా? అసాధ్యం. ఎందుకంటే, పెట్టుబడిదారీ విధానంలో పెట్టుబడిదారుల ప్రభావాన్ని, ప్రయోజనాలను, వలసలను మొదలైన వాటిని విభజించుకోవడానికి విశ్వసనీయమైన పునాది ఇందులో భాగస్వాములయ్యే వారి ఆర్థిక, ద్రవ్య, సైనిక బలం మొదలైన వాటిపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. అలాగే పెట్టుబడిదారీ విధానంలో విభజించుకోవడంలో ఈ భాగస్వాముల బలం అనేది సమాన స్థాయిలో ఉండజాలదు. ఎందుకంటే పెట్టుబడిదారీ విధానంలో దేశాలన్నీ సమానంగా అభివృద్ధి చెందడం అసాధ్యం. భాగస్వామ్య దేశాల్లో సాపేక్షిక బలాల్లో మార్పు వస్తే పునర్విభజన తప్పనిసరి అవుతుంది. ఇది తప్పకుండా ఘర్షణలకు దారితీస్తుంది. సామ్రాజ్యవాదుల మధ్య జరిగే ఒప్పందాల అస్థిర స్వభావానికి లెనిన్ చెప్పిన కారణం ఇదే.

యుద్ధావకాశాలకు వ్యతిరేకంగా రొటీన్‌గా ముందుకు వచ్చే వాదన ఏమిటంటే, విదేశీ భూభాగాలు సామ్రాజ్యవాద శక్తులచే నేరుగా పరిపాలించనివిగా, అవి యెల్లయెడలా విస్తరించిన ద్రవ్య పెట్టుబడిపై ఆధారపడినవిగా వర్తమాన సామ్రాజ్యవాదాన్ని వర్గీకరించడం. అంటే అంతర్జాతీయంగా ఉన్నది సామ్రాజ్యవాదం కాదు, అలా అని పోస్ట్ సామ్రాజ్యవాదం కూడా కాదు. అది గ్లోబల్ పెట్టుబడిదారీ విధానం. ఇందులో భూమికను పోషించేవారు (భారీ కార్పొరేషన్లు) ఏదో ఒక దేశానికి సంబంధించినవారు కాకపోవడం, వారు మొత్తం ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహించేవారు కావడం వల్ల, విడి విడి దేశాలు ఈ కార్పొరేషన్ల మధ్య పోరాటాలను చేపట్టవు. అవి కేవలం స్వేచ్ఛగా కార్యకలాపాలు సాగించడం కోసం, ప్రపంచవ్యాప్తంగా 'దోచుకునే హక్కు' కోసం వాటికి మార్గం సుగమం చేసేందుకు మాత్రమే శ్రద్ధ చూపుతాయి. ఇది 'సమైక్య' సామ్రాజ్యవాద బ్లాకు ద్వారా ఖాయం చేయబడుతుంది. ఈ విధంగా చూడడం పరిస్థితిని సరిగ్గా అధ్యయనం చేయకపోవడం వల్ల తలెత్తుతుంది. మన దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ఇటువంటి ధోరణులు ఉన్నాయి. వీటిని మనం నిర్ద్వంద్వంగా ఖండించాలి.

పెట్టుబడిదారీ పాలకవర్గానికి సంబంధించినంత వరకు, యుద్ధం అనేది ఇతరులను తమ దారికి తెచ్చుకునే సమర్థవంతమైన మార్గం. క్రమంగా ప్రపంచాన్ని మింగివేస్తున్న బహుళజాతి తిమింగళాల మూలాలు ఇప్పటికీ నిర్దిష్ట రాజ్యంలోనే బలంగా పాతుకొని ఉన్నాయి. దాని రాజకీయ ఉన్నత వర్గాలతో అవి అత్యంత సన్నిహిత సంబంధాలను కలిగి ఉంటాయి. అందువల్ల సామ్రాజ్యవాదుల మధ్య వైషమ్యాలను అంతం చేయడం కోసం ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ స్థాయికి చేరుకుందనడం ఈ విషయాన్ని విస్మరించడమే.

లెనిన్ ఎత్తిచూపినట్లుగా, ''... 'సామ్రాజ్యవాదుల మధ్య' కూటములు లేదా 'అధి–సామ్రాజ్యవాద' కూటములు, అవి ఏ రూపం తీసుకున్నప్పటికీ, ఒక సామ్రాజ్యవాద కూటమికి వ్యతిరేకంగా మరొకటి ఉండే రూపం తీసుకున్నా లేదా సకల సామ్రాజ్యవాద శక్తులన్నింటినీ కలిపే సార్వత్రిక కూటమి అయినా, ఏదైనా కావచ్చు, అవన్నీ అనివార్యంగా యుద్ధాల మధ్య కాలాల్లో ఒక 'యుద్ధ విరమణ ఒప్పందానికి' రావడం తప్ప మరొకటి కాదు. శాంతియుత కూటములు యుద్ధాలకు భూమికను సిద్ధం చేస్తాయి, తిరిగి అవి యుద్ధాలలో నుంచి ఉత్పన్నమవుతాయి. ఒకటి మరోదాన్ని నియంత్రిస్తుంది. ప్రపంచ ఆర్థిక రాజకీయ వ్యవహారాలలోని సామ్రాజ్యవాద సంబంధ బాంధవ్యాలు అనే అదే ప్రాతిపదిక నుండి ఒకసారి శాంతియుత పోరాటాన్నీ, మరొకసారి హింసాయుత పోరాటాన్నీ మార్చి మార్చి ఉత్పన్నం చేస్తాయి. ... కాకపోతే కాట్స్కీ అతి తెలివితో ఒకే గొలుసులో ఉండే లింకులను ఒక దాని నుంచి మరోదాన్ని వేరుచేస్తాడు. వర్తమాన సకల శక్తుల శాంతియుత కూటమి ... నుంచి రేపటి హింసాయుత ఘర్షణను వేరుచేస్తాడు. ... సామ్రాజ్యవాద శాంతి కాలాలకూ, సామ్రాజ్యవాద యుద్ధ కాలాలకూ మధ్య సజీవ సంబంధాన్ని చూపడానికి బదులు, కార్మికులలో జీవం లేని వైరాగ్యాన్ని కల్పించాడు. తద్వారా తమ జీవం లేని నాయకులను రాజీపడేలా చేశాడు." (లెనిన్ రచనలు–3వ సంపుటి, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ, పేజీ–269).

సామ్రాజ్యవాదం పట్ల లెనిన్ విమర్శనాత్మక దృక్పథం మూడు ముఖ్యమైన అంశాలపై ప్రధానంగా ఆధారపడి ఉంది. అందులో ఒకటి యుద్ధాల అనివార్యత. మిగతా రెండు అంశాలను తడిమే ఎటువంటి ప్రయత్నం రివిజనిస్టు సిద్ధాంతవేత్తలు చేయరు. ఎందుకంటే, లెనిన్ విశ్లేషణలోని ఉన్నతత్వం పాఠకులకు స్పష్టంగా అర్థమవుతుంది. మొదటిది, సామ్రాజ్యవాదం గురించి లెనిన్ విమర్శలో ప్రాథమిక అంశం ఏది? అది యుద్ధాన్ని కొనితెస్తుందనేదేనా? కాదు. అది ముఖ్యమైనదే అయినప్పటికీ, అది ప్రాథమిక అంశం కాదు. లెనిన్ అవగాహన ప్రకారం సామాజిక విప్లవం ఒక్కటే సామ్రాజ్యవాద దశ నుంచి బయటపడే మార్గం అనేది ప్రాథమిక అంశం. లెనిన్ ప్రకారం, "సామ్రాజ్యవాదానికి అత్యంత హ్రస్వ నిర్వచనం ఇవ్వాలంటే, దాన్ని పెట్టుబడిదారీ విధానపు గుత్త దశగా చెప్పాలి''. (లెనిన్ రచనలు, 3వ సంపుటి, సామ్రాజ్యవాదం– పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ, పేజీ 236). "గుత్త సంస్థలూ,

ప్రభు మండలీ, స్వేచ్ఛ కొరకు కాక పెత్తనం కొరకు పాకులాడడమూ, కొద్దిపాటి అత్యంత ధనిక లేదా అత్యంత శక్తివంతమైన దేశాలు అంతకంతకూ యెక్కువ చిన్న లేదా బలహీన జాతులను దోచుకోవడమూ - ఇవన్నీ సామ్రాజ్యవాదంలో యెలాంటి విలక్షణ గుణాలను ఉత్పన్నం చేసినాయంటే, సామ్రాజ్యవాదాన్ని పరాన్నభుక్కు లేదా శిథిలమవుతున్న పెట్టుబడిదారీ విధానంగా వర్ణించేటట్లుగా అవి మనల్ని నెడతాయి" (పై పుస్తకమే, పేజీ 273) అని లెనిన్ ప్రకటించాడు. ఆ అవగాహన ప్రస్తుత సామ్రాజ్యవాద పరిస్థితిని మరింత స్పష్టం చేస్తుంది. 'మరణావస్థలో ఉన్న పెట్టుబడిదారీ విధానం'గా సామ్రాజ్యవాదానికి లెనిన్ ఇచ్చిన నిర్వచనం వర్తమానంలో దాని సరైన లిఖిత అర్థాన్ని నిలబెట్టుకుంటుంది.

పెట్టుబడిదారీ విధానం తన సామ్రాజ్యవాద దశలో తన అన్ని ప్రగతిశీల లక్షణాల్ని కోల్పోయింది. ప్రస్తుతం అది ఒక 'జీవశ్చవం'. అది మానవజాతికి ఇవ్వగలిగేది ఏమీ లేదు. సామాజిక విప్లవాల యుగం వచ్చిందని లెనిన్ పిలుపు నివ్వడానికి ప్రోత్సహించినది నిజంగా ఇదే. లెనిన్ ఇలా అన్నారు, 'ఒక పెద్ద వ్యాపార సంస్థ బ్రహ్మాండమైన స్థాయికి చేరినప్పుడు, సామూహిక సమాచారాన్ని ఖచ్చితంగా లెక్క వేసి, దాని ఆధారం మీద, కోట్ల మంది ప్రజలకు అవసరమైన దానిలో మూడింట రెండు వంతుల మేరకు గానీ, నాలుగింట మూడు వంతుల మేరకు గానీ ప్రాథమిక ముడి పదార్థాల సరఫరాను పథకం ప్రకారం ఏర్పాటు చేసినప్పుడు; ముడి పదార్థాలు అత్యంత అనుకూలమైన ఉత్పత్తి స్థలాలకు, ఒకోసారి ఒకదాని నుండి మరొకటి వందల, వేల మైళ్ల దూరాన వున్నవాటికి, క్రమపద్ధతిగా, నియమబద్ధమైన పద్ధతిలో రవాణా చేయబడినప్పుడు; రకరకాల పరిపూర్ణ వస్తువుల ఉత్పత్తి దాకా సరుకుల మీద చేసే పనిలో వరుసగా అన్ని దశల మీదా ఒకే ఒక కేంద్రం దర్శకత్వం వహించినప్పుడు; ఈ పరిపూర్ణ వస్తువులు ఒకే ఒక పథకం ప్రకారం కోటానుకోట్ల మంది వినియోగదారుల మధ్య పంపకమైనప్పుడు (అమెరికన్ చమురు ట్రస్టు అమెరికాలోనూ, జర్మనీలోనూ చమురు అమ్మడం) - అప్పుడు తేటతెల్లమౌతుంది - అది "పరస్పర బంధం" కాక, ఉత్పత్తి సామాజికీకరణ జరిగిందనీ; సొంత ఆర్థిక సంబంధాలూ, సొంత ఆస్తి సంబంధాలూ అనే పై పెంకు ఇప్పుడిక దాని లోపలి వస్తువుకు తగినట్లు లేదనీ, అది అనివార్యంగా క్షీణించక తప్పదనీ, దాని తొలగింపును కృత్రిమంగా ఆలస్యం చేస్తే (అత్యంత హాని జరిగి, అవకాశవాదపు పుండు చికిత్స చాలా కాలం సాగితే) ఆ పెంకి దీర్ఘకాలం క్షీణ స్థితిలో నిలిచి వుండవచ్చుననీ, కానీ అనివార్యంగా తొలగింపబడుతుందనీ.' (పై పుస్తకమే, పేజీ 276.) ఈ విషయాన్ని లెనిన్ 100 సంవత్సరాల క్రితమే కంప్యూటర్లను కనుగొనని దశాబ్దాల ముందే రాశారనేది గుర్తుంచుకోండి. ప్రస్తుతం, పైన చెప్పబడిన క్రమాలు చెప్పలేనంత విశాలంగా, వేగంగా, అత్యంత ప్రభావశీల స్థాయిలో జరుగుతున్నాయి.

సామ్రాజ్యవాదం గురించి లెనినిస్టు విమర్శలోని ఈ కోణాన్ని తడమకుండా ఉండడం ద్వారా

ఈ విప్లవకర నిర్ధారణను దాచిపెట్టడానికి రివిజనిస్టు సిద్ధాంతవేత్తలు ప్రయత్నిస్తున్నారు. దీనికి భిన్నంగా, వారు నిస్సిగ్గుగా లెనినిజాన్ని వికృతం చేస్తున్నారు. ప్రస్తుతం సామ్రాజ్యవాద యుద్ధాలంటూ ఏమీ లేవని చెబుతూ, విప్లవాన్ని తోసిపుచ్చుతున్నారు. లెనినిజం అంతమైందని చెబుతున్నారు. విప్లవాన్ని అనంత కాలానికి వాయిదా వేస్తూ 'ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే' వైపుగా మనం వెనక్కు మళ్లడం ముఖ్యమని అంటున్నారు! విప్లవాన్ని శాశ్వతంగా వాయిదా వేసే ఇటువంటి వాళ్లు కంటికి కనిపించే వాస్తవాలను కూడా చూడరు, భౌతిక పరిస్థితులు ఎప్పుడు పరిపక్వమవుతాయా అంటూ అంతం కాని అన్వేషణను కొనసాగిస్తారు. వాళ్లు సోషలిజం భవిష్యత్తును ఏదో సుదూరమైనదిగా, అసమంజసమైనదిగా, అస్పష్టమైనదిగా చిత్రిస్తారు.

అందువల్ల సామ్రాజ్యవాదంపై లెనినిస్టు వాదన కీలక అంశం ఇది : సామ్రాజ్యవాదం మరణావస్థలో ఉన్న పెట్టుబడిదారీ విధానం. అది సోషలిస్టు విప్లవాన్ని అవశ్యం చేస్తుంది. సామ్రాజ్యవాదం ద్వారా పరిపక్వమయ్యే భౌతిక పరిస్థితులు సోషలిస్టు విప్లవాన్ని సుసాధ్యం చేస్తాయి. గుత్త పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాల ద్వారా బద్దలయ్యే సామ్రాజ్యవాద యుద్ధాలు సోషలిస్టు విప్లవాన్ని నివారించలేనివిగా చేస్తాయి.

విప్లవం ఆసన్నం కావడానికి సామ్రాజ్యవాదుల మధ్య ఘర్షణను ఒక తప్పనిసరి ముందు షరతుగా చేసిన రివిజనిస్టు సిద్ధాంతవేత్తల సిద్ధాంతంతో మార్క్సిజం-లెనినిజం ఏకీభవిస్తుందా? ఎంత మాత్రమూ ఏకీభవించదు. సామ్రాజ్యవాద యుద్ధాలు విప్లవాన్ని నివారించలేనివిగా చేస్తాయి, అయితే దీని అర్థం, ఏ రకంగానూ యుద్ధాలే దాన్ని అనివార్యం చేస్తాయని కాదు. రష్యాలో సామ్రాజ్యవాద యుద్ధం విప్లవానికి తక్షణ కారణంగా పనిచేసింది. అయితే దీన్ని వాళ్లు తలకిందులు చేస్తున్నారు.

"ఉదాహరణకు, ఇంగ్లాండు గురించి లెనిన్ అభిప్రాయంలో అక్కడ నిజమైన శ్రామికవర్గ విప్లవం యెంత త్వరలో ప్రజ్వలించేదీ, ఇప్పుడు ఇంకా నిద్రావస్థలో ఉన్న అతి విశాలమైన జనాలను రేపడానికీ, రగిలించడానికీ, పోరాటంలోకి లాగడానికీ యే తక్షణ కారణం అన్నిటి కంటే యెక్కువగా పనిచేసేదీ మనం చెప్పజాలం. - ముందుగా యెవరూ చెప్పజాలరు. ... పార్లమెంటరీ సంక్షోభం చేతనో లేక దిక్కుమాలినంతగా చిక్కుపడి, అంతకంతకూ బాధాకరమూ, తీవ్రమూ అవుతున్న వలసవాద, సామ్రాజ్యవాద వైరుధ్యాల నుండి ఉత్పన్నమయ్యే సంక్షోభం చేతనో లేక యేదైనా మూడవ కారణం చేతనో, మరొక-మరొకదాని చేతనో గండిపడడం, మంచుగడ్డ పగిలిపోవడం సంభవమే." (లెనిన్ రచనలు-8వ సంపుటి, వామపక్ష కమ్యూనిజం-ఒక బాల్యారిష్టం, 118వ పేజీ.) విప్లవం చెలరేగడానికి ట్రిగ్గర్‌గా పనిచేసే అనేక కారణాలలో ఒకటి సామ్రాజ్యవాద సంక్షోభం అని లెనిన్ పరిగణించాడనేది అత్యంత స్పష్టం.

**3) ప్రస్తుత పరిస్థితిలో భారత వామపక్షం, మావోయిస్టులతో సహా, అవకాశవాద, విప్లవేతర, కూటముల ప్రాతిపదికతో సంస్కరణవాద పంథా చేపట్టాలనే దివాళాకోరు వాదన :** రివిజనిస్టు

సిద్ధాంతకర్తల వాదన ప్రకారం "ప్రపంచంలో ప్రతీ చోటా యాదృచ్ఛికంగా వివిధ శ్రేణుల ఉద్యమాలు ముందుకు వస్తున్నప్పటికీ, అవి పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా స్థిరమైన వైఖరిని ప్రదర్శించడం లేదు. కార్మికవర్గ విముక్తి మాత్రమే ప్రస్తుత వైరుధ్యాలకు ఆచరణాయుత పరిష్కారమని చూసేంత స్పృహ వాటికి లేదు. అవి ఇప్పటికీ 'ఆర్థికవాద' స్వభావం కలిగినవే. అవి చాలా వరకూ ఉత్పత్తి విధానాన్ని మార్చడం కాక సంపదను న్యాయంగా పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనికి కారణం పీడిత వర్గం ఎదుర్కొంటున్న ఈ ఆర్థిక సమస్యలకున్న సామాజిక, రాజకీయ మూలాలను బహిరంగం చేయగలిగేటువంటి, ఈ స్పాంటేనియస్ పోరాటాలను ఒక విశాలమైన, మరింత లక్ష్యశుద్ధి గల సామాజిక పోరాటంగా ఐక్యం చేయగలిగే వర్గ స్పృహ కలిగిన కార్మికవర్గ అగ్రగామి దళం ఉనికిలో లేకపోవటమే."

వాళ్లు ఇంకా ముందుకు పోయి "సామ్రాజ్యవాద యుద్ధాలు లేవు, విప్లవం ఆసన్నత లేదు, కాబట్టి విప్లవ వామపక్షం అవసరమే లేదు" అనేంత వరకూ వెళ్లారు. ఈ పరిస్థితిలో "కమ్యూనిజం ఆచరణాయుతమైనదిగా మిగిలి ఉండాలంటే లెనినిస్టు అనంతర యుగం విధించిన షరతులపై ఆధారపడి కొత్త మార్గాలను వెతుక్కోవాలి, తనను తాను పునర్వ్యవస్థీకరించుకోవాలి. ఇది కష్టమైన పనే. ఆచరణాయుతమైన రాజకీయాలను పక్కకు పెట్టి నైతిక స్వచ్ఛతను ఆధిపత్యంలో ఉంచి, విప్లవాసన్న స్థితి లేదు అనే అంశాన్ని తిరస్కరించడం అనే సాధారణ, అవాంఛనీయమైన ధోరణి విప్లవకారులలో ఉండడం వల్ల ఇది మరింత కష్టమైన పని" అంటున్నారు.

ప్రపంచంలో వామపక్ష పతనానికి మూలాలు విప్లవ వాస్తవికతపై ఆధారపడి సమకాలీన ప్రయోజనాలను నెరవేర్చడంలో మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు సిద్ధాంతపు ప్రాసంగికతను తెలుసుకోవడం, పరిరక్షించడంలో దాని (వామపక్షపు) అసమర్థతలో, అది విప్లవ సమస్యను వదిలిపెట్టడంలో, తన స్వభావాన్ని సోషల్ డెమోక్రసీగా మార్చుకోవడంలో, 'సంక్షేమవాదపు' శ్రేణుల్లోకి అది దిగజారడంలో ఉన్నాయి. అంటే 'విప్లవ వామపక్షం' ఒక 'క్రమపద్ధతిలో సోషల్ డెమోక్రటైజేషన్' అయ్యింది. అది సోషల్ డెమోక్రసీకి చెందిన రాజకీయ వ్యూహాన్ని చేపట్టింది. సంక్షోభాన్ని మహత్తర పరివర్తనల వైపు కాక, దాన్ని మేనేజ్ చేసేలా దాని రాజకీయ దృక్పథం మారిపోయింది. వామపక్ష పార్టీలు 2వ ఇంటర్నేషనల్‌కు చెందిన సోషల్ డెమోక్రటిక్ పార్టీల్లానే వ్యవహరించసాగాయి. విప్లవేతర దైనందిన రొటీన్ కార్యకలాపాలే వాటికి సర్వస్వం అయ్యాయి. అవి ప్రజాస్వామిక పెట్టుబడిదారీ రాజ్య సంస్థల పరిరక్షణ కోసం పెట్టుబడిదారులతో, మధ్యతరగతి వర్గంలోని ఉదారవాదులతో కూటములను ఏర్పరచుకుంటున్నాయి. సామూహిక, సమరశీల ఉద్యమాల ద్వారా కాకుండా పార్లమెంటరీ కార్యకలాపాల ద్వారా, రొటీన్‌గా సామూహిక బేరసారాలు ఆడడం ద్వారా సంస్కరణలను కోరుతున్నాయి.

ఈ 'సోషల్ డెమోక్రటైజేషన్'కు స్పష్టమైన రాజకీయ, ఆర్థిక కారణాలు ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1955-1970ల మధ్య పెట్టుబడిదారీ వికాసం (boom)తో పాక్షిక

స్థిరత్వం ఏర్పడింది. దాన్ని 'పెట్టుబడిదారీ విధానపు స్వర్ణయుగం'గా పిలిచారు. ఇది అనేక మంది మేధావుల్లో భ్రమల్ని రేకెత్తించింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో మార్క్స్ కనుగొన్న వైరుధ్యాలు అధిగమించబడ్డాయని వారు వాదించనారంభించారు. సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలనే జాన్ మినార్డ్ కీన్స్ సిద్ధాంతం ముందుకు వచ్చింది. దీంతో వాళ్లు విప్లవ వాస్తవికత గురించి మరిచిపోయారు, మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు సిద్ధాంతాన్ని వదిలిపెట్టారు. పెట్టుబడి తర్కం ముందు సాష్టాంగపడి, సంస్కరణవాదులుగా మారారు. అయితే, సంక్షోభం చరిత్ర చెత్తబుట్టలోకి విసరివేయబడిందని పరిగణించబడుతున్న క్రమంలో, అది 60ల చివర, 70ల ప్రారంభంలో సింహద్వారాన్ని బద్దలు కొట్టుకుంటూ తిరిగి వాపస్ వచ్చింది. సంస్కరణవాదులకు నిద్ర కరువైంది.

లెనినిస్టు దృక్పథం ప్రకారం, భౌతిక పరిస్థితులు పరిపక్వం కాకపోయినప్పటికీ, కార్మికవర్గ అగ్రగామి దళం స్థిరంగా కార్మికవర్గంలో వర్గ చైతన్యాన్ని అభివృద్ధి చేసేందుకూ, విప్లవ ఆవశ్యకతను, సుసాధ్యతను చెప్పి వారిని ప్రభావితం చేసేందుకూ కృషి చేయాలి. లెనిన్ పదే పదే విసుగు లేకుండా బోధించినట్లుగా అగ్రగామి దళపు విప్లవ కర్తవ్యం "... విప్లవం అవసరం, తక్షణం అందుకోసం పూనుకోవాల్సిన అవసరం, దాని అనివార్యత"పై పీడిత వర్గాన్ని చైతన్యవంతం చేయడం. రివిజనిస్టు సిద్ధాంతవేత్తలు విప్లవం ఎంతమాత్రమూ ఎజెండాలోనే లేదని కార్మికవర్గానికి నమ్మబలుకుతుంటే, దాన్ని రుజువు చేసేందుకు 'ఘటనల్ని' 'చూపుతుంటే', లెనిన్ విప్లవ అనివార్యత గురించి వారిలోకి దృఢంగా తీసుకొని వెళుతున్నారు. రివిజనిస్టు సిద్ధాంతవేత్తలు వారికి జోలపాటలు పాడుతుంటే, లెనిన్ వారిని తట్టిలేపుతూ కఠోర వాస్తవాన్ని చెప్పి జాగరూకుల్ని చేస్తున్నారు. ఈ తేడాను లెనిన్ చెప్పిన మాటల్లోనే స్పష్టంగా చూడవచ్చు : విప్లవం ఆసన్నం కాకపోయినప్పటికీ, అది వచ్చే అవకాశం మాత్రమే ఉన్నప్పటికీ "... పరిపక్వమవుతున్న విప్లవ ఆవశ్యకతను అవిద్యావంతులైన జన సామాన్యానికి బోధించేందుకూ, అది అనివార్యమని రుజువు చేసేందుకూ, దాని లాభాలను జనానికి వివరించేందుకూ, శ్రామికవర్గాన్నీ, కాయకష్టం చేసే, దోచుకోబడే ప్రజలనూ దానికి సన్నద్ధం చేసేందుకూ తనకి ఉన్న సామర్థ్యంతో విప్లవకర మార్క్సిస్టు, కూపస్థమండూకానికీ, పెటీబూర్జువాకీ భిన్నంగా ఉంటాడు". (లెనిన్ రచనలు-7వ సంపుటి, 79వ పేజీ.) వామపక్షానికి విప్లవకరంగా ఉండవద్దని రివిజనిస్టు సిద్ధాంతవేత్తలు ఇచ్చే పిలుపును బట్టి స్పష్టమయ్యేదేమంటే, లెనిన్ మాటల్లో, వామపక్షాన్ని మొదటి శ్రేణి పెటీబూర్జువా కూపస్థమండూకంలా ఉండమని చెప్పడమే. ఈ విధంగా అత్యంత లోతైన సామ్రాజ్యవాద సంక్షోభం మధ్య యథాస్థితివాదాన్ని ముందుకు తెస్తున్నారు. సార్వజనిక వయోజన ఓటింగ్ విధానంపై ఆధారపడి ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసే పార్లమెంటరీ మార్గాన్ని పీడిత ప్రజల ముందుంచుతున్నారు. భారతదేశంలో కేంద్రీకృత రాజ్యాంగ యంత్రమూ, అత్యంత శక్తివంతమైన ఆధునిక సైన్యమూ ఉన్న స్థితిలో,

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బూర్జువాజీ మోసం తప్ప మరేమీ కాదని పూర్తిగా బహిర్గతమైన స్థితిలో ఒక కార్మికవర్గ విప్లవ పార్టీ పార్లమెంట్‌లో అత్యధిక స్థానాలు గెలుచుకొని, అధికారాన్ని చేపట్టడం, అది సోషలిస్టు రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టడం, రాజ్యాంగ యంత్రపు అణచివేత సాధనాలను తటస్థం చేయడం, చివరిగా ఆ రాజ్యాంగ యంత్రాన్ని కూలదోసి కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపించడం అసాధ్యమనేది స్పష్టం. సామ్రాజ్యవాదుల దన్ను కలిగిన భారత దళారీ పాలకవర్గాలను కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక-కర్షక తదితర పీడిత ప్రజలు కూలదోయకుండా తమకు తాముగా తమ సంపదనూ, అధికారాన్నీ ఎన్నటికీ ఒదులుకోవు. 1970, 80లలో చిలీ, నికరాగువా అనుభవాలు మన ముందున్నాయి. కనుక రివిజనిస్టు సిద్ధాంతవేత్తలు ముందుకు తెస్తున్న వాదనలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి, తిప్పికొట్టాలి.

## సాయుధ శక్తి ద్వారా రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకునే పంథాపై దృఢంగా నిలబడదాం!

మార్క్సిజం-లెనినిజం-మావోయిజం, విప్లవంలో ప్రధాన సమస్య రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోవడం అని చెబుతుంది. విప్లవంలో కేంద్ర కర్తవ్యం, ఉన్నత రూపం సాయుధ శక్తి ద్వారా రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోవడం. ఇది మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు విశ్వజనీన సత్యం. ఈ సత్యాన్ని ఎవరైతే అంగీకరించరో లేదా మాట వరుసకు అంగీకరించి, వాస్తవానికి అంగీకరించరో, వారు నిజమైన మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టులు కారు. విప్లవాన్ని విజయవంతం చేసేందుకు భారతదేశంలోని నిర్దిష పరిస్థితి ఏమిటి? వివిధ దేశాల్లో అక్కడి నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా విప్లవాలు ఏ విధంగా విజయవంతమయ్యాయి? లెనిన్ అక్టోబరు విప్లవానికి చెందిన గొప్ప ఆచరణపై ఆధారపడి 1919 నవంబరులో "తూర్పు దేశాల కమ్యూనిస్టు పార్టీల రెండవ అఖిల రష్యా కాంగ్రెస్‌లో ఇచ్చిన ఉపన్యాసంలో" తూర్పు ప్రాంతంలోని విభిన్న దేశాల కమ్యూనిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ యిలా అన్నారు : "వారు తప్పనిసరిగా తమ తమ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను పరిశీలించాలి. సాధారణ కమ్యూనిస్టు సూత్రాలపై, ఆచరణపై విశ్వాసం ఉంచి, యూరప్ దేశాల్లో లేని తమ ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మలచుకోవాలి." లెనిన్ యింకా యిలా నొక్కిచెప్పారు, "ఇది ఎటువంటి కర్తవ్యం అంటే ఇటువంటి దాన్ని ప్రపంచంలో కమ్యూనిస్టులు ఇంతకు మునుపు ఎప్పుడు ఎదుర్కొని ఉండలేదు." మార్క్సిజం-లెనినిజం-మావోయిజం విశ్వజనీన సత్యాన్ని తమ దేశ నిర్దిష్ట విప్లవ ఆచరణతో జోడించకపోతే రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవడం, విప్లవాన్ని విజయవంతం చేయడమనే సమస్యే ఉత్పన్నం కాదు. చైనాలో ఈ సూత్రాన్ని సృజనాత్మకంగా మావో నాయకత్వంలోని సి.పి.సి. అమలు చేయడం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి కమ్యూనిస్టు లక్ష్యాన్ని చేరుకోవడానికి సోషలిజాన్ని సంఘటితం చేసే ప్రక్రియకు పూనుకుంది.

భారతదేశంలో సి.పి.ఐ (మావోయిస్టు) వ్యవస్థాపకులు కామ్రేడ్ సి.ఎం., కామ్రేడ్ కె.సి.ల నాయకత్వంలో అనేక మంది విప్లవకారులు సి.పి.ఐ, సి.పి.ఐ.(ఎమ్) రివిజనిజాన్ని ఓడిస్తూ పారిస్ కమ్యూన్, అక్టోబరు విప్లవం, చైనా విప్లవం కొనసాగింపు రూపంగా నక్సల్బరీ మార్గాన్ని, దీర్ఘకాల సాయుధ పోరాట మార్గాన్ని ఎన్నుకున్నారు. అదే భారతదేశంలో నేడు సి.పి.ఐ. (మావోయిస్టు) నాయకత్వంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవం. అది ప్రపంచ కార్మికవర్గ సోషలిస్టు విప్లవంలో భాగం. అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ గల్గిన భారతదేశంలో విప్లవం అనివార్యంగా రెండు దశలలో కొనసాగుతుంది. మొదటి దశ నూతన ప్రజాస్వామిక విప్లవం, రెండవ దశ సోషలిస్టు విప్లవం. భిన్న రూపాల్లోని ఈ రెండు విప్లవ ప్రక్రియలు భిన్నత్వాన్ని కలిగి ఉన్నప్పటికీ పరస్పరం సంబంధాన్ని కల్గినవి. మన పార్టీ భారతదేశ విప్లవ వ్యూహం-ఎత్తుగడలు అనే డాక్యుమెంటులో భారత అర్ధవలస-అర్ధభూస్వామ్య సమాజపు నాలుగు స్వాభావిక లక్షణాలను గురించి, వివిధ కులాలుగా విభజింపబడిన దాని విశిష్టతలను గురించి, దానిలోని ప్రత్యేక సామాజిక సెక్షన్లు, జాతుల వాస్తవిక పరిస్థితులను గురించి, వర్తమాన భారతదేశ అర్ధవలస-అర్ధభూస్వామ్య సమాజ ప్రముఖ వైరుధ్యాలు, రెండు మౌలిక వైరుధ్యాల గురించి, అందులో ప్రధాన వైరుధ్యాన్ని గురించి విశ్లేషించడమైంది. వివిధ ప్రత్యేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక పాలసీలను రూపొందించడమైంది. అలాగే భారత విప్లవానికి లక్ష్యాలుగా సామ్రాజ్యవాదం, దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య విధానాలను పేర్కొని వాటిని ధ్వంసం చేయడం గురించి, భారత విప్లవ చోదకశక్తులు, విప్లవ మౌలిక కర్తవ్యాలు, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవడం, వ్యవసాయక విప్లవం నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసు, ప్రజాసైన్యం-స్థావర ప్రాంతాలు, మూడు అద్భుత ఆయుధాలు (పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన), విప్లవ స్వరూపం-దాని భవిష్యత్తు, భవిష్యత్తులో దాని పరిణామం మొదలైన విషయాలను గురించి వివరంగా పేర్కొంటూ వ్యూహం-ఎత్తుగడలను రూపొందించడం జరిగింది. గడచిన 50 సంవత్సరాలలో సి.పి.ఐ. (మావోయిస్టు) ఎమ్.ఎల్.ఎమ్. సిద్ధాంతాన్ని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడం ద్వారా, ఆచరించడం ద్వారా సరైన పంథాగా రూపుదిద్దుకుంది. ఈ విప్లవ కార్యచరణలో మితవాద, అతివాద అవకాశవాద తప్పుడు పంథాలను ఓడించడం ద్వారానే ఈ సరైన పంథా అభివృద్ధి అయ్యింది. ఈ పోరాట క్రమంలో నిజమైన కమ్యూనిస్టులంతా ఐక్యమై సి.పి.ఐ (మావోయిస్టు) ఏర్పడి ఐక్యతా కాంగ్రెస్ జరుపుకొని సరైన పంథాను ఎన్నుకున్నది. అది అనేక ఊచకోతలకు భయపడి లొంగిపోలేదు. తుపాకులను విడిచిపెట్టలేదు. కొద్ది మంది నెగిటివ్ టీచర్ల ఉదాహరణల నుంచి పాఠాలు నేర్చుకుంటూ సాయుధ పోరాటం లేకుండా విప్లవాన్ని విజయవంతం చేయడం అసంభవమనే సత్యాన్ని చాటి చెప్తూతూ నేడు భారత విప్లవోద్యమాన్ని పురోగమింపజేస్తున్నది. చాంగ్ కై-షేక్‌తో జరిగిన ప్రజా విముక్తి యుద్ధంలో మావో యిలా చెప్పారు, "ప్రజల సాయుధ శక్తులు, ప్రతి తుపాకీ, ప్రతి తూటా, మొత్తం అన్నీ సురక్షితంగా ఉ

ంచుకోవాలి. వారిని లొంగిపోయేలా చేయకూడదు.”

అంతర్జాతీయంగా, దేశీయంగా తీవ్రతరమవుతున్న విప్లవ సంక్షోభం నేపథ్యంలో, మన పార్టీ గత 50 సంవత్సరాల నుంచి సమాజంలో, విప్లవోద్యమంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణ్యంగా తగిన ఎత్తుగడలను అభివృద్ధి చేసుకుంటూ పురోగమిస్తున్నది. తీవ్ర వర్గ పోరాటాలలో, ప్రజా యుద్ధంలో-ప్రజా పోరాటాలలో పాల్గొనే క్రమంలో మాత్రమే ఇది సాధ్యమైంది. అంటే ఆచరణాయుత అనుభవం ద్వారానే, వర్గశక్తుల గురించి సాపేక్షికంగా సరైన అంచనాతోనే సరైన, దృఢమైన పోరాట ఎత్తుగడలు రూపొందుతూ వచ్చాయి. ఇవి భవిష్యత్తు విప్లవ విజయానికి హామీ వుంటాయి. ఆ మేరకు ఎప్పటికప్పుడు సమాజంలోని పరిస్థితులను మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. నేరుగా పరిశోధనలు నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది. ఇదే సిద్ధాంతాన్ని ఆచరణలో జోడించే మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు శైలి, వాస్తవాల నుండి సత్యాలను రాబట్టే శైలి.

ప్రజాయుద్ధానికి పునాది భారతదేశ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో వున్నది. చిన్న శక్తి అనేక రెట్లు బలమైన శత్రువును ఎదుర్కొనే క్రమంలో ఈ రోజు సి.పి.ఐ (మావోయిస్టు) అనేక ఎగుడు-దిగుళ్ళను చవిచూస్తుండవచ్చు. అనేక ఆటుపోట్లు ఉన్నప్పటికీ, ఇది ఒక రాజీలేని మౌలిక పోరాటం. ఈ క్రమంలో ఆచరణలో జరిగే తప్పు-ఒప్పుల నుండి గుణపాఠాలను తీసుకుంటూ లోపాలు, బలహీనతలు, పరిమితులను అధిగమించేందుకు తప్పులను సరిదిద్దుకొనే క్యాంపెయిన్ల ద్వారా వర్గ పోరాట ప్రాపంచిక దృక్పథంతో, నిబద్ధతతో, త్యాగనిరతితో ఉద్యమాన్ని పురోగమింపజేస్తున్నది.

సామ్రాజ్యవాదానికి, ఆధునిక రివిజనిజానికి, దేశంలోని అభివృద్ధి నిరోధకులకు (భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి) వ్యతిరేకంగా మనం బలోపేతం కాగలగాలి, మన కార్యకలాపాలను పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా పెంపొందించుకో గలగాలి. నయా ఉదారవాదం, పెరుగుతున్న రాజ్యహింస (రాజ్య టెర్రరిజం), సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాల, ప్రచ్ఛన్న యుద్ధాల నేపథ్యంలో గుత్త బూర్జువాజీ, ద్రవ్య ప్రభు మండలి (ఫైనాన్షియల్ ఆలిగార్కీ)లోని అపరిమితమైన దురాశ ద్వారా వర్గీకరించబడిన దీర్ఘకాలిక, మునుపెన్నటి కంటే తీవ్రతరమవుతున్న ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద ఆర్థిక సంక్షోభం మనల్ని మరింత దృఢంగా, సమరశీలంగా పోరాడమని, ప్రజల నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి, సోషలిస్టు విప్లవానికి పురోగమించమని కోరుతున్నది.

**నవంబర్ 11, 2017.**

***

## ఉద్యమ బలాబలాల్లో కలిగే మార్పులను అనుసరించి

## తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యాన్ని మార్చుకోవడం గురించి

**–డీజే**

నక్సల్బరీ, శ్రీకాకుళం తదితర ఉద్యమాల అనంతర విప్లవోద్యమ కాలపు గత 45 సంవత్సరాల చరిత్రను విహంగ వీక్షణం చేస్తే మన పార్టీ ఎప్పటికప్పుడు ఆనాడున్న దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులను విశ్లేషించుకుంటూ ఉద్యమ బలాబలాలను అనుసరించి తక్షణ, ప్రధాన కర్తవ్యాల్ని సరిగా రూపొందించుకుంటూ దృఢంగా ఆచరిస్తూ వస్తోంది. దాని ఫలితంగా భారత విప్లవోద్యమం ఈనాటి స్థితికి అభివృద్ధి అయ్యింది.

భారత విప్లవోద్యమ నిర్మాత, మన పార్టీ వ్యవస్థాపక నాయకులలో ఒకరైన కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వం, నక్సల్బరీ వెల్లువ వెనుకపట్టు పట్టిన తరువాత దేశవ్యాప్తంగా మునుపటి సిపిఐ (ఎం–ఎల్)లో ఒక సెక్షన్‌లో పార్టీ పంథా పట్ల అనుమానాలు; ఆచరణను సరిగా విశ్లేషించి విజయాలను, వైఫల్యాలను వేరుచేసి, విజయాల ఆధారంగా పురోగమించే పథకాల్ని రూపొందించుకోలేని వైఫల్యత; నిరాశ, నిస్పృహ, అవిశ్వాసాలు నెలకొన్న స్థితి కొనసాగింది. ఈ స్థితిలో మునుపటి సిపిఐ (ఎం–ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ (ఏపి ఎస్‌సి) 1972 నుండి 1977 తెలంగాణ రీజినల్ కాన్ఫరెన్స్ జరిగేంతవరకు పార్టీ కాడర్లలో ఉన్న సైద్ధాంతిక, రాజకీయ గందరగోళాన్ని తొలగించి, సరైన విప్లవ పంథా చుట్టూ సమీకరించడమే ప్రధాన కర్తవ్యంగా కృషి చేసింది. మన పార్టీ 8వ కాంగ్రెస్ రూపొందించిన సరైన పంథాను, నక్సల్బరీ, శ్రీకాకుళం తదితర విప్లవోద్యమాల పాజిటివ్ అంశాలను ఎత్తిపట్టడంతో పాటు, ఆనాడు మనం చేపట్టిన అతివాద ఎత్తుగడల ఫలితంగా భారత విప్లవోద్యమానికి కలిగిన నష్టాన్ని మన నాయకత్వం వివరించింది. 'పిలుపు' పత్రికలో వ్యాసాలు రాయడమేకాకుండా 'గతాన్ని సమీక్షించుకుని సాయుధ పోరాట పథంలో విజయవంతంగా పురోగమిద్దాం' అనే పేరుతో ఆత్మవిమర్శనా రిపోర్టును (డాక్యుమెంట్‌ను) రూపొందించింది. ఆనాటి నిజమైన, నిజాయితీ కలిగిన విప్లవశక్తుల సమీకరణకు, సరైన ఎత్తుగడల్ని రూపొందించుకుని ప్రజల్లోకి వెళ్ళి వర్గపోరాటాల్ని ప్రారంభించడానికి ఈ డాక్యుమెంట్ కీలకంగా పనిచేసింది. 1977 ఆగస్టులో ఏపి ఎస్‌సి ఎత్తుగడలపై రూపొందించిన డాక్యుమెంటు (ప్రస్తుత రాజకీయ పరిస్థితి–మన కర్తవ్యాలు), వర్గశత్రు నిర్మూలన పేరుతో సాగుతున్న సెక్టేరియన్ తప్పుల్ని సరిదిద్ది, పార్టీని ప్రజాపంథాలోకి మళ్ళించింది. దాని ఫలితమే కరీంనగర్–ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల వెల్లువ, ఆంధ్రప్రదేశ్‌లో సాయుధ వ్యవసాయిక విప్లవ పోరాటాల విస్తరణ. కరీంనగర్–ఆదిలాబాద్

రైతాంగ పోరాటాల వెల్లువపై ఆధారపడి 1980లో మన పార్టీ గెరిల్లాజోన్ డాక్యుమెంట్‌ను రూపొందించి ఉత్తర తెలంగాణ రైతాంగ పోరాటాలను గెరిల్లాజోన్ స్థాయికి అభివృద్ధి చేసే ప్రధాన కర్తవ్యాన్ని పార్టీ ముందుంచింది. అందులో భాగంగా దండకారణ్యానికి ఉద్యమం విస్తరించింది. 1985 నాటికి ఆంధ్రప్రదేశ్, దండకారణ్య ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవ ప్రతీఘాతుక దాడిని తీవ్రతరం చేసినప్పుడు 'ప్రభుత్వ దాడిని ఓడిద్దాం' సర్క్యులర్ ద్వారా శత్రు సాయుధ బలగాలపై గెరిల్లాయుద్ధం చేపట్టడం ప్రధాన కర్తవ్యంగా రూపొందించింది. ఆ తరువాత ఎప్పటికప్పుడు జరిగిన ఆంధ్ర రాష్ట్ర, దండకారణ్య కాన్ఫరెన్సులు, ప్లీనాలు, 1995లో జరిగిన అఖిల భారత ప్రత్యేక మహాసభ ఉద్యమాన్ని సమీక్షించి తక్షణ, ప్రధాన కర్తవ్యాల్ని రూపొందించాయి. నక్సల్బరీ వెల్లువ కాలపు మార్క్సిస్టు-లెనినిస్టు ఉద్యమాన్ని (1967-72) సమీక్షించి, ఇందులో ప్రధానాంశమైన పాజిటివ్స్‌ను ఎత్తిపట్టి, ద్వితీయాంశంగా ఉన్న నెగెటివ్స్‌ను ఎత్తిచూపి, ఈ ప్రాతిపదికపై విప్లవ శక్తులను ఐక్యం చేయడంతో పాటు ఉద్యమాన్ని నిర్మించే లక్ష్యంతో 1978 నవంబర్‌లో మునుపటి సిపిఐ(ఎంఎల్)పార్టీ యూనిటీ ఏర్పడింది. మునుపటి పి.యు. పార్టీ 1983, 87, 97లలో నిర్వహించిన కేంద్ర మహాసభలు దీని చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కలిగినవి. ఈ కాన్ఫరెన్స్‌లు సైద్ధాంతిక, రాజకీయ, సైనిక, నిర్మాణ, ఎత్తుగడలపర విషయాలను సమీక్ష చేశాయి. ఇవి పాజిటివ్స్‌ను ఎత్తిపట్టి పొరపాట్లను, లోపాలను, బలహీనతలను ఎత్తిచూపాయి. తక్షణ, ప్రధాన కర్తవ్యాల్ని రూపొందించాయి. మొదటి కాన్ఫరెన్స్ మునుపటి పి.యు. పార్టీని స్థిరీకరించింది. రెండవ కాన్ఫరెన్స్ అంతర్గత పోరాటం ద్వారా లిక్విడేషనిస్ట్ పంథాను తోసిపుచ్చి పార్టీ పంథాను రక్షించుకున్నది. మూడవ కాన్ఫరెన్స్ అంతర్గత పోరాటం ద్వారా పార్టీ పంథాను ఎన్‌రిచ్ చేసుకోవడంతో పాటు సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపరమైన బలహీనతలు గుర్తించి సరిదిద్దుకోవడానికి తోడ్పడింది. ఇలా నాయకత్వం మూడవ కాన్ఫరెన్స్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ-పి.యు.ల మెర్జర్‌కు సరైన ప్రాతిపదిక ఏర్పడి అనతికాలంలోనే (సెప్టెంబర్ 1998) ఈ ఐక్యత సాధించబడింది. ఈ మెర్జర్‌తో మునుపటి ఐక్య పీపుల్స్‌వార్ పార్టీకి అఖిల భారత స్వరూపం విస్తృతమైంది. 2001 నాటి మునుపటి పీపుల్స్‌వార్ 9వ కాంగ్రెస్ ఉద్యమాన్ని సమీక్షించి తక్షణ, ప్రధాన కర్తవ్యాల్ని రూపొందించాయి. ఆ కర్తవ్యాల వెలుగులో మన విప్లవోద్యమం కొనసాగుతూ పురోగమించింది.

భారత విప్లవోద్యమ నిర్మాత, మన పార్టీ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరయిన కామ్రేడ్ కన్హయ్ ఛటర్జీ 1969 మే నాటికే రూపొందించిన 'వ్యూహం-ఎత్తుగడలు' డాక్యుమెంట్, ఆయన 1970లో రాసిన మరో అమూల్యమైన వ్యాసం 'వ్యవసాయ విప్లవాన్ని కొనసాగించండి, సైన్యం, బేస్ ఏరియాల నిర్మాణ పనిని వేగవంతం చేయండి' ఆధారంగా మునుపటి ఎంసిసి నాయకత్వంలో

మొదట పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణాల జిల్లాలో డీహీ-సోనార్‌పూర్ రైతాంగ పోరాటం ప్రారంభమయ్యింది. తీవ్రమైన శతృదాడి వల్ల ఈ పోరాటం గుణాత్మక స్థాయికి అభివృద్ధి చెందలేకపోయింది. అయితే ఆ పోరాటం నుండి గ్రామీణ ప్రాంతాల పని గురించి మనకు కొన్ని మంచి అనుభవాలు వచ్చాయి. ఈ అనుభవాలను విశ్లేషించుకొని వాటికి అనుగుణంగా పశ్చిమ బెంగాల్‌లోని 24 పరణాల జిల్లాలో కొన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ, బర్ద్వాన్ జిల్లాలో కాంక్సా-బుద్‌బుద్-ఆవుస్‌గ్రాం ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటాల్ని ప్రారంభించాం. మునుపటి కంటే అభివృద్ధి చెందిన రూపంలో ఒక నూతన వెల్లువ ముందుకు వచ్చింది. గయ-హజారీబాగ్ పోరాటాలు 1968లో ప్రారంభంకాగా, కాంక్సా పోరాటం 1970లో ప్రారంభమయ్యింది. శత్రు భారీ దాడులకు దీటుగా మన రాజకీయ నిర్మాణ (స్వీయాత్మక) సన్నాహాలు లేకపోవడం వల్లనూ గెరిల్లా యుద్ధ విన్యాసాలకు ఏరియా తగినంత విశాలంగా ఉండకపోవడం వల్లనూ కాంక్సా పోరాటం అనివార్యంగా వెనకపట్టు పట్టింది. అయితే కాంక్సా పోరాటం నుంచి పొందిన అనుభవాలు ఆ తర్వాత బీహార్-ఝార్ఖండ్-బెంగాల్ స్పెషల్ ఏరియాలో అభివృద్ధి చెందిన వ్యవసాయ విప్లవ గెరిల్లా పోరాటానికి పునాది అయ్యాయి. 1978-1980 నాటికి ఈ పోరాటాలు విశాల ప్రాంతాలకు విస్తరించి, సంఘటితపడ్డాయి. ఈ సంఘటిత ప్రజాపునాది ఆధారంగా ఈ పోరాటాలను భూస్వామ్య ప్రైవేట్ సేనలను ఎదుర్కొనే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను ఎదుర్కొనే స్థాయికి ఎదిగించే కర్తవ్యాన్ని ప్రధాన కర్తవ్యంగా తీసుకుని పనిచేశాం. ఈ క్రమంలో 1990ల ప్రారంభానికి ఆ పోరాటాలు గెరిల్లాజోన్ స్థాయికి ఎదిగాయి. 1990 నుండి 2004 వరకు బీహార్-ఝార్ఖండ్ ప్రాంతంలోని ఉద్యమ స్థితిపై ఆధారపడుతూ ఎప్పటికప్పుడు తక్షణ, ప్రధాన కర్తవ్యాల్ని రూపొందించుకుంటూ వచ్చాం.

సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటు అనంతరం కేంద్రకమిటీ మొదటి సమావేశం, తరువాతి రెండేళ్ళ కోసం నాలుగు మేజర్ కర్తవ్యాలను చేపట్టింది. అందులో మొదటిది **ప్రధాన కర్తవ్యం.** "దేశమంతటా ప్రజాయుద్ధాన్ని పెంపొందించి తీవ్రతరం చేయడం, గెరిల్లాజోన్లను స్థావర ప్రాంతాలుగా పరివర్తన చెందించడానికి నిర్దిష్టమైన నమయుబద్ధ ప్లానులను రూపొందించుకోవడం, రాజకీయాధికార అంగాలను, విప్లవ ఐక్యసంఘటనను నిర్మించి బలోపేతం చేయడం, ప్రజా ఉద్యమం, ప్రజా సంఘాలతో సహా అన్ని కార్యకలాపాలను కేంద్ర కర్తవ్యాన్ని పూరించే దిశలో మల్చడం, పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటనలను బలోపేతం చేయడం మరియు విముక్తి ప్రాంత స్థాపన లక్ష్యంతో ఆ దిశలో ఏరియాలను మెట్టుమెట్టుగా అభివృద్ధి చేయడం అనేదే **ప్రధానకర్తవ్యం".**

ఐక్యపార్టీ ఏర్పాటు తరువాత రూపొందించుకున్న నాలుగు మేజర్ కర్తవ్యాల ఆధారంగా సాగిన రెండు సంవత్సరాల మూడు నెలలకాలపు ఆచరణను మనం 2007 జనవరిలో జరిగిన

9వ కాంగ్రెస్-ఐక్యతా కాంగ్రెస్‌లో సమీక్షించుకున్నాం. రానున్న కాంగ్రెస్ వరకు (సాధారణంగా 5 సంవత్సరాల కాలం) తక్షణ కర్తవ్యాల్ని రూపొందించుకున్నాం. ఆ తక్షణ కర్తవ్యాల్లో భాగంగా కింది విధంగా **ప్రధాన, కేంద్రకర్తవ్యాన్ని** రూపొందించుకున్నాం.

"మన విప్లవపు మూడు ఆయుధాలను పటిష్ట పరుచుకుంటూనే దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్ వ్యూహాత్మక ప్రాంతాలలో స్థావర ప్రాంతాలను నెలకొల్పడానికిగానూ గెరిల్లాయుద్ధాన్ని గుణాత్మకంగా ఇంకా ఉన్నత దశయైన చలనయుద్ధంగా పురోగమింపజేయడం, పీఎల్‌జీఏను పీఎల్ఏగా పరివర్తన చెందించడం అన్నదే **ప్రధాన, కేంద్ర కర్తవ్యంగా** ఉంటుంది. అంతేగాక, ఇతర గెరిల్లాజోన్‌లలో గెరిల్లాయుద్ధాన్ని ఉధృతం చేయాలి. పరస్పెక్టివ్ ప్రాంతాలలో ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. ఈ ప్రాంతాలలోనూ, ఇతర ప్రాంతాలలోనూ గెరిల్లాజోన్లను నిర్మించడానికి సన్నాహాలను పరిపూర్తి చేయాలి. యావత్తు పార్టీని, పీఎల్‌జీఏని, ప్రజారాశులను ఈ కర్తవ్య సాధన వైపు నడపాలి". (విలీనాంతర పిఓఆర్ నుంచి)

ఈ ప్రధాన, కేంద్ర కర్తవ్యాన్ని సాధించడం కోసం మనం 11 రాజకీయ కర్తవ్యాలను, 6 సైనిక కర్తవ్యాలను, 9 ఐక్యసంఘటన కర్తవ్యాలను, 4 నిర్మాణ కర్తవ్యాలను, 4 పట్టణ ఉద్యమ కర్తవ్యాలను రూపొందించుకున్నాం.

ఐక్యతా కాంగ్రెస్ రూపొందించిన ప్రధాన, కేంద్ర కర్తవ్యంతోపాటు ఇతర తక్షణ కర్తవ్యాల సాధన కోసం దేశవ్యాప్తంగా గ్రామీణ, అటవీ, పట్టణ ప్రాంతాల్లో విప్లవోద్యమ పురోగమనం కోసం కృషి చేశాం. ఫలితంగా 2007 నుండి 2011 వరకు భారత విప్లవోద్యమం క్రమక్రమంగా అభివృద్ధి చెందింది. ఈ స్థితిలో విప్లవోద్యమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐక్యపార్టీ ఏర్పాటు వెనువెంటనే దేశవ్యాప్తంగా ప్రారంభించిన విప్లవ ప్రతీఘాతుక దాడి తీవ్రతతోపాటు, దీర్ఘకాలంగా మన పార్టీలో కొనసాగుతూ వస్తున్న బలహీనతల ఫలితంగా 2013 నాటికి భారత విప్లవోద్యమానికి గడ్డుస్థితి ఎదురయ్యింది. ప్రధాన, కేంద్ర కర్తవ్యాన్ని రూపొందించుకోవడానికి ప్రధాన ఆధారాలుగా ఉన్న దండకారణ్య ఉద్యమం 2011 చివరివరకు గడ్డుస్థితిలోకి వెళ్ళగా, 2013 ప్రారంభం నాటికి బీహార్-ఝార్ఖండ్ ఉద్యమం తాత్కాలిక వెనుకంజ స్థితికి గురయ్యింది. ఈ స్థితిలో డీకే, బీజేలను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం కోసం పీఎల్‌జీఏను పీఎల్ఏగా, గెరిల్లాయుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయడం అనే కేంద్ర కర్తవ్యం తక్షణ కర్తవ్యంగా ఉంటుందా? లేదా? అనే ప్రశ్నను కొద్దిమంది పార్టీ కాడర్లు లేవనెత్తారు. ఈ విషయంపై మన కేంద్రకమిటీ మధ్య మధ్యలో స్పష్టీకరణ ఇస్తూ వచ్చినప్పటికీ, దీనిపై పార్టీలో స్పష్టమైన అవగాహన కలిగించడం కోసం ఈ సందర్భంగా తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యాల గురించి కొంత వివరంగా చెప్పుకుందాం. కొన్ని ప్రశ్నల రూపంలో ఈ సమస్యను కొంత వివరంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం.

1. తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యాన్ని ఏ ప్రాతిపదికన నిర్ణయించుకుంటాం. ఇది వ్యూహాత్మక అంశమా? ఎత్తుగడల సంబంధిత అంశమా?

2. పార్టీ కాంగ్రెస్ కేంద్ర కర్తవ్యాన్ని రూపొందించినప్పటికీ ఉద్యమ బలాబలాల్లో కలిగే మార్పులను అనుసరించి తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవాన్ని మార్చుకోవడం సరైనదేనా?

3. కేంద్ర కర్తవ్యం దేశం మొత్తానికి ఒకటే ఉంటుందా? లేక రాష్ట్ర/స్పెషల్ ఏరియా/స్పెషల్‌జోన్ కమిటీలు కేంద్రకర్తవ్యం రూపొందించుకోవచ్చా? లేక ఈ కమిటీలు తక్షణ కర్తవ్యాల్ని రూపొందించుకునే ప్రాతిపదిక, పద్ధతి ఏమిటి?

## 1. తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యాన్ని ఏ ప్రాతిపదికన నిర్ణయించుకుంటాం? ఇది వ్యూహాత్మక అంశమా? ఎత్తుగడల అంశమా?

తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యాల్ని రూపొందించుకోవడమనేది ఎత్తుగడలకు సంబంధించిన అంశం. నిర్ణీతకాలాల్లో, నిర్ణీత ప్రాంతాల్లో విప్లవోద్యమ స్థితిపై ఆధారపడి, బలాబలాలపై ఆధారపడి పార్టీ, మిలిటరీ, ఐక్యసంఘటన రంగాలకు సంబంధించిన తక్షణ కర్తవ్యాల్ని రూపొందించుకుంటాం. ఈ తక్షణ కర్తవ్యాల్లో ఏదో ఒకటి ప్రధాన కర్తవ్యంగా ఉంటుంది. దేశవ్యాప్త ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే అత్యంత ప్రధానమైన కర్తవ్యమే కేంద్ర కర్తవ్యమవుతుంది.

తక్షణ, ప్రధాన కర్తవ్యాలను ఏ ప్రాతిపదికన నిర్ణయించుకోవాలనే విషయాల్ని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు స్టాలిన్ తన "లెనినిజం-పునాదులు" అనే గ్రంథంలో చక్కగా వివరించాడు. తక్షణ, ప్రధాన కర్తవ్యాల్ని రూపొందించడం ఎత్తుగడల నాయకత్వపు **ప్రధాన కర్తవ్యమని** స్టాలిన్ చెప్పాడు. ఎత్తుగడల నాయకత్వపు **ప్రధాన కర్తవ్యాలలో** "......మొదటగా, ఒక నిర్దిష్ట సమయంలో ఉద్యమంలో ఆటు లేక పోటు పరిస్థితులకు పూర్తి అనుకూలమైన, తద్వారా ప్రజలను విప్లవ క్షేత్రాలలోకి తీసుకువచ్చేందుకు సుగమం చేసే, హామీనిచ్చే, అలాగే లక్షలాది ప్రజలను విప్లవ రంగంలోకి తీసుకువచ్చే, వారిని విప్లవ రంగంలో నిలబెట్టే పోరాట నిర్మాణ రూపాలను అగ్ర స్థానంలో ఉంచాలి."

..... ..... .....

"రెండవది, ఎటువంటి పరిస్థితిలోనైనా పరిణామ క్రమంలో ఉన్న ప్రత్యేక లింకును గుర్తించాలి. దీనిని గ్రహించగలిగితే యావత్తు గొలుసునూ పట్టి ఉంచగలుగుతాం. వ్యూహాత్మక విజయ సాధనకు పరిస్థితులను సన్నద్ధం చేయగలుగుతాం.

ఇక్కడ విషయం ఏమంటే, పార్టీ ముందున్న సమస్త కర్తవ్యాల నుంచి నిర్దిష్ట, తక్షణ కర్తవ్యాన్ని విడదీయాలి. దీనిని నెరవేర్చడమే కేంద్ర బిందువుగా ఉంటుంది. దీనిని పరిపూర్తి చేయడం ద్వారా ఇతర తక్షణ కర్తవ్యాలను విజయవంతంగా నెరవేర్చగలుగుతాం.

ఈ సిద్ధాంత ప్రాధాన్యతను రెండు ఉదాహరణల ద్వారా వివరించవచ్చు. ఒకటి గత కాలం (పార్టీ నిర్మాణ కాలం) నుంచి తీసుకుంటే రెండోది వర్తమానం (నూతన ఆర్థిక విధాన కాలం) నుంచి తీసుకోవచ్చు ...." (పై పుస్తకంలో, వ్యూహం-ఎత్తుగడలు అనే శీర్షిక కింద ఎత్తుగడల నాయకత్వం అనే అంశం నుంచి).

తక్షణ, ప్రధాన కర్తవ్యాల్ని ఏ సిద్ధాంత ప్రాతిపదికన రూపొందించుకోవాలనేది చెప్పిన తరువాత స్టాలిన్ ప్రధాన కర్తవ్యాన్ని గురించి రష్యన్ కమ్యూనిస్టు ఉద్యమం నుండి, ఆ పార్టీ అనుభవాల నుండి రెండు ఉదాహరణలు చెప్పాడు. మొదటిది – అఖిల రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ ఏర్పాటుకు ముందున్న పరిస్థితిలో, అఖిల రష్యన్ రహస్య వార్త పత్రికను (ఇస్క్రా) నడపడం ఒక **ప్రధానమైన లింకు అనీ, అది ప్రధాన కర్తవ్యమని** చెప్పాడు. "ఎందువల్లనంటే, ఆనాడు ఉన్న పరిస్థితుల్లో అఖిల రష్యన్ రహస్య వార్తా పత్రిక మూలంగానే అసంఖ్యాకమైన బృందాలను, సంస్థలనూ ఒకే మొత్తంగా ఏకం చేయగలిగినట్టి, సిద్ధాంత రంగంలోనూ, ఎత్తుగడలలోనూ ఐక్యతను చేకూర్చుటకు పరిస్థితులు సృష్టించగలిగినట్టి, ఆ విధంగా నిజమైన పార్టీని నిర్మించుటకు పునాదులను నిర్మించగలిగినట్టి పార్టీయొక్క గట్టి కేంద్రాన్ని నిర్మించగలిగాం" (పై పుస్తకంలో, వ్యూహం-ఎత్తుగడలు అనే శీర్షిక కింద ఎత్తుగడల నాయకత్వం అనే అంశం నుంచి) అని చెప్పాడు. 1917 అక్టోబరులో సోషలిస్టు విప్లవం విజయవంతమైన తరువాత యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్న స్థితిలో సోషలిస్టు రాజ్యం అనేక కర్తవ్యాలను చేపట్టిగా, ఆ దశలోని పరిణామ క్రమపు గొలుసులో **ప్రధానమైన లింకు**, అనేక కర్తవ్యాలలో **ప్రధానమైన కర్తవ్యం** వ్యాపారాన్ని అభివృద్ధి చేయడమేనని చెప్పాడు. "ఎందువల్లనంటే – వ్యాపారాభివృద్ధి ద్వారా అమ్మకాలను పెంచడం ద్వారానే పరిశ్రమలను అభివృద్ధి చేయుట సాధ్యం అయ్యేది. వ్యాపారరంగంలో మన స్థితిని స్థిరపరుచుకున్న తరువాతనే, వ్యాపారంపై కంట్రోల్‌ను సాధించిన తరువాతనే, ఈ ప్రధాన లింకును పట్టుకున్న తరువాతనే, సోషలిస్టు ఆర్థిక జీవనానికి పునాదులను నిర్మించే పరిస్థితులను సృష్టించుటకుగానూ, పరిశ్రమలను రైతాంగ మార్కెట్‌లో బందింపజేయడంగానీ, **ఇతర తక్షణ కర్తవ్యాలను జయప్రదంగా పూర్తి చేయడంగానీ సాధ్యమయ్యేది"** (పై పుస్తకంలో, వ్యూహం-ఎత్తుగడలు అనే శీర్షిక కింద ఎత్తుగడల నాయకత్వం అనే అంశం నుంచి).

పైన పేర్కొన్న దాని ప్రకారం ఒక నిర్ణీతకాలంలో, నిర్ణీత ప్రాంతంలో (అది రాష్ట్రం కావచ్చు, దేశం కావచ్చు) పరిణామ క్రమాల గొలుసులో ఏ లింకును పట్టుకొనడం ద్వారా మొత్తం గొలుసు అంతా స్వాధీనంలోకి వస్తుందో, వ్యూహాత్మక విజయాల్ని సాధించుటకు పరిస్థితులను తయారు చేస్తుందో అటువంటి లింకే **ప్రధానకర్తవ్యం**. ఇతర తక్షణ కర్తవ్యాలను జయప్రదంగా పూర్తి చేయడానికి సాధ్యమయ్యే పరిస్థితులను సృష్టిస్తుందో/కల్పిస్తుందో అదే **ప్రధానకర్తవ్యం.**

అంటే ఒక జోన్‌లో/జిల్లాలో/డివిజన్‌లోగానీ, స్పెషల్ ఏరియాలో/స్పెషల్ జోన్‌లో/రాష్ట్రంలోగానీ, ఒకానొక నిర్ణీతకాలంలో పార్టీ, మిలిటరీ, ఐక్యసంఘటనలకు సంబంధించిన ఏ కర్తవ్యాలనయితే తక్షణం అమలు చేయడం అవసరమో అవన్నీ **తక్షణ కర్తవ్యాలుకాగా,** వాటన్నింటిలో ఏ కర్తవ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చి, దాని అమలుపై పార్టీ, మిలిటరీ, ఐక్యసంఘటన రంగాలకు చెందిన నాయకత్వం కాడర్లు అంతా సమైక్యంగా ప్రత్యేక శ్రద్ధపెట్టి కృషి చేయడం ద్వారా ఇతర తక్షణ కర్తవ్యాలను జయప్రదంగా పూర్తిచేసే పరిస్థితులు సృష్టించబడుతాయో అది **ప్రధాన కర్తవ్యం** అని అర్థం.

అయితే కేంద్రస్థాయిలో (దేశవ్యాప్తంగా), కేంద్ర కర్తవ్యాన్ని ఏ ప్రాతిపదికన నిర్ణయించుకుంటాం?

కేంద్ర కర్తవ్యం కూడా తక్షణ కర్తవ్యాల్లో ఒక భాగమే అయినప్పటికీ, అది ప్రధాన కర్తవ్యం కన్నా అత్యధిక ప్రాధాన్యత కలిగినటువంటిది. ఏ కర్తవ్యాన్ని అమలు చేయడం ద్వారా వ్యూహాత్మక ప్రయోజనాలు నెరవేరుతాయో అలాంటి తక్షణ, ప్రధాన కర్తవ్యమే **కేంద్రకర్తవ్యం**. దేశవ్యాప్త ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఒక నిర్దిష్ట కాలమంతా ఒకే కేంద్రకర్తవ్యం ఉంటుంది. ఏక కాలంలో అనేక కేంద్ర కర్తవ్యాలు ఉండవు. అందుకే మనం ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి, గెరిల్లాయుద్ధాన్ని మొబైల్‌యుద్ధంగా, పీఎల్‌జీఏను పీఎల్ఏగా అభివృద్ధి చేయాలనే ప్రధాన, కేంద్రకర్తవ్యాన్ని నిర్దేశించుకున్నాం. ఈ కర్తవ్య అమలులో మనం సాధించే పురోగతి-తిరోగతులు, ఆ కాంగ్రెస్ రూపొందించిన ఇతర తక్షణ కర్తవ్యాల అమలులో గణనీయమైన, ప్రముఖమైన మార్పులకు దారి తీస్తాయి. ఈ కర్తవ్యపు అమలులో మనం అభివృద్ధి సాధిస్తే అది, దేశంలో అనేకచోట్ల ప్రజా పోరాట వెల్లువకు దారి తీస్తుంది, సెట్‌బ్యాక్‌కు గురయిన ప్రాంతాలు రివైవ్ (తిరిగి బలోపేతం) కావడానికి తోడ్పడుతుంది. ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటన, వ్యూహాత్మక ఐక్యసంఘటన బలపడడానికి బలమైన ప్రాతిపదిక ఏర్పడుతుంది. పట్టణోద్యమం బలపడడానికి దారితీస్తుంది. వీటన్నింటి ఫలితంగా పార్టీ, మిలిటరీ, ఐక్యసంఘటన రంగాల్లో దీర్ఘకాలిక ప్రభావం చూయించే పాజిటివ్ ఫలితాలు (వ్యూహాత్మక ప్రయోజనాలు) ఒనగూరుతాయి. ఈ కేంద్ర కర్తవ్య సాధనలో సాధించే అభివృద్ధి/పురోగతి కాంగ్రెస్ నిర్దేశిత ఇతర కర్తవ్యాలను ఎలాగయితే ప్రభావితం చేస్తుందో, అదే విధంగా తిరోగమనం/తిరోగతి కాంగ్రెస్ నిర్దేశిత ఇతర కర్తవ్యాలను (రాజకీయ, సైనిక, ఐక్యసంఘటన, నిర్మాణ, పట్టణ కర్తవ్యాలు) నకారాత్మకంగా ప్రభావితం చేస్తుంది. అంటే భారత విప్లవోద్యమం, మన పార్టీ అనేక ప్రతికూలతలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కేంద్రకర్తవ్యం, ఇతర తక్షణ కర్తవ్యాలు పరస్పర ఆధారితాలు, పరస్పరం ప్రభావం కలిగించుకునేవి. కాబట్టి కేంద్రకర్తవ్య పురోగతి, తిరోగతి ఇతర కర్తవ్యాలను ఎలాగయితే

ప్రభావితం చేస్తాయో, ఇతర కర్తవ్యాల పురోగతి-తిరోగతులు కేంద్రకర్తవ్యాన్ని అదేవిధంగా ప్రభావితం చేస్తాయి.

అయితే, “గ్రామీణ ప్రాంతంలో-ప్రత్యేకించి మారుమూల గ్రామీణప్రాంతం (ఇది గెరిల్లాయుద్ధాన్ని, ప్రజాసైన్యాన్ని, స్థావర ప్రాంతాలను నిర్మించడానికి అత్యంత అనుకూలంగా ఉంటుంది)-వ్యవసాయ విప్లవ గెరిల్లాయుద్ధం కోసం ప్రజలను ఒక పథకం ప్రకారం జాగృతం చేసి, సంఘటితం చేయడం, గెరిల్లాయుద్ధం ద్వారా ప్రజాసైన్యాన్ని, గ్రామీణ ఎర్ర స్థావర ప్రాంతాలను నిర్మించడం, విప్లవపు **ప్రస్తుత దశలోని** మౌలిక, ప్రధాన, తక్షణ కర్తవ్యం అని దీర్ఘకాలిక ప్రజాయుద్ధ సాధారణపంథా తెలియజెబుతోంది” అని మన ‘వ్యూహం-ఎత్తుగడలు’ డాక్యుమెంటులో పేర్కొన్నదాన్ని ఎలా అర్థం చేసుకోవడం?

తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యాలు ఎత్తుగడలపరమైన అంశంగా చెప్పుకున్నప్పుడు పైన పేర్కొన్నది **ప్రస్తుత దశకంతటికీ** వర్తించేదిగా ఉన్నప్పుడు అది వ్యూహాత్మక అంశమవుతుంది కదా అని ఎవరికయిన సహజంగానే ప్రశ్న తలెత్తుతుంది.

భారత సమాజంలోని వర్గాల వస్తుగత విశ్లేషణపైన, భారత రాజ్యపు స్వభావంపైన, మౌలిక వైరుధ్యాలపైన, ప్రధాన వైరుధ్యంపైన ఆధారపడి, భారతదేశ విశిష్ట స్వాభావిక లక్షణాలను, ప్రత్యేక లక్షణాలను పరిగణనలోకి తీసుకుని మనం రాజకీయ వ్యూహాన్ని, మిలిటరీ వ్యూహాన్ని రూపొందించుకున్నాం. వీటన్నింటి ఆధారంగా భారతదేశపు ప్రస్తుత విప్లవదశ నూతన ప్రజాస్వామిక విప్లవదశగా ఉంటుందని నిర్ణయించుకున్నాం. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలంటే ఈ దశ అంతటినీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయిక విప్లవ గెరిల్లాయుద్ధం ద్వారా ప్రజాసైన్యాన్ని నిర్మించి, స్థావర ప్రాంతాలను నిర్మించడమే మౌలిక, తక్షణ, ప్రధాన కర్తవ్యంగా తేలుతుంది. ఇక్కడ చెబుతున్నది **భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవదశకు అంతటికి** వర్తించే విషయం. దీనిని వ్యూహాత్మక అంశంగా చెబుతున్నాం. నూతన ప్రజాస్వామిక విప్లవదశ అంతటా మనం సాగించే రాజకీయ, సైనిక, నిర్మాణ కృషిలో డీవియేషన్స్ తలెత్తకుండా నివారించడానికి వ్యూహాత్మక దిశానిర్దేశాన్ని కలిగిస్తూ ఈ విషయాన్ని చెప్పుకున్నాం. సన్నాహాల పేరుతో దీర్ఘకాలానికి వాయిదా వేయకుండా ఉండడం కోసం తక్షణమే ఈ కర్తవ్య సాధనకు పూనుకోవాలని చెప్పడం కోసం దీనిని తక్షణ కర్తవ్యమని చెప్పాం. ప్రజాసైన్యాన్ని, స్థావర ప్రాంతాలను నిర్మించడం భారత విప్లవ మౌలిక, సాధారణ కర్తవ్యం **వ్యూహాత్మక కర్తవ్యం** కాగా, దాన్ని ఆచరించే క్రమంలో ఎప్పటికప్పుడు ఉద్యమ బలాబలాల ఆధారంగా తక్షణ కర్తవ్యాలను, ప్రధాన, కేంద్ర కర్తవ్యాన్ని రూపొందించుకోవడం అనేది **ఎత్తుగడలపరమైన అంశంగా** అర్థం చేసుకోవాలి. వ్యూహాత్మక నాయకత్వంలోని ఒక భాగమే ఎత్తుగడల నాయకత్వం కాబట్టి, వ్యూహాత్మక నాయకత్వం యొక్క

కర్తవ్యాలకు, అవసరాలకు ఇది లోబడి ఉంటుంది, కాబట్టి ఇలాంటి కీలకమైన కర్తవ్యాల్ని రూపొందించడం కేంద్రకమిటీ బాధ్యతే అవుతుంది.

## 2. పార్టీ కాంగ్రెస్ కేంద్ర కర్తవ్యాన్ని రూపొందించినప్పటికీ ఉద్యమ బలాబలాల్లో కలిగే మార్పులను అనుసరించి తక్షణ, ప్రధాన, కేంద్రకర్తవ్యాన్ని మార్చుకోవడం సరైనదేనా?

ఈ విషయాన్ని అర్థం చేసుకోవడం కోసం మొదట తాత్విక/సైద్ధాంతిక భావనల్ని చూద్దాం.

ప్రతి విషయం (ఎంటిటి) దానిలోని విరుద్ధాంశాల మధ్య వైరుధ్యాల వల్ల **నిరంతరం చలనంలో** (మార్పు) ఉంటుందని గతితార్కిక భౌతికవాదం చెబుతుంది. అందుకే ఒక సమస్యను, ఒక విషయాన్ని అధ్యయనం చేసేటప్పుడు మనం స్వీయమానసికతత్వాన్ని, ఏకపక్షతనూ, అల్పదృష్టిని విడనాడాలి. లేనిచో భౌతిక పరిస్థితుల్లో జరిగే మార్పులను అధ్యయనం చేయడంలో మనం పొరపాట్లు చేస్తాం. ఈ స్వీయమానసికతత్వం ఒక ధోరణిగా ఉంటే అది రాజకీయంగా మితవాదంగానో, అతివాదంగానో వ్యక్తమవుతుంది. దీంతో మనం విప్లవోద్యమ సమస్యల్ని పరిష్కరించడానికి అందించే గైడెన్స్ నష్టాలకు దారితీస్తుంది.

"మనం విప్లవ శ్రేణులలోని మొండిఘటాలను వ్యతిరేకిస్తాం. వారి ఆలోచన మారే భౌతిక పరిస్థితులకు అనుగుణంగా పురోగమించడంలో విఫలమై, చారిత్రకంగా, మితవాద అవకాశవాదంగా వ్యక్తమయింది. విరుద్ధాంశాల మధ్య ఘర్షణ భౌతిక క్రమాన్ని ఇప్పటికే ముందుకు నెట్టిందనీ, కాగా తమ జ్ఞానం పాతదశలోనే ఆగిపోయిందని చూడడంలో వారు విఫలమవుతారు. మొండి ఘటాలందరి ఆలోచనా సరళికి ఇది ప్రత్యేక లక్షణం. వారి ఆలోచన సామాజిక కార్యాచరణ నుండి దూరమై పోయింది. వారు సమాజ రథాన్ని నడపడానికి ముందుకురకలేరు...".

"అతివాద వాగాడంబరాన్ని కూడా మనం వ్యతిరేకిస్తాం. అతివాదుల ఆలోచనా సరళి, ఆ భౌతిక క్రమంలోని అప్పటి అభివృద్ధి దశను మీరిపోతుంది. కొందరు తమ వెర్రిమొర్రి ఊహాలనే సత్యం అనుకుంటారు. మరి కొందరు భవిష్యత్తులో మాత్రమే సాధించవీలయ్యే ఆశయాన్ని ప్రస్తుతంలోనే సాధించాలని శ్రమిస్తారు. వారు అత్యధిక సంఖ్యాక ప్రజల వర్తమాన ఆచరణ నుండి నేటి వాస్తవాల నుండి, తమకు తామే వేరుపడిపోయి, తమ చర్యలలో దుస్సాహసికులుగా బయటపడుతారు" (మావో రచనలు, 1వ సంపుటి, ఆచరణ, జులై 1937, 403వ పేజీ).

ఒక ఎంటిటిని (విషయాన్ని) నిరంతరం చలనంలో భాగంగా మార్పులకు గురయ్యేదిగా చూడాలని, దాని ప్రకారమే వర్గపోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని, విప్లవోద్యమాన్ని విశ్లేషించి, నిర్దిష్ట స్థల, కాలాల్లోని ఉద్యమాలను వాస్తవికంగా అంచనావేసి, గైడెన్స్‌ను అందించాలని, నిర్దిష్ట స్థల, కాలాల్లోని విప్లవోద్యమంలోని చలనాన్ని స్వీయాత్మకంగా విశ్లేషిస్తే అందులోని మార్పును సరిగా

గుర్తించకపోవడమేకాకుండా వాస్తవిక స్థితికి భిన్నంగా ఇచ్చే గైడెన్స్ రాజకీయంగా అతివాద, మితవాద తప్పిదాలకు దారితీస్తుందని పైన పేర్కొన్న మావో మాటల ఉద్దేశం.

విప్లవకాలంలో పరిస్థితి చాలా త్వరితంగా మారిపోతుంది. కాబట్టి సామాజిక ఉద్యమాలను నడిపే విప్లవ నాయకులు, ఒక భౌతిక క్రమం అప్పటికే పెంపొంది, అభివృద్ధిలో ఒక దశ నుండి వేరే దశకు మారిపోయినప్పుడు, తాము, తమతోపాటు తోటి విప్లవకారులందరూ కూడా వారి వారి స్వీయాత్మక విజ్ఞానంతో, తదనుగుణంగా పెంపొంది, మారేలాగున చేయడంలో కూడా సిద్ధహస్తులై ఉండాలనీ, అంటే ప్రతిపాదించబడ్డ కొత్త విప్లవ కర్తవ్యాలు, కొత్త కార్యక్రమాలు పరిస్థితులలో వచ్చిన కొత్త మార్పులకు అనుగుణంగా ఉండేట్టు తప్పనిసరిగా జాగ్రత్త వహించాలని మావో చెపుతాడు.

అయితే విప్లవకాలంలో మారే పరిస్థితులను గతితార్కిక భౌతికవాద పద్ధతుల్లో అధ్యయనం చేయకుంటే స్వీయాత్మకతకు గురవుతాం. అది ఒక ధోరణిగా మారితే రాజకీయంగా అతివాద, మితవాద పొరపాట్లు చేస్తాం. అందుకే తొందరపాటుతనంతో, స్వీయాత్మకతకు గురికాకుండా గతితార్కిక భౌతికవాద పద్ధతితో మార్పులను అధ్యయనం చేసి రాజకీయంగా తగిన కర్తవ్యాలను, ఎత్తుగడలను రూపొందించుకోవడం అవసరం.

2007వ సంవత్సరంలో భారత విప్లవోద్యమం పురోగమన స్థితిలో ఉండగా, 2013 నాటికి గడ్డుస్థితికి వెళ్ళింది. ఇప్పటికీ అది సాధారణంగా గడ్డుస్థితిలోనే ఉంది. భారత విప్లవోద్యమం పురోగమన స్థితిలో ఉన్నప్పుడు రూపొందించుకున్న తక్షణ, ప్రధాన, కేంద్రకర్తవ్యాన్ని భౌతిక పరిస్థితిలోని మార్పులకు అనుగుణంగా మార్చుకోవడం ద్వారానే మనం విప్లవోద్యమాన్ని సరిగా నడపగలుగుతాం. అయితే ఈ మార్పులు పరిమాణాత్మక మార్పులే, కాబట్టి ఎత్తుగడల మార్పు మాత్రమే చేసుకోవాలి.

భారతదేశ విప్లవోద్యమం/ప్రజాయుద్ధం, విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్ని ఎదుర్కొంటుంది. ఈ రెండు విరుద్ధాంశాల మధ్య ఘర్షణ ఫలితంగా సాగే భౌతిక క్రమపు స్థితి (విప్లవోద్యమ స్థితి) పట్ల స్వీయాత్మకతకు, అందులోభాగంగా మితవాద, అతివాద అంచనాలకు లోనుకాకుండా ఉండడం కోసం ప్రతి రెండు-నాలుగు సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఏరియాల/స్పెషల్‌జోనల్/రాష్ట్ర ప్లీనాలు, రీజినల్ బ్యూరోల సమావేశాలు-విస్తృత సమావేశాలు, దాదాపు మూడు-నాలుగు సంవత్సరాలకు ఒకసారి కేంద్రకమిటీ సమావేశాలు జరుపుకుంటూ ఉద్యమ స్థితిని అంచనా వేస్తున్నాం. 2010లో కేంద్రకమిటీ మూడవ సమావేశం చేసిన తీర్మానాన్ని అనుసరించి 2011 అక్టోబరులో దండకారణ్య ప్లీనం, 2012లో సెంట్రల్ రీజినల్ బ్యూరో సమావేశం, 2012లో బీహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా ప్లీనం జరిగాయి. 2013లో కేంద్రకమిటీ 4వ సమావేశం జరిగింది. ఈ సమావేశ తీర్మానాన్ని అనుసరించి 2014లో ఈస్టర్న్ రీజినల్ బ్యూరో సమావేశం,

2014లో సెంట్రల్ రీజినల్ బ్యూరో విస్తృత సమావేశం, 2015లో ఈస్టర్న్ రీజినల్ బ్యూరో విస్తృత సమావేశం, 2017లో పూర్వీ బీహార్-పూర్వోత్తర్ ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా ప్లీనం జరిగి ఆయా స్పెషల్ ఏరియాల/స్పెషల్‌జోన్ల/రాష్ట్రాల, బ్యూరోల్లోని విప్లవోద్యమ స్థితిని అంచనావేయగా, 2013, 2017లో జరిగిన కేంద్రకమిటీ సమావేశాలు దేశవ్యాప్త విప్లవోద్యమ స్థితిని అంచనా వేశాయి. ఆయా స్పెషల్ ఏరియాల/స్పెషల్‌జోన్ల/రాష్ట్రాల, రీజినల్ బ్యూరోల ఉద్యమ స్థితిపై ఆయా ఎస్‌ఏసీ/ఎస్‌జెడ్‌సీ/ఎస్‌సీలు, రీజినల్ బ్యూరోలు తమ అంచనాతోపాటు, ఆ అంచనాపై ఆధారపడి తగిన తక్షణ కర్తవ్యాల్ని నిర్దేశించాయి. అలాగే కేంద్రకమిటీ కూడా 2013వ సంవత్సరం నాటికి దేశవ్యాప్త ఉద్యమస్థితి గడ్డుగా మారిందనే అంచనాతోపాటు, ఆ స్థితిని అధిగమించడానికి చేపట్టాల్సిన కర్తవ్యాల్ని కూడా రూపొందించింది. అలాగే 2017 కేంద్రకమిటీ సమావేశం కూడా చేపట్టాల్సిన కర్తవ్యాల్ని రూపొందించింది.

సాధారణంగా, కాంగ్రెస్ రూపొందించిన కర్తవ్యాల ప్రకారమే, తదుపరి కాంగ్రెస్ వరకు దేశవ్యాప్త పార్టీ తన కార్యకలాపాలను సాగిస్తుంది. అయితే భౌతిక క్రమపు అభివృద్ధి దశలకు అనుగుణంగా మన కర్తవ్యాలను మార్చుకోకుండా ఉంటే విప్లవోద్యమం నష్టాల పాలవుతుంది. అందుకే ఎప్పటికప్పుడు విప్లవోద్యమ భౌతిక క్రమపు అభివృద్ధిని వాస్తవికంగా అంచనావేయడం కోసం స్పెషల్ ఏరియాల/స్పెషల్‌జోన్ల/రాష్ట్రాల ప్లీనాలు, రీజినల్ బ్యూరోల విస్తృత సమావేశాలు, వీలయితే కేంద్ర ప్లీనాలు జరుపుకుంటూ, కాంగ్రెస్ నిర్దేశిత కర్తవ్యాలను గమనంలో ఉంచుకుంటూనే, వాటిలో అవసరమైన మార్పులు చేసుకోవడమే సరైనదవుతుంది. కాంగ్రెస్ నిర్దేశిత కర్తవ్యాలను తిరిగి కాంగ్రెస్‌లోనే మార్చుకోవాలనడం యాంత్రికవాద అవగాహన అవుతుంది.

విప్లవోద్యమం అనే ఎంటిటిలోని రెండు విరుద్ధాంశాలయిన శతృదాడి-మన ప్రతిదాడి నడుమ (విప్లవయుద్ధం-విప్లవ ప్రతీఘాతుక యుద్ధం) సాగే ఘర్షణ ఫలితంగా జరిగే మార్పులకు అనుగుణంగా కర్తవ్యాలను మార్చుకోవడం తాత్వికంగా, రాజకీయంగా సరైనదవుతుంది. తాత్వికంగా, రాజకీయంగా సరైనదైనప్పుడు దానికి లోబడే నిర్మాణ పద్ధతి ఉండాలి లేదా సారానికి లోబడి పద్ధతి (ఫారమ్) ఉండాలి. విప్లవ ప్రతీఘాతుక దాడి తీవ్రంగా కొనసాగే పరిస్థితుల్లో స్పెషల్ ఏరియాల/స్పెషల్‌జోన్ల/రాష్ట్రాల ప్లీనాలు, రీజినల్ స్థాయి విస్తృత సమావేశాలు/ప్రత్యేక సమావేశాలు/ప్లీనాల ద్వారా తమతమ స్పెషల్ ఏరియాలు/స్పెషల్‌జోన్లు/రాష్ట్రాలలో, రీజియన్‌లలో కాంగ్రెస్ నిర్దేశిత కర్తవ్యాల సాధన కోసం సాగుతున్న రాజకీయ, సైనిక, నిర్మాణ కృషి, అందులోని పురోగతి-తిరోగతి లేదా పాజిటివ్-నెగెటివ్ అంశాలను చర్చించి, కేంద్రకమిటీకి తమ అంచనాలతోపాటు, ప్రతిపాదనల్ని పంపితే, కేంద్రకమిటీ ప్రజాస్వామిక పద్ధతిని అనుసరించి తీసుకునే నిర్ణయాలు పార్టీ మొత్తానికి శిరోధార్యంగా ఉంటాయి. ఈ పద్ధతి యాంత్రిక

అవగాహనకు భిన్నంగా శాస్త్రీయమైనదేకాకుండా, కేంద్రీకృత ప్రజాస్వామిక పద్ధతిని కూడా అనుసరించినట్లవుతుంది.

చైనాలో 1928లో 6వ కాంగ్రెస్ జరిగితే 17 సంవత్సరాల తరువాతనే 1945లో 7వ కాంగ్రెస్ జరిగింది. ఈ మధ్యకాలంలో పార్టీ తన పంథానే మౌలికంగా మార్చుకుని దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అనుసరించింది. జపాన్ చైనాపై దురాక్రమణకు పాల్పడి, దాన్ని వలసగా మార్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న స్థితిలో, అప్పటివరకు కొమింగ్‌టాంగ్‌కు వ్యతిరేకంగా సాగుతుండిన అంతర్యుద్ధం స్థానంలో జపాన్ వ్యతిరేక జాతీయ విముక్తి యుద్ధానికి నూతన కార్యక్రమాన్ని సున్‌యీ కాన్ఫరెన్స్ (పొలిటికల్ బ్యూరో విస్తృత సమావేశం) రూపొందించింది. కాబట్టి విప్లవోద్యమ స్థితిలో జరిగే మార్పులపై, ఉద్యమ బలాబలాల్లో జరిగే మార్పులపై, దేశీయ–అంతర్జాతీయ పరిస్థితిలో చోటు చేసుకునే పరిణామాలపై ఆధారపడి మనం తక్షణ, ప్రధాన, కేంద్రకర్తవ్యాన్ని మార్చుకోవడం ద్వారానే విప్లవోద్యమాల్ని సరిగా నడపగలుగుతాం. దానికి భిన్నంగా ఉద్యమ స్థితిని స్వీయాత్మకంగా (అతివాద, మితవాద ధోరణులతో) అంచనావేసినా, ఫారానికి (పద్ధతికి) ప్రాధాన్యతనిచ్చే యాంత్రికవాద దృష్టితో ఉద్యమాన్ని గైడ్ చేసినా నష్టపోతాం.

మన పార్టీ మొదటి (8వ) కాంగ్రెస్ తర్వాత రెండవ కాంగ్రెస్ – ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ జరగడానికి 37 ఏళ్ల కాలం పట్టింది. ఈ 2వ కాంగ్రెస్ జరిగి ఇప్పటికే 10 ఏండ్ల కాలం ముగిసిపోయింది. గత దశాబ్ద పరిస్థితిని పరిశీలించి చూస్తే భారత విప్లవోద్యమంపై పాలకవర్గాలు కొనసాగిస్తూ వస్తున్న అత్యంత తీవ్రమైన ప్రతీఘాతుక దాడి వల్ల సమీప భవిష్యత్తులో మరో కాంగ్రెస్ జరుపుకునే అవకాశాలు కనిపించడం లేదు. 1960ల చివరి నుండి ప్రపంచంలో వివిధ దేశాల్లో జరుగుతున్న విప్లవోద్యమాల చరిత్ర మన చరిత్ర లాగే ఉంది. ఈ స్థితిలో భారత విప్లవోద్యమానికి సరైన మార్గదర్శకత్వాన్ని అందించడానికి గానూ కేంద్రకమిటీ చొరవగా పనిచేయాల్సి ఉంటుంది.

రాష్ట్రకమిటీలు రెగ్యులర్‌గా సమావేశాలు నడుపుకుంటూ, ఆయా స్పెషల్ ఏరియాలు/స్పెషల్‌జోన్లు/రాష్ట్రాలలో జోనల్/జిల్లా/డివిజనల్, స్పెషల్ ఏరియా/స్పెషల్ జోనల్/రాష్ట్ర, రీజినల్ బ్యూరోల ప్లీనాలు జరిగిన పరిస్థితుల్లో కాంగ్రెస్ గానీ, కేంద్ర స్థాయి ప్లీనాలు గానీ జరగనప్పటికీ కేంద్రకమిటీ, పొలిటికల్ బ్యూరో ఉద్యమ స్థితిని సమీక్షించి, అంచనా వేసి ఎత్తుగడల్ని మార్చుతుంది, నూతన ఎత్తుగడల్ని రూపొందిస్తుంది. రాజకీయ, సైనిక, నిర్మాణపరమైన విషయాల్లో కీలక నిర్ణయాల్ని చేస్తుంది. రీజినల్ బ్యూరోలు, స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్లు/రాష్ట్రకమిటీలు చేసే ఉద్యమ సమీక్షలకు, ఎత్తుగడల మార్పుకు కేంద్రకమిటీ/పొలిట్‌బ్యూరోలు దిశానిర్దేశం చేస్తాయి. ఇది కూడా కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో భాగమే.

గడ్డు స్థితిలో కేంద్రకమిటీ మొత్తం సమావేశం కానప్పటికీ ఎక్కడికక్కడ రీజినల్ బ్యూరోలు, ఆయా స్పెషల్ ఏరియాలు/స్పెషల్‌జోన్లు/రాష్ట్రాలలో పనిచేసే కేంద్రకమిటీ సభ్యులు సమిష్టి టీములుగా కేంద్రకమిటీ తరపున ఆయా ఉద్యమాలను గైడ్ చేయాలి. టీములు లేనిచోట ఆయా స్పెషల్ ఏరియాలను/స్పెషల్‌జోన్లను/రాష్ట్రాలను గైడ్ చేసే కేంద్రకమిటీ సభ్యులు ఒక్కరయినా మన పంథా ఆధారంగా చొరవగా పనిచేయాలి.

అంతర్యుద్ధ పరిస్థితుల్లో, గడ్డు స్థితిలో విప్లవోద్యమం దెబ్బతినిపోకుండా ఉండడం కోసం కేంద్రకమిటీ పైన చెప్పిన పద్ధతుల్లో పనిచేయడం అవసరమే కాక సరైనది కూడా అవుతుంది. గడ్డు పరిస్థితుల్లో రీజియన్ల వారీగా, ప్రాంతాల వారీగా కేంద్రకమిటీ సభ్యులు సమిష్టి టీములుగా ఉంటూ ఉద్యమానికి తగిన గైడెన్స్ ఇచ్చేలా, కమాండ్ చేస్తూ పనిచేయనట్లయితే ఉద్యమంలో సమన్వయరాహిత్యం తలెత్తి, చొరవ తగ్గిపోయి, దెబ్బతినిపోయి, ఓడిపోయే పరిస్థితి నెలకొంటుంది. అందుకే కాంగ్రెస్, కేంద్ర ప్లీనాలు జరగనప్పటికీ కేంద్రకమిటీ కేంద్రీకృత ప్రజాస్వామిక పద్ధతిని అనుసరించి చేసే ఉద్యమ సమీక్షలు, రూపొందించే ఎత్తుగడలు, చేసే కీలక నిర్ణయాలను పార్టీ అంతటా అమలు చేయాలి. కేంద్రీకృత ప్రజాస్వామిక పద్ధతిని అనుసరిస్తూ పార్టీ యావత్తు ఆ నిర్ణయాలను అమలు చేస్తూనే, వాటిపై తమ అభిప్రాయాలను కేంద్రకమిటీకి పంపవచ్చు. యావత్తు పార్టీ నుండి వచ్చే అభిప్రాయాలను కేంద్రకమిటీ సమీక్షించి తిరిగి నూతన కర్తవ్యాలను, ఎత్తుగడలను రూపొందిస్తుంది. గడ్డు స్థితి తొలగి, అనుకూల స్థితి తలెత్తే వరకు రాష్ట్ర ప్లీనాలు, బ్యూరో ప్లీనాలు జరుపుకోవడంతో పాటు పై పద్ధతిని అనుసరించడం కూడా అవసరమే.

మన ఆచరణలో ఉద్యమస్థితిని అధ్యయనం చేయడం (అంచనా వేయడం)లోగానీ, తగిన కర్తవ్యాల్ని రూపొందించడంలో మనం స్వీయాత్మకతకుగానీ, మితవాద, అతివాదాలకుగానీ, యాంత్రికతకుగానీ గురి కాలేదు. 2011 అక్టోబరులో జరిగిన దండకారణ్య ప్లీనం, ఆ స్పెషల్ జోన్ ఉద్యమం గడ్డుస్థితిలో ఉందని అంచనా వేసింది. ఏకతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ కేంద్ర కర్తవ్యాన్ని రూపొందించడానికి కీలకమైన ఆధారాల్లో ఒకటిగా వున్న డీకే ఉద్యమం గడ్డుస్థితిలోకి వెళ్ళిందనే డీకే ప్లీనపు అంచనాను పరిగణనలోకి తీసుకుని పీఎల్‌జీఏ ఫార్మేషన్ల గురించి, యుద్ధ స్థాయి గురించి, యుద్ధ వనరులు సంపాదించుకోవడం గురించి, విస్తరణ గురించి సీఆర్‌బీ ఆగస్టు 2012 సమావేశం కిందివిధంగా తీర్మానం చేసింది.

“డీకేలో ప్రజాపునాది బలహీనపడినందున సెంట్రల్ రీజియన్ వ్యాప్తంగా రానున్న రెండేళ్ళ కాలంలో కంబాట్ బలగాల కన్సాలిడేషన్‌పైన కేంద్రీకరించాలి. డీకేతోసహా ఇతర ప్రాంతాల్లో కంబాట్ బలగాల ఫార్మేషన్లను విస్తరించవద్దు, ఉన్నత ఫార్మేషన్లను ఏర్పాటు చేయవద్దు. తప్పనిసరిగా అవసరమైనచోట కొన్ని యూనిట్లను (ఎల్‌జీఎస్, ప్లాటూన్లు) ఏర్పాటు చేసుకోవచ్చు.

రిక్రూట్‌మెంట్ తగ్గిన పరిస్థితుల్లో, కంబాట్ యూనిట్లలో సంఖ్య పెంచలేని పరిస్థితుల్లో వాటిని రాజకీయంగా, మిలిటరీపరంగా, నిర్మాణపరంగా కన్సాలిడేట్ చేస్తూ, వాటి ప్రతిఘటనా సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. బెటాలియన్‌లో రెండేసి కంపెనీలు, కంపెనీల్లో రెండేసి ప్లాటూన్లు, ప్లాటూన్లలో రెండేసి సెక్షన్లు ఉండేలా చూసుకోవాలి. ప్రతి సెక్షన్‌లో నలుగురు-నలుగురు చొప్పున రెండు గ్రూపులకు తగ్గకుండా ఉండేలా చూసుకోవాలి. ఈ సంఖ్యలను నిలబెట్టుకోలేని యూనిట్ల స్థాయిని తగ్గించవచ్చు, రద్దు చేయవచ్చు.

రీజినల్ బలగాల్లో కూడా పై పద్ధతిని పాటించాలి. (ఈ పద్ధతిని అనుసరించి ఒకటవ కంపెనీని నడపలేని పరిస్థితి రీత్యా దాన్ని రెండేసి సెక్షన్లతో, ఒక హెడ్‌క్వార్టర్స్‌తో కూడిన ప్లాటూన్‌గా నడిపించాలి.

ఈ స్థితిలో ప్రధానంగా చిన్న, మధ్యరకపు యుద్ధచర్యల ద్వారా గెరిల్లాయుద్ధాన్ని కొనసాగించాలి. చిన్నటీముల ద్వారా పెద్దచర్యలు చేసే ఎత్తుగడల్ని అనుసరించాలి. నైట్ ఆంబుష్‌ల ద్వారా శత్రువును ఎక్కువగా దెబ్బతీయాలి. పోలీసు కదలికలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను, రూట్లను గుర్తించి తగిన సన్నాహాలు చేసుకుని, ఏటీ, ఆర్‌టీలను వినియోగించి శత్రువును దెబ్బతీయాలి. అన్ని వనరులను సమీకరించుకుని, శత్రువు బలహీనతలను కనిపెట్టి కొన్ని పెద్దచర్యలు చేపట్టాలి.

ప్రజల్ని, మిలీషియాను విస్తృతంగా కదిలించి మైన్ యుద్ధతంత్రాన్ని విస్తృతం చేయాలి. దీనికోసం ఇతర వనరులను ఉపయోగించుకోవడంతోపాటు స్థానిక వనరుల మీద ఆధారపడి గన్‌పౌడర్‌ను పెద్దఎత్తున తయారు చేసుకోవాలి. దీనికోసం గన్‌పౌడర్ తయారీ క్యాంపులను నడపాలి.

గెరిల్లాయుద్ధ నిర్వహణకు అవసరమైన ఏ&ఏ&ఈ కోసం స్థానిక వనరులను వెలికితీయాలి. స్థానిక వనరుల మీద ఆధారపడి మిలీషియాను సాయుధం చేయాలి. ఉన్నవాటిలో సంఖ్య పెంచాలి.

.... .... .... .... .... .... .... .... .... .... .... ....

డీకే-సీఓబీ-ఓఎస్-ఏఓబీల మధ్యనున్న ప్రాంతంలోకి విస్తరించాలి. సీఓబీ నుండి రెండు రూట్లలో బీజేను కలపాలి. ఉత్తర గడ్చిరోలి డివిజన్ పరిధిని పెంచడానికి వీలుకలిగేలా గోందియా డివిజన్ పరిధి గడ్చిరోలి-దేవురి రోడ్డుకు ఆవలివైపుకు పరిమితం చేయాలి".

కాంగ్రెస్ నిర్దేశిత కేంద్ర కర్తవ్యాన్ని మార్చకుండానే, మారిన ఉద్యమ బలాబలాలను పరిగణనలోకి తీసుకుని ఆ కర్తవ్యాన్ని ఏరకంగా అమలు చేయాలో నిర్దిష్టంగా సూచిస్తూ సీఆర్‌బీ తక్షణ కర్తవ్యాల్ని రూపొందించింది. అలాగే 2013 మార్చిలో జరిగిన కేంద్రకమిటీ నాలుగవ

సమావేశం డీకే ఉద్యమం గడ్డుస్థితిలోకి వెళ్ళడం, బీజే ఉద్యమం తాత్కాలిక వెనుకంజ (టెంపోరరి సెట్‌బ్యాక్)కు గురయిన స్థితితోపాటు దేశవ్యాప్త ఉద్యమ స్థితిని విశ్లేషించి, దేశవ్యాప్త ఉద్యమం గడ్డుస్థితిలో ఉందని అంచనా వేసింది. ఈ వాస్తవిక అంచనాపై ఆధారపడి ఉద్యమాన్ని గడ్డుస్థితి నుండి పురోగమన స్థితికి తీసుకురావడం కోసం తరువాతి రెండేళ్ళ కాలంలో అనుసరించాల్సిన సాధారణ మౌలిక ఎత్తుగడలతో కూడిన వ్యూహాత్మక పథకాన్ని రూపొందించింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో శత్రువు దేశవ్యాప్తంగా కొనసాగిస్తున్న బహుముఖ దాడిని ప్రతిఘటించి, ఓడించి ఉద్యమాన్ని రక్షించుకుని ఐక్యతా కాంగ్రెస్ రూపొందించిన కర్తవ్యాల సాధనకు ముందుకుసాగే లక్ష్యంతోనే ఈ ఎత్తుగడల్ని రూపొందించింది. సీఆర్‌బీగానీ, కేంద్రకమిటీగానీ కాంగ్రెస్ నిర్దేశిత కేంద్ర కర్తవ్యాన్ని మార్చకుండానే ఉద్యమ బలాబలాలు మారిన పరిస్థితుల్లో కాంగ్రెస్ నిర్దేశిత కర్తవ్యాల అమలులో యాంత్రికతకు, స్వీయాత్మకతకు గురికాకుండా గతితార్కిక, శాస్త్రీయ దృష్టితో నిర్దిష్టంగా తక్షణ కర్తవ్యాల్ని రూపొందించాయి. ఈ ఎత్తుగడలపై ఆధారపడి మన ప్రతిఘటన కొనసాగిస్తూ ఈ యుద్ధాన్ని పొడిగించడం (డ్రాగ్‌ఆన్) ద్వారా శత్రు పథకాల్ని విఫలం చేశాం.

### 3. కేంద్ర కర్తవ్యం దేశం మొత్తానికి ఒకటే ఉంటుందా? లేక రాష్ట్ర/స్పెషల్ ఏరియా/ స్పెషల్‌జోన్ కమిటీలు కేంద్రకర్తవ్యం రూపొందించుకోవచ్చా? లేక ఈ కమిటీలు తక్షణ కర్తవ్యాల్ని రూపొందించుకునే ప్రాతిపదిక, పద్ధతి ఏమిటి?

భారతదేశ విప్లవోద్యమాన్ని ఒకే (సింగిల్) ఎంటిటి (మొత్తం)గా తీసుకున్నప్పుడు కేంద్రకర్తవ్యం ఒకటే ఉంటుంది. ప్రతి స్పెషల్ ఏరియా/స్పెషల్‌జోన్/రాష్ట్రం కేంద్ర కర్తవ్యాన్ని రూపొందించుకుంటే దేశవ్యాప్త విప్లవోద్యమంలో అనేక కేంద్ర కర్తవ్యాలు ముందుకు వచ్చి, స్వీయాత్మక శక్తుల, భౌతిక వనరుల మోహరింపులో, వాటి కేంద్రీకరణలో, యుద్ధ నిర్వహణలో అస్తవ్యస్థత ముందుకు వచ్చి, భౌతిక స్థితిలో (ప్రజాయుద్ధంలో) ఎక్కడా గుణాత్మక మార్పును తీసుకురాలేకపోతాం. ఎక్కడా గెరిల్లా బేసుల్ని-విముక్తి ప్రాంతాల్ని నిర్మించలేకపోతాం. కాబట్టి భారత విప్లవోద్యమంలో నిర్ణీత వ్యూహాత్మక ప్రాంతాల్లో గెరిల్లా బేసులు-విముక్తి ప్రాంతాలు నెలకొల్పే కేంద్ర కర్తవ్యాన్ని ఎంచుకోవడం ద్వారానే పరిస్థితిలో గుణాత్మక మార్పును తీసుకురాగలుగుతాం. అందుకే స్పెషల్ ఏరియా/స్పెషల్ జోనల్/రాష్ట్ర ఉద్యమాలు తమకంటూ విడిగా కేంద్ర కర్తవ్యాన్ని రూపొందించుకోజాలవు/రూపొందించుకోకూడదు. అన్ని రాష్ట్రాలు తమ ప్రాంత ఉద్యమ బలం ఎంత పరిమితమయినప్పటికీ, అవి కేంద్ర కర్తవ్యాన్ని సాధించడం కోసం తమ స్పెషల్ ఏరియాల్లో/ స్పెషల్‌జోన్లలో/రాష్ట్రాల్లో శక్తిమేరకు వర్గపోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని నడుపుతూ, తమ ప్రాంతాల నుండి స్వీయాత్మక శక్తుల్ని, భౌతిక వనరులను కేంద్ర కర్తవ్య సాధన కోసం కేటాయించాలి. కేంద్ర కర్తవ్యం అంటేనే దేశంలోని అన్ని స్పెషల్ ఏరియాలు/స్పెషల్‌జోన్లు/రాష్ట్రాలు, అన్ని

విభాగాలు దాని సాధన కోసం కృషి చేయాలి. అన్ని స్పెషల్ ఏరియాలు/స్పెషల్‌జోన్లు/రాష్ట్రాలు కేంద్ర కర్తవ్యాన్ని ముందుంచుకుని కృషి చేస్తూనే తమ ప్రాంతాల్లో ఉద్యమాన్ని అభివృద్ధి చేయడం కోసం **ఒక ప్రధాన కర్తవ్యాన్ని,** ఆ ప్రధాన కర్తవ్య సాధనకు తోడ్పడేలా పార్టీ, మిలిటరీ, ఐక్యసంఘటన రంగాలకు సంబంధించిన **తక్షణ కర్తవ్యాల్ని** లేక రాజకీయ, సైనిక, నిర్మాణపరమైన తక్షణ కర్తవ్యాల్ని రూపొందించుకోవాలి. అన్ని స్పెషల్ ఏరియాలు/స్పెషల్‌జోన్లు/రాష్ట్రాలు **మొదట కేంద్ర కర్తవ్యాన్ని ముందుంచుకుని దాని సాధనకు తోడ్పడేలా తమ తమ ప్రాంతాల్లో ఒక ప్రధాన కర్తవ్యాన్ని, ఇతర తక్షణ కర్తవ్యాల్ని రూపొందించుకోవడమే సరైన పద్ధతి.**

అయితే, స్పెషల్ ఏరియాలు/స్పెషల్‌జోన్లు/రాష్ట్రాలు తమ తమ ప్రాంతాల్లో ప్రధాన కర్తవ్యాల్ని, ఇతర తక్షణ కర్తవ్యాల్ని ఏ ప్రాతిపదికగా నిర్ణయించుకోవాలి? ఏ పద్ధతి ప్రకారం రూపొందించుకోవాలి?

విప్లవమంటేనే సాయుధ శక్తి ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం. కాబట్టి విప్లవానికి సన్నాహాల నుండి మొదలుకుని అన్ని దశల్లో, అన్ని రంగాల్లో అధికారాన్ని హస్తగతం చేసుకునే కేంద్రకర్తవ్యంతోనే ఉద్యమాలను అభివృద్ధి చేయాలి. ఈ సార్వత్రిక నియమాన్ని మనం అన్వయించుకోవడానికి మన పార్టీ రూపొందించిన “భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు” డాక్యుమెంట్ మనకు స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. ఈ డాక్యుమెంట్ ప్రకారం అసమాన ఆర్థిక, రాజకీయ అభివృద్ధితో కూడిన అర్థవలస, అర్థ భూస్వామ్య స్వభావమే భారతదేశ సమాజపు స్వభావం. ఇదే మన రాజకీయ వ్యూహాన్నీ, ఎత్తుగడలనూ, సైనిక వ్యూహం-ఎత్తుగడలనూ మౌలికంగా నిర్ణయించే అతి ముఖ్యమైన స్వాభావిక లక్షణం.

భారతదేశ అసమాన ఆర్థిక, రాజకీయ అభివృద్ధి, అర్థవలస, అర్థ భూస్వామ్య సమాజ స్వభావమే మన దేశంలో ప్రాంతాలవారీగా అధికారాన్ని హస్తగతం చేసుకునే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అనుసరించేలా చేస్తున్నాయి. భారతదేశ అసమానాభివృద్ధి ఫలితంగా వర్గపోరాటంలో, ప్రజాయుద్ధంలో కూడా అసమానతలు ఉంటాయి. వర్గపోరాటం-ప్రజాయుద్ధంలోని అసమానతల ఫలితంగా కొన్ని ప్రాంతాలు ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా, కొన్ని ప్రాంతాలు గెరిల్లాజోన్లుగా ఉంటే, మరికొన్ని ప్రాంతాలు గెరిల్లాబేసులు-విముక్తి ప్రాంతాలుగా ఉంటాయి. రాజ్యాధికారాన్ని కేంద్రంగా చేసుకునే పోరాట ప్రాంతాల స్థాయిని పై విధంగా విభజించుకున్నాం. ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలంటే శతృవు అధికారం కొనసాగే ప్రాంతాలనీ, ఆ ప్రాంతాల్లో గెరిల్లాజోన్లను నిర్మించడానికి సన్నాహాలు చేస్తామనీ, శతృవుతో అధికారం కోసం పోటీపడే ప్రాంతాలే గెరిల్లాజోన్లనీ, ప్రజా రాజ్యాధికారం నిర్మాణమయ్యి-అమలయ్యే ప్రాంతాలే గెరిల్లాబేసులు-విముక్తి ప్రాంతాలనీ మనం వర్గీకరించుకున్నాం.

ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో ప్రధాన, తక్షణ కర్తవ్యాల్ని

రూపొందించుకోవాలి. నూతనంగా ఉద్యమం ప్రారంభించిన ప్రాంతాలను ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం తక్షణ, **ప్రధాన కర్తవ్యం**గా ఉంటుంది. ఆ ప్రధాన కర్తవ్య సాధనకు తోడ్పడేలా పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన రంగాలకు సంబంధించిన ఇతర **తక్షణ కర్తవ్యాల్ని** రూపొందించుకోవాలి. ఎర్ర ప్రతిఘటనా ప్రాంతంగా అభివృద్ధి చెందిన ప్రాంతంలో గెరిల్లాజోన్‌ను నిర్మించడమే తక్షణ, **ప్రధాన కర్తవ్యం**గా ఉంటుంది. ఆ ప్రధాన కర్తవ్య సాధనకు తోడ్పడేలా పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన రంగాలకు సంబంధించిన ఇతర **తక్షణ కర్తవ్యాల్ని** రూపొందించుకుంటాం. ఒక ప్రాంతం గెరిల్లాజోన్‌గా అభివృద్ధి అయితే ఆ ప్రాంతాన్ని గెరిల్లా బేసులుగా–విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేయడమే తక్షణ, **ప్రధాన కర్తవ్యంగా** నిర్ణయించుకుంటాం. ఈ ప్రధాన కర్తవ్య సాధనకు తోడ్పడేలా ఇతర **తక్షణ కర్తవ్యాల్ని** రూపొందించుకుంటాం.

ప్రజాయుద్ధంలో గెలుపు, ఓటమి, తిరిగి గెలుపు, తిరిగి ఓటమి, అంతిమంగా విజయం అనే సాధారణ నియమాన్ని అనుసరించి విముక్తి ప్రాంతాలు గెరిల్లాజోన్లుగా మారవచ్చు, గెరిల్లాజోన్లు ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా మారవచ్చు, మన సైనిక శక్తిని మించిన స్థాయిలో శత్రువు భారీ సైనిక దాడులు చేసినప్పుడుగానీ, మనం అనుసరించే ఎత్తుగడల్లో లోపాలున్నప్పుడు గానీ విముక్తి ప్రాంతాలు, గెరిల్లాజోన్లు తెల్ల ప్రాంతాలుగా, శత్రు ఆక్రమిత ప్రాంతాలుగా కూడా మారిపోవచ్చు. ఇలాంటి తిరోగమనాలు ఉన్నప్పుడు ఆ ప్రాంతాలను తిరిగి పురోగమించేలా కృషి చేయడమే ప్రధాన కర్తవ్యం అవుతుంది.

ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్ర, ఏఓబీ, ఉత్తర ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బంగ్ ప్రాంతాలు తాత్కాలిక వెనుకంజ (టెంపొరరి సెట్‌బ్యాక్‌లో) ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కొన్ని మైదానప్రాంత టెర్రయిన్‌లోనివి కాగా, కొన్ని వ్యూహాత్మక ప్రాంతాలు. తెలంగాణ, ఏఓబీలు గతంలో శత్రువుతో అధికారం కోసం బలంగా పోటీపడిన గెరిల్లాజోన్ ప్రాంతాలుగా కొన్ని సంవత్సరాలపాటు కొనసాగినవికాగా, పశ్చిమ బంగ్‌లోని బీజేఓ ప్రాంతం కొద్ది కాలంపాటే గెరిల్లాజోన్‌గా ఉనికిలో ఉన్నది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ ఎర్ర ప్రతిఘటనా ప్రాంతంగా ఉంటూనే శత్రుదాడికి తట్టుకోలేక వెనుకంజ వేసిన ప్రాంతం. కాబట్టి తాత్కాలిక వెనుకంజ వేసిన ప్రాంతాల్లో ప్రధాన, తక్షణ కర్తవ్యాల్ని రూపొందించుకునే సందర్భంగా మనం కొన్ని అంశాల్ని చర్చించుకోవాలి, పరిగణనలోకి తీసుకోవాలి.

ఆ అంశాలు –

1. తాత్కాలిక వెనుకంజను ఏ రకంగా అర్థం చేసుకోవడం, ఏ రకంగా నిర్వచించుకోవడం.

2. ఆయా ప్రాంతాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, టెర్రయిన్ పరిస్థితిని అంచనా వేసుకోవడం.

3. ఆ ప్రాంతాలకు ప్రధాన గెరిల్లాజోన్లు-గెరిల్లా బేసులు సరిహద్దులుగా ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడం.

ఒక్కొక్క అంశాన్ని కొంత వివరంగా చూద్దాం.

చైనా విప్లవ యుద్ధ అనుభవాల ఆధారంగా మావో ప్రజాయుద్ధ శాస్త్రాన్ని అభివృద్ధి చేశాడు. మావో రూపొందించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అనుసరించి ప్రజాయుద్ధం వ్యూహాత్మక ఆత్మరక్షణదశ, వ్యూహాత్మక ప్రతిష్ఠంబనదశ, వ్యూహాత్మకదాడిదశ గుండా సాగుతుంది.

ఈ వ్యూహాత్మక దశల్లో కూడా ప్రజాయుద్ధం అనేకసార్లు ఎత్తుగడలపరంగా గెలుపు, ఓటమి, తిరిగి గెలుపు, తిరిగి ఓటమి, అంతిమంగా విజయం గుండా సాగుతూ స్వీయాత్మక బలాన్ని పెంపొందించుకోవడంతో పాటు శత్రు బలాన్ని నాశనం చేస్తూ శత్రువుకు, మనకు బలాబలాల్లో వ్యూహాత్మక మార్పును తీసుకువస్తూ, వ్యూహాత్మక దశల్లో మార్పుల్ని సాధిస్తూ ముందుకు సాగుతుంది. ఈ మూడు వ్యూహాత్మక దశల్లోని యుద్ధాల్లో కూడా ఎదురుదాడి-ఆత్మరక్షణ, పురోగమనం-తిరోగమనం, గెలుపు-ఓటమి ఉంటాయి. అవి ఎత్తుగడలపరంగా ఉంటాయి, వ్యూహాత్మకంగా ఉంటాయి. చైనా విప్లవయుద్ధంలో వ్యూహానికి సంబంధించిన సమస్యలు అనే వ్యాసంలో మావో ఎర్రసైన్యానికి ఓటమి అంటే అర్థం ఏమిటో చెప్పాడు. "వ్యూహాత్మకంగా చెప్పాలంటే మిలిటరి పథకం సంపూర్ణంగా ఓడిపోయినప్పుడే ఎర్రసైన్యం ఓడిపోయినట్లు అర్థం. అప్పుడు కూడా ఆ ఓటమి పాక్షికమైనది, తాత్కాలికమైనది. ఎర్రసైన్యం సంపూర్ణంగా నిర్మూలించబడినప్పుడే ఈ అంతర్యుద్ధంలో ఎర్రసైన్యం సంపూర్ణంగా ఓడించబడినట్లు అర్థం. అయితే ఇది ఎప్పుడూ సంభవించలేదు. విస్తృతమైన విప్లవ స్థావరాలు పోగొట్టుకోవడం, ఎర్రసైన్యం స్థావరం మార్చుకోవలసి రావడం, తాత్కాలికమైన, పాక్షికమైన ఓటమి మాత్రమే. ఇది సంపూర్ణమైన అంతిమమైన ఓటమి ఎంతమాత్రం కాదు" (మావో రచనలు, మొదటి సంపుటి, పేజీ-256, 3వ పేరా) అని మావో ఎర్రసైన్యపు ఎత్తుగడలపరమైన ఓటమి అంటే ఏమిటి, వ్యూహాత్మక ఓటమి అంటే ఏమిటి? అనే వాటి గురించి చెప్పాడు.

ప్రస్తుతం మనం తెలంగాణ, ఆంధ్ర, ఏఓబీ తదితర ప్రాంతాలు తాత్కాలిక వెనుకంజ (టెంపరరి సెట్‌బ్యాక్) స్థితిలో ఉన్నాయని చెబుతున్నాం. ఇది సరైందే. ఇవన్నీ తాత్కాలికమైన, పాక్షికమైన ఓటమిని సూచించేవే. ఇవి వ్యూహాత్మకంగా ఓటమిని సూచించేవి కావు.

మావో ప్రజాయుద్ధంలో ఎత్తుగడలపరమైన ఓటమి, వ్యూహాత్మక ఓటమిల గురించి చెబుతూనే ప్రజాయుద్ధంలో కొన్నిసార్లు ఆటు-పోటులు, ఎగుడు-దిగుళ్ళు, మలుపులు-మెలికలు ఉంటాయని కూడా చెప్పాడు. మూడు వ్యూహాత్మక దశల్లో కూడా ఈ ఆటు-పోటులు, ఎగుడు-దిగుళ్ళు, మలుపులు-మెలికలు ఉంటాయి. ఇవి ఎత్తుగడలపరమైనవే, తాత్కాలికమైనవే. ఇందులో పోటులు,

ఎగుళ్ళు, మలుపులు అనేవి ఉద్యమంలోని అభివృద్ధికి, పురోగమనానికి సూచికలు కాగా ఆటులు, దిగుళ్ళు, మెలికలు తిరోగమనానికి సూచికలు. ఉద్యమంలోని భౌతికస్థితిలోని పరిమాణాత్మక మార్పును సూచించే ఈ స్థితుల్లో ఆ మేరకు ఎత్తుగడల్లో మార్పులుండాలి. ఉద్యమ స్థితిలోని మార్పును అంచనా వేసి దానికి తగినట్టుగా ఎత్తుగడలను రూపొందించుకోవాలి. ఎత్తుగడల మార్పును సూచించకుంటే ఉద్యమ స్థితి మారిందనే అంచనాతో ఉపయోగముండదు. అలాంటి స్థితిలో ఉద్యమ స్థితిపై అంచనాను వ్యక్తీకరించే పదాలు అలంకారిక పదబంధాలవుతాయి, ఉద్యమ స్థితిలో అభివృద్ధి ఉండదు.

మన ప్రజాయుద్ధం వ్యూహాత్మక ఆత్మరక్షణలో ఉన్నప్పటికీ ఒక నిర్ణీత ప్రాంతం ఎర్ర ప్రతిఘటనా ప్రాంత స్థాయి నుండి గెరిల్లాజోన్‌గా, గెరిల్లాజోన్ నుండి గెరిల్లాబేసులు-విముక్తి ప్రాంతంగా అభివృద్ధి అయితే వాటి స్వభావంలో మార్పు వచ్చినట్లు లెక్క. ఈ మార్పు పురోగమనానికి, అభివృద్ధికి సూచిక. అలాగే ఒక నిర్ణీతప్రాంత ఉద్యమం విముక్తి ప్రాంతం-గెరిల్లాబేసుల నుండి గెరిల్లాజోన్‌గా; గెరిల్లాజోన్, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతంగా మారితే కూడా వాటి స్వభావాల్లో మార్పు వచ్చినట్లే లెక్క. ఈ మార్పు తిరోగమనానికి, నకారాత్మక మార్పుకు సూచిక. ఎర్ర ప్రతిఘటన పోరాట స్థాయిలో ప్రజా రాజ్యాధికారం కోసం శత్రువుతో పోటీ పడడానికి సన్నాహాలు చేసుకుంటే, గెరిల్లాజోన్‌లో శత్రు అధికారాన్ని ధ్వంసం చేస్తూ అధికారం కోసం పోటీ పడుతాం; గెరిల్లాబేసుల్లో-విముక్తి ప్రాంతాల్లో ప్రజారాజ్యాధికారాన్ని నిర్మించి, అమలు చేస్తాం. వీటిలో మార్పే వీటి స్వభావంలో మార్పు అని అర్థం, లేదా వాటి గుణాత్మక స్వభావంలో మార్పు అని అర్థం. శత్రుదాడి ఫలితంగా ఆయా పోరాట ప్రాంతాల గుణాత్మక స్వభావంలో మార్పు రానంతవరకు ఎదురయ్యే ప్రతికూలతలన్నీ (ఆటు-పోటులు, ఎగుడు-దిగుళ్ళు, మలుపులు-మెలికలు, గడ్డుస్థితి) పరిమాణాత్మక మార్పులే. కాబట్టి ఒక రాష్ట్రం/స్పెషల్ ఏరియా/స్పెషల్‌జోన్‌లోనయినా పోరాట ప్రాంతాల గుణాత్మక స్వభావంలో నకారాత్మక మార్పు (నెగెటివ్ చేంజ్) రానంతవరకు వాటిని తాత్కాలిక వెనుకంజ (టెంపరరి సెట్‌బ్యాక్)గా నిర్వచించకూడదు.

పైన పేర్కొన్న దాని ప్రకారం ఒక ప్రాంతం ఎర్ర ప్రతిఘటనా ప్రాంతంగా ఉన్న స్థితిలో శత్రువు కొనసాగిస్తున్న భారీ సైనికదాడిని తట్టుకోలేక తీవ్రమైన ప్రతికూలతలు ఏర్పడ్డప్పుడు ఉద్యమం బలహీనపడిందని నిర్వచించుకోవడం సరిగా ఉంటుంది. ఆ ప్రాంతంలో మన కార్యకలాపాలు దాదాపుగా పూర్తిగా నిలిచిపోయి, అది పూర్తిగా తెల్లప్రాంతంగా మారినప్పుడే టెంపొరరి సెట్‌బ్యాక్‌గా వర్గీకరించుకోవాలి. అలాగే ఒక నిర్ణీత గెరిల్లాజోన్‌లో శత్రువుతో అధికారం కోసం పోటీపడలేని స్థాయికి మన ఉద్యమ బలం/ప్రజాయుద్ధ-సైనిక ఫార్మేషన్ల స్థాయి తగ్గినప్పుడు

**దాన్ని దెబ్బతిన్న గెరిల్లాజోన్‌గా** వర్గీకరించుకోవాలి. ఎందుకంటే ఆ ప్రాంతంలో శతృ అధికారాన్ని ధ్వంసం చేస్తూ శతృవుతో అధికారం కోసం పోటీపడే స్థాయిలో మన ప్రజాయుద్ధ-ప్రజాసైన్య ఫార్మేషన్ల స్థాయి లేనప్పటికీ, అవి నూతనంగా ఉనికిలోకి వచ్చిన ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాల కంటే భిన్నమైన లక్షణాలను కలిగి ఉంటాయి. ప్రజాసైన్య ఫార్మేషన్ల స్థాయి, వాటి పోరాట సామర్థ్యం/వాటి అనుభవం, శతృవుపై సాగించే యుద్ధచర్యలు వగైరాల్లో ఈ నిర్దిష్టతలు (భిన్నమైన లక్షణాలు) ఉంటాయి. ఈ నిర్దిష్టతల ఆధారంగా ఎత్తుగడలను రూపొందించుకోవాలి.

పైన పేర్కొన్న వాటి ఆధారంగా చూసినప్పుడు ప్రస్తుతం డీకే, బీజే, పూర్వీ బీహార్-పూర్వోత్తర్ ఝార్ఖండ్ గెరిల్లాజోన్లలో సాపేక్షికంగా గెరిల్లా యుద్ధం ఉన్నత స్థాయిలో కొనసాగుతోంది. డీకేలో ఏరియా, డివిజన్ స్థాయి విప్లవ ప్రజాకమిటీలు కొనసాగుతున్నాయి. బీజే, పూర్వీ బీహార్-పూర్వోత్తర్ ఝార్ఖండ్‌లు సెట్‌బ్యాక్‌లో ఉన్నాయి. అయితే ఈ ప్రాంతాలు ఇప్పటికీ గెరిల్లాజోన్లుగా తమ గుణాత్మక స్వభావాన్ని కోల్పోనప్పటికీ గడ్డు స్థితి ప్రభావం తీవ్రంగా ఉన్న నిర్దిష్టతను పరిగణనలోకి తీసుకుని ఆ స్థితిని అధిగమించడానికి ప్రాధాన్యతనిస్తూ రాజకీయ, సైనిక, నిర్మాణ కృషిని సాగించాలి. ఈ నిర్దిష్టతపై ఆధారపడి 2013లో, 2017లో కేంద్రకమిటీ రూపొందించిన ఎత్తుగడలను అమలు చేయాలి.

దెబ్బతిన్న గెరిల్లాజోన్లుగా ఉన్న తెలంగాణ, ఏఓబీ, బీజెఓ నిర్దిష్టతల ఆధారంగా అక్కడ తక్షణ, ప్రధాన కర్తవ్యాల్ని రూపొందించుకోవాలి. ఆయా ప్రాంతాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, టెర్రయిన్ స్థితిని, ఆయా ప్రాంతాలకు సరిహద్దుగా ప్రధాన గెరిల్లాజోన్లు-గెరిల్లాబేసులు ఉన్నాయా? లేవా? అనే నిర్దిష్టతల ఆధారంగా ఆ ప్రాంతాల తక్షణ, ప్రధాన కర్తవ్యాలు ఉండాలి. **సాధారణంగా దెబ్బతిన్న గెరిల్లాజోన్ ప్రాంతాలను తిరిగి గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేయడమే తక్షణ, ప్రధాన కర్తవ్యంగా ఉండాలి.** అయితే తెలంగాణలోని విశాలమైన టెర్రయిన్ మైదాన ప్రాంతం. బీజెఓ ఉద్యమ ప్రాంత పరిధి చిన్నది, ఈ ప్రాంతం లోని పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజల పోరాట అనుభవం సాపేక్షికంగా తక్కువ, పిఎల్‌జిఏ పోరాట సామర్థ్యం తక్కువ. ఏఓబీలోని టెర్రయిన్‌లో అత్యధికం వ్యూహాత్మక ప్రాంతం, అక్కడ అత్యధిక జనాభా ఆదివాసీ జనాభా. తెలంగాణ, ఏఓబీ, బీజెఓలకు ప్రధాన గెరిల్లాజోన్లు సరిహద్దులుగా ఉన్నప్పటికీ తెలంగాణలోని పార్టీ, పీఎల్‌జీఏ బలగాలు సీజనల్ రిట్రీట్‌లతోపాటుగా, ఇతర సమయాల్లో వెనకతట్టుగా (రియర్‌గా) దండకారణ్యాన్ని ఉపయోగించుకుంటున్నట్లుగా మిగతా ప్రాంతాలు ఇలా ఉపయోగించుకోవటానికి కొన్ని ప్రతికూలతలున్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాలను తిరిగి గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేసే ప్రధాన కర్తవ్యాల్ని సాధించడానికి తోడ్పడేలా తక్షణ కర్తవ్యాలు ఉండాలి.

ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా కొనసాగుతున్న **ఒడిశా, 2యూ రాష్ట్రాల**ను గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేయడం **తక్షణ, ప్రధాన కర్తవ్యం**గా ఉండాలి. **నూతనంగా ఉద్యమం ప్రారంభించిన,**

**విస్తరించిన ప్రాంతాలను** ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం **తక్షణ, ప్రధాన కర్తవ్యంగా ఉండాలి.**

2007లో ఆంధ్ర నుండి మనం ప్రజా గెరిల్లా బలగాలను రిట్రీట్ చేయించిన తర్వాత నుండి గత దశాబ్ద కాలంగా అక్కడ ఉద్యమం వెనుకంజ స్థితిలోనే ఉంది. ఆ ప్రాంతంలో విప్లవోద్యమాల్ని పునర్నిర్మించే దృష్టితో మన పార్టీ ప్రస్తుతం ప్రచార-ఆందోళనా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఈ కృషి ద్వారా సమరశీల పార్టీ శక్తులను, గెరిల్లా శక్తులను తయారు చేసుకొని నూతన పద్ధతిలో తిరిగి ఎర్రప్రతిఘటనా ప్రాంతాల్ని నిర్మించే కర్తవ్యాన్ని మనం చేపట్టాల్సి ఉంది.

సామ్రాజ్యవాదం తన ఆర్థిక, రాజకీయ, సైనిక ప్రయోజనాల కోసం రెండవ ప్రపంచ యుద్ధానంతరం నయా వలస విధానాలను అమలు చేస్తూ వస్తోంది. అందులో భాగంగా 1991 నుండి మరింత కపట, మోసపూరిత, ప్రమాదకర రూపమైన ప్రపంచీకరణలో భాగంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా లాంటి వెనుకబడిన దేశాల్లో రోడ్లు, రవాణా, కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ వ్యవస్థలను, ప్రభుత్వ యంత్రాంగాన్నీ ఆధునీకరిస్తూ పటిష్టం చేస్తున్నది. ప్రపంచీకరణ విధానాలు అమలవుతున్నప్పటి నుండి సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడి ప్రయోజనాల కనుగుణంగా సామ్రాజ్యవాద దేశాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో స్టేట్(రాజ్యం) మరింత ఫాసిస్టు స్వభావాన్ని సంతరించుకుంటున్నది. ఇందులో భాగంగానే అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాల్లో పోలీసు, పారామిలిటరీ, మిలిటరీ బలగాలను పెద్దెత్తున ఆధునీకరిస్తూ సంఖ్యరీత్యా కూడా పెంచివేస్తున్నారు. సామ్రాజ్యవాదం, స్థానిక దళారీ నిరంకుశ బూర్జువాజీ (సీబీబీ) కలిసి వనరుల దోపిడీనీ, శ్రమదోపిడీనీ తీవ్రతరం చేసినందున, ఆ దోపిడీని వెన్నంటి తలెత్తే సాంఘిక అశాంతిని, తిరుగుబాట్లను, గెరిల్లాయుద్ధాలను, విప్లవోద్యమాలను క్రూరంగా అణచివేసి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్ని నియంత్రించడం కోసం కౌంటర్ ఇన్సర్జెన్సీ-కౌంటర్ గెరిల్లావార్ను, ప్రభావవంతంగా నిర్వహించటానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని, స్పెషల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలను, కౌంటర్ గెరిల్లా బలగాల్ని నిర్మిస్తూ ఆధునీకరిస్తున్నాయి. కాబట్టే మన దేశంలో ప్రపంచీకరణ విధానాలు ఆరంభమైనప్పటి (1991) నుండి రాజ్యం మరింత ఫాసిస్టీకరించబడుతున్న దాని ప్రభావం విప్లవోద్యమం నూతనంగా విస్తరించిన ప్రాంతాలతో పాటు అన్ని ఉద్యమ ప్రాంతాల్లో చాలా స్పష్టంగానే కనిపిస్తున్నది. ఈ అంశాల్ని పరిగణనలోకి తీసుకుని నూతనంగా విస్తరించిన ప్రాంతాలతో పాటు అన్ని ఉద్యమ ప్రాంతాల్లోనూ మన రాజకీయ, సైనిక, నిర్మాణ కృషి ఉండాలి. మన పార్టీ, పీఎల్జీఏ, ప్రజాసంఘాలు, విప్లవ ప్రజాకమిటీలు కూడా ఈ స్థితిని ఎదుర్కోవడానికి తగిన రాజకీయ చైతన్యాన్ని, పోరాట సంసిద్ధతను పెంపొందించుకోవడానికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలి. అందుకు తగినట్లుగా అన్ని రంగాల్లోని వివిధ స్థాయిల నాయకత్వం, కేడర్లు తమశక్తి, సమర్థతల్ని పెంచుకోవాలి.

తక్షణ, ప్రధాన, కేంద్ర కర్తవ్యాల్ని పైన పేర్కొన్న పద్ధతిలో రూపొందించుకున్నప్పటికీ, ఆయా ప్రాంతాల ఉద్యమస్థితిలోని ప్రతికూలతలను అధిగమించి, అనుకూలత దిశగా పురోగమింపజేయడానికి రెండు కీలకాంశాలు ఉన్నాయి. అందులో **ఒకటి**–ఉద్యమ ప్రాంతాలంతటా సామాజిక పరిశోధనను చేపట్టి, దాని ఆధారంగా వర్గపోరాటానికి తగిన ఎత్తుగడలు రూపొందించుకుని ప్రజలను రాజకీయంగా సమీకరించి వివిధ ప్రజాసంఘాలలో, ప్రజామిలీషియాలో సంఘటితపరుస్తూ సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్ని తీవ్రతరం చేస్తూ ప్రజాపునాదిని పెంపొందించుకోవడం. ఆ వర్గపోరాట ఆధారంగా నూతన తరాన్ని (నవతరాన్ని) విస్తృతంగా పార్టీలోకి, పీఎల్‌జీఏలోకి సమీకరించడం. **రెండవది** – ఉద్యమ ప్రాంతాలంతటా పీఎల్‌జీఏ ఫార్మేషన్ల స్థాయి, ప్రజా పునాది, టెర్రయిన్ అంశాల ఆధారంగా గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేస్తూ విప్లవ ప్రజాకమిటీలను నిర్మించి సంఘటితపరచడం. ఈ రెండింటిలో లోపాలను, బలహీనతలను సరిదిద్దుకుని, అధిగమించడం అవసరం.

కేంద్ర కర్తవ్యం, ఇతర తక్షణ కర్తవ్యాలు పరస్పర ఆధారితాలు, పరస్పరం ప్రభావం నెరపుకునేవి అనే ఈ రెండింటి లింకును మన పార్టీ నాయకత్వం, కాడర్లు సరిగా ఆకళింపు (గ్రాస్ప్) చేసుకోని ఫలితంగా ఆచరణలో ఈ రెండు కర్తవ్యాల అమలుకోసం సరిగా కృషి చేయలేదు. డీకే, బీజేల్లో ఆ ప్రాంతాలకు నిర్దేశించుకున్న ఉన్నత కర్తవ్యాల సాధనకు చేయాల్సిన కృషిని మెరుగ్గా నిర్వహించడంలో బలహీనతలు, లోపాలు కొనసాగగా, డీకే, బీజే ప్రాంతాలను మినహాయించిన ప్రాంతాలంతటా వర్గ పోరాటాల్ని తీవ్రతరం, విస్తృతం చేయలేదు. దీంతో ఆ ప్రాంతాల్లో రాజకీయ, నిర్మాణ, సైనిక కార్యకలాపాల్లో అభివృద్ధిలేక స్వీయాత్మక శక్తులు సంఖ్యలోనూ, గుణంలోనూ అభివృద్ధి సాధించలేకపోయాయి. దీంతో ఆ ప్రాంతాల ఉద్యమాలూ అభివృద్ధి కాలేదు; డీకే, బీజే ప్రాంతాలకు దన్నుగా కాడర్లను గానీ, పాదార్థిక మద్దత్తును గానీ అందించలేకపోయాయి. దేశవ్యాప్త విప్లవోద్యమం గడ్డు స్థితిలోకి వెళ్లడానికి గల ముఖ్యమైన కారణాల్లో ఈ వైఫల్యం ఒకటి.

ఇప్పటికయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' దాడిని ఓడించి భారత విప్లవోద్యమాన్ని పురోగమింపజేయాలంటే డీకే, బీజే, తూర్పు బీహార్–ఈశాన్య ఝార్ఖండ్, ఏఓబీ ప్రాంతాల్లో మాత్రమే వర్గ పోరాటాల్ని, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేస్తే సరిపోదు, ఈ ప్రాంతాలతో పాటు దేశంలోని ఇతర పోరాట ప్రాంతాలంతటా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాల్ని తీవ్రతరం చేయడం అత్యంత ముఖ్యమైనది. ఈ ప్రాంతాల్లో సాగే వర్గపోరాట అభివృద్ధి భారత విప్లవోద్యమ పురోగమనానికి అతిపెద్ద వనరు, ప్రాతిపదిక అవుతుంది. అవి మరోవైపు డీకే, బీజే, తూర్పు బీహార్–ఈశాన్య ఝార్ఖండ్‌లకు బలమైన దన్నుగా నిలుస్తాయి. కాబట్టి కేంద్రకర్తవ్యానికి ఇతర

కర్తవ్యాలకు మధ్యనున్న పరస్పర సంబంధాన్ని సరిగా అర్థం చేసుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ దేశంలో మరిన్ని నూతన వర్గపోరాట కేంద్రాలను నిర్మిద్దాం.

దేశవ్యాప్త ఉద్యమం గడ్డుస్థితిలోకి వెళ్ళినప్పటి నుండి పార్టీలో కొన్నిచోట్ల, కొద్దిమంది కామ్రేడ్స్ తక్షణ, ప్రధాన, కేంద్రకర్తవ్యాన్ని గురించి లేవనెత్తిన ప్రశ్నలకు, కేంద్రకమిటీ మధ్య మధ్యలో జవాబులు ఇచ్చినప్పటికీ ఈ చర్చనంతటినీ ముగిస్తూ, దేశవ్యాప్త ఉద్యమ పురోగమనం కోసం మార్చ్ 2017లో 'దేశవ్యాప్త విప్లవోద్యమ స్థితిపై అంచనా-మన కర్తవ్యాలు' పేరుతో కేంద్రకమిటీ రూపొందించిన తీర్మానంలో చివరి రెండు పేజీలలో పేర్కొన్న అంశాన్ని ఈ వ్యాసానికి ముగింపుగా పేర్కొనడం ఉచితంగా ఉంటుంది. దాన్నే యధాతదంగా ఇక్కడ పేర్కొంటున్నాం. ఈ తీర్మానంలో నేటి ఉద్యమ నిర్దిష్ట స్థితిరీత్యా రూపొందించుకునే తక్షణ, ప్రధాన కర్తవ్యానికీ, కాంగ్రెస్ నిర్దేశిత కేంద్ర కర్తవ్యానికీ మధ్య ఎలాంటి సంబంధం ఉంటుందో స్పష్టం చేసింది.

**"దేశవ్యాప్త విప్లవోద్యమ గడ్డుస్థితిని అధిగమించడానికి కృషి చేయడమే నేడు మన తక్షణ, ప్రధాన కర్తవ్యం. గడ్డుస్థితిని అధిగమించే కృషిలో మనం సాధించే విజయాల ఆధారంగా, పురోగతి ఆధారంగా 9వ కాంగ్రెస్ నిర్దేషించిన కేంద్ర కర్తవ్యాన్ని సాధించడానికి కృషి చేయాలి.** భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానాభివృద్ధిని అనుసరించి విప్లవోద్యమం ఆయా ప్రాంతాల్లో అసమానంగానే అభివృద్ధి చెందుతుంది. ప్రస్థుతం డీకే, బీజే, పూర్వ బీహార్-ఈశాన్య ఝార్ఖండ్‌లు ప్రధాన గెరిల్లాజోన్లుగా ఉండగా, మిగతా కొన్ని దెబ్బతిన్న గెరిల్లాజోన్లుగా/సెట్‌బ్యాక్‌కు గురయిన ప్రాంతాలుగా, బలహీనపడ్డ ప్రాంతాలుగా, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా/నూతన విస్తరణ ప్రాంతాలుగా ఉన్నాయి.

దేశవ్యాప్త విప్లవోద్యమ గడ్డుస్థితిని అధిగమించడం కోసం డీకే, బీజే, ఈబీ-ఎన్ఈజేఆర్‌కే, ఏఓబీ, టీజీ, ఓఎస్, ఎమ్ఎమ్‌సీ, లాల్‌గఢ్, వెస్ట్రన్‌ఘాట్ ప్రాంతాల్లో పీఎల్‌జీఏ ఫార్మేషన్ల స్థాయి, ప్రజా పునాది, టెర్రయిన్ అంశాల ఆధారంగా **గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేస్తూ, ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో శతృవు సాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక దాడిని గట్టిగా ప్రతిఘటించాలి, ఓడించాలి.**

పైన పేర్కొన్న ప్రాంతాలతో సహా, దేశంలోని ఉద్యమ ప్రాంతాలంతటా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయడం కోసం ఉద్యమ ప్రాంతాలంతటా సామాజిక పరిశోధనను చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి. మనదేశ స్వాభావిక స్వభావం అర్ధవలస-అర్ధ భూస్వామ్యం అని మనం విశ్లేషించుకుని మన రాజకీయ-మిలిటరీ పంథాలను రూపొందించుకున్నాం. మనదేశ సామాజిక స్వభావం మౌలికంగా మారనంతవరకు మన రాజకీయ-మిలిటరీ పంథాలు లేదా మన

రాజకీయ–మిలిటరీ వ్యూహం మారదు. అయితే మనం సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను నడపడం కోసం నిరంతరం మారుతూ ఉండే సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పుల ఆధారంగా ఎత్తుగడలను మార్చుకుంటాం, అభివృద్ధి చేసుకుంటాం. వ్యూహం–ఎత్తుగడల మధ్యనున్న ఈ సంబంధాన్ని సరిగా అర్థం చేసుకోని ఫలితంగానూ, వర్గపోరాటం ఫలితంగా, సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి తన దళారీలయిన దళారీ పెట్టుబడిదారులపై, బడా భూస్వాములపై ఆధారపడి మన దేశంలో చేస్తున్న వ్యవస్థాగత మార్పులను, వ్యవసాయిక, పారిశ్రామిక, సేవా రంగాల్లో చేస్తున్న మార్పులను గతితార్కిక పద్ధతిలో అధ్యయనం చేయని ఫలితంగా లేదా అధ్యయనంలోని జడతార్కిక పద్ధతి (మెటాఫిజికల్) వల్లా వర్గపోరాటానికి తగిన ఎత్తుగడలను రూపొందించుకోవడంలో మనలో బలహీనతలు, లోపాలు కొనసాగున్నాయి. వీటిని అధిగమించడానికి నిర్ణీత గడువులోగా అన్ని ప్రాంతాల్లో సామాజిక పరిశోధనను పూర్తిచేసి, వాటి ఆధారంగా వర్గపోరాట ఎత్తుగడలను అభివృద్ధి చేసుకుని వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి.

బోల్షివీకరణ చేపట్టని రాష్ట్రాల్లో చేపట్టి అక్కడి పార్టీ సైద్ధాంతిక, రాజకీయ స్థాయిని పెంచాలి.

ప్రస్తుత పరిస్థితి–మన కర్తవ్యాలు అనే పేరుతో సీసీ రూపొందించిన కర్తవ్యాలను ఆయా స్పెషల్ ఏరియాల/స్పెషల్ జోన్ల/రాష్ట్రాల ఉద్యమ బలాబలాల ఆధారంగా అమలు చేయాలి.

వీటితోపాటు ఆర్‌బీలు, ఎస్ఏసీ/ఎస్‌జెడ్‌సీ/ఎస్‌సీలు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఆయా రాష్ట్రాలకు తగిన కర్తవ్యాల్ని, ఎత్తుగడలను రూపొందించాలి.

పైన పేర్కొన్న పాజిటివ్ అనుభవాల, నూతన అనుభవాల ఫలితంగా విప్లవోద్యమానికి ఏర్పడుతున్న అనుకూలతలూ దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రముఖ వైరుధ్యాలు పదునెక్కుతున్న ఫలితంగా విప్లవానికి అనుకూలంగా మారుతున్న వస్తుగత స్థితీ, గడ్డుస్థితి అధిగమించడానికి వనరు, ప్రాతిపదిక. అయితే, భారత విప్లవోద్యమాన్ని రానున్న రెండున్నర సంవత్సరాల్లో నిర్మూలించే దుష్టపథకంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవ ప్రతీఘాతుక దాడిని రానున్న రోజుల్లో మరింత తీవ్రతరం చేయనున్న స్థితితోపాటు, మన ఆయుధ సంపత్తి బలహీనంగా ఉన్నందు వల్లా మన **విప్లవోద్యమం సాపేక్షికంగా ఎక్కువ కాలమే గడ్డుస్థితిలో ఉంటుంది.** ఈ అంచనాపై ఆధారపడి మనం సాగించే రాజకీయ, సైనిక, నిర్మాణ కృషిలో నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా, తొందరపాటుకు గురికాకుండా ఉండాలి. మరోవైపు నిష్క్రియపరత్వానికి, చొరవ చేయని స్థితికి గురికాకుండా దృఢసంకల్పంతో, చొరవతో గడ్డుస్థితిని మార్చడానికి చైతన్యయుతమైన కృషిని సాగించాలి. ఈ స్థితిలో పార్టీని బోల్షివైజ్ చేసుకుని, యుద్ధవనరులను సంపాదించుకుని, అత్యంత ధైర్యసాహసాలతో, దృఢసంకల్పంతో గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ, వర్గపోరాటాన్ని సరైన ఎత్తుగడలతో నడిపి బలమైన ప్రజాపునాదిని పెంచుకోవడం ద్వారా నేటి గడ్డుస్థితిని అధిగమిద్దాం.”

*

ప్రకటన

# ఎర్ర విప్లవకర అంతర్జాతీయతా మేడే! – 2017

## మార్క్సిస్టు లెనినిస్టు మావోయిస్టు పార్టీలు సంస్థల ప్రకటన

‘అక్టోబరు విప్లవ పతాకం అజేయమైనది’ - మావో సే టుంగ్



ఇది అక్టోబరు విప్లవ శతవార్షికోత్సవ సంవత్సరం.

గత సంవత్సరం మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ 50వ వార్షికోత్సవం పట్ల వ్యవహరించినట్టుగానే సామ్రాజ్యవాదులు, ప్రతీఘాతకులు, సంస్కరణవాదులూ, అన్ని రకాల అవకాశవాదులూ ఈ ఘటనను తోసిపుచ్చడానికి, కప్పి పుచ్చడానికి, తక్కువ చేయడానికి, మసి పూయడానికీ ప్రయత్నం చేస్తున్నారు.

ఈ ఘటనల నుంచి కార్మికవర్గానికి, ప్రజలకూ అందుతున్న సందేశం మరింతగా ఉనికిలో ఉన్నదని తెలుసు కాబట్టే వాళ్లు ఇలా చేస్తున్నారు.

సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం, యుద్ధం, కార్మికవర్గం పై దోపిడీ, ప్రజల పై పీడనను పారదోలాలంటే మనం కార్మికవర్గ విప్లవం చేయాలి!

కార్మికవర్గం పాలక వర్గాల నుంచి రాజకీయాధికారాన్ని గుంజుకోవాలి, తమ అధికారాన్ని,

తమ రాజ్యాన్ని, కార్మికవర్గ నియంతృత్వాన్నీ నెలకొల్పి సోషలిజం నిర్మించాలి. సామ్రాజ్యవాద సమస్త శృంఖలాలను వదిలించుకుని ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం వైపు సాగడం కోసం ప్రతి దేశంలోనూ యావత్తు ప్రపంచంలోనూ విప్లవాన్ని అభివృద్ధి చేసి కొనసాగించాలి.

'సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' అన్న మహోన్నత గ్రంథంలో లెనిన్ విశ్లేషించి వర్ణించినట్టుగా సామ్రాజ్యవాద వ్యవస్థ కుళ్లిపోయిన, శిథిల వ్యవస్థ అని స్పష్టం అవుతున్నది.

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదము, దాని ప్రభుత్వాలూ లోతైన ఆర్థిక, ద్రవ్య, రాజకీయ, సామాజిక సంక్షోభంలో ఉండి, తమ సంక్షోభ భారాన్ని దేశంలో కార్మికవర్గం పైనా ప్రజల పైనా, అంతర్జాతీయంగా పీడిత ప్రజలు, జాతుల పైనా వేస్తున్నారు.

సామ్రాజ్యవాదం ప్రపంచ నూతన విభజన కోసం ఆర్థిక యుద్ధం, దురాక్రమణ యుద్ధం.

సామ్రాజ్యవాదం ప్రతీఘాతుకత్వం, ఫాసిజం. పెట్టుబడిదారీ విధానపు చరమ దశయిన సామ్రాజ్యవాదం దాన్ని కూల్చివేయవలసిన అవసరాన్ని రోజు రోజుకూ తెలియజేస్తున్నది.

అందుచేతనే లెనిన్, అక్టోబరు విప్లవాల సందేశం ఎన్నటికంటే కూడా సజీవంగా ఉన్నది!

అమెరికాలో అత్యంత సామ్రాజ్యవాదం కింద ట్రంప్ విజయం అమెరికా సామ్రాజ్యవాద సంక్షోభాన్ని, దాని నుంచి బయటపడడం కోసం ఆర్థిక యుద్ధాన్ని, సైనిక పాలనను, భౌగోళిక-రాజకీయ వ్యూహాత్మక ప్రాంతాల పై అదుపును తీవ్రతరం చేయడాన్ని, ప్రపంచంలో వివిధ యుద్ధ క్షేత్రాలలో కూటముల పునర్నిర్వచనాన్నీ ప్రతిబింబిస్తున్నది.

ట్రంప్ విజయం 'అమెరికా ప్రజాస్వామ్యం'గా చెలామణీ అవుతున్న దాని క్రూరత్వాన్ని తెలియజేస్తున్నది. ఫాసిస్టు బిలియనేర్ అధికారంలో ఉండి దేశంలో పేద ప్రజలకు వ్యతిరేకంగా, ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నాడు.

ట్రంప్ విజయం సమస్త సామ్రాజ్యవాద దేశాలలోనూ ప్రతీఘాతుకత్వాన్ని, పోలీసు రాజ్యాన్ని, సైనికీకరణను, శాశ్వత అత్యవసర పరిస్థితిని, కార్మికవర్గ, మహిళల హక్కులకు వ్యతిరేకంగా, ఆఫ్రో అమెరికా ప్రజలకు వ్యతిరేకంగా, అడ్డంకులు, బహిష్కరణలతో శరణార్థులకు వ్యతిరేకంగా, ముస్లింలకు, ఆరబ్‌లకు వ్యతిరేకంగా, స్కూళ్లు, విశ్వవిద్యాలయాలు, ప్రజా మాధ్యమాలు, సంస్కృతి, కళలకు వ్యతిరేకంగా అంతర్గత యుద్ధాన్ని పోషిస్తున్నది.

అమెరికా సామ్రాజ్యవాదపు నూతన దురాక్రమణ దశ అణు అగ్రరాజ్యమైన రష్యా సామ్రాజ్యవాదంతో, నూతన సోషల్-సామ్రాజ్యవాద శక్తి చైనాతో, ప్రస్తుతం జర్మన్ ఆధిపత్యం కింద ఉన్న సామ్రాజ్యవాద ఐరోపా దేశాలతో అంతర్ సామ్రాజ్యవాద వైరుధ్యాలను తీవ్రతరం చేస్తుంది.

సామ్రాజ్యవాద దేశాల మధ్య మార్కెట్‌ల పునర్విభజన కోసం ప్రపంచ పోటీ, శక్తి వనరుల

పై నియంత్రణ కోసం ఘర్షణా దురాక్రమణ, ప్రతీఘాతుక యుద్ధాలకు దారి తీస్తూ పోషిస్తూ ప్రపంచవ్యాప్తంగా మరణాలు, ఊచకోతలు, వినాశనాలను నాటుతున్నాయి.

ప్రపంచంలో ప్రతి మూలలోనూ జరుగుతున్న సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలు వలస మహా వెల్లువకు దారి తీస్తున్నాయి!

సామ్రాజ్యవాద యుద్ధాల క్రూరత్వం, సామ్రాజ్యవాద కోటల నట్టనడుమ కూడా జరుగుతున్న యుద్ధాలూ సామ్రాజ్యవాద దేశాల వీధులనూ రక్తంతో నింపుతున్నాయి!

సమస్త సామ్రాజ్యవాద దేశాలలోనూ, ప్రపంచ ప్రభువుల రాజ్యాలు, ప్రభుత్వాలూ కార్మికవర్గానికీ ప్రజలకూ వ్యతిరేకంగా అంతర్గత యుద్ధం పెంపొందిస్తుంటే, సంక్షోభం, పీడన, అణచివేతలతో వారు మరింతగా పోరాడుతున్నారు, తిరగబడుతున్నారు.

సామ్రాజ్యవాద పీడనలో ఉన్న దేశాలలో కార్మికవర్గం, పీడిత ప్రజలూ సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతి విముక్తి పోరాటాలను తీవ్రతరం చేస్తున్నారు. ముఖ్యంగా మనం జియోనిస్టు రాజ్యం, సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా పాలస్తీనా, ఆరబ్ ప్రజల పోరాటానికి, ప్రజా యుద్ధాలకూ మద్దతునివ్వాలి.

భారతదేశం నుంచి ఫిలిప్పీన్స్ వరకు, టర్కీ నుంచి పెరూ వరకు, మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీల మార్గదర్శకత్వంలో జరుగుతున్న ప్రజాయుద్ధం సామ్రాజ్యవాదం నుంచి, ప్రతీఘాతుక ప్రభుత్వాల నుంచి స్వేచ్ఛ పొందే, నూతన ప్రజాస్వామిక రాజ్యాలను నిర్మించి సోషలిజం వైపుగా సాగే మార్గానికి వనరు.

ఈ మార్గాన్ని వేసి నేడు 'నక్సల్బరీ పోరాట' 50వ వార్షికోత్సవం జరుపుకుంటున్న భారతదేశ ప్రజాయుద్ధం ఊచకోతలకు వ్యతిరేకంగా, గ్రీన్‌హంట్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా, మావోయిస్టులు, ఆదివాసీ ప్రజలు, ప్రజాస్వామిక, విప్లవ మేధావులు, విద్యార్థుల పై, కార్మికులు, రైతాంగం, మహిళా పోరాటాలు, జాతీయ అల్పసంఖ్యాకుల పై నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్నది. అంతర్జాతీయ మద్దతును ఏదీ ఆపలేనట్టే ప్రజాయుద్ధాన్ని, ప్రజా విముక్తి పోరాటాన్ని ఏదీ ఆపలేదని ఇది తెలియజేస్తున్నది.

రివిజనిజం, అవకాశవాదాలకు వ్యతిరేకంగా పోరాడకుండా సామ్రాజ్యవాదానికీ దాని రాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడి గెలవలేం అని అక్టోబరు విప్లవం, మహనీయుడు లెనిన్ రుజువు చేశారు

ప్రపంచంలో ప్రధాన ధోరణి విప్లవమే కావడంతో అందుకు వస్తుగత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. సమస్త సోషల్ డెమోక్రసీ శక్తులు, మాజీ 'కమ్యూనిస్టు' పార్టీలూ రివిజనిస్టులు, సంస్కరణవాదులుగా మారారు. ప్రజల విశ్వాసం కోల్పోయారు. ప్రజల జీవన, పని పరిస్థితులను పరిరక్షించడంలో, సామ్రాజ్యవాదం, యుద్ధం, ఫాసిజం, పోలీసు రాజ్యాలను

వ్యతిరేకించడంలోనూ పనికి రాని సాధనాలుగా తేలిపోయారు.

ఈ శక్తుల సంక్షోభమే కాకుండా, ప్రజలను ఏదో ఒక సామ్రాజ్యవాద వాహకానికి, అంతిమంగా అత్యంత ప్రతీఘాతుక సామ్రాజ్యవాద, బూర్జువా వర్గ ముఠాలకు, దానికి సేవ చేస్తున్న ప్రభుత్వాలకూ కట్టిపడేసేందుకు ప్రజలను విడదీసే ప్రతీఘాతుక బహుళ ధోరణులు, ఛాందసవాద ప్రతీఘాతుక ఉద్యమాలూ పెరగడం చూస్తున్నాం.

తమను నిరాయుధం చేసే లక్ష్యంతో పార్లమెంటరీ, శాంతియుత పంథాలు సృష్టించే భ్రమలను కార్మికవర్గం, ప్రజలూ దృఢంగా నిరాకరించి విప్లవ పంథా చేపట్టాలి. విప్లవాన్ని పరిపూర్తి చేసేందుకు ప్రజాయుద్ధం అత్యంత పురోగామి రూపం. అందుకని ప్రారంభమయిన అన్ని దేశాలలోనూ దానికి మద్దతు ఇవ్వాలి, ఇతర సమస్త దేశాలలోనూ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయిస్తూ అందుకు సన్నాహాలు చేయాలి.

ఇందుకోసం కార్మికవర్గానికి, సమస్త ప్రజల నాయకత్వ కోర్‌కూ అగ్రగామిగా ఉండే నిజమైన కమ్యూనిస్టు పార్టీలను నిర్మించడం అవసరం. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం విప్లవ శాస్త్రం పునాదిగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలు, వాస్తవ పరిస్థితికి అన్వయించిన ప్రజాయుద్ధ ప్రారంభం, అభివృద్ధుల కోసం ప్రజలతో సన్నిహిత సంబంధంతో వర్గ పోరాట కొలిమిలో నిర్మాణమవుతాయి.

కమ్యూనిస్టు పార్టీలు పీడిత ప్రజల, సామ్రాజ్యవాద పీడనలో ఉన్న సమస్త సెక్షన్‌ల ఐక్య సంఘటనను నిర్మించి, రాజకీయ, సైనిక ఆధిపత్యం తీసుకునే రూపానికి అనుగుణంగా అందుకు అవసరమైన ఎత్తుగడలను పెంపొందించాలి.

సామ్రాజ్యవాద దేశాలలో అధిక దోపిడీ, బానిసత్వం, జాత్యహంకారాలకు వ్యతిరేకంగా నూతన వలస కార్మికుల పోరాటంలో అగ్రగామి పాత్ర వహించడం ద్వారా కమ్యూనిస్టు పార్టీలు ఆ శ్రేణులను సమైక్యం చేసుకోవాలి.

విప్లవానికి బలమైన శక్తిగా యువత తిరుగుబాటును, మహిళల పోరాటాన్ని కమ్యూనిస్టు పార్టీలు సమీకరించి సంఘటితం చేయాలి.

కార్మికవర్గ, పీడిత ప్రజల ప్రధాన శత్రువుగా ఉన్న తమ దేశ సామ్రాజ్యవాదం పై పోరాడాలి, దాడికి గురయిన దేశాల ప్రజల పక్షాన నిశ్చయంగా నిలబడాలి.

ప్రత్యేకించి నేడు మనం ఆఫ్ఘనిస్తాన్ పై సామ్రాజ్యవాద ఆక్రమణకు, సిరియా పై సామ్రాజ్యవాద దురాక్రమణకు, ఉత్తర కొరియా పై అణు ప్రమాదాలకూ వ్యతిరేకంగా పోరాడాలి.

సామ్రాజ్యవాద యుద్ధం, బూర్జువా వర్గ ప్రతీఘాతుక నియంతృత్వాల వల్ల సామ్రాజ్యవాద యుద్ధాన్ని ప్రజాయుద్ధంతో తిప్పికొట్టడానికి అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీలు తమ్ము తాము తయారు చేసుకోవలసిన అవసరం ఉన్నది. ఎర్ర సైన్యం కేంద్రకంగా తమ పోరాట శక్తిని



నిర్మించుకోవాలి.

ఊచకోత విధానాలకు తోడుగా శాంతి చర్చల నుంచి కూడా ప్రజాయుద్ధాలు ప్రమాదం ఎదుర్కొంటాయి. ఈ చర్చలు వ్యూహాత్మక దాడి దృష్ట్యా ప్రజాయుద్ధాలు బలపడడానికి, సంఘటితపడడానికీ ఉపయోగపడడం అటుంచి, వాటిని లొంగదీసుకోవడం కోసం దారి మళ్లించడం, ఉక్కిరి బిక్కిరి చేయడం, చీల్చడం లక్ష్యంగా ఉంటాయి.

అంతర్జాతీయత అంటే ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ప్రపంచ కార్మికవర్గం, పీడిత ప్రజల మధ్య ఐక్యత.

అంతర్జాతీయత అంటే **'తమ దేశంలో విప్లవోద్యమ, విప్లవ పోరాట అభివృద్ధికి మనస్ఫూర్తిగా పని చేయడం, ఈ పోరాటానికి మద్దతు అందించడం (ప్రచారం, సానుభూతి, పాదార్థిక సహాయాల ద్వారా), ప్రతి దేశంలోనూ మినహాయింపు లేకుండా ఇది, ఈ పంథా మాత్రమే' – లెనిన్**

అంతర్జాతీయత అంటే, కమ్యూనిస్టుల ప్రస్తుత సమస్యలను పరిష్కరిస్తూ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథా దిశగా, ఒక నూతన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ దిశగా సాగగలిగే ఒక నూతన అంతర్జాతీయ సంస్థ నిర్మాణం.

- మహత్తర అక్టోబరు విప్లవ శత వార్షికోత్సవం వర్ధిల్లాలి!
- సామ్రాజ్యవాదం నశించాలి! ప్రపంచమంతటా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ దిశగా సాగుదాం!
- ప్రపంచ కార్మికవర్గ, పీడిత ప్రజల పోరాటాలు వర్ధిల్లాలి!
- కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!

- ఎర్ర, సోషలిస్టు భవిష్యత్తు కోసం ముందుకు సాగుదాం!
- కమ్యూనిజంలోకి కవాతు చేద్దాం!

**ఈ ప్రకటన పై సంతకం చేసివారు –**

* కలెక్టివ్ ఆఫ్ ఇరానియన్ మావోయిస్ట్స్
* కమిటీ బిల్డింగ్ ది మావోయిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ, గలీషియా, స్పానిష్ స్టేట్
* కమ్యూనిస్ట్ (మావోయిస్ట్) పార్టీ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్
* కమ్యూనిస్ట్ మూవ్‌మెంట్ ఆఫ్ సెర్బియా
* కమ్యూనిస్ట్ న్యూక్లియస్, నేపాల్
* కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ బ్రెజిల్ రెడ్ ఫాక్షన్–సి.పి.బి.(ఆర్.ఎఫ్.)
* భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)*
* కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (రివల్యూషనరీ మావోయిస్టు)
* డెమోక్రసీ అండ్ క్లాస్ స్ట్రగుల్, బ్రిటీష్ స్టేట్
* క్లాసెన్‌స్టాండ్‌పున్క్ట్, క్లాస్ పొజిషన్, ఎడిటోరియల్ స్టా–, జర్మనీ
* మావోయిస్ట్ కమ్యూనిస్ట్ మూవ్‌మెంట్, ట్యునీషియా
* మావోయిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ–ఫ్రాన్స్
* మావోయిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ–ఇటలీ
* మావోయిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ, మణిపూర్
* మావోయిస్ట్ రివల్యూషనరీ లీగ్, శ్రీలంక
* ఆర్గనైజేషన్ డె ట్రవెయిల్ కమ్యూనిస్టె–టునిసి
* పార్టి డెస్ ఖడెహైన్స్–టునిసి
* రివల్యూషనరీ కమ్యూనిస్ట్ పార్టీ (క్యుబెక్ డిస్ట్రిక్ట్)
* రివల్యూషనరీ ప్రాక్సిస్–గ్రేట్ బ్రిటన్
* యూనియన్ ఒబ్రెరా కమ్యూనిస్టా (ఎంఎల్ఎం)–కొలంబియా
* వర్కర్స్ వాయిస్–మలేసియా

***

# జినుగు నరసింహా రెడ్డి లొంగుబాటును, విప్లవ ద్రోహాన్ని అసహ్యించుకుందాం!

# పార్టీనీ, మనల్నీ తీర్చిదిద్దుకొని పటిష్టపరచుకోవడం కోసం ఈ నెగెటివ్ టీచర్ నుండి నేర్చుకుందాం!

**ప్రియమైన కామ్రేడ్స్!**

2017 డిసెంబర్ 23న మన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జినుగు నరసింహా రెడ్డి అలియాస్ జంపన్న అలియాస్ రాజేష్ తన భార్య రజిత (జయ)తో సహా శత్రువు ముందు మోకరిల్లి, ఇందుకు తన అనారోగ్యాన్ని, సైద్ధాంతిక విభేదాలను సాకులుగా చూపాడు. గత కొన్ని సంవత్సరాలుగా అతని వ్యవహార శైలితో సన్నిహిత సంబంధం కలిగిన పార్టీ నాయకత్వానికీ, క్యాడర్లకు ఆయన సరెండర్ ఆశ్చర్యం కలిగించకపోయినప్పటికీ, పార్టీలో ఉన్నత స్థాయి కమిటీ సభ్యుడిగా ఉంటూ ఈ విధంగా సైద్ధాంతికంగా, రాజకీయంగా బలహీనపడి దిగజారిపోవడం, శత్రువుకు సరెండర్ కావడం అతనిని గురించి తెలియని కామ్రేడ్స్‌కూ, విప్లవ ప్రజానీకానికీ ఏదోమేరకు సందేహాలకు తావిచ్చి ఉంటుంది. అయితే, మన పార్టీ సుదీర్ఘ చరిత్ర తెలిసిన వారికెవరికైనా ప్రజాయుద్ధ అభివృద్ధి క్రమంలో ఇలాంటి బలహీనమైన శక్తులు తుదివరకు నిలబడలేక దిగజారిపోతారనీ, విద్రోహులుగా కూడా మారతారనీ సులభంగానే అర్థం చేసుకోగలుగుతారు. విప్లవోద్యమములో, పార్టీలో, ఎంతటి గడ్డు పరిస్థితులలోనైనా ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా తమను తాము మలుచుకోలేని బలహీనులు, అసమర్థులు, ప్రజల ప్రయోజనాల కంటే తమ వ్యక్తిగత ప్రయోజనాల్ని మిన్నగా భావించే స్వార్థపరులు ఈ విధంగా దిగజారిపోవడం అనివార్యమని ద్రోహి నరసింహారెడ్డి మరోసారి రుజువు చేసాడు. నరసింహారెడ్డి సిసి సభ్యుడు అయినప్పటికీ గత రెండు సంవత్సరాలుగా ఆయన తీవ్ర భయాందోళనతో, రాజకీయ గందరగోళంతో, విప్లవ సంసిద్ధతా, త్యాగశీలతా కోల్పోతూ ఊగిసలాటలో ఉండి కనీసం ప్రాథమిక పార్టీ సభ్యుడి చైతన్యాన్ని సైతం ప్రదర్శించలేకపోయాడు. అనారోగ్యం, సైద్ధాంతిక విభేదాలు అనేవి కేవలం తన దిగజారుడును, విప్లవ ద్రోహాన్ని కప్పిపుచ్చుకునేందుకు చెప్పిన సాకులు మాత్రమే. మన పార్టీ కేంద్రకమిటీ నరసింహా రెడ్డి రాజకీయ పతనాన్నీ, శత్రువుకు లొంగిపోవడాన్నీ తీవ్రంగా ఖండిస్తున్నది, ఈ విద్రోహిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నది.

నరసింహా రెడ్డి సహచరి రజిత (జయ) దశాబ్ద కాలానికి పైగా పార్టీలో కొనసాగుతూ డివిసి స్థాయికి ఎదిగింది. కానీ ఆమె ఆయనలోని బలహీనతలు స్పష్టాతిస్పష్టంగా అర్థమవుతున్నప్పటికీ, సహచర కామ్రేడ్స్ ఆయనను విమర్శిస్తున్నప్పటికీ తాను మాత్రం పల్లెత్తు విమర్శ కూడా చేయకుండా సాధారణ జీవితంలోని ఒక భార్యలాగానే వ్యవహరించింది. ఆమె పితృస్వామ్య విలువలనే

పాటిస్తూ తుదకు ఆయనతో పాటు శత్రువుకు లొంగిపోయింది. ఆమె సభ్యత్వాన్ని పార్టీ రద్దు చేస్తోంది.

మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి సోషలిజం-కమ్యూనిజం సాధించే లక్ష్యంతో, ప్రపంచ సోషలిస్టు విప్లవం సాధించే లక్ష్యంతో మన పార్టీ ఏర్పడి పని చేస్తున్నది. ఈ లక్ష్యసాధనకు తగినట్లు వర్గపోరాట క్రమంలో కేంద్రకమిటీ నాయకత్వంలో పార్టీలోని అన్ని యూనిట్లు, పార్టీనీ, తమని తాము సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా తీర్చిదిద్దుకుంటూ పటిష్టపరచడానికి నిరంతరాయంగా కృషి చేయవలసి ఉంటుంది. మనలో ప్రతి ఒక్కరం వివిధ వర్గ నేపథ్యాల నుంచి, వివిధ అవగాహనలు, వైఖరులతో కమ్యూనిస్టు పార్టీలో చేరతాం. మనతో పాటు మనం మన వర్గ స్వభావానికి సంబంధించిన మన వైఖరులను పార్టీలోకి తీసుకొస్తాం. మన దేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం కావడం వల్ల మనం చాలా వరకూ రైతాంగం, పెటీబూర్జువా వర్గ నేపథ్యం నుంచి పార్టీలో చేరుతాం. తక్కువ మంది సభ్యులు కార్మికవర్గ నేపథ్యం నుంచి వస్తున్నారు. వారిలో తమ వర్గ దృక్పథంతో పాటు సమాజంలో ఆధిపత్యంలో ఉన్న అర్ధవలస, అర్ధభూస్వామ్య సంస్కృతి, భావజాలం, వైఖరి ప్రభావంతో పాటు, బూర్జువా, రివిజనిస్టు పార్టీల ద్వారా పెంచి పోషించబడే సంస్కరణవాద, ట్రేడ్ యూనియనిస్టు, ఆర్థికవాద ప్రభావం కూడా పార్టీలోకి ప్రవేశిస్తుంది. విప్లవకర కమ్యూనిస్టు పార్టీ కమ్యూనిస్టు లక్ష్యాన్ని సాధించేందుకు ఎంఎల్ఎం ప్రాతిపదికన పనిచేస్తుంది. మనం కమ్యూనిస్టు పార్టీలో చేరినప్పుడు మనలో ఉన్న కార్మికవర్గేతర భావాల, పని పద్ధతుల ప్రభావం వల్ల వైరుధ్యం ఏర్పడుతుంది. కమ్యూనిస్టు లక్ష్యాన్ని సాధించేందుకు కార్మికవర్గ భావజాలానికి అనుగుణంగా వీటిని మార్చుకోవాలి. ఈ పరివర్తననే 'తీర్చిదిద్దుకోవడం' అంటాం. దీని ద్వారా ఎంఎల్ఎం ప్రాతిపదికన కార్మికవర్గ భావాలు, ఆలోచనలు, వైఖరులను అలవరుచుకుంటూ, మన పాత ఫ్యూడల్, బూర్జువా, పెటీబూర్జువా భావాలను, ఆలోచనలను, వైఖరులను రూపుమాపాలి. మనం స్వీయాత్మకవాద, ఉదారవాద, వ్యక్తివాద, అరాచక, పెత్తందారీ, యాదృచ్ఛిక పనిశైలిని వదిలించుకొని, కార్మికవర్గ సమిష్టి ఆలోచనను, సమిష్టి పని విధానాన్ని, పనిశైలిని అభివృద్ధి చేసుకోవాలి. మన పని విధానంలో ఒక పథకం ప్రకారం మెజారిటీ అభిప్రాయానికి కట్టుబడి ఉండాలి. ఎంత కష్టమైనా చేసుకున్న నిర్ణయాలను అమలు చేసేందుకు తీవ్రంగా కృషి చేయాలి. మంచి కమ్యూనిస్టు విప్లవకారుల అభివృద్ధి అనేది ఎంత లోతుగా, సమగ్రంగా ఈ భావజాలాన్నీ, దృక్పథాన్నీ, పనిశైలినీ సరిగా అలవర్చుకుంటారనే దానిపై ఆధారపడి ఉంటుంది. అయితే వీటిని అలవర్చుకుని అభివృద్ధిపరచుకోవడంలో నరసింహా రెడ్డి పూర్తిగా విఫలమయ్యాడు.

నరసింహా రెడ్డి పార్టీలో చేరి ఉద్యమ అభివృద్ధితో పాటు అంచలంచెలుగా ఎస్‌జడ్‌సి వరకూ ఎదుగుతూ రావడంతో, అప్పటి పరిస్థితుల్లో ఆయనలో ఉన్న పాజిటివ్ లక్షణాలను దృష్టిలో ఉ

ంచుకొని 2001లో జరిగిన మునుపటి పిడబ్ల్యు కాంగ్రెస్‌లో, 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో ఆయన సిసి సభ్యుడిగా ఎన్నికయ్యాడు. అయితే ఈ బాధ్యతల్ని ఆయన సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాడు. ఆయనలో అప్పటికే కొనసాగుతూ వస్తున్న కార్మికవర్గేతర ధోరణులే ఇందుకు ప్రధాన కారణం. సిసితో సహా వివిధ కమిటీలు పలు వేదికలపై కొనసాగించిన విమర్శ-స్వయంవిమర్శ పద్ధతినీ, ఐక్యత-ఘర్షణ-ఐక్యత క్రమాన్నీ, రెక్టిఫికేషన్-ఎడ్యుకేషన్ క్యాంపెయిన్లను కూడా ఆయన సద్వినియోగించుకోవడానికి సిద్ధం కాలేదు. పదవిని అధికారంగా భావించే ధోరణి ఆయనలో అభివృద్ధి చెందింది. ఆయనలో పెటీబూర్జువా వ్యక్తివాదం, బురాక్రసీ తీవ్ర స్థాయిలో పెరుగుతూ వచ్చాయి. ఇవి కార్మికవర్గ విప్లవ లక్ష్యాన్నీ, సమిష్టితత్వాన్నీ, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్నీ, విప్లవ లక్ష్యాన్నీ దెబ్బతీసే స్థాయికి చేరుకున్నాయి. సరైన పద్ధతిలో నిర్దిష్ట పరిస్థితులను అర్థం చేసుకోవడంలో విఫలం కావడం, ప్రజలతో సజీవ సంబంధాలు నెలకొల్పుకోవడంలో విఫలం కావడం, కష్టపడి పనిచేసే తత్వం కోల్పోవడం, కమిటీలలో సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో కాకుండా ఎడతెరిపి లేకుండా చర్చను వివాదంగా మారేలా కొనసాగించడంతో పాటు దాడిపూర్వకంగా వ్యవహరిస్తూ సమస్యను సంక్షోభం స్థాయికి తీసుకొనిపోవడం, అన్ని విషయాలలోనూ వ్యక్తిగా తనని ప్రారంభ బిందువుగా తీసుకోవడం, అన్నింటి కంటే తన వ్యక్తిగత ప్రయోజనాలను మిన్నగా భావించడం, అహంభావం-అహంకారం మితిమీరడం, తనకు తాను గొప్పవానిగా భావించడం మొదలైన కార్మికవర్గేతర చెడు లక్షణాలు నరసింహా రెడ్డిలో పెంపొందుతూ వచ్చాయి. ఆయన ఉత్తర తెలంగాణ ఎస్‌జడ్‌సిఎంగా, ఎస్‌జడ్‌సి కార్యదర్శిగా, సిసిఎంగా ఉన్న కాలంలో ఈ చెడు లక్షణాలు ఆయనలో క్రమంగా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. దీని వెనుక గల కారణాలను లోతుగా విశ్లేషించి తగిన గుణపాఠాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నక్సల్బరీ వెల్లువ తాత్కాలికంగా వెనుకపట్టు పట్టిన తర్వాత 70ల చివర నుండి బద్దలైన విప్లవోద్యమాల్లో ఒక ప్రముఖమైనది ఉత్తర తెలంగాణ ఉద్యమం. 90వ దశకంలో పాలకవర్గాలు కొనసాగించిన శత్రు ఎల్‌ఐసి దాడి తీవ్రస్థాయికి చేరుకున్న స్థితిలో చాలా దృఢంగా నిలిచి ఉత్తర తెలంగాణ ఉద్యమాన్ని రక్షించుకోవడం కోసం పార్టీ సమిష్టి నాయకత్వాన్ని అందించడం కీలకమైనదిగా, అత్యంత ఆవశ్యకమైనదిగా మారింది. ఎన్‌టి ఎస్‌జడ్‌సి కార్యదర్శిగా, సిసిఎంగా నరసింహా రెడ్డి ఆ బాధ్యతను తన భుజస్కంధాలపై ఎత్తుకొని సరిగా నిర్వహించడంలో విఫలమవుతూ వచ్చాడు.

శత్రు దాడిని తిప్పికొట్టి ఉద్యమాన్ని పురోగమింపజేయడం కోసం 2003 జూన్‌లో సిఆర్‌బి తన 4వ సమావేశంలో "ఎన్‌టి పరిస్థితి-మన ఎత్తుగడలు"పై తీర్మానం చేసింది. ఈ తీర్మానం చేసే క్రమంలో ఎన్‌టి ఉద్యమ పరిస్థితిపై గల అంచనాపై, చేపట్టాల్సిన ఎత్తుగడలపై, పని విధానంపై సిఆర్‌బికీ, ఆయనకూ మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. పార్టీలో తలెత్తే అభిప్రాయ

భేదాలను కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికన సమిష్టిగా చర్చించి మెజారిటీ అభిప్రాయాలపై ఆధారపడి సిఆర్‌బి ఆ తీర్మానం చేయాల్సి వచ్చింది. ఈ తీర్మానంలో భాగంగా ఎన్‌టికి సంబంధించిన కొన్ని నిర్మాణ విషయాలపై కూడా సిఆర్‌బి నిర్ణయాలు చేసింది. దీని పట్ల కూడా ఆయనకు భిన్నాభిప్రాయం ఉండింది. ఏది ఏమైనా సిఆర్‌బి చేసిన ఆ తీర్మానాన్ని కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రానికి కట్టుబడి, 2003లో జరిగిన ఎన్‌టి ఎస్‌జడ్‌సి సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదింపజేసి అమలు చేయించడానికి కృషి చేయడం కాకుండా, దీనిని తుంగలో తొక్కి ఆయన విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పూనుకున్నాడు. ఎస్‌జడ్‌సి సమావేశ ఆరంభానికి ముందే ఆ తీర్మానంపై తన భిన్నాభిప్రాయాలను అవకాశవాదంతో ఎస్‌జడ్‌సి సభ్యులకు చెప్పాడు, చర్చించాడు. విడి విడిగా వారు సిఆర్‌బి తీర్మానంతో విభేదిస్తూ డ్రాఫ్ట్‌లు రాయడానికి ప్రోత్సహించాడు. వాటిని ఎస్‌జడ్‌సి సభ్యుల మధ్య సర్క్యులేట్ చేయించాడు. నిర్మాణపరమైన విషయాలలో సిసి నిర్ణయాలు చేయకూడదనే తప్పుడు అవగాహనను ఎస్‌జడ్‌సికి కలిగించడంలో కూడా ఆయనదే ప్రధాన బాధ్యత. తద్వారా సిసి తప్పుడు ఎత్తుగడలు రూపొందించి, తప్పుడు గైడెన్స్ ఇస్తోందనీ, సిసి అది గుర్తించకుండా ఎస్‌జడ్‌సి తప్పులను విమర్శిస్తోందనే అపోహలు, తప్పుడు అభిప్రాయాలు వారిలో ఏర్పడేలా చేసి సిసికీ, ఎస్‌జడ్‌సికీ మధ్య తీవ్రమైన ఘర్షణ వాతావరణం సృష్టించాడు. ఈ విధంగా సిసి పట్ల ఎస్‌జడ్‌సికి వ్యతిరేకతను కలిగించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయన దోహదం చేశాడు. ఇది పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్యానికీ, నిర్మాణ పద్ధతికి వ్యతిరేకమైనది. ఎన్‌టి ఉద్యమాన్ని పురోగమింపజేయడంలో తన బలహీనతలను, విఫలతను కప్పిపుచ్చుకోజూసాడు. ఎస్‌జడ్‌సిలో భావ సమైక్యత లేకుండా విచ్ఛిన్నం చేసి, తన తప్పుడు అవగాహనలను ఎస్‌జడ్‌సి, సిఆర్‌బి/సిసిలపై రుద్దుతూ సిసి ప్రతిష్టను దెబ్బతీసే స్థాయికి దిగజారిన చరిత్ర ఆయనది. ఎన్‌టి ఉద్యమాన్ని అధ్యయనం చేయడానికి ఎన్నడూ పథకం ప్రకారం కృషి చేయకపోవడం, స్పాంటేనిటీలో కొట్టుకొనిపోవడం, స్వీయాత్మకంగా ఆలోచించడం, చర్చలలో అప్రజాస్వామికంగా ఉంటూ తీవ్ర అసహనంతో వ్యవహరించడం, అభిప్రాయాలను పంచుకోవడంలో ఆటంకంగా మారడం, భిన్నాభిప్రాయాలు ఉన్నప్పుడు తన అభిప్రాయాన్నే అమలు చేయడం అనే పెటీబూర్జువా వ్యక్తివాదం, పెత్తందారీ ధోరణి ఈ క్రమంలోనే ఆయనలో ఉచ్ఛస్థాయికి చేరుకున్నాయి. ఈ ధోరణులకు వ్యతిరేకంగా మొట్టమొదటిసారిగా 1999లో జరిగిన ఉత్తర తెలంగాణలో ప్లీనంలో ఎస్‌జడ్‌సీ, కేడర్ నుండి తీవ్రమైన విమర్శలు వచ్చాయి. మళ్లీ 2003 ప్లీనం సందర్భంగా జరిగిన ఎస్‌జడ్‌సి మీటింగ్‌లో, 2007లో జరిగిన కాన్ఫరెన్స్‌లో కూడా ఎస్‌జడ్‌సి, కింది నుండి కూడా విమర్శలు వచ్చాయి. ఎంతో చర్చ జరిగిన తర్వాత చివరకు ప్లీనం, కాన్ఫరెన్స్ వేదికల పైన ఆత్మవిమర్శ ప్రకటించేవాడు. అయినప్పటికీ ఆయనలోని చెడు ధోరణలలో పెద్దగా మార్పేమీ రాలేదు. తన తప్పులను సరిదిద్దుకోవడానికీ, బలహీనతలను అధిగమించడానికి ఆయన నిజాయితీగా కృషి చేసిందేమీ లేదు. ఆ తర్వాత సంవత్సరాల

తరబడి సిసిఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చినా తన చెడు ధోరణులలో ఏ మార్పూ లేదనడానికి 2010లో తన పెళ్లి విషయంలో సిఆర్‌బి ఆయనపై చేసిన హెచ్చరిక తీర్మానంతో పాటు, 2011లో పిబికి ప్రతిపాదనగా సిఆర్‌బి చేసిన తీర్మానమే నిదర్శనంగా ఉన్నాయి.

జులై 2010లో సిఆర్‌బి 5వ సమావేశంలో నరసింహా రెడ్డిపై తీర్మానం ఇది –

"కా.ఆర్ తన సహచరి ఆర్ఎన్ ఉద్యమాన్ని విడిచి వెళ్లిన తర్వాత కొద్ది మాసాల్లోనే మరో మహిళా కామ్రేడ్‌తో పెళ్లి అవగాహనకు వచ్చాడు. అయితే ఈ విషయం మరెక్కడా చెప్పకూడదనీ ఆమెను వారించి ఆయన కూడా చాలాకాలం పార్టీకి (సిఆర్‌బికి) తెలపకుండా ఉన్నాడు. ఆ తర్వాత దాదాపు 7, 8 మాసాలకు పెళ్లి ప్రతిపాదన ముందుకు తెచ్చి పార్టీ ఆమోదంతోనే పెళ్లి చేసుకున్నప్పటికీ ఆయన పెళ్లి కోసం అనతికాలంలోనే మహిళా కామ్రేడ్‌ను కోరడం, గడువుకు ముందే చేసుకోవాలనే తొందరపాటుతో పెళ్లి నిర్ణయానికి వచ్చిన విషయంలో ఆయన ఆత్మవిమర్శ చేసుకున్నప్పటికీ నైతిక విషయాల్లో నాయకత్వం అనుసరించాల్సిన ఆదర్శాలు, పద్ధతులు పాటించకపోవడంతో సిఆర్‌బి ఆయన్ని తీవ్రంగా విమర్శిస్తూ జరిగిన పొరపాటుపై గంభీర హెచ్చరిక చేస్తుంది. ఆయన పెళ్లి సమస్యపై కింది నుంచి వచ్చిన విమర్శలను స్వీకరిస్తూంది."

2011 సిఆర్‌బి 6వ సమావేశంలో నరసింహా రెడ్డిపై పి.బి.కి ప్రతిపాదనగా చేసిన తీర్మానం ఇది –

"సి.సి.–3 సమావేశం, కా. జె.పి.ని సి.ఆర్.బి. నుండి రిలీవ్ చేసి విస్తరణ ప్రాంతానికి బదిలీ చేసింది. అక్కడి ప్రత్యేక కమిటీలో సభ్యునిగా ఉండాలని నిర్ణయించింది. ఈ తీర్మానాన్ని సమావేశానికి హాజరైన జె.పి. ఆమోదించాడు. కానీ సమావేశం అనంతరం కా. జె.పి. ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడాడు. తాను కమిటీలో సభ్యునిగా ఉండననీ, విడిగా ఉంటాననీ మాట్లాడాడు. అయితే కమిటీకి సెక్రటరీగా నియమిస్తే ఉంటానని తన అభిమతాన్ని వ్యక్తం చేశాడు.

పై విషయాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు కా. జె.పి.లో ఆధిపత్య స్వభావం, పెత్తందారీతనం బలంగా కొనసాగుతున్నాయని కమిటీ భావిస్తున్నది. కా. జె.పి. పార్టీలో ఒక ఉన్నత స్థాయి కమిటీలో ఉంటూ, కార్యదర్శి స్థానంలో మాత్రమే ఉంటాననడం, ఆ స్థానాన్ని బాధ్యతగా కాకుండా అధికారంగా చూస్తున్నాడనీ కమిటీ అభిప్రాయపడుతున్నది. పార్టీ కేంద్రకమిటీలో ఉంటూ, ఇటువంటి తీవ్రమైన రాజకీయ బలహీనతలు కలిగి ఉండటాన్ని తీవ్రమైన విషయంగా భావించి గంభీర హెచ్చరిక చేయాలని కమిటీ పి.బి.ని కోరుతున్నది."

సిసి సభ్యుడిగా ఉన్న నరసింహా రెడ్డిపై సిఆర్‌బి చేసిన ఈ రెండు తీర్మానాలు తీవ్రమైన స్వభావం కలిగినవి. కమ్యూనిస్టు పార్టీ నాయకునిలో ఏమాత్రమూ ఉండకూడని బలహీనతలని ఎత్తిచూపాయి. అయితే ఆయన వీటిని సరిదిద్దుకోవడానికి సిద్ధం కాకపోవడం వల్ల ఇవి క్రమంగా ఆయనలో పెంపొందుతూ వచ్చాయి. సిసి మాట వినకపోవడం, సంబంధిత సిసి

సభ్యులను, రాష్ట్ర కమిటీని చులకనగా చూడడం, వారి అభిప్రాయాలను ఖాతరు చేయకపోవడం, డివిజన్ కమిటీనీ, ఏరియా కమిటీలను పట్టించుకోకపోవడంతో పాటు, గైడ్ చేయడానికి శ్రద్ధ పెట్టకపోవడం, తన నిర్దిష్ట బాధ్యతలను నిర్వహించడం మాట అటుంచి సంబంధిత నాయకత్వ కామ్రేడ్స్‌తో ఎడతెగని జగడాలకు దిగడం, కఠినమైన పని నుండి తప్పుకోవడం, సమస్యలను పరిష్కరించకుండా వాయిదా వేస్తూ, కాలయాపన చేయడం, పొద్దస్తమానం కంప్యూటర్, టాబ్, స్మార్ట్ ఫోన్, నెట్‌కు అంటిపెట్టుకొని పూర్తి బాధ్యతారహితంగా ఉండడం, కమిటీలలో అనైక్యతను ప్రేరేపించడం, కక్షసాధింపు వైఖరిని అవలంబించడం, పార్టీ నిధులను విచక్షణారహితంగా ఖర్చు చేయడం, కేంద్ర, రాష్ట్ర కమిటీలకు సరైన లెక్కలు చూపకపోవడం వంటి పెటీబూర్జువా అరాచకవాద లక్షణాలు పెరిగి ఆయనలో విప్లవ ఆకాంక్ష బలహీనపడింది.

2016లో చాలా తీవ్రమైన శత్రుదాడి మధ్యలో, అత్యంత సంక్లిష్ట పరిస్థితులలో నిర్వహించాల్సిన సిసి మీటింగ్‌ను విజయవంతం చేయడానికి ఆయన తన వంతు బాధ్యతను చిత్తశుద్ధితో, దృఢసంకల్పంతో నిర్వహించడానికి కృషి చేయకపోవడమే గాకుండా దానిని నిలిపివేయడానికి తుది వరకు అనేక ఆటంకాలు కల్పించాడు. విప్లవోద్యమం ముందున్న అనేక సవాళ్లను పరిష్కరించుకునేందుకు 2017లో నిర్వహించిన సెంట్రల్ రీజనల్ బ్యూరో (సిఆర్‌బి), కేంద్రకమిటీ (సిసి) సమావేశాలకు హాజరు కావాల్సిన తాను, పెరిగిన శత్రు దాడులను చూసి తీవ్ర భయాందోళనకు గురై గైరుహాజరయ్యాడు. ఆ సమావేశాలకు హాజరైతే తాను తీవ్రమైన విమర్శలకు గురికావాల్సి ఉంటుందనే ఆలోచనే ఆయన గైరుహాజరుకు ఒక ముఖ్యమైన కారణం.

2017 ఫిబ్రవరిలో జరిగిన సిసి 5వ సమావేశం, నరసింహా రెడ్డిలో మూర్తీభవించిన వ్యక్తివాదం, పెత్తందారీతనం, కుహనా ప్రతిష్ట, శత్రువు అంటే పెరిగిన భయం వంటి కార్మికవర్గేతర ధోరణుల గురించి, ఫలితంగా పార్టీకి, విప్లవోద్యమానికి కలుగుతున్న నష్టం గురించి లోతుగా చర్చించింది. తన లోపాలను, తప్పుడు పద్ధతుల్ని మార్చుకోకపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని సిసి ఆయనపై క్రమశిక్షణా చర్య తీసుకుంది. ఆయన్ని సిసి నుంచి రెండు సంవత్సరాల కాలం సస్పెండ్ చేసి, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉండి పనిచేయాలని నిర్ణయించింది. పార్టీ నిబంధనావళిలో సస్పెన్షన్ కాల పరిమితి సంవత్సర కాలానికి మించకూడదని స్పష్టంగా రాసుకున్నప్పటికీ, ఆయనలోని బలహీనతల తీవ్రతను గంభీరంగా పరిగణనలోకి తీసుకున్న సి.సి. ఆయన సస్పెన్షన్ కాలాన్ని రెండేళ్లుగా నిర్ణయించింది. ఆయన సుదీర్ఘ విప్లవోద్యమ అనుభవాన్ని సిసి పరిగణనలోకి తీసుకుంటూనే తన తప్పులను గుర్తింపజేసి సరిదిద్దడానికి కృషి చేయాలని నిర్ణయించింది. సిసి ప్రతినిధి మండలి ఆయనను కలిసి ఈ తీర్మానాన్ని వివరించాలని నిర్ణయించింది. సిసి సమావేశం తర్వాత త్వరగానే సంబంధిత సిసి కామ్రేడ్స్ ఆయనను కలిసి సిసి తీర్మానాలను వివరించారు. తాను సిసి ప్రతినిధి మండలిని

కలవాలని పంపారు. ఆరు నెలల తర్వాత ఆయన ప్రతినిధి మండలిని కలిసాడు. ఆయనపై చేసిన సిసి నిర్ణయాన్ని ప్రతినిధి మండలి ఆయనకు చాలా ఓపికగా వివరించింది. అయితే సిసి తీసుకున్న క్రమశిక్షణా చర్యను ఆయన జీర్ణించుకోలేకపోయాడు. తన ఆత్మవిమర్శకు ఆయన కోరిన విధంగా వారం రోజులు సమయాన్ని సిసి ప్రతినిధి మండలి ఆయనకు కల్పించింది. ఆ తర్వాత కూడా తన ఆత్మవిమర్శను మాట్లాడడం గానీ, రాసి ఇవ్వడం గానీ చేయకుండా తనను కలిసిన కొందరూ సిసి, రాష్ట్ర కమిటీల కామ్రేడ్స్‌తో సిసిపై, ఉద్యమంపై కామెంట్స్ చేస్తూ అరాచక పద్ధతిలో చర్చ లేవనెత్తుతూ చాలా బాధ్యతరహితంగా వ్యవహరించాడు. సిసి తీర్మానాన్ని అమలుచేసేందుకు ఏమాత్రం సిద్ధం కాకుండా, తన ఇష్టానుసారంగా, ప్లాను ప్రకారం తెలంగాణాలోని సంబంధిత సిసి, ఎస్‌సి కామ్రేడ్స్‌ను కలిసి, అక్కడి నుండే తమ కుటుంబాల వారిని పిలిపించుకుని కలిసి వారి ద్వారా పాలక పార్టీ నాయకులకు వర్తమానాలు పంపి పూర్తి ఏర్పాట్లతోనే వెళ్లి తన భార్యతో సహా శత్రువు ముందు మోకరిల్లాడు.

ఫిబ్రవరి 2017 సిసి సమావేశం నరసింహా రెడ్డిపై చేసిన తీర్మానం ఇది –

“సి.సి. 5వ సమావేశం నిర్వహణ బాధ్యత కామ్రేడ్ రాజేష్‌కు ఇవ్వడమైంది. కానీ దానిని అనుకున్న విధంగా సి.సి. జరుపుకోలేకపోయింది. అందుకు ఇతర ముఖ్యమైన కారణాలతో పాటు కామ్రేడ్ రాజేష్ అనుసరించిన తప్పుడు పద్ధతులు, స్వీయ ఆలోచనకు గురై తాను శత్రువును ఎక్కువగా అంచనా వేసి నిబ్బరం కోల్పోయి తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడం కూడా ఒకటి. కామ్రేడ్ రాజేష్ నిబ్బరంగా వ్యవహరించి వుంటే పెరిగిన శత్రు దాడుల మధ్య కూడా రెండు ప్రాంతాల పిబి మెంబర్లు (ఎక్కువ మంది) కలుసుకోగలిగేవారే. వారు అలా కలుసుకోగలిగి ఉంటే, క్లిష్ట పరిస్థితులలో మీటింగ్ జరిగి మెరుగైన ఫలితాలు సాధించగలిగేది. కాని అలా కాక పోవడానికి కీలకస్థానంలో వుండి బాధ్యత వహించిన కామ్రేడ్ రాజేష్ ప్రధాన బాధ్యత వహించాలి.

కామ్రేడ్ రాజేష్‌లో మొదటి నుండి మూర్తీభవించిన వ్యక్తివాదం, పెత్తందారీతనం, కుహనా ప్రతిష్టకు లోనవ్వడం కొనసాగుతున్నాయి. తన స్వీయ ఆలోచనలను కమిటీపై రుద్దడానికి అనేక రకాల ప్రయత్నిస్తాడు. అందుకు కార్మికవర్గ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడంతో సహా కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సహితం దృష్టిలో పెట్టుకోకుండా తనకు తోచిన విధంగా పిడి వాదనలు ముందుకు తేవడం ఆయనకు అలవాటుగా మారింది. కమిటీ మీటింగులను ప్రతిష్టంభనకు గురి చేయడం, కమిటీ మెంబర్లు గట్టిగా ప్రతిఘటిస్తే ఆ మీటింగ్‌లను బహిష్కరిస్తానంటు కూడా ఒత్తిడి తెస్తాడు. ఇలాంటి నిర్మాణ రాహిత్య పద్ధతులు, చర్చలు చేయడం ద్వారా తను పని చేసే కమిటీలో తోటి సభ్యుల విశ్వాసం పొందలేక ఒంటరవుతాడు. రాజేష్‌లో గల తప్పులకు వ్యతిరేకంగా వివిధ కమిటీలు పోరాడినప్పటికీ ఆయనలో అవే బలహీనతలు మరింత పెరిగాయే తప్పా తగ్గలేదు. ఈ బలహీనతల నేపథ్యంలోనే సి.సి.

మీటింగ్ సందర్భంగా ఆయన బాధ్యతల్లో జరిగిన లోపాలను చూడాలి.

కామ్రేడ్ రాజేష్‌లో శత్రువు అంటే భయం కూడా పెరిగింది. వర్తమానంలో అది ఏ స్థాయికి వెళ్లిందంటే తనతో ఉండే సెక్యూరిటీ గార్డులు, తన నాయకత్వం వహిస్తున్న ప్రాంతంలోని సాధారణ దళ సభ్యులు కూడా ఆయనను విమర్శిస్తోన్న స్థితి వచ్చింది. వాస్తవంగా ఈనాటి గడ్డు పరిస్థితులలో, శత్రువు కొనసాగిస్తోన్న భారీ సైనిక దాడుల మధ్య పార్టీ అత్యున్నత స్థాయి నాయకత్వ కామ్రేడ్స్ ఎంతో నిబ్బరంగా ఉంటూ, సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ పరంగా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. శక్తులను ధైర్యంగా నిలబెట్టుకోవలసిన అవసరం మున్నెన్నడు లేనంతగా ఉంది. ఇందుకు ఈనాటి పరిస్థితులలో నాయకత్వం సైనిక రంగంలో ఎలా ఉంటుందనేది ఒక ముఖ్యమైన ముందు షరతుగా ఉంటుంది. దీనిని కామ్రేడ్ రాజేష్ ఒక సి.సి.ఎం.గా అర్థం చేసుకోవడం లేదు. ఫలితంగా అక్కడి పార్టీకి చాలా నష్టం జరుగుతున్నది.

సి.ఆర్.బి. పదకొండో సమావేశానికి కామ్రేడ్ రాజేష్ హాజరవ్వాలని సి.సి.-5 నిర్ణయం చేసింది. ఆయన కూడా హాజరవుతానని చెప్పినప్పటికీ చివరకు హాజరుకాలేదు. ఆయన మార్గమధ్యం నుండి వెనక్కి వెళ్లాడు. పెరిగిన శత్రు దాడుల మధ్య వెళ్లలేమనే అంచనాకు వచ్చి ఆ నిర్ణయం తీసుకున్నాడు. తనతో పాటు ప్రయాణంలో ఉన్న తోటి సి.సి. కామ్రేడ్ చెప్పినా వినకుండా తీవ్ర భయాందోళనకు గురై వెనక్కి వెళ్లడం సరైంది కాదు. కామ్రేడ్ రాజేష్‌లో వ్యక్తమవుతోన్న ఈ అన్ని బలహీనతలను లోతుగా చర్చించిన సి.సి. ఆయన్ని రెండు సంవత్సరాల కాలం సస్పెండ్ చేస్తున్నది. ఈ తీర్మానం అమలు చేయడంలో భాగంగా ఈ విషయాన్ని కామ్రేడ్స్ క, సో లు కామ్రేడ్ రాజేష్‌తో మాట్లాడాలి. అనుకోని అవాంతరాలు ఏర్పడి గానీ, మరే కారణం వల్ల గానీ కా. రాజేష్ కాంటాక్టుకు చేరుకోలేని పరిస్థితులు ఏర్పడితే సిసి ప్రతినిధి మండలిగా కామ్రేడ్స్ సంగ్రామ్, మనోజ్‌లు ఆయనతో మాట్లాడాలి. సిసి తీర్మానాన్ని అమలు చేయాలి. ఆయన అందుకు అంగీకరించకపోతే ఏం చేయాలనేది ఆ ప్రతినిధి మండలి తన రికమండేషన్‌ను జి.ఎస్.కు పంపించాలి.

మన పార్టీ నిబంధానవళిలో సస్పెన్షన్ కాల పరిమితి సంవత్సర కాలానికి మించకూడదని స్పష్టంగా రాసుకున్నప్పటికీ కామ్రేడ్ రాజేష్ స్థాయి, అంతకన్నా బలహీనతల తీవ్రతను గంభీరంగా పరిగణనలోని తీసుకున్న సి.సి. ఆయన సస్పెన్షన్ కాలాన్ని రెండేళ్లుగా నిర్ణయించింది.

కామ్రేడ్ రాజేష్ సస్పెన్షన్ కాలంలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఒడిశాలో ఉండాలి. ఆయనలో వ్యక్తమవుతోన్న తీవ్ర పెడ ధోరణులపై ఆ రాష్ట్ర కమిటీ ఐక్యత-ఘర్షణ-ఐక్యత పద్ధతిలో ఎలాంటి ఉదారవాదానికి లోనుకాకుండా వ్యవహరించాలి. కామ్రేడ్ రాజేష్ కూడా తనలో దీర్ఘకాలంగా కొనసాగుతూ ఘనీభవించిన పెడ ధోరణుల నుండి బయట పడడానికి ఈనాటి పరిస్థితులలో అత్యున్నత స్థాయి చైతన్యాన్ని ప్రదర్శిస్తూ బోల్షెవిక్ పట్టుదలతో కృషి చేయాలని సి.సి. ఆయనకు విజ్ఞప్తి చేస్తోంది. ఈ కృషి ప్రధానంగా ఆయన నుండి జరగాల్సిందే. కామ్రేడ్

రాజేష్ తన బలహీనతల నుండి బయటపడడానికి సంబంధిత సిసి కామ్రేడ్స్ తోడ్పాటు నందించాలని సిసి కోరుతున్నది. సాధారణంగా ఇలాంటి విషయంలో కూడా సహ కామ్రేడ్స్ సహాయం అవసరం అవుతుంది.

కామ్రేడ్ రాజేష్‌కు అక్కడి రాష్ట్ర కమిటీలో ఏ వర్క్ డివిజన్ ఇవ్వాలో సంబంధిత సి.ఆర్.బి. సభ్యులు నిర్దిష్టంగా గైడ్ చేయాలి.”

వాస్తవానికి పతనావస్థకు చేరుకునేంత వరకూ, సిసి 5వ సమావేశానంతరం సిసి కామ్రేడ్స్‌ను కలిసేంత వరకూ, ప్రత్యేకంగా సిసి ప్రతినిధి మండలిని కలిసేంత వరకూ ఎన్నడూ ఆయన పార్టీ పంథాపై, మౌలిక డాక్యుమెంట్లపై, పార్టీ ముందున్న ముఖ్యమైన ఏ రాజకీయ సమస్యపై తనకు ఎటువంటి భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సిసికి చెప్పలేదు. సిసి 5వ సమావేశానంతరం తనని కలిసిన కొందరు సిసి కామ్రేడ్స్‌తో, ప్రతినిధి మండలి కామ్రేడ్స్‌తో తాను కొన్ని విషయాలపై అధ్యయనం చేస్తున్నాననీ, ఇంకా వాటిపై ఒక కంక్లూషన్‌కు రాలేదనీ మాట్లాడాడు వాస్తవానికి ఉద్యమం ముందున్న కొన్ని ముఖ్యమైన సైద్ధాంతిక, రాజకీయ సమస్యలను గుర్తించి వాటిని ప్లాను ప్రకారం పరిష్కరించడానికి సిసి 5వ సమావేశం నిర్ణయించింది. ఈ సమస్యల విషయంలో పార్టీ సభ్యులు తమ అభిప్రాయాలను పార్టీ నిబంధనావళి ప్రకారం చర్చించవచ్చునని పేర్కొంటూ సరైన పద్ధతిని కూడా రూపొందించింది. ఈ విషయం ప్రతినిధి మండలి ఆయనకు కూడా తెలిపింది. ఈ తీర్మానం వెలుగులోనైనా తనకు ఏ విషయంలో అయినా భిన్నాభిప్రాయాలు ఉంటే చర్చించవచ్చని ప్రతినిధి మండలి ఆయనకు స్పష్టంగా చెప్పింది. కానీ సరెండర్‌కు పూర్తి ఏర్పాట్లు చేసుకునే క్రమంలో కొందరూ సిసి, ఎస్‌సి కామ్రేడ్స్‌తో తనకు పార్టీ పంథాపై నమ్మకం లేదనీ, సైద్ధాంతిక విభేదాలున్నాయనీ తెలిపాడు. రాజకీయంగా పతనం చెంది శత్రు పంచన చేర నిర్ణయించుకున్న విప్లవ ద్రోహులు ప్రజలను వంచించడానికి తుదివరకు చేసే ప్రయత్నాల్లో ఇదొకటి. ఈ విధంగా నరసింహా రెడ్డి విప్లవ జీవితం ముగిసి విప్లవ వ్యతిరేక, విప్లవ విద్రోహకర జీవితం ఆరంభమైంది.

## నరసింహా రెడ్డి దిగజారుడుకు, ద్రోహానికి ప్రధాన కారణాలు ఇవి :

మొదటిది, నరహింహా రెడ్డి మూడు దశాబ్దాల కంటే ఎక్కువ కాలం నుండి విప్లవోద్యమంలో వివిధ స్థాయిల్లో పనిచేసినప్పటికీ, తనలో తీవ్రస్థాయిలో వ్యక్తివాదం పెరిగిన మూలంగా ఆయన తాను ఉన్న కమిటీలో టీం స్పిరిట్‌తో పనిచేయకపోవడంతో కార్మికవర్గ సమిష్టి ఆలోచనను, సమిష్టి పని విధానాన్ని అలవర్చుకోలేకపోయాడు. ఒక కార్మికవర్గ విప్లవకారునిగా తనను తాను తీర్చిదిద్దుకోలేక పోయాడు. ఎవరైనా ఏ సమస్యనైనా గతితార్కిక భౌతికవాద పద్ధతిలో విశ్లేషించకుండా తన మనసుకు పట్టిన విధంగా వ్యవహరించడం స్వీయాత్మకవాదానికి పునాది అవుతుంది. ఇది ఉద్యమంపై, కేడర్లపై సరైన అంచనాను ఇవ్వదు. వారి మధ్య కామ్రేడ్లీ సంబంధాలను దెబ్బతీస్తుంది. అది వ్యక్తిగత సంబంధాలను పాడుకొల్పుతుంది. రాజకీయ,

నిర్మాణ, సైనిక కృషిని నెగెటివ్‌గా ప్రభావితం చేస్తుంది. ఈ స్వీయాత్మకవాద ధోరణి ఉద్యమాన్ని, కామ్రేడ్స్‌ను, వారి మధ్య సంబంధాలను అంచనా వేయడంలో ఆయనలో తీవ్రస్థాయిలో ఉండింది. ఆయనలోని "నేను", "నా" అనే వ్యక్తివాదం దీనికి పునాది.

రెండవది, నరసింహా రెడ్డిలో సైద్ధాంతికంగా, రాజకీయంగా, మిలటరీపరంగా ఎదుగుదల ఆగిపోయింది. తన కమిటీ సభ్యులతోనూ, క్యాడర్లతోనూ, ప్రజారాశులతోనూ సజీవ సంబంధాలు నెలకొల్పుకోనందువల్ల వారి అభిప్రాయాలను తెలుసుకోలేకపోవడం, సామాజిక పరిశోధన–అధ్యయనం శూన్యం కావడం, నిర్దిష్ట విధానాలను గ్రహించకపోవడం, రాజకీయ–సిద్ధాంత కృషిని నిర్వహించకపోవడం వల్ల వాస్తవాల నుండి వేరుపడిపోయాడు. విప్లవేతర పనులతో కాలం గడిపేవాడు. ఫలితంగా, లక్ష్యరహితంగా రాజకీయాలు చర్చిస్తూ, ఉద్యమానికీ, పార్టీకీ నిర్మాణపరంగా నేతృత్వం వహించగలిగే సామర్థ్యాన్ని క్రమక్రమంగా కోల్పోయాడు.

మూడవది, పెటీబూర్జువా అరాచకవాదం, అహంభావం, పెత్తందారీతనం, నిర్మాణ రాహిత్యం ఆయనలో బలంగానే ఉండిపోయాయి. ఇవి కార్మికవర్గ విప్లవకర జీవితానికి పూర్తిగా వ్యతిరేకమైనవి. ఇవి ఎంఎల్‌ఎంకు వ్యతిరేకమైనవి. గతితార్కిక, చారిత్రక భౌతికవాద ప్రాపంచిక దృక్పథానికి విరుద్ధమైనవి. అయితే మన పార్టీ కమిటీ సమావేశాలలో ఒక పద్ధతిగా కొనసాగిస్తూ వచ్చిన విమర్శ–స్వయంవిమర్శల సందర్భంగా గానీ వివిధ సందర్భాలలో సిసి, ఎస్‌సిలు చేపట్టిన రెక్టిఫికేషన్ క్యాంపెయిన్లలో గానీ, బోల్షివీకరణ అధ్యయన క్యాంపెయిన్లలో గానీ తనలో ఉన్న తప్పుడు ధోరణుల నుండి ఐక్యత–ఘర్షణ–ఐక్యత ద్వారా మంచి కమ్యూనిస్టుగా పరివర్తన చెందలేకపోయాడు. అందువల్ల తన తప్పుల, బలహీనతల గురించి తనకు బాగానే తెలిసినప్పటికీ ఈ మొండిఘటం వాటిని సరిదిద్దుకునేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేయలేక పోగా తన లోపాలను కప్పిపుచ్చుకునేవాడు. పెటీబూర్జువా కుహనా ప్రతిష్ట ఆయన నిజాయితీగా ఆత్మవిమర్శ చేసుకునేందుకు నిరంతరం అడ్డంకిగా నిలిచింది. ఫలితంగా విప్లవ చేవ పూర్తిగా నశించి, పురోగతిని సాధించగలననే ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోయాడు.

నాలుగవది, విప్లవకారులు శత్రువును చూసి ఎంతగా భయపడతారో వారి ఉత్సాహం అంతగా మందగిస్తుంది. శత్రువును ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే సంసిద్ధత ఉండి, నిర్భయంగా ఉంటే, త్యాగశీలత ఉంటే ఉద్యమంలో ఉత్సాహంగా పని చేయగలుగుతారు. ఇటీవలి కాలంలో విప్లవోద్యమం ఎదుర్కొంటున్న గడ్డు స్థితిలో తీవ్ర నష్టాలను, శత్రు దాడి తీవ్రతను చూసి ఆయనలో భయం తీవ్ర స్థాయికి చేరింది. ప్రస్తుత అనుకూల భౌతిక పరిస్థితిని వినియోగించుకోవడానికి చొరవ తీసుకొని పార్టీ క్యాడర్లనూ, ప్రజలనూ కదిలించి ఉద్యమాన్ని నిర్మించగలననే, శత్రు దాడిని ఎదుర్కొంటూ ఉద్యమానికి నాయకత్వం వహించగలననే విశ్వాసం ఆయన కోల్పోయాడు. ఉద్యమ, పార్టీ, ప్రజల ప్రయోజనాల కంటే తన ప్రయోజనాలనే మిన్నగా

ఎంచి త్యాగనిరతితో పని చేసే చైతన్యాన్ని కోల్పోయాడు.

సిసి, సిఆర్‌బిలు, నరసింహా రెడ్డి దిగజారిపోవడానికి కారణమైన పై ముఖ్యమైన కార్మికవర్గేతర ధోరణులకు వ్యతిరేకంగా ఉదారవాదం కారణంగా నిశితంగా పోరాటం చేయలేదు. నాయకత్వపరంగా జరిగిన ఈ లోపం ఆయన తీవ్రమైన కార్మికవర్గేతర ధోరణులతో సుదీర్ఘకాలం పార్టీలో కొనసాగడానికి దోహదం చేసింది. కేంద్రకమిటీ ఈ నెగెటివ్ అనుభవం నుండి గుణపాఠం తీసుకొని పార్టీనీ, తమను తాము తీర్చిదిద్దుకోవడానికి దృఢంగా కృషి చేయాలి.

ఈ విధంగా ఇప్పటి వరకూ ద్వితీయ అంశంగా ఉంటూ వచ్చిన నరసింహా రెడ్డి విప్లవ జీవితంలోని తప్పులు, బలహీనతలు ప్రధాన అంశంగా మారిపోయాయి. ఒక విప్లవకారుడిగా, విప్లవ నాయకుడిగా ఉన్న ఆయన విప్లవ వ్యతిరేకిగా, విప్లవ ప్రతీఘాతకుడిగా మారిపోయాడు. విప్లవకారులు ఎవరైనా, గతంలో ఆయనకు/ఆమెకు ఎంత ఆదర్శవంతమైన చరిత్ర ఉన్నా తమలోని కార్మికవర్గేతర భావాలపై, కార్మికవర్గేతర తప్పుడు ధోరణులపై తాము అంతర్గత పోరాటం చేయకుండా ఎక్కువ కాలం లేదా చివరి వరకూ విప్లవంలో కొనసాగలేరు. ఇది విప్లవ గతితర్కం. ఇది సమాజానికీ, వ్యక్తులకూ, విప్లవకారులకు సైతం వర్తించే నియమం. స్వార్థపరులు, పార్టీ, విప్లవం, పీడిత ప్రజల కంటే తమకు తాము అధికులమని భావించే కెరీరిస్టు నాయకులు చరిత్ర పెంటకుప్పపైకి విసిరివేయబడతారు. అదే విధంగా నరసింహా రెడ్డి సైతం చరిత్ర పుటల్లో విద్రోహులలో ఒకడిగా మన పార్టీ చరిత్రలో నిలిచిపోతాడు.

కమ్యూనిస్టు పార్టీ తనను తానూ, కమ్యూనిస్టు విప్లవకారులంగా మనల్ని మనమూ మలుచుకోవడం ఎల్లప్పుడూ నిరంతరం కొనసాగే క్రమం. అందువల్ల, ఎల్లప్పుడూ నిరంతరం మనల్ని మనం పరివర్తన చెందించుకునేందుకు ప్రతి ఒక్కరం ప్రయత్నాలు చేయడం అవసరం. దీన్ని తమ యూనిట్లలో సమిష్టిగా కొనసాగించడం ద్వారా మాత్రమే సమర్థవంతంగా నిర్వహించగలుగుతారు. ఇందులో వారు బోధన–ఆచరణ–సమీక్ష–ఆత్మవిమర్శ–విమర్శ–పరివర్తన (తీర్చిదిద్దుకోవడం) అనే క్రమాన్ని అనుసరించాలి. ఆ క్రమంలో మాత్రమే ప్రతి సభ్యురాలు/సభ్యుడు చొరవతో, స్థిరంగా ప్రభావశీలంగా, సమర్థవంతంగా సమిష్టిగా కృషి చేయడం ద్వారా మాత్రమే, బలహీనతలను పరిశీలించడం, పర్యవేక్షించడం, సమీక్షించడం, దిద్దుకోవడం సాధ్యమవుతుంది.

విప్లవాన్ని విజయవంతం చేయాలంటే బలమైన పార్టీ, సమర్థవంతమైన నాయకత్వం, కేడర్ల ఆవశ్యకతను గురించి కామ్రేడ్ మావో ఇలా పేర్కొన్నారు, "గొప్ప విప్లవాన్ని నిర్వహించడానికి చాలా గొప్ప పార్టీ, దానిని నడపడానికి అనేక మంది కేడర్లు కావాలి. నాయకత్వం సంకుచితమైన చిన్న ముఠా అయితే, నాయకులు కేడర్లు అల్పబుద్ధులు, హ్రస్వదృష్టులు, అసమర్థులు అయితే, నలభై అయిదు కోట్ల ప్రజలు గల చైనాలో చరిత్రలోనే అపూర్వమైన మహా విప్లవాన్ని నిర్వహించడం అసాధ్యం. చాలా కాలంగా చైనా కమ్యూనిస్టు పార్టీ చాలా పెద్ద పార్టీ. ప్రతీఘాత

విప్లవ కాలంలో నష్టాలు సంభవించినా అది ఇంకా పెద్ద పార్టీయే. దానిలో చాలా మంది మంచి నాయకులు, కేడర్లు ఉన్నారు. అయినా ఇంకా చాలరు. మన పార్టీ మన పార్టీ సంస్థలను దేశమంతటా విస్తరించాలి. లక్షలాది కేడర్లనూ, వందలాది మంది ఒకటో రకం నాయకులను మనం శిక్షణ ఇచ్చి తయారు చేయాలి. ఈ కేడర్లూ, నాయకులూ మార్క్సిజం-లెనినిజం తెలుసుకున్నవారే, రాజకీయంగా దూరదృష్టి గలవారూ, పనిలో సమర్థులు, ఆత్మత్యాగ సంసిద్ధులు, సమస్యలను తమంత తాము పరిష్కరించగల సమర్థులు, కష్టాలలో సడలని దీక్షాపరులు, అత్యంత విశ్వసనీయులు, జాతి, వర్గం, పార్టీ సేవకు అంకితమైనవారూ కావాలి. సభ్యులు, జనసామాన్యంతో సంబంధాలకు ఈ కేడర్లు, నాయకులపైననే పార్టీ ఆధారపడుతుంది. జన సామాన్యంపై వీరి దృఢమైన నాయకత్వంపై ఆధారపడడం వల్లనే పార్టీ శత్రువును ఓడించి విజయం పొందాలి. అటువంటి నాయకులు, కేడర్లు స్వార్థం, వ్యక్తిగత వీరత్వం, ఆడంబరం, సోమరితనం, నిష్క్రియత్వం, ఒంటెత్తు అహంభావంలేని నిస్వార్థమైన జాతీయ, వర్గవీరులు కావాలి." (మావో రచనలు-1వ సంపుటి, జపాన్ వ్యతిరేక ఐక్యసంఘటనకు లక్షలాది ప్రజలను సమీకరించండి, కేడర్ల సమస్య, 380వ పేజీ, మొదటి పేరా.)

ఈ రకమైన నాయకులు, కేడర్లు ఎలా సృష్టించబడతారు? వర్గ పోరాటంలో క్రియాశీలంగా భాగస్వామ్యం కావడం, అప్పగించిన కర్తవ్యాలను అమలు చేయడం, ఎంఎల్ఎం వెలుగులో వాటిని అర్థం చేసుకోవడం ద్వారా తమ అనుభవాల నుంచి గుణపాఠాలను నేర్చుకోవడం, ఉద్యమాన్ని పురోగమింపజేసే క్రమంలోనే ఎవరైనా అభివృద్ధి కాగలుగుతారు. అయితే, ఈ క్రమం పనిలో యాదృచ్ఛికంగా భాగం కావడం ద్వారా చోటుచేసుకోదు. ప్రతి ఒక్కరు ఒక పథకం ప్రకారం, ఒక క్రమపద్ధతిలో కృషి చేసినప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది, వాళు ్ల సమర్థులైన ఆర్గనైజర్లుగా, కమాండర్లుగా అభివృద్ధి కాగలుగుతారు. అటువంటి వాళ్లు ప్రజల విశ్వాసాన్ని పొందగలుగుతారు. వారికి నాయకత్వాన్ని అందించగలుగుతారు. ఈ విధంగా చేయాలంటే మనకు ఎంఎల్ఎం సిద్ధాంతం గురించి మంచి పరిజ్ఞానం ఉండడమే కాక, మనం సిద్ధాంతాన్ని ఆచరణలో ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడంతో జోడించగలగాలి. మనకు మన రాజకీయ పంథా, మిలటరీ పంథా గురించి లోతైన అవగాహన ఉండడమే కాక, మనం పనిచేసే చోట మన ఆచరణలో వాటిని నిర్దిష్టంగా అన్వయించగలగాలి. ఆత్మవిమర్శనా ఆయుధాన్ని చేబూనడం ద్వారా, కర్తవ్య నిష్ఠతో అధ్యయనం చేసే పద్ధతిని అనుసరించడం ద్వారా, పార్టీ మరియు విప్లవ అవసరాలకు అనుగుణంగా మనల్ని మనం తీర్చిదిద్దుకోగలుగుతాం. సిద్ధాంతం నుంచి ఆచరణనూ, అధ్యయనం నుంచి పనినీ వేరు చేసే ధోరణులను సరిదిద్దుకోవాలి. తద్వారా మన వర్గ వైఖరి, మన పార్టీ వైఖరి, మన పార్టీ స్ఫూర్తిని మరింత దృఢతరం చేయాలి.

ఈ సందర్భంగా కామ్రేడ్ మావో చెప్పిన ఈ కింది బోధన మనకు మార్గదర్శకంగా ఉ

ంటుంది, “వర్గ పోరాటంలోనూ, ప్రకృతితో జరిపే పోరాటంలోనూ కార్మికవర్గం మొత్తం సమాజాన్ని తీర్చిదిద్దుతుంది. ఆ క్రమంలోనే తన్ను తాను తీర్చిదిద్దుకుంటుంది. పని క్రమంలోనే అది తప్పనిసరిగా నేర్చుకోవాలి, క్రమక్రమంగా తన లోటుపాట్ల నుండి బయటపడాలి. అలా చేయడం ఎన్నడూ మానకూడదు.” (మావో రచనలు, 5వ సంపుటి, ప్రజల మధ్య వైరుధ్యాలతో సరైన తీరులో వ్యవహరించడం, పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల సమస్య అనే అంశం, ఫిబ్రవరి 27, 1957, 522వ పేజీ.)

నరసింహా రెడ్డి శత్రువు ముందు లొంగిపోయిన ప్రస్తుత పరిస్థితిలో, ఆయన ద్వారా శత్రువుకు తెలిసే అవకాశం ఉన్న మన రహస్యాల వల్ల మనకి జరిగే నష్టాన్ని కనీస స్థాయికి తగ్గించేందుకు మన పార్టీకి చెందిన అన్ని నాయకత్వ కమిటీలు, కేడర్లు, ప్రత్యేకించి సిసితో పాటు, ఇప్పటి వరకూ ఆయన పనిచేసిన రాష్ట్రంలో ఉన్న ఎస్‌సి, తెలంగాణ రాష్ట్ర కమిటీ అవసరమైన జాగ్రత్తలన్నీ తీసుకోవాలి. పార్టీ రహస్యాల గురించి ఆయన ద్వారా శత్రువుకు తెలిసే అవకాశం ఉందనీ, వీటిని ఆధారం చేసుకొని శత్రువు ఎల్‌ఐసిలో తన కార్యకలాపాలను నిర్వహిస్తాడనీ గుర్తుంచుకోవాలి. అందువల్ల ఈ అన్ని విషయాలలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంపై, ఇప్పటి వరకూ అనుసరిస్తున్న, ఆధారపడుతున్న విషయాలలో, రోజువారీ జీవితంతో సహా అవసరమైన మార్పులు చేసుకోవడంపై సంబంధిత కమిటీలు శ్రద్ధ వహించాలి.

### ప్రియమైన కామ్రేడ్స్!

మన పార్టీ విప్లవానికి అంకితమైన అనేక మంది కామ్రేడ్స్‌ను, ప్రత్యేకించి, అనేక మంది సీనియర్ కామ్రేడ్స్‌ను కోల్పోయింది. ఈ అమరులు నిస్వార్థానికి, త్యాగనిరతికి, సాహసానికి, విప్లవం పట్ల అంకితభావానికి, పీడిత ప్రజల పట్ల ప్రేమానురాగాలకు గొప్ప ఉదాహరణలుగా మన ముందున్నారు. వీరు శత్రు నిర్బంధంలో ఎన్ని చిత్రహింసలనైనా ఎదుర్కొని పార్టీ రహస్యాలను కాపాడి తమ ప్రాణాలను సైతం ధారపోశారు. మన పార్టీలో ప్రతి సభ్యురాలు, సభ్యుడూ ఇలాంటి మన ప్రియతమ అమరవీరుల మహత్తర కమ్యూనిస్టు లక్షణాలను సంతరించుకోవాలి. అన్యవర్గ ధోరణులను, బలహీనతలను వదిలించుకొని నిజమైన శ్రామికవర్గ విప్లవకారులుగా మనం తీర్చిదిద్దుకొని, ఆ అమరులకు నిజమైన వారసులం కావాలి.

ఈ విషయంలో నరసింహా రెడ్డి మన పార్టీకీ, కేడర్లకు, విప్లవ ప్రజలకు ఒక నెగెటివ్ టీచర్‌గా నిలిచిపోతాడు. పార్టీలో అంతర్గత పోరాటం కొన్ని సార్లు శత్రువుతో సాగించే వర్గ పోరాటం కంటే చాలా సంక్లిష్టంగా, కఠినంగా, భీషణంగా ఉంటుంది. ఇందుకు ఎంతో గొప్ప ధైర్యం, దృఢనిశ్చయం ఉండాలి. అన్నింటికంటే మార్క్సిజం-లెనినిజం-మావోయిజం (ఎంఎల్ఎం) సిద్ధాంతం పట్ల లోతైన అవగాహన, పీడిత ప్రజల పట్ల, పార్టీ పట్ల లోతైన

(తరువాయి భాగం 20వ పేజీలో...)

(7వ పేజీ తరువాయి భాగం...)
ప్రజా కమిటీ' నాయకత్వాన నడిచిన ఉద్యమంలో మానసిక వ్యాధి పీడితురాలైన ఒక ఆదివాసీ మహిళ ఛితాముని టుడును ఒక రోజు రాత్రి 12 గంటలకు పోలీసులు ఘోరంగా శారీరక అత్యాచారం జరిపి తుపాకి బట్‌తో కంటిపై గుద్ది ఒక కంటిని పూర్తిగా కనపడకుండా చేయడం - ఇలా ఎన్నో మనకు కనిపిస్తాయి."

**2017 మార్చిలో విడుదల చేయబడిన పీపుల్స్‌వార్-11 సంచికలో**

చైనా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ 50వ వార్షికోత్సవం సందర్భంగా 2017 ఫిబ్రవరి 26న మన పార్టీ కేంద్రకమిటీ 'మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ ప్రాముఖ్యత, దాని విజయాలు-గుణపాఠాలు' పేరుతో ఒక బుక్‌లెట్‌ను విడుదల చేసింది. దీనిని పీపుల్స్‌వార్-11వ సంచిక (మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ 50వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక)లో కూడా ప్రచురించాం. ఇందులో 39వ పేజీ రెండవ పేరాలో మొదటి రెండు లైన్లలో (బుక్‌లెట్ (తెలుగు)లో 19వ పేజీ, మొదటి పేరాలో మొదటి రెండు లైన్లలో) ఈ విధంగా తప్పు రాశాం, "1970 సెప్టెంబర్‌లో 9వ సిసి 2వ ప్లీనం 'అతివాదులకు' చెందిన రహస్య పథకాలను బహిర్గతం చేసింది. లిన్ పియావోను చైనా రిపబ్లిక్ అధ్యక్ష పదవిలో నియమించింది.'' ఈ వాక్యాలను ఈ కింది విధంగా సరిదిద్దుకొని చదువుకోవాల్సిందిగా కోరుతున్నాం.

"1970 సెప్టెంబర్‌లో జరిగిన 9వ సిసి 2వ ప్లీనంలో లిన్ పియావోను చైనా రిపబ్లిక్ అధ్యక్ష పదవిలో నియమించేందుకు 'అతివాదులు' చేసిన కుట్రలను ప్లీనం బహిర్గతం చేసింది."

అలాగే ఈ బుక్‌లెట్ (హిందీ ప్రతి)లో 43-44వ పేజీలలో మన పార్టీ డాక్యుమెంటు 'భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు' (హిందీ ప్రతి) నుంచి కొన్ని పేరాలు ఉల్లేఖించాం. డాక్యుమెంటు (హిందీ ప్రతి)లోని 41-42 పేజీల నుంచి ఉల్లేఖించిన పేరాలలోని చివరి పేరాలో మూడవ లైన్‌లో "साम्राज्यवाद-सामंतवाद **विरोधी** संस्कृति को मिटाकर" అని తప్పుగా అనువాదం జరిగింది. దీన్ని "साम्राज्यवाद-सामंतवाद संस्कृति को मिटाकर" అని సరిదిద్దుకొని చదువుకోవాలి. ఈ తప్పు 'భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు' డాక్యుమెంటు (హిందీ) ప్రతి లోనిదే. కనుక ఈ డాక్యుమెంటు (హిందీ ప్రతి)లో కూడా సరిదిద్దుకొని చదువుకోవాల్సిందిగా కోరుతున్నాం.

ఈ తప్పులకు పీపుల్స్‌వార్ సంపాదక మండలి చింతిస్తున్నది.

***

*"పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలు ఒక చివరి అంచుకు చేరినప్పుడు, కార్మికవర్గ విప్లవం ఒక తక్షణమైన ఆచరణాత్మక సమస్యగా మారినప్పుడు, కార్మికవర్గ విప్లవానికి సన్నాహాలు జరిపే పాతకాలం గడచి పెట్టుబడిదారీ విధానం మీద ప్రత్యక్షంగా దాడికి దిగే కాలంగా - నూతన కాలంగా అది పరివర్తన చెందినప్పుడు, సామ్రాజ్యవాద పరిస్థితుల నడుమ లెనినిజం వృద్ధి చెంది, రూపుదిద్దుకుంది." "లెనినిజం అంటే సాధారణంగా కార్మికవర్గపు సిద్ధాంతం, ఎత్తుగడలు, ప్రత్యేకించి చెప్పాలంటే కార్మికవర్గ నియంతృత్వం యొక్క సిద్ధాంతం, ఎత్తుగడలు."*

*- స్టాలిన్*

## *సి.పి.ఐ. (మావోయిస్టు) ఎంఎల్ఎం డాక్యుమెంటు నుంచి -*

*"లెనినిజం, బెర్న్‌స్టీనియన్ రివిజనిస్టులు, నరోద్నిక్కులు, ఆర్థికవాదులు, మెన్షివిక్కులు, చట్టబద్ధ మార్క్సిస్టులు, లిక్విడేటర్లు (పార్టీని రద్దు చేయాలని కోరేవారు), కాట్‌స్కైట్లు, ట్రాట్‌స్కైట్లు వంటి వివిధ రకాల అవకాశవాదులకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా సాగించిన పోరాటం నుండి అభివృద్ధి చెందింది. మార్క్సిజాన్ని ఒక పిడివాదంగా గాక ఆచరణకు మార్గదర్శిగా స్వీకరించి లెనిన్ ఈ ఎత్తుగడలను రూపొందించారు. లెనిన్ రూపొందించిన ఎత్తుగడల నినాదాల విభ్రాంతికరమైన సుస్పష్టత, విప్లవ పథకాల విస్మయకరమైన సాహసం రెండవ ఇంటర్నేషనల్‌లోని వామపక్ష శక్తులన్నింటినీ, విప్లవ ప్రజారాశులందరినీ బోల్షివిక్కుల పక్షానికి ఆకర్షించాయి."*

"పార్టీ అంటే అత్యున్నత రూపంలోని వర్గ సంస్థనీ, అది ఇతర అన్ని రూపాలలోని ప్రజా నిర్మాణాలకు మార్గనిర్దేశత్వం వహిస్తుందనీ, కార్మికవర్గ పార్టీ ద్వారానే కార్మికవర్గ నియంతృత్వాన్ని సాధించగలమని లెనిన్ సూత్రీకరించారు. అలాంటి పార్టీకి అతి విస్తృతమైన పార్టీ సభ్యత్వపు యంత్రాంగం ఉండి దానికి ప్రొఫెషనల్ విప్లవకారులు అనే సుస్థిర కేంద్రకం (న్యూక్లియస్) ఉండాలి. అలాంటి రాజకీయ పార్టీ ప్రజలతో తప్పనిసరిగా మమేకమై, చరిత్ర నిర్మాణంలో ప్రజలు చూపే సృజనాత్మక చొరవకు గొప్ప ప్రాధాన్యతనివ్వాలి. విప్లవంలోనూ, సోషలిజం, కమ్యూనిజాలను నిర్మించేటప్పుడు కూడా అది ప్రజారాశులపై సన్నిహితంగా ఆధారపడాలి."

**సామ్రాజ్యవాదం నశించాలి!**

**ప్రపంచమంతటా కార్మికవర్గ విప్లవాలను ప్రజ్వలింపచేద్దాం!**

**ఎర్ర, సోషలిస్టు భవిష్యత్తు కోసం ముందుకు సాగుదాం!**

**కమ్యూనిజంలోకి కవాతు చేద్దాం!**

*"అక్టోబరు విప్లవం సామ్రాజ్యవాదాన్ని కుదిపివేస్తూ అదే సమయంలో, మొట్టమొదటి కార్మికవర్గ నియంతృత్వం రూపంలో ప్రపంచ విప్లవోద్యమానికి ఒక శక్తివంతమైన, బహిరంగ పునాదిని, అది గతంలో ఎన్నడూ కలిగ లేని, ఇప్పుడిక ఆధారపడగలిగిన ఒక పునాదిని సృష్టించింది. ప్రపంచ విప్లవోద్యమానికి గతంలో ఎన్నడూ కలిగ లేని ఒక శక్తివంతమైన బహిరంగ కేంద్రాన్ని సృష్టించింది. ఇప్పుడిక అది దీని కేంద్రంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమస్త దేశాల కార్మికవర్గ, పీడిత ప్రజల ఐక్య విప్లవ వేదికను సంఘటితం చేసి సమీకృతం కాగలుగుతుంది."*

*"అక్టోబరు విప్లవాన్ని కేవలం 'జాతీయ పరిధులలో' జరిగిన విప్లవంగా చూడలేం. ప్రధానంగా, అది అంతర్జాతీయ, ప్రపంచ వ్యవస్థలో వచ్చిన విప్లవం. ఎందుకంటే, ఈ విప్లవం ప్రపంచ మానవాళి చరిత్రలో ఒక మౌలిక మార్పును, పాత, పెట్టుబడిదారీ ప్రపంచం నుంచి నూతన, సోషలిస్టు ప్రపంచానికి జరిగిన మార్పును సూచిస్తున్నది."*

జె.స్టాలిన్ – 'అక్టోబరు విప్లవ అంతర్జాతీయ స్వభావం'
(అక్టోబరు విప్లవ పదో వార్షికోత్సవం సందర్భంగా)
ప్రావ్దా, నెం. 255, 1927 నవంబరు 6-7